ఆంధ్రమహిళ

1



13 వ వార్షిక సంచిక

అంజలీ పిక్చర్సు

సమర్పించు

మహోన్నత చిత్రము

"సువర్ణ సుందరి"

తారాగణం:

★ అంజలీదేవి	★ నాగేశ్వర రావు
★ రాజసులోచన	★ రేలంగి
★ గిరిజ	★ సి. యస్. ఆర్
★ ఇ. వి. సరోజ	★ గుమ్మడి
★ సూర్యకళ	★ రమణా రెడ్డి

డైరెక్షన్: వేదాంతం రాఘవయ్యా

డైలాగ్స్: మల్లాది రామకృష్ణ శాస్త్రి

సాంగ్స్ : సముద్రాల

కెమెరా : రహమాన్

ఆర్టు : వాలి

ప్రొడ్యూసర్ : **ఆదినారాయణ రావు**

"చమ్రియా రిలీజ్"

32 ఔరంగజేబ్ రోడ్,
న్యూఢిల్లీ
3.12.56.

సోదరి లక్ష్మీ రఘురామ్ గారికి -

ఆంధ్రమహిళ 13వ వార్షిక సంచిక ప్రచురిస్తున్నారని విని చాలా సంతోషించాను. 'ఆంధ్రమహిళ' పురోభివృద్ధికి తోడ్పడుతూ వున్న మిత్రులందరికీ నా కృతజ్ఞతాభివందనములు తెలియజేయుచున్నాను.


పత్రిక self supporting గా వుండాలేదా అన్నది ముఖ్యవిషయం కాదు. ఒక ఆదర్శానికి కట్టుబడే పత్రికలూ, సంస్థలూ ఎప్పుడూ 'బాధ'గానే వుంటాయి. — లోపాలతోనే వుండాలి కూడా! రాబడి వచ్చినకొద్దీ, మూల ధనం పెరిగినకొద్దీ ప్రజపై ఆధారపడటం తగ్గుతుంది; దానితోబాటు సేవాభిలాష కూడా తగ్గుతుందేమో.

13 సంవత్సరాల క్రితం — ఆంధ్రమహిళ 'పత్రిక'ను Bank లో వేయడానికి నెలసరి ఖర్చులకే వెళ్ళి నూరు రూపాయలు పోగుచేసాం. నేడూ ఆస్తి లేనిదే వున్నది ఆంధ్రమహిళ. కాని — పదమూడు సంవత్సరాలూ మన పత్రిక నెలనెలా నాగా లేకుండా వచ్చిందంటే... ప్రజా సహకారం వల్లనే కదా! We must deserve this Co-operation & trust.

దుర్గాబాయి దేశ్‌ముఖ్







ఆంధ్ర మహిళ

సంపుటి 13 :: జనవరి '57 :: సంచిక 1

త్రయోదశ వార్షికోత్సవ సంచిక

వ్యవస్థాపకురాలు :
శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపాదకురాలు :
శ్రీమతి లక్ష్మీరఘురామ్

ముద్రణ :
ఆంధ్ర మహిళా ప్రెస్

విషయసూచిక

ముఖచిత్రము : ఆంధ్ర సంస్కృతీ చిహ్నము, పూర్ణకుంభము. చిత్రణ : శ్రీ ఉదయగిరి శ్రీరాములు.

విషయసూచిక



మహిళా మహోదయం

యుగపురుషులు

కథానికలు - నవలలు

సంక్షేమం

సారస్వతము



Advertisers' Index

———:o:———

Thirteenth Year of Publication


రాజ్ భవన్,

హైదరాబాద్,


16, నవంబరు, '56.

'ఆంధ్ర మహిళ' పదమూడవ ప్రత్యేక వార్షిక సంచికగా వెలువడుతూందని తెలుసుకొనుటకు చాల సంతోషం. ఈ పత్రిక మహిళా పురోభివృద్ధికైన సముద్యమాలన్నింటిలోను మిక్కిలి ఉపయుక్తమైన కృషిచేయుచున్నది. రాబోవు పంచవర్ష ప్రణాళిక లన్నిటిలోను మహిళలు ప్రముఖపాత్రవహించవలసి ఉన్నదని తరుచు నేను నొక్కి వక్కాణించుచున్నాను. అదే విషయం ఈ ప్రత్యేక సంచికలోను విశదపరచబడునని నమ్ముచున్నాను. 'ఆంధ్ర మహిళ' అన్నివిధాలా విజయవంతము కావాలని వాంచిస్తున్నాను.

సి. ఎం. త్రివేది
గవర్నర్



★



హైదరాబాదు.

23, నవంబరు, 56.

"ఆంధ్ర మహిళ" సంక్రాంతికి, ప్రత్యేక వార్షిక సంచిక ప్రచురిస్తూందని తెలిసికొనుటకు ఎంతో సంతోషంగాఉంది. గడచిన పదమూడు సంవత్సరములుగా సంఘంలోని అభాగ్య సోదరీమణుల భాగ్యోన్నతికై "ఆంధ్ర మహిళ" యొనర్చే నిరాఘాట సేవాప్రయత్నములు ప్రశంసనీయములు. నేను వానిని ఎంతో శ్రద్ధతో గమనిస్తూనేయున్నాను.

వారి సత్సాధన విజయంసాధించాలని నా వాంఛ.

ఎన్. సంజీవ రెడ్డి
ముఖ్యమంత్రి



పూజా ప్రసూనాలు

"రమ్యశ్రీ"


బ్రహ్మ ప్రమోదాన జరుపంగఁ బడెడి నీదు;
పదియుమూడేండ్ల పుట్టినపండగకును-
పూజకోసము పంపినపూలు యివ్వి
అందుకొనవమ్మ! ప్రీతితో "ఆంధ్రమహిళ"

జడయల్లి జడకుచ్చు లిడ నొక్కముద్దియ;
మొల్లపూబంతుల ముడువ నొకతె;
ముంగురుల్ సవరింప సింగారవతి యొర్తు;
తిలకంబు దిద్దగా కలికియొకతె;
పనిగొని యొకభామ పట్టుపరికిణీ గట్ట;
రమణియొర్తుక బిగిరైకె దొడఁగ;
కంఠహారము నొక్కకమలాక్షి సవరింప;
మంజీరములు నొక్క మగువ యిడఁగ
సురటివిసురుచు నిర్వంక సుదతు లుండ;
పాదసంవాహనం బొక్క పడఁతి సలుప;
దివ్యహారతులనుగొని తేజరిల్లు
యాంధ్రశ్రీరాజ్యసింహాసనమ్ము నందు!

రచనా చమత్కృతి రాణించు 'పద్యముల్'
స్వచ్ఛమౌ కర్ణభూషణము లమ్మ!
విప్రలంభాములు వెలలేని 'గేయాలు'
రమ్యమౌ కంఠహారములు సుమ్మి!
హృదయాలఁ గదలించు మధురమౌ 'గాథలు'
నాణ్యమౌ మణికంకణంబు లివ్వి!
నవ్య సాహిత్యవిన్నాణంపు 'నాటికల్'
శ్రీమించు రత్నమంజీరము లివి!
ముద్దుటుంగర మందియల్; ముక్కుపుడక;
ముత్తెములదండ; ముత్యాలమురుగు లాది
కవికళాదులు రచయించి కదలినారు
'ఆంధ్రమహిళ'ను గైసేత మనుచునేడు!

* * *

రమ్యశ్రీ మూర్తిఁ జూడగా రండటంచు
ఈశుభోదయవేళలో నింపెసఁగఁగ;
ఆంధ్రమహిళలు గుంపులై యరుగుదెంచి
రౌర! నీజన్మదినవేళ "ఆంధ్రమహిళ!"



న్యూఢిల్లీ,
నవంబర్, 22, 1956.

డిశంబరు నెలాఖరుకు "ఆంధ్ర మహిళ" పదమూడవ ప్రత్యేక సంవత్సర సంచికగా, సంక్రాంతికి ప్రచురిత మవుతూందని వినుటకు చాల కుతూహలంగాయుంది. నా హృదయపూర్వక శుభాకాంక్షలు "ఆంధ్ర మహిళ" (ప్రత్యేక సంచిక) విజయానికి పంపుతున్నాను.

భవదీయ

ఎస్. రాధాకృష్ణన్

వైస్ ప్రెసిడెంట్.

★

మన భారత స్వాతంత్ర్య పోరాటంలో పురుషులతో సమానంగా పోరాడి, చరిత్ర పత్రాలలో సునిశిత స్థానాన్ని స్త్రీలు ఆక్రమించుకున్నారు. సాంఘికంగా కొత్త పునాదులతో నిర్మింపబడుతున్న నేటి స్వతంత్ర భారతంలో — మహిళల నిస్వార్థసేవ ఎంతో అవసరం.... అనాదిసిద్ధముగ స్త్రీ యొక్క శాంతము పట్టుదలకలసిన సేవాదీక్ష, శక్తి దేశపునర్నిర్మాణ మనేగురుతర భారాన్ని వహించుటకు తగియుండుట విదితమే. ఆ సేవ వారి మానసిక విలువలనుకూడ వృద్ధిపరచుచున్నది.

మహానగరపు మహిళలను విద్యావంతులను చేయటంతో మీ మహిళాసేవ పరిపూర్ణం కాలేదని గుర్తించాలి. అనాగరికతలో పాతుకుపోయిన అయిదులక్షల పల్లెలలోని పల్లెపడుచుల జీవితాల్లోను జ్ఞానజ్యోతిని వెలిగించి వారి మనస్సులు జ్యోతిర్మయానందరాగయుతములుగాచేయాలనే కొత్త బాధ్యతను గుర్తించాలని కోరుతున్నాను.

స్థానిక స్వపరిపాలనా మంత్రి

కె. బ్రహ్మానందరెడ్డి

★



న్యూఢిల్లీ,
21, నవంబరు, 1956.

ప్రస్తుత పరిస్థితులలో ఈమాదిరి పత్రికను నడుపుట కొంతవరకు కష్టసాధ్యమే.... మీ యొక్క మీ అనుచరుల యొక్క ప్రయత్నములు సఫలీకృతములు కావాలని, వాంఛిస్తున్నాను.

బి. జగన్నాథదాస్

జడ్జి, సుప్రీంకోర్టు, ఇండియా.




శ్రీమతులు చదలవాడ సోదరీ కవయిత్రులు

హారతి

దేశ్ ముఖ్ దుర్గబాయమ్మ దేవి దయను
విదుషి- కె. లక్ష్మీరఘురాము ప్రేమమునను
పదియు మూడుసంవత్సర ప్రాయమైన
ఆంధ్రమహిళకు మంగళ హారతి యది.

ఆంధ్రరాష్ట్ర మిప్పు డాంధ్రప్రదేశమ్ము
ఆంధ్రమహిళ దిన దినాభివృద్ధి
నంది గృహ గృహమ్ము నలరించుగావుత !
ఆదరమున నిడిన హారతి యిది

ఆరతి, ఇయ్యది మంగళ
హారతి; అఖి[illegible]ాంతర్గతమహా
కీరితి-సద్గతి కడుం జే
కూరుత ! ఈ ఆంధ్రమహిళకున్ సతతమ్మున్



ఆంధ్రమహిళ

సంపుటి 13 :: జనవరి '57 :: సంచిక 1

కిం కర్తవ్యం?

ప్రపంచములో మన దేశానికి ఒక ప్రత్యేకత వున్నది. అట్లాగే భారతదేశములో మన ఆంధ్రులకు ఒక ప్రత్యేకత వున్నది. అది మన చరిత్రే ఋజువు పరుస్తుంది.

'దేశభాషలందు తెలుగు లెస్స' అన్నమాట మన భాష ప్రత్యేకతను తెలుపుతుంది. విదేశీయులు ఈ భాషను విని, ఆనందించి, ముగ్ధులై 'ఇటాలియన్ ఆఫ్ ది యీస్ట్' అని గౌరవించారు. గంభీరమైన మాధుర్యమే ఈ భాష ప్రత్యేకత. మనకు దేశసాహిత్యము పుష్కలంగా వుంది. భక్తి జ్ఞానవిజ్ఞానచిత్తసంస్కారానందాల నివ్వగల సుసంపన్నమైన సాహిత్యము మనకు ఉన్నది. మన సాహిత్యములో భారత భాగవతాదులు భాషాంతరీకరింపబడిన విధమున ఇతర భాషలలో భాషాంతరీకరింపబడలేదని బహుభాషావిదులైన ప్రాజ్ఞులు అంగీకరించుచున్నారు. అది మనసాహిత్యప్రత్యేకత. మన సంస్కృతి మన దేశమంత పురాతనమైనది. వివిధదేశాల, జాతుల, భాషల సంస్కృతులను క్షీరనీర న్యాయంగా కలుపుకుంటూ ఒక ప్రత్యేక విశిష్టతగల సంస్కృతిగా తయారైనది. మన సంస్కృతి, మనమొక్కవోని శౌర్యము, మన మతసహనము, మన ఆధ్యాత్మిక తాత్విక జ్ఞానము, మన రాజకీయచతురత, వేయేల మన చరిత్ర, మన శాసనాలు, మన గుళ్లు గోపురాలు అన్నీ మన ప్రత్యేకతను వేనోళ్ళ ఘోషించుతూనే వున్నవి- భాషారాష్ట్రము కావలెనని నలుబది సంవత్సరములు పోరాడి ఆంధ్రప్రదేశ్ ను సాధించి నిర్మించుకొనుటే మన ప్రత్యేకతకు ప్రత్యక్ష నిదర్శనము.

సంఘ సంస్కరణలోను మనకు ప్రత్యేకత లేకపోలేదు. మన వీరేశలింగము ఏనాడో దానికి పునాదులు వేశారు. అప్పటి నుండి ఇప్పటివరకూ మొత్తము భారతదేశములో సంఘసంస్కరణమందు-ముఖ్యముగా మహిళాభ్యుదయమునకై చేయు సంఘసేవయందు ముందంజ వేసినది మనమే.

అన్నీ వుండి అల్లుని నోట్లో శని-అన్నట్లు అన్ని విధాల ప్రత్యేక విశిష్టితాలక్షణాలు గల మనకు మన మహిళా[illegible] వాంఛిత పరిణామము పొందలేదు. ఒక ఆంధ్రమహిళ అయినా మంత్రి కాలేదని, ఒక రాష్ట్రమునకు గవర్నరు కాలేదని మేము విచారించుటలేదు- ఒక విదేశరాయబారిని కాలేదని విచారించుటలేదు. అధికారము, ఉన్నత పదవులు ఎంత వాంఛనీయమైనా అవి అభ్యుదయమునకు గీటురాళ్లు కానేరవు, కాని మహిళాభ్యుదయమునకై పాటుబడు సంస్థలు, ఉద్యమములు, రెండు మూడేండ్లలో అవసరమే మోనని మేము అనుకుంటూ వుండగనే నాలు

గై దేండ్లు దాటిపోయినవి. స్వరాష్ట్రమొచ్చినది. రెండవ పంచవర్ష ప్రణాళికలో బహుముఖముగా అనేక సంస్థలు శిశు మహిళాభ్యుదయమునకై పాటు పడుచున్నవి. రెండవ పంచవర్షప్రణాళికా కాలము ముగించునప్పటికైనా మనము సఫలీకృతుల మగుదుమో లేదో యని సంశయము కలుగు చున్నది. స్త్రీ పురుషులలో సంపూర్ణ సహకారము, పరిపూర్ణ చిత్తశుద్ధి లేనిది అట్టి అదృష్టము మనకు లభింప నేరదు.

క్రొత్త సంవత్సరము క్రొత్త వాతావరణములో మనము ముక్కోటి ఆంధ్రులము మన నిర్లిప్తత, నిర్లక్ష్యత వీడి నిర్మలమైన చిత్తశుద్ధితో మన మహిళాభ్యుదయమును చక్కదిద్దుకొన వలయునన్న దీక్షబూనిన అది కరతలామలకమే కాగలదు కదా! "ఆంధ్రమహిళ" ద్వారా ఆంధ్రుల సందరినీ మే మర్థించునది అదే. అట్టి చిత్తసంస్కారము మన సోదర సోదరీమణులకు కలిగెనేని మన సంస్థల కర్తవ్యములు నెరవేరినట్లే! మన జాతికి అపూర్వమహోజ్వల భవిష్యత్తు సిద్ధించినట్లే! మన తెలుగు వెలుగు మన దేశమునకు జ్యోతి అయినట్లే!

1944 మే 15 వ తేదీ "ఆంధ్ర మహిళ" ఆంధ్ర మహిళల పత్రికగా జనన మొంది మహిళా లోకానికి సర్వతోముఖంగా సేవచేస్తోంది. ఈ త్రయోదశ వార్షికోత్సవ శుభసమయమున గడచిన ద్వాదశ వార్షిక సంచికల లోని సంపాదకీయ భాగములను జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాము.

"ఈ సంచికతో "ఆంధ్ర మహిళ"కు ఆమె సేవా జీవితమున రెండవ సంవత్సరము ప్రవేశించుచున్నది. సహృదయంతో చేసిన కృషి ఏదిగాని సజ్జనామోదంపొంది, సాఫల్యం గడింపకపోదన్న విశ్వాసంతోనే ఆంధ్ర మహిళ పత్రికా ప్రపంచమున ప్రవేశించింది.' 1945

"ఆంధ్ర ప్రజ ఆదరాభిమానములతో ఆంధ్ర మహిళకు మూడు సంవత్సరాలు నిండాయి" 1946

"సహృదయులైన సోదరీమణుల సహకారంతో ఆంధ్ర మహిళ సేవాన్వేషియై తన జీవితము సార్థకము చేసుకో గలదని మనవి చేస్తున్నాము." 1947

"శాంతి భద్రతలు పూర్తిగా నశించి ఇంటా బయటా గూడ కలహ వాయువులు తుపానువలె చెలరేగుచున్న గడ్డు సమయములో మా మహిళకు ఐదవ సంవత్సర మారంభమైనది." 1948

"గడచిన ఐదు సంవత్సరములలో మా ఆంధ్ర మహిళ చాలా కష్టము లనదగు ప్రమాదముల కెన్నింటికో గురియయ్యూ, వానినన్నింటిని, స్థాపకులయొక్క మనోబలమను దివ్యౌషధముతో ధిక్కరించి పూర్ణారోగ్యముతో నిలచియున్నది." 1949

"మా ఆంధ్ర మహిళ ఊహించుకున్న సేవా సౌధంలో ఆరు అంతస్థులు సక్రమముగా నిర్మాణమయ్యాయి. ఏడవ అంతస్థును అతి ఉత్సాహంతో ఉత్సవ సరంజాముతో అరంభించుకుంది." 1950


ఎన్నడుగాని మా దగ్గర ఒక్క కానీ ప్రతిఫలము అందకపోయినా తమ అమూల్య రచనలను చిత్రాలను పంపి ప్రోత్సాహమిచ్చిన రచయితలకు చిత్రకారులకు మా కృతజ్ఞత." 1951

"బాధ్యతలను గుర్తించి వ్యవహరిస్తే హక్కులు స్వయంసిద్ధిని పొందుతాయనడానికి "ఆంధ్ర మహిళ" ఒక ప్రబలమైన తార్కాణము. తన చిర వాంఛితమైన స్వంత ప్రెస్సును స్థాపించుకుని స్వంత ముద్రణాలయములో ముద్రింపబడుతోందంటే ఎందరి సహకారము లేనిదే యింత సాధ్యము కాగలదు! యీ ముద్రణశాలకూడ సహృదయుల సహకారంతో "యింతింతై-మరియు దానింతై" వచ్చే సంవత్సరానికి స్వంతభవనాలలో సౌష్టవరూపము దాల్చి స్థిరపడగలదని నమ్మటలో పొరపాటు ఉండదేమో!" 1952

"స్త్రీలకు ఓర్పు, శాంతి, సమరసభావాలు సహజసంపదలు. వారికి అవకాశం యిస్తే వీటిని విశాల ప్రపంచములో కూడ స్థాపించగరు." 1953

"ఆంధ్ర మహిళా సభా ప్రాంగణములో కలదు ప్రమదావనము. నాటిన ఉన్నతాశయములు నేటికి కన్నుల పండువుగ నుండు ఒక చిన్న పుష్పవనముగ తయారైనది." 1954

"......ఇట్లే మహిళాభ్యుదయము పురోగమించిన మరియొక దశాబ్దములో ప్రత్యేక మహిళా సభలు, ప్రభుత్వ మహిళా శాఖలు అనవసరము కాగలవేమో!" 1955



రాజ్ భవన్

భోపాల్

నవంబరు 22, 56.

మీరు, సంక్రాంతికి ప్రత్యేక సంచికను ప్రచురించబోవుచున్నారని తెలుసుకొనుటకెంతో సంతోషం. ఈ పత్రిక గడచిన పదమూడు సంవత్సరములుగ, స్త్రీ విద్య మహిళా పురోభి వృద్ధికే పాటుపడుతున్నది.

ప్రైవేటు సంస్థగా వెలసి, ప్రభుత్వసహాయము లేకనే ఉన్నతస్థితికి వచ్చే సంస్థలు ప్రభుత్వ సంస్థల కెంతేని సహాయకరము, ఆహ్వానితము.

మీకు జయము చేకూరునుగాక యని కోరుచున్నాను.

బి. పట్టాభిసీతారామయ్య
గవర్నర్, మధ్యప్రదేశ్.

★

కాకినాడ

16, నవంబర్, 1956.



"ఆంధ్ర మహిళ" తన పదమూడవ ప్రత్యేక వార్షిక సంచికను వెలువరించబోతున్నదని తెలుసుకొనుటకెంతో కుతూహలంగాయున్నది. ఈ మాస పత్రిక ఆంధ్ర మహిళాలోకాని కొక వెలుగు బాట అని రుజువుచేసుకొన్నది. యువతీ పురోభివృద్ధికై ఆంధ్ర మహిళాసభ చేయుచున్న పరమోత్కృష్టమైన సేవ ప్రజలందరకూ విదితమే. అందరి కార్యక్రమాలలో ఈ పత్రిక ఒక ప్రముఖ శాఖ మాత్రమే.

మహిళా లోకానికి ముఖ్యంగా ఆంధ్ర మహిళా లోకానికై మీ ఈ పవిత్ర సేవాదక్షత ఇతోధికాభివృద్ధి కాంచి సర్వత్రా జయప్రదము కావాలని కోరుతున్నాను.

భవదీయ విశ్వాసపాత్రమైన
మొ. తిరుమలరావు

హైదరాబాదు (దక్కన్)
18, నవంబరు, 1956.

ఈ సంవత్సరంకూడా "ఆంధ్ర మహిళ" వార్షిక సంచిక వెలువరించబోతున్నదని తెలుసుకొని ఎంతో సంతోషిస్తున్నాను. పత్రిక మహిళాభ్యుదయాని కతిగా పాటుపడుతున్నది. మీ ఉత్కృష్టాశయము జయప్రద మగునని కోరుతున్నాను.



కళా వెంకటరావు
మినిస్టర్ ఫర్ ఫైనాన్సు, కమ్మర్షియల్,
టాక్సెస్ & లాండ్ రిఫార్మ్స్.

★

కౌన్సిల్ హాల్, బొంబాయి,
7, నవంబరు, 1956.

సంక్రాంతి కానుకగా ఆంధ్ర మహిళ పదమూడవ ప్రత్యేక వార్షిక సంచిక వెలువరించు చున్నందుకు చాల సంతోషించుచున్నాను.

ఇవే మీకు నా శుభాకాంక్షలు. అభినందనలు.

ఎస్. ఎల్. శీలమ్
స్పీకర్, బొంబాయి లెజిస్లేటివ్ అసెంబ్లీ.

★


హైదరాబాద్,
19, నవంబరు, 1956.



'సంక్రాంతి' ప్రత్యేక సంచిక వెలువడే శుభ సమయానికి, శుభ సందేశమును కోరుతూ నాకు చేరిన లేఖలలో మొదటిది "ఆంధ్ర మహిళ" నుండి అని తెలియచేయుటకు ఎంతో సంతసమగుచున్నది. ఈ పత్రిక యువతీ జనపురోభివృద్ధికై గత పలుసంవత్సరములుగా పాటుపడుతూ యుండుట నిస్సందేహము. అయినా ఇటుపైనూత ఇంతకన్న ఎక్కువగా స్త్రీజన భావిభాగ్యోదయమునకు, మీ ఆధ్వర్యమున కృషి సాగగలదని నా నమ్మకము.

మీ ప్రయత్న సాఫల్యమునకూ, మీ పత్రిక ఉజ్వల భావికీ ఇవే శుభాకాంక్షలు.

శ్రేయోభిలాషి
ఎస్. బి. పి. పట్టాభిరామారావు
విద్యాశాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.



విజయవిహార్, హైదరాబాద్.
15, డిసెంబర్, 1956

ఆంధ్రమహిళ వార్షికసంచిక సంక్రాంతికి వెలువడుతున్నందుకు ఎంతో ఆనందముగా ఉన్నది. ఆంధ్రనారీలోకానికి నూతన ఉత్తేజమును కలుగజేయుటకు ఆంధ్రమహిళ మార్గదర్శకత్వము వహిస్తూఉన్నది. యథాప్రకారం ఈ సంక్రాంతిసంచిక కూడా మంచి రచనలతోనూ, చిత్రములతోనూ, ఆకర్షణీయంగా ఉండగలదని విశ్వసిస్తున్నాను. ఆంధ్రమహిళకు అకుంఠిత విజయసిద్ధి లభించాలని కాంక్షించుచున్నాను.

బి. గోపాలరెడ్డి.
హోమ్‌శాఖామంత్రి.

★

'ఆంధ్ర మహిళ' సంక్రాంతికి ప్రత్యేక వార్షిక సంచికగా వెలువడుతున్నందుకు సంతసము.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము భారత ప్రధానిచే ప్రారంభింపబడి, ప్రభుత్వము సక్రమముగా సాగుచున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని పత్రికా సంస్థలు రాష్ట్ర పురోగమనమునకు, ప్రభుత్వముతో సహకరించుచున్నవి. 'ఆంధ్ర మహిళ' అందుకు వెనుకబడదని నా నమ్మిక. ఈ ప్రజా స్వామ్యయుగంలో ప్రెస్సు నిర్వహించవలసిన పాత్ర ఎంతో ప్రధానమైనది - ప్రజాభిప్రాయాల్ని ప్రతిబింబింప చేయటంతో ఆ బాధ్యత తీరిపోలేదు. అదే రీతిని ప్రభుత్వ ఆశయాలనుకూడ ప్రజలకు సరిగా అనువదించి - ప్రజలకూ, ప్రభుత్వమునకూ మధ్య సమరసభావాన్ని సమకూర్చాలి - ప్రస్తుతకాలపు ఘర్షణలకు మూల కారణం - ప్రజలకూ ప్రభుత్వమునకూ మధ్య సరైన సామరస్యం కూర్చబడకపోవటమే.... ఆ సామరస్యం నేడు తలయెత్తే సమస్యలలో సగానికిపైగా వెంటనే పరిష్కరించగలిగినదే."

'ఆంధ్ర మహిళ' అభ్యుదయాన్ని వాంఛిస్తున్నాను.

వి. బి. రాజు
మినిస్టర్, ఇండస్ట్రీస్ & లేబర్

★

హైదరాబాదు
10_12_1956

అమూల్యమైన మీ పత్రిక ప్రత్యేకసంచిక వెలువరచనున్నారని తెలుసుకుని చాల సంతోషించుచున్నాను. విద్యారంగంలోనూ, సోదరీమణులనుద్ధరించు కార్యక్రమంలోను మీరు కావిస్తున్న కృషియొక్క విలువను ఈ పదమూడు సంవత్సరాల నిరాఘాటమైన సేవయే చెప్పక చెప్పుచున్నది. భారతదేశానికి ఇలాంటి పత్రికలు ఇంకా ఎన్నో అవసరం. అకుంఠిత కార్యదక్షతతో దేశసేవ చేయుటకునూ, పత్రికను సర్వతో ముఖముగా అభివృద్ధిచేయుటకునూ గల మీ ప్రయత్నములు సఫలీకృతములు కావలెనని ఆశించుచున్నాను.

జె. వి. నర్సింగరావు
మినిస్టర్ ఫర్ ఇరిగేషన్ అండ్ పవర్.

శుభాకాంక్షలు


అరయన్ ద్వాదశపూర్ణవర్షములు నీవ్యాసంగమున్ జేసిన
త్వరమంధ్రావనిఁబేరుఁబొందితివి ; సౌభాగ్యంబు దీపించు ని
ర్భరగాథల్ వెలయించితీవుమహిళా ! రాణింపుమిక్కోఁనసం
బరముల్ మీఱ వచోవిలాసములు రాపాడంగ నభ్యున్నతిన్

నేఁటికి ద్వాదశాబ్దములునిండె ; త్రయోదశవత్సరాన నీ
పాటవమేర్పడన్ గను మపారశుభమ్ముల నాంధ్రదేశమం
దాటలనాడి తన్పుము బుధావళినెప్పుడు ; మానినీమణుల్
జాటఁగ నీదునామమును జన్మమహోత్సవమేపుఁజేయుమా !!

పండితోద్దండుల పాండితీగరిమతో
        వియ్యమందఁగరమ్మ వివిధరూప !
కవిరాజసింహుల కావ్యామృతమ్ముతోఁ
        బాలుఁబంచఁగరమ్ము పద్మవదన !
కల్పనాచతురుల ఖండరచనలతోఁ
        బంతమాడగరమ్ము వారిజాక్షి !
రుచిర గేయానందరోచిస్మితమ్ముతో
        దీటునందఁగరమ్ము దివ్యవాణి !


తెనుఁగుకాంతల పజ్జ నీదీప్తిఁ జెలఁగ
వేగ మాంధ్రప్రదేశాన విశ్వరుచిర
కీర్తి శోభల నింపు నీ కిరణమలర !
నందికొమ్ము శుభాకాంక్షలాంధ్రమహిళ !

శ్రీమతి శిష్ట్లాబాల



"యత్రనార్యస్తు పూజ్యంతే నందంతే తత్రదేవతాః
యత్రైతాస్తు నపూజ్యంతే సర్వాస్తత్రాఫలాః క్రియాః"

మహిళా మహోదయము



ఇష్టమైనా కష్టమైనా కాకతీయగణపతిదేవుని పుత్రిక రుద్రమ్మ తన భుజశక్తితో రారాజుల నుండి సామంతులనుండి, ప్రజావాహినినుండి పూజలందుకొన్నది. అందుకే కాకతీయ సామ్రాజ్యము ఆరుకాయలు మూడు పువ్వులతో అలరారింది.


"ముప్పదై రెండులేరీతి మోదమునను
ఓరగలు రాజధానిగ నొప్పనేలి
తుదకు వీరప్రతాప రుద్రునకు నప్ప
గించి రుద్రమయుంకృత కృత్యయయ్యె"

బానిస సృంఖలతో అలమటించే తరి వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి పరరాజులమీదకి సింగివలే స్వాతంత్ర్య సమరములోనికి దూకి దిక్కులు మారుమ్రోగేటట్టు ఢంకామ్రోగించి విజయ శంఖము పూరించింది. అదే నాంది స్వరాజ్య ఉద్యమానికి —

అరశతాబ్దమునాడు స్త్రీల పతనోన్ముఖమైన పరిస్థితులు తెలుసుకొని కవి, విదుషీమణి సరోజినీనాయుడు మహిళాభ్యుదయమునకై అవిరళకృషి ఆరంభించింది. గాంధేయ స్వాతంత్ర్య సమరములో కురికి ఆయనకు ప్రియశిష్యురాలై భారతదేశములో ఒక రాష్ట్రమునకు ప్రప్రథమ స్త్రీ గవర్నరై రాణించింది — ఈ రమణి — తెలుగింటికోడలు — శ్రీమతి సరోజినీనాయుడు.

"అచట బుట్టిన చిగురు కొమ్మైనచేవ" అన్నట్లు తెనుగునాట ఏనాడూ, జీవితములు తృణప్రాయముగానెంచుచు ప్రాణములు దేశమునకై అర్పించగల నారీమణులకుకొదువలేదు. అప్పటికవసరమైనహంగులతో, రూపురేఖలతో, అస్త్రశస్త్రములతో తెనుగు ఆడపడచు అప్పుడు తన యావచ్ఛక్తి ధారపోస్తూ మహిళోదయమునకు అండదండయై అనన్య సామాన్యమైన కార్యదీక్షతో వెనుకంజ ఎరుగని ఆంధ్ర మహిళ నాటికి నేటికి తన జాతి భాగ్యభోగ్యాలను చక్కదిద్దుకుంటూనేవుంది, యావత్ నారీలోకపు నీరాజనాలు అందుకుంటూనేవుంది.

—సంపాదకురాలు.



రాణీ రుద్రమదేవి

రాజనీతిజ్ఞత, పరిపాలనాదక్షతా పురుషుల సొమ్మే కాదు. స్త్రీలును చాకచక్యముగాను, సౌలభ్యంగానూ పరిపాలించగలరని రుజువుచేసిన మహిళామణి రాణీ రుద్రమదేవి. ఆంధ్రదేశమునేగాక పరిసరప్రాంతములనూ, ఢిల్లీవరకుకూడ, తమ సామ్రాజ్యమును విస్తరింపజేసుకొనిన కాకతీయ సామ్రాజ్య ప్రభుత్వమును అతిసమర్థతతో నిర్వహించిన రుద్రమదేవి ప్రతిభావిశేషములు ప్రశంసాపాత్రములై పాశ్చాత్యదేశ యాత్రికులనుసైతము దిగ్భ్రమ గావించినవి. తండ్రి గణపతిదేవునకు పుత్రసంతానములేని లోటును తీర్చి, యౌవరాజ్య పట్టాభిషిక్తురాలై తదనంతరము రాజ్యాధిపత్యముచేపట్టి, స్త్రీపాలనకు లోబడుటకు సిగ్గుపడి తిరుగుబాటు చేసిన సామంత రాజులను రాజనీతి విజ్ఞతతోనూ, కత్తితోనూ స్వాధీనము చేసుకొన్న ప్రజ్ఞాశాలి రుద్రమదేవి. తన ముప్పదియేండ్ల పరిపాలనలోనూ దేశమందెక్కడా, అశాంతి. ప్రజలలో అసంతృప్తి కలుగనీయక సర్వసంపదలతోను సౌఖ్యముగ జీవితములు జరిగిపోవునట్లు నిరాఘాటముగ పరిపాలించిన ప్రభ్వి రుద్రమాంబ. ఆంధ్రమహిళా లోకమునకేగాక సర్వ ప్రపంచమునకునూ స్త్రీ శక్తిని నిరూపించి స్త్రీకి అసాధ్యమైనదిలేదని రుజువుచేసిన ఆంధ్రమహిళ రాణీ రుద్రమదేవి.

ఆమె శౌర్య ధైర్యాలనే పుణికి పుచ్చుకుని. ఆమె శిక్షణలోనే పెరిగిన మనుమడు, ప్రతాప రుద్రమహారాజు. ఢిల్లీసుల్తానుల సైతము, ఓరుగంటికి బందీగా తీసుకువచ్చి ఆంధ్రపౌరుషమును, పూర్వుల గౌరవమును ఇనుమడింపజేసికొన్నాడు. ఆంధ్రమహిళలకు రుద్రమదేవి స్మరణ ఉత్తేజము కలిగించుగాక.

★



కస్తూరీబాయ్ గాంధీ

కస్తూరిబాయ్ గాంధీ పూర్వాచార పరాయణుల వాతావరణంలో పెరిగింది. వివాహము అయి, కాపురానికి వచ్చేనాటికి ఆమెకు ప్రపంచము ఏమీ తెలియదు. గాంధీజీ అంత మహాత్మునికి భార్య కావడము, ఆమె పూర్వజన్మములో నోచిన నోముల ఫలమే. మన పురాణాలలోని మహా పతివ్రతల కథలు ఆదర్శప్రాయములే కాని, ఇప్పుడు ఈయుగంలో మన కళ్ల ఎదట దర్శనమిచ్చిన మహాపతివ్రత ఈమె. తన భర్త నమ్మిన ఆదర్శాలను తాను సంపూర్ణముగా విశ్వసించుచూ, ఆయన నడిపించిన ఉద్యమా లన్నింటిలో తాను ముందడుగు వేయుచూ, ఆయన అభిప్రాయములకు అనుగుణముగా పూసలలోని దారమువలె జీవితాంతము వరకు సర్వవిధముల మనో వాక్కాయకర్మములచే భర్తనను సరించిన పతివ్రత.

దేశస్వాతంత్ర్య సంగ్రామంలో పురుషులతోపాటు స్త్రీలును పాల్గొనినప్పుడు మహిళా లోకంలో లాటిదెబ్బలకు, కారాగారవాసాలకు అగ్రతాంబులం ఈమెదే, నిరాడంబర జీవితము, నిస్స్వార్ధసేవా, నిరుపమానకరుణల మూర్తిస్వరూపమే కస్తూరిబాయి. ఈమె స్మారక చిహ్నముగా ఏర్పడిన 'నిధి' కార్యకర్తలు, ఆమె జీవిత మర్పించిన మహిళా మహోదయమునకు కృషిచేయుట ఎంతయు సమంజసముగానున్నది.

మహా భక్తిపరుడు, వేదాంతి, ప్రవక్తఅయిన శ్రీ రామకృష్ణ పరమహంసల వారి ధర్మపత్ని జగన్మాత శ్రీ శారదాదేవిని బోలి భర్తకార్యక్రమములను ఆచరణలో పెట్టి, పరాధీనప్రజలకు ఆత్మ కైంకర్యము చేసిన మహాసాధ్వి కస్తూరిబా మాజీకి మా జోహారులు.

—కుమారి ఎన్. సుహాసిని.



ఝాన్సీరాణి లక్ష్మీబాయి

భారతదేశ చరిత్రలో 1857 వ సంవత్సరము విస్మరింపరానిది. ఆ సంవత్సరం మేనెలలో భారత స్వాతంత్ర్య సమరానికి అంకురార్పణ జరిగింది. ఝాన్సీరాణి లక్ష్మీబాయి తన రాష్ట్రమును ఆంగ్లేయ పరాధీనత నుండి తొలగించి, సర్వస్వతంత్ర పట్టమహిషి అయినది. కాని, త్వరలోనే అడవులపాలై మిత్రులను, సైనికులను, సేకరించి, వివిధయుద్ధ రంగములో శత్రువులను భంగపరచి స్వాతంత్ర్య రక్షణకై కదనరంగమున అసువులు బాసినది

19 వ శతాబ్దం వీరవనితామణుల యుగము. వారిలో ఝాన్సీ లక్ష్మీబాయి నాయకమణి. మహిళాలోకములో ఆమె యొక్క రాజనీతిజ్ఞత, పరిపాలనాదక్షత, స్వాతంత్ర్య కాంక్ష, అకుంఠిత ధైర్య సాహసములలో సహస్రాంశమైన నలవరచు కొనినచో భారతదేశము ధన్యతమము అగును.

"ఆమెను చూచిన వారెవరును పురుషసింహ మనుకొందురే కాని పొరపాటున కూడ అబల అని యూహించుట అసంభవమే" అని ఒక ఆంగ్లేయ వీరుని నోటియూర అన్నమాట.



శ్రీమతి సరోజినీ నాయుడు

ప్రజాసేవా పరాయణత్వమున భారతనారీమండలమున ధృవతార శ్రీమతి సరోజినీ నాయుడు. కవయిత్రి, శాంతిదూత, రాజకీయవేత్త, బోధకురాలు. భారత మహిళా సంస్కృతీ సాంప్రదాయముల ప్రాశస్త్యమును విదేశీయుల బుర్రలలోనికి ఎక్కించి భారతజాతి విశిష్టతను, గౌరవమును ప్రపంచమున ఇనుమడింపజేసిన అసామాన్య మహిళాధురంధరి. శ్రావ్యమూ, మధురమూ, శక్తివంతమూ అయిన కోకిలస్వరముతో తన ఉపన్యాసములచేత స్వరాజ్యోద్యమంలో దేశీయులను ఉద్రేకపూరితులను చేసినది. విదేశీయులకు భ్రమ కలుగజేసినది.

పుట్టుక వంగ బ్రాహ్మణవంశంలో, మెట్టినది ఆంధ్ర అబ్రాహ్మణ కుటుంబంలో. కులమత భేదాలకు ఎప్పుడో స్వస్తిచెప్పి భారతజాతి ఒక్కటే అని ఆదర్శపూర్వకముగ నిరూపించినది.

సామ్రాజ్యమే ఏలగల ప్రజ్ఞాశాలిని, భారతప్రభుత్వం ఆమెకు ప్రథమ మహిళా గవర్నరు

“నన్ను మరచినా, దేశమును మరవవద్దు!”

ఈమె శ్రీ మాగంటి బాపినీడు గారి భార్య, కీ॥ శే॥ అన్నపూర్ణాదేవి. ఆంధ్రదేశములో జాతీయోద్యమంలో చేరిన ప్రప్రథమస్త్రీలలో నీమె ఒకరు—ఆమె ఆంగ్లంలో ధారాళంగా ప్రసంగించేది. సాహిత్యంలో కూడా మంచి కృషిచేసింది. బాల వాఙ్మయం తెలుగులో లేదేయని ఎంతో బాధపడేది. వంగభాషలో నుంచి “నవ వర్ష స్వప్నం” “వివాహమంగళం” ‘అరవిందుని’ లేఖలు తెలుగులోకి అనువదించింది, పాఠశాలలలోని బాల బాలికలకు అనువగునట్లు రామాయణ కథను ‘సీతారామము’ అను పేరున నవల రచించి పెక్కు మన్ననల బడసినది.



మాగంటి అన్నపూర్ణాదేవి

భర్త అమెరికాలో చదువుకొనుచుండగా అక్కడికి వెళ్ళుటకు అన్ని ఏర్పాట్లు చేసుకుంది. చివరి క్షణంలో గాంధీజీ ఆంధ్రదేశ యాత్రకు రావటంతో ఆ ప్రయాణముమానుకొని దేశసేవకై తన జీవితాన్ని అంకితము చేసింది. ‘నన్ను మరచినా దేశమును మరవ వద్దు’ అనిభర్తకు వ్రాసిన ఉపదేశమే ఆమె ప్రగాఢ దేశభక్తి చాటగలదు.

గాంధీగారు ఈమె విషయము వదిలిన మాటలివి—“1921 వ సంవత్సరంలో విజయవాడలో జరిగిన మహిళాసమావేశంలో ఖద్దరు వస్త్రధారియై....కృషిచేస్తున్న అన్నపూర్ణను తొలిసారి చూచాను. నాటి సమావేశానికి వచ్చిన వారందరిలోను ఖద్దరు ధరించిన స్త్రీ ఆమె ఒక్కతెయే! నాకు జ్ఞాపకమున్నంతలో తన ఆభరణాలనూ, చేతి గాజులనూ, కంఠహారాలనూ, నాకు మొట్టమొదట అర్పించింది కూడా ఆమెయే! ఆమె మరణము వలన ఒక భక్తురాలినే కాదు—కేవలము ఒక పుత్రికనే కోల్పోయినట్లు నేను భావిస్తున్నాను.”

శ్రీమతి వేదాంతం కమలాదేవి

ఆంధ్రదేశంలో బ్రాహ్మమత ప్రభావం ప్రసరించినకాలంలో డాక్టరు వేదాంతం వెంకటకృష్ణయ్యగారి కుటుంబం సంఘ సంస్కరణోద్యమా లన్నింటిలోనూ పాటుపడినది. డాక్టరుగారి భార్య కీ॥ శే॥ కమలాదేవి, భర్తకు అనువర్తియై హరిజనోద్యమమున పతితోద్ధరణసేవా, వితంతు వివాహోద్యమాలలో కృషిచేసి పేరువడసినది. గాంధీజీ నాయకత్వము స్వరాజ్యోద్యమం తీవ్రతరంకా నుద్యమించినప్పుడు, అభ్యుదయ ఉద్యమాలన్నింటిలోనూ ముందడుగువేయు దంపతులిద్దరూ కాంగ్రెసులోచేరి నిరుపమానమైన సేవ చేసియున్నారు. వారి గృహము కాంగ్రెసువాదులకు, ఐచ్ఛిక సేవకులకు ఆశ్రయమూ, భోజన భాజనాదులూ సమకూరుస్తూ రేయింబవళ్ళు తెరచియుండే ధర్మసత్రంగా ఉండేది అంటే శ్రీమతి కమలాబాయి గాఢవిశ్వాసమూ, కార్యదీక్ష సేవాతత్పరత, స్వార్థరాహిత్యములే కారణములు. కాంగ్రెసు మహిళాదళానికి నాయకురాలై, అన్ని సత్యాగ్రహములలోనూ పాల్గొని, కన్నబిడ్డలకు దూరమై, కారాగారవాసక్లేశము సంతోషమున ననుభవించుచూ, లాటీదెబ్బలకు పాలయి, అష్టకష్టములూపడి దేశస్వాతంత్ర్యానికి జీవిత మర్పించిన కమలాదేవి మనకు ఎల్లప్పుడూ స్మరణీయురాలు.

యుగపురుషులు

"ఏ పూర్వపుణ్యమో ఏ యోగబలమో
జనియించినాడ వీ స్వర్గలోకమున...!"

అన్నట్లు పుట్టుటగిట్టుటకొరకే కాదని నిరూపిస్తూ బ్రతికిన మూర్ణాళ్ళు గొప్ప ఆదర్శమునకై కార్య దీక్షతో, సాహసముతో జీవితము సాగించి తమ కార్యము సాధించి అసువులను బాసిన మహనీయులెందరో మన దేశమున పుట్టినారు. పోయినారు. పుట్టుచున్నారు, పుట్ట గలరు. ఆధ్యాత్మిక మత సంస్కరణ అవసరమైననాడు బుద్ధభగవానుడు, రామానుజ, శంకరాచార్య, వివేకానం దులు పుట్టిరి. రాజకీయనాయకులు అవసరమైనప్పుడు పూజ్యబాపుజీ, సర్దార్ పటేలు, సుభాష్‌చంద్రబోసు, మోతిలాలు నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ వగైరా దేశసేవకై ప్రాణములర్పించుటకు సంసిద్ధులైరి. అట్లే సంఘసంస్కరణ అత్యవసరమైనప్పుడు రామమోహన రాయ్, లాలాలజపతిరాయ్, కందుకూరి వీరేశలింగము ప్రభృతులు సంఘసంస్కరణ ఉద్యమములు లేవదీసిరి. వీరి నిస్స్వార్థసేవచే, నిష్కళంక దేశభక్తిచే కేవలము యుగపురుషులుగానేగాక ఆ చంద్రార్కము భారతీయులకు గోచరించు ధ్రువతారలుగానిశీథవీధులలో గోచరించగలరు.

కందుకూరి వీరేశలింగము జీవితము ఆంధ్రులకు చిరపరిచితము. వారి పేరు చెప్పినంతన 'విధవా వివాహములు' మనస్సుకు స్ఫురించును కాని ఆయన మహిళాభ్యుదయమునకై చేసినసేవలో వితంతువివాహ ములు మాత్రమే ముఖ్యముకాదు. గాంధీమహాత్ముడు జాతీ యోద్యమములో స్త్రీలకు క్రొత్త స్థానము కల్పించినట్లు శ్రీ వీరేశలింగముగారు సాంఘికముగా వేయపురుగులై స్త్రీజాతిని బాధించుచున్న అనేక దురాచారములను నిర్మూలించి, స్త్రీ జాతిలో గొప్ప సంచలనము గావించి వారిలో అనన్యసామాన్యమైన నవచైతన్యము గలిగించిరి. అదే వారు స్త్రీలకు చేసిన మహా సేవ.

"ఆరంభించరు నీచమానవులు.... ....యుగ యుగానికీ ఇట్టి పురుషులు జన్మించుతూ లోకకళ్యాణానికి పచ్చతోరణముకట్టుతూ వుండుట మానవాళికి శ్రేయో దాయముకదా!

— సంపాదకురాలు.





యుగపురుషుడు

సంఘసంస్కర్త

కందుకూరి వీరేశలింగం పంతులుగారు

శ్రీమతి రావూరి వేంకటసుబ్బమ్మ

సీ॥ ఇచ్ఛకమ్ముల ప్రొద్దుపుచ్చెడిమానవ
తికినొక్క ధర్మబోధినిగమెలగి।
తానెఱుంగని యట్టి ధవుబాయు ననద దైన్యమువాపు శరణాలయముగవెలసి।
అజ్ఞానమున బాధలందుచు మ్రగ్గుకాం
తలకు వివేకవర్ధనిగ జెలగి।
మూఢతనోములు పూజలుసేయువా
రలకు ప్రార్థనమందిరముగ నొప్పి।

"వెలయుతన జీవితమ్ము సఫలతనొంద
అంగనాజను లెల్లరు హర్షమంద
విలిచికొన్నాడు శాశ్వత విమలకీర్తి
కందుకూరి వీరేశలింగ కవివరుండు"

చం॥ పెనిమిటిదోవ తోన చితి
వ్రేల్చెడి దుర్ణయ మాపి రామమో
హనుడు గడించెదీనులగు
నాంధ్ర కృతజ్ఞత, కట్టెవో నియా
మనికి సుఖాస్పదమ్మయి, సు
మమ్ములుదాల్చి ఫలించునట్టులీ
యనఘుడు క్రొత్తవౌపరిణ
యమ్ములవారికిఁ గూర్చెసౌఖ్యముల్॥

ఉ॥ దాతలులేరె యీ భువి వ
దాన్యత, బేర్పడినట్టివార లీ
రీతి నిజార్జితంబులగు
రిక్థములెల్ల ననాథబాలికా
వ్రాత సుఖార్థమై వరకృ
పా మతి నెవ్వడొసంగె లీలమై
యీతనిసాటిలే రితరు
లీవికి సత్కృప కార్తరక్షకున్॥

తే॥గీ॥ స్త్రీల దుస్థితి బాపిన శీలపరుఁడు
సంఘసంస్కర్త మేటిశాస్త్రజ్ఞు డితడు
ఇట్టి లోకోపకారిని యింతులెల్ల
మరువ కెపుడు కృతజ్ఞలై మనగవలదె॥

తే॥గీ॥ సంఘమునను దా వెలియయి సంఘమునకె
చేసెను మహోపకార మీ స్థిరయశుండు
ధర్మసంస్థాపనార్థ మీ ధరణియందు
యుగయుగంబున జనియింత్రు యోగ్యతములుఁ॥

రాజా రామ మోహన రాయలు




శ్రీమతి శ్యామలా ఇంద్రాణి

దాస్య శృంఖలాలలో ఉన్న భారతదేశమును సర్వవిధాల ఉద్ధరించుటకు అవతరించారా అన్న. మహాపురుషులలో శ్రీ రాజారామమోహన రాయలు ఒకరు. గాంధీ యుగానికి ఒక శతాబ్దమునకు ముందుగానే రామమోహనరాయలు దేశాభ్యున్నతికి అన్ని రంగములలోను. ప్రాతిపదికలువేసిన మహనీయుడు. అజ్ఞానాంధకారము అలముకొని దురాచారములు ప్రబలియున్న సంఘమునకు వెలుగుబాటలు నిర్మించారు. పాశ్చాత్య పరిపాలనలో ఉన్న దేశము పెడద్రోవలు త్రొక్కకుండా స్వకీయ సాంప్రదాయములను నిలువబెట్టుటకు చెలియలికట్ట యైనారు. దారుణము, అమానుషముయైన సతీసహగమన ఆచారమును శాసన రీత్యా అంతమొందించిన మహాపుణ్యమునకు భారత నారీలోకమేకాక సర్వమానవులు ఆయనయెడల కృతజ్ఞులైయుండుట అవసరము. ఇంగ్లీషు చదువు మన మతమునకు అనర్థకమని దానిని విరోధించుమూర్ఖులను ధిక్కరించి, దాని ఆవశ్యకతను గుర్తించి, ప్రథమ ఇంగ్లీషు పాఠశాలను నెలకొల్పుటకు కారకులైన రామమోహనుని దూరదృష్టికి జోహారులు !

"నరనారేర్ సమానాధికార్" అని ఉద్ఘోషించి సర్వవిషయములందును స్త్రీ లోకమునకు సమానప్రతిపత్తికై బీజములునాటిన మహావ్యక్తి.

సంఘములో ప్రబలియున్న కులమతభేదాల నిర్మూలనకు గొడ్డలిపెట్టు ఆయన. వయస్సు, కులము, శాఖ, మతములలోని ఆటంకములను పాటించని వివాహములను ప్రోత్సహించిన విశాలదృక్పథము ఆయనది. మత, సాంఘిక, రాజకీయ, విద్యా, సాంస్కృతిక క్షేత్రములలో సంస్కరణమునకు ఆయన నాటిన బీజములే చిగిర్చి, వృద్ధిపొంది క్రమముగా ఫలప్రదమగుచున్నవి.



महात्माह्येवमब्रवीत्

उत्कटोऽथ विमलो मनोरथो
यो भवेत्स परिपूर्यते सदा ।
नैकदास्य नियमस्य सत्यता
दृष्टवाननुभवेऽहमात्मनः ॥

मतयोर्न विसंवादो
मन्तव्यो वैरसन्निभः ।
नो चेद्भार्या ममाहं च
स्यातां शश्वमिथोऽरिणौ ॥

न बुद्बुदसमाः स्वप्ना
अकिञ्चित्सदृशा मम ।
परमार्थपरिणामांस्तां-
श्चिकीर्षामि यथाबलम् ॥

महात्मत्वाप्रेयो भवति मम सत्यं न्वतितमा
मदोभाराभिन्नं मम निजविशून्यत्वपरिधेः ।
स्वकीयानां सीम्नामथ परिचयो वा विहितवान्
महात्मत्वोत्पीडाभरत इत यावत्परिह्वतिम् ॥

मां श्रीकृष्णप्रतिममिव ये भासयन्ते मते मे
पाखण्डास्ते ननु लघुतमः कार्यवाहोऽहमस्मि ।
कार्येतस्मिन्महति बहवः सन्ति तेषाहमेकः-
स्तन्नेतृणां महिमकथनाल्लाभतो हानिरेव ॥

न वेद जगती कियन् महिमनो ममालम्बते
तथा कथिततोऽविरत-भारकष्टश्रमान् ।
स्त्रियामथ नृणां कृतिमतां विशुद्धात्मनां
स्वकार्यपटुतावतां निभृतकार्य चिन्ताभृताम् ॥

एतन्मामक-गौरवस्यशिखरं मित्रैः कृतस्यास्ति मे
यत्ते स्वायुषि योजयेयुरचलाः कार्यक्रमान्यानहम् ।
संसेवे यदि नोभवेयुरथवा तस्मिन्नुपात्तादरा
यावच्छक्ति विरोधिभिर्मम तदा संवर्तितव्यं हि तैः ॥

महात्माह्येवमब्रवीत्

सीमानामात्मनामस्ति
संविन्मामकमानसे ।
हृदिस्था सैव संविन्मे
केवला शक्तिशालिता ॥

तथा शरीरं मम दोषपात्रं
यथा लघिष्ठस्य नरान्तरस्य ।
तस्मादियं मे प्रतिपत्तिरस्ति
यथापरो भ्रान्तिपरस्तथाहम् ॥

न कार्यबलितां प्रति प्रयतते मनो मे हठात्
परन्तु परिपन्थिनी यदि भवेत्समाराधने ।
स्वधर्मपरिरक्षणे परतमस्य कार्यस्य सा
जनो गणयितां मया यदियमस्ति साध्वर्जिता ॥

वात्याहतायुषिन्यक्कृतिमध्ये
चाजये तथाकथिते ।
अलमहमात्मन अवितुं
शान्ति मान्तराद्दतेशविश्वासात् ॥

निवार्यन्ते सद्यः परिहरणकामेऽपि न जने
भवन्त्येतादृक्षा जगति बत वस्तूनि कतिशः ।
इयं कारारूपा जनिविषसमा पार्थिवतनुः
परन्त्वस्यां क्षान्तिह्यपि च निर्वृतिर्मेऽबलवतः ॥

मदीममायुर्ह्यविभाज्यमेकं
मिथःप्रसारप्रवणाः क्रियाश्च ।
प्रीतिर्नृवंशे मम या न शाम्या
सा मत्क्रियाणां च निसर्गमूलम् ॥

न कोऽप्याशासेऽहंवसतिमयिदर्पः परमहं ॥
निजं दौर्बल्य यत्सकलमवगच्छामि ननु तत् ।
ध्रुवा मे श्रद्धेशे करुणिमयुते तस्य च बले
कुलालस्यामुष्याहमपि करयोरस्मि मृदिव ॥

अहं मार्गाभिज्ञो भवति सत्त्रृजुश्चाप्यणुतरः
समोऽसेर्धारायाः समुदमहमस्यां हितपदः ।
स्खलन्रोदिम्यैशं वचनमिदमाश्वासयति मां
कदाचिन्नश्येन्नाचरितदृढयत्नो न्ववितथम् ॥

१४. द्वारका
बृन्दावन स्ट्रीट
मैलापुर, मद्रास.

चिंतामण द्वारकानाथ देशमुख

७-१२-१९५६

Phone : 85663

AUTO SERVICE STATION

PRIVATE LIMITED.



★

YOUR PLEASURE IS OUR JOY

"Fair exchange is no robbery "....we believe you will get the wanted satisfaction for your car if you depend upon our Service Department.

Our Organisation is tuned to care for the product we sell.

This concentrated effort is reflected in our skilled mechanics, special tools and approved lubricants.

So, let us give you pleasure and take joy make a trip to-day.

మనలో మనమాట



కలడు కలం డనెడు వాడు కలడో లేడో?

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

నిజమే. ఈ సందేహము మనకందరికీ చాలారోజుల నుంచీ కలుగుతూనే వున్నది. ఇంతకీ "కలడు కలండనే" వాడు ఎవ్వడు? ఇప్పుడు చూచి వచ్చినవారెవ్వరు చెప్పటములేదుకదా. పోతే వేదవేదాంతాలా, పాత పురాణాలా ఇవన్నీ చెప్పేది? వేదాలూ పురాణాలూ ఏమిఘోషిస్తే మనకెందుకు? వాటినిచూచేదెవరు? చూడవలసిన పనేమున్నది. తిక్క తిక్క వ్యవహారమంతా ఘోషించే ఆ పాత పురాణాలను ఈ 20వ శతాబ్దములో ఖాతరుచేసేదెవరు? పాతచింతకాయ పచ్చడి పత్యానికే పనికివచ్చేది. బ్రహ్మాండమైన మేథాశక్తితో ప్రతిసృష్టి చేయ కలిగి అటంబాంబులతో సృష్టినంతా క్షణంలో నాశనము చేయగల ఇప్పటి మానవులు అసలాపురాణాలు చూడటమే పొరపాటు.

అయినా పురాణాలు కలడు కలండనుచున్నవో లేదో గాని, సినిమాల్లో కలడనే అంటున్నారుగనుక కలడో లేడో కలడంటేనే ఫ్యాషన్, అనార్కలీ చీరె, అజంతా కొప్పు, అమరావతి రవికె, నాగార్జున తలపాగా ఎంత అనుసరణీయమో. దేవునిపూజ అంత అనుసరణీయమే. ఇంటిలో స్టీరియోవైపు డ్రాయింగురూము ఎంత అవసరమో, పూజామందిరము కూడా —బీదవారింటిలో అయితే గోడనుకొట్టిన పలకా— అవసరము. నలుగురితో నారాయణ క్షేమము.

అయినా కలడో లేడోయని ఆలోచనెందుకు? వుంటే ఏమి? లేకపోతేనేమి? వుంటే వుద్ధరిస్తాడుగనుకనా లేకపోతే ప్రపంచము కొల్లబోతుందా? ప్రపంచమంతా ప్రళయమొచ్చి తుడుచుకుపోతే మరీమంచిది. లేడూ వున్నాడూ అంటే అన్నీ సమస్యలే. పూజలు పునస్కారాలు- కాని వున్నా అంతా కర్మప్రకారము- చేసుకున్నవారికి చేసుకున్నంతగా జరగాలికదా? చిత్రగుప్తుడిచిట్టా ప్రకారము అన్నీ జరుగుతూ వుంటే- వున్నాడని మనము తెలుసుకొని చేసేదేమిటి.

కాబట్టి కలడో లేడోనని వెర్రిముఖము వేసికొని కూర్చుంటే ఈరోజుల్లో డాక్టర్లు పిచ్చాసుపత్రికి పంపిస్తారు. అంత తెలుసుకోవాలనేవుంటే ధ్రువునివలె అరణ్యానికి దోవ చూచుకోవాలి జాగ్రత్త. ఈరోజుల్లో ఏవిషయమైనా అనుమానము వుండకూడదు. అనుమానము వున్నట్లు అసలే వుండకూడదు. ఏవిషయమైనా సరే ఇటో అటో తేల్చుకొని వుండాలి. వాళ్ళంతటవాళ్ళు తేల్చుకోలేకపోతే, ఫ్రీగా తేల్చిపెట్టే బుద్ధిమంతులు చాలామంది వున్నారుకదా! వారినడిగి ఏవిషయమైనా ఇదమిద్ధంగా నిర్ధారణ చేసుకోవచ్చు-

అయినా అప్పుడప్పుడూ అక్కడక్కడా ఒక్కొక్కరికి ఇటువంటి అనుమానాలు వస్తూనేవుంటూవుంటవి. కొన్నేళ్ళకు పూర్వము ఒక మేధాసంపన్నునికి, కవికి, వేదాంతికి, "ఇదే సందేహమొచ్చింది- కాని ఆయన ఆ సందేహముతో మధనపడలేదు శుభ్రంగా ఇంట్లో ఒక గదిలో ప్రశాంతసమయములో ప్రశాంత మనస్సుతో మోకరించి ,కళ్లు మూసుకొని, చేతులు జోడించి "భగవంతుడనేవాడుంటే, ఓ భగవంతుడా! నాకు ఆత్మంటూ వొకటుంటే నీవు రక్షించగలిగితే రక్షించాలి" అని ప్రార్థన చేశాడట. కాని ఈ సందర్భములో అలవైకుంఠపురంబులోని ఆపన్న ప్రసన్నుండు సిరికి చెప్పకుండా హడావిడిగా బయలుదేరి రాలేదు.

ఆకలడు లేడనేవానికి తొందరగా భక్తుల ఆక్రందనలు వినబడే అలవాటు లేదు- అసలు మొదటి విషయము భక్తుడు బాగా బాధలు. విచారము అనుభవించాలి. అంతమాత్రముచేత బాధలు కష్టాలు ఆ కలడనేవాని అనుగ్రహము సంపాదించడానికి గ్యారంటీ పత్రములుకావు. ఆ కలడనేవాడు దయానిధి, కరుణానిధి అని అంటారేగాని, ఆ దేవుని హృదయం. మనలో మనమాట. మంచుగడ్డ వంటిదని నావుద్దేశము- ఐస్‌లాగా కరగనూ కలదు. రాయివలె వుండనూ కలదు.

అలనాడు రామదాసుకు, ప్రహ్లాదునికి, ధ్రువ, ద్రౌపది, హరిశ్చంద్ర ఇత్యాది భక్తులందరికి ఆ భగవంతుడు ప్రత్యక్షమై, కలడని నిరూపిస్తూ, "ఓ భక్తా! నీభక్తికి మెచ్చితిని" అని అన్నాడుట. అందరూ నానా అవస్థలపాలై "లావొక్కింతయు లేక- ధైర్యము విలోలంబై ప్రాణంబులున్ రావులుదప్పిన". తరువాతే ఆ కలడు కలడనే మహానుభావునకు దీనాలాపములు వినబడటమూ- ఆయన అభయమివ్వటమూ జరిగింది. అంతేగాక- అధికారివద్ద సహాయము కావలసి వచ్చినప్పుడు ఆయన మేనమామ బావమరది అల్లుడి తమ్ముడి షడ్డకుని రికమండేషను అవసరమైనట్లు ఆ భగవానుని అనుగ్రహమునకు రికమండేషన్లు కూడా అవసరము-

అందుకే రామదాసు—— 'ఏలదయరాదు రామయ్యా' యని విలపించాడు జైలులో- తానీషా కొరడాదెబ్బలు "భరింపలేను రామయ్యతండ్రీ!" యని మొరపెట్టుకున్నాడు- "సీతమ్మకు జేయిస్తి చింతాకు పతకము... కలికి తురాయినీకు పొలుపుగాచేయిస్తి రామచంద్రా!- నీవు కులుకుచూ తిరిగెద వెవరబ్బసొమ్మని రామచంద్రా!" యని బెదరించికూడా చూచాడు- ఊహూఁ- రామచంద్రుడు పలకనూలేదు ఉలకనూలేదు. అప్పుడు రామదాసు

"నన్ను బ్రోవ మని చెప్పవే సీతమ్మ తల్లీ!
నన్ను బ్రోవమని చెప్పవే జనని జానికమ్మా!॥
ప్రక్కన చేరుక......ఏకాంతరంగడు......
.....నిద్రమేల్కొనువేళ అలివరో! బోధించి॥ నన్ను॥

అని ఆలాపించాడు. అంతటితో అన్నదమ్ములు రావటము రామదాసుని రక్షించటము మీకు తెలిసిన విషయమే-

కాబట్టి పర్యవసానము తేలిం దేమిటంటే- కలడో లేడోయని జీవితాంతమువరకూ ఆలోచించినా ఆ సమస్య తేలదు, ఓ చిన్న చీమకుట్టంగానే "రావేయీశ్వర! కావవే" అంటే రాడు, కష్టాలలో కంఠమువరకూ మునిగి అప్పుడు కూడా వున్నాడే అనుకొని "కలుగదేనాపాలి కలిమి..." యని విలపిస్తే ఆ భక్తజనపాలనాపరాయణుడు, నారాయణుడు, ఆ దీనాలాపములు విని వచ్చి రక్షించి కలడని ఋజువు చేసుకొనగలడు,

కాబట్టి ఈజీచెయిరులో పంకాక్రింద కూర్చుని కలడు కలడనువాడు కలడో లేడోనని అంటే .. సమాధానము డాక్టర్లే చెప్పాలి. మనలో మనమాట—— మానవుని బుద్ధి ఎంత మేధాసంపన్నమైనా దానికీ పరిమితులూఉన్నవి. హద్దులూ ఉన్నవి.

★

లోకం పోకడ!

రచన :
శ్రీమతి కె. సుగుణమణి

★★

"పాటల్లు పాడితే పలువ అంటూరు
పాడకుంటే జనులు మూగ అంటూరు
లోకుల్ని అందుకే కాకు లంటూరు !"

ఒకావిడ పాపం, స్వానుభవంవల్ల ఇలా అని ఉంటుంది. ఐతే తాము చెప్పే మాటలుగాని, వ్రాసే వ్రాతలుగాని, చేసే పనులుగాని సత్యసమ్మతమైనవై, తమకూ లోకానికీ, 'మంచి' చేస్తాయి అన్న ఆత్మ విశ్వాసం ఉన్ననాడు- ఎవరేమనుకున్నాసరే లెక్కచేయక ధైర్యంతో మాట్లాడేవారే, ధీమాగా కార్యసాధన సాగించే వారే, కడకు దిగ్విజయం సాధించి ప్రజ్ఞాఢ్యులౌతారు. "ధీరుల్ విఘ్న నిహన్య మానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై, ప్రారబ్ధార్థము లుజ్జగింపరుసుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్" మొదలు తమ్ము పరిహసించిన లోకమే కడకు హర్షిస్తుంది. హర్షించకపోయినా వారికి లోటులేదు. ఇందుకు అనేక ఋజువు లున్నాయి. మచ్చుకు కొన్ని :-

మానవుడు భగవంతుని బిడ్డ అన్న నేరానికి క్రైస్తును క్రాసుకు పెట్టి మేకులు వేసింది లోకం. ఆవెనుక భగవంతుడని ఆరాధించింది !

17 వ శతాబ్దంవరకూ సృష్టిలో మన భూమికే గొప్ప ప్రాధాన్యత ! బ్రూనో మహాశయుడు ఇది కాదన్నందుకే గదూ, మన భూమిలాంటి లోకాలు ఇంకా ఉండవచ్చునన్న 'మహాపరాధానికే'గదూ, అతణ్ణి పట్టుకొని, చితి పేర్చి తగలబెట్టింది లోకం ! దేవునిబిడ్డ- క్రైస్తు పుట్టిన భూగోళం విశ్వానికంతకూ కేంద్రంగా ఉండాలి ; దాని చుట్టూ సూర్యుడు, గ్రహాలు సంచరించవలసిందే. కాదని ఎవరన్నా అంటే బైబిలూ, చర్చి, ప్రజలూ ఊరుకోరు !

1610 లో మళ్ళా గెలీలియో మహాశయుడి వంతు ! తాను తయారుచేసిన దూ ర ద ర్శి ని (telescope) యంత్రంలో చూచి, "మన భూమి, గ్రహాలతోపాటు, సూర్యునిచుట్టూ పరిభ్రమిస్తుంది. మనభూమి కేంద్రం గాదు, సూర్యుడే" నన్నాడు. హ్రస్వదృష్టిగల లోకం "ఈ దూరదర్శిగాణ్ణి పట్టుకోండిరా" అంది. పట్టి, ఖైదులో పడేసింది. "కాదని అంటావా, ఖైదులో ఉంటావా ?" అంది లోకం. "నేను కాదని ఎలా అంటాను ? అంటే మాత్రం "సత్యం" అంటే ఎందుకవుతుంది?" అన్నాడు. అతనికి కారాగారవాసం తప్పిందిగాదు- ఆఖరుకు లోకం సత్యాన్ని ఒప్పుకోకతప్పిందీ కాదు. "గెలీలియోగొప్ప మేధావి" అంది లోకం ఆ తర్వాత !

మార్కొనీ మహాశయుడు తీగలు అక్కర లేకుండా మాట ప్రసారం చేయగల వితంతు . శబ్దవాహక యంత్రాన్ని తయారు చేశానన్నాడు, "తంతువు లక్కర లేకుండా ఈ 'వితంతువు' చేసేదేమిటి ! పట్టుకొని. పిచ్చి ఆసుపత్రికి పంపండిరా" అందిలోకం. లోకమేగాదు- బంధువులూను ! విడిచిపెట్టేక మళ్ళీన మోవాకాలర్పించింది అప్పుడు లోకం పిచ్చివాడన్న మేధావియొక్క రేడియోనే యిప్పుడు ఇంటింటానూ లోకమంతటా ఆనందించేది !

మానవుడు అలా ఒక్కసారిగా భగవంతుని బిడ్డగా పుట్టుకొచ్చేడు అని మతం చెపుతుంటే "సృష్టిపరిణామం (Evolution) కు ఒక క్రమపద్ధతి ఉంది. ఏకకణ జీవులు- బహుకణ జీవులు- జలచరాలు - భూచరాలు- చతుష్పాదజంతువులు-ద్విపాదజంతువులు-వానరం-అడవి మనిషి ఆధునిక మానవుడు క్రమంగావచ్చే"డని డార్విన్ మహాశయుడు ధైర్యంగా ప్రకటించేడు, ఈ కోతిగాణ్ణి వెలివేయండిరా అంది, లోకం. కొంతకాలం ! ఆఖరుకు ఆతడి సృష్టిపరిణామ సిద్ధాంతాన్ని లోకం ఒప్పుకోక తప్పిందిగాదు !

సిగ్మండు ఫ్రాయిడ్ అన్న ఆయన మానసికశాస్త్రానికి పితామహుడు, అతడు ప్రకటించిన సత్యాలకు ముక్కుమీద వేలు పెట్టుకుంది లోకం - కొన్నాళ్ళు ! ఇదంతా వట్టి ఫ్రాడ్ (మోసం) అంది ! ఐతే మాత్రం సత్యం ఒప్పుకోక తప్పుతుందా? సత్యాన్ని మనం కాదంటే మాత్రం సత్యం సత్యంగానే ఉండి పోతుంది. ధీశాలి, దాన్ని అంటిపెట్టుకొనే ఉంటాడు, లోకం మెప్పులతో ప్రమేయం లేకుండాను.

లోకంయొక్క తంతు చక్కగా రెండు మాటలలో చెప్పేడు శ్రీరామతీర్థ ; "సురాపానమత్తునెదుట బ్రహ్మర్షి నిలబడితే, సంసార సాగరాన్ని తరించే మార్గాన్ని బోధించమని ప్రార్థిస్తాడా? తాను తాగివిడిచిన కల్లుముంత అతని

"నెత్తిపై పగలకొట్టి చక్కాబోతాడుగాని!" యథార్థం అంతేమరి! లోకం తంతే అంత!!

అంతవరకు ఎందుకు, మనగాంధీ నేమంది ఒకప్పుడు లోకం? "స్వరాజ్యం నూలుదారం చివర వేలాడుతుందిట ఏమిటీ- ఈ ఇరవయ్యవ శతాబ్దంలో నవ నాగరిక వ్యామోహతా వివశమయ్యే లోకంలో. ఈ అర్థంలేని ప్రలాపం! "క్విట్ ఇండియా" అట- సూర్యుడస్తమించని మహాసామ్రాజ్యాన్ని పరిపాలించే బ్రిటిషర్ని!" ఆ మాటలే ఋజువైనప్పుడు, అంతపనీ జరిగినప్పుడు. లోకం విస్తుపోయి "తప్పు తప్పు" అని చెంపలు వాయించుకొన్నది మళ్ళీ ఆలోకమే! ఇదే లోకంలో ఉండే మాలోకం!!


ఆఖరుకు శ్రీరామకృష్ణ పరమహంస అంతటివారిని "పిచ్చివాని"గా పరిగణించింది లోకం! లోకపు పోకడల నెరుగని ఆ మహానుభావుడు దీని యథార్థత్వాన్నెరుగక బాలకుని రీతిని, మాతృ సమానురాలూ గురుతుల్యురాలునైన "భైరవీబ్రాహ్మణి"తో నన్నాడు. "చూడు తల్లీ, నేను పిచ్చివాడనంటూంది లోకం" అని. అందుకు ఆమె చల్లగా "ఎవరు పిచ్చివారు కారునాయనా. ఈ లోకంలో- ఒకరికి డబ్బుపిచ్చి, వేరొకరికి కీర్తిపిచ్చి, ఇంకొకరికి స్త్రీలపిచ్చి. నీకు నిన్ను సృష్టించిన సృష్టికర్తను గూర్చిన పిచ్చి! లోకమే పిచ్చిది నా తండ్రీ!! మీలో నేనే మంచి "పిచ్చివాడ"నని చెప్పు!!" అని ఊరడించింది. ఆ పిచ్చి ఆయన్నే ఇప్పుడు అటు అమెరికానుండి ఇటు ఇంగ్లాండు వరకు సర్వప్రపంచం పూజిస్తూంది.

లోకం పోకడను మన స్త్రీలు మరీ సూక్ష్మంగా, చమత్కారంగా, సామెతలుగా చెపుతారు. "మొగుణ్ణికొట్టి-మొర్రలెత్తిందని!" మనకాశ్మీరు ఆక్రమించిన పాకీస్తాన్ ప్రచారాలు, ఈజిప్టుపై విరుచుకుపడ్డ పాశ్చాత్య దేశాల సమన్వయాలు సరిగా ఇలాగే ఉన్నాయి. ఇలాంటిలోకంలో బ్రతకడానికి మనకు మహా ఓర్పు, సహనం, నిదానం, సౌభ్రాతృత్వం వగైరాలెన్నో ఉండాలి. లోకమన్ననకోసం కాదు. మన నిత్యమనుగడకోసరమేను! లోకమన్నన వాంఛిస్తే అది సున్నే అవుతుంది. అందుకే ఒక మహాకవి "ఏరీతి చరించినన్ మెచ్చరుగదా, సమకాలికులెంతటి వానినైన!" అని ప్రాణం విసిగి వేసారేడు.

లోకం పోకడే అంత!

★

కథానికలు, నవలలు




అనగనగా ఒక ... అనగానే మంచి కథ వినగలమనే నమ్మకములేదు కథానికలు వ్రాయటానికిగాని, నవలలు వ్రాయటానికిగాని ఒక ప్రత్యేక నైపుణ్యముండాలి. కథానికలు వ్రాయటము ఒక కళ. ప్రఖ్యాత రచయితల కథానికలు మేమిచ్చుట పాఠకులకు సమర్పించుచున్నాము. మొన్న మొన్నటివరకూ మంచి కథానికలుగాని నవలలుగాని మన సాహిత్యములో లేనేలేవంటూ కొందరు వాపొయ్యారు. కాని ఈ దశాబ్దములో తయారైనన్ని కథానికలుగాని, నవలలుగాని ఇదివరకు కనీవినీ యెరుగనంత విడివిడిగా ప్రకటితమౌతున్నవి. వాటిలో కొందరి కథలు, నవలలుకూడా చాలా చక్కటి రచనలనే ఒప్పుకొనకతప్పదు. ప్రపంచ కథానికలు, నవలలపోటీలో నెగ్గినవికూడావున్నవి ఈ కథానికలు, నవలలు కేవలము పుస్తకరూపకముగా ప్రకటితమగుటేగాక అనేక వార పత్రికలలో సీరియలుగా రేడియోలోకూడ ప్రకటితమైనవి. తెనుగు సాహిత్యములో కొల్లలుకొల్లలుగా కథానికలు, నవలలుండగా ఇంకా మేము ఆంగ్ల కథానికల, నవలల తర్జుమా ఎందుకు ప్రకటించుతున్నామో కొందరి పాఠకులకు ఆశ్చర్యము కలిగించవచ్చు కొందరి ఆంగ్ల రచయితలలోనున్న విశిష్టత ఇంకా తెనుగు రచనలలో లేదేమోనని మీకు సందేహము ఇప్పుడిక్కడ ఆ ప్రఖ్యాత రచయితలు. తామస్‌హార్డీ నవలొకటి, ఆస్కారు వైల్డు కథానిక ఒకటి శ్రీమతి రుద్రాణిచే తర్జుమా చేయబడి ప్రకటింపబడినవి. ముఖ్యముగా ఆస్కారువైల్డు రచనలు - ఆ రచనలకు అవే సాటి. అట్టి ప్రఖ్యాత రచయితల విశిష్ట రచనలు ఆంధ్ర మహిళా లోకానికి సమర్పించవలయునను ముఖ్యోద్దేశముతోనే ఇవి ప్రకటింపబడినవి. ఇదివరలో మేము కొన్ని ప్రఖ్యాత రచయితల కథలు ఆంధ్ర మహిళ ద్వారా ఆంధ్ర మహిళలకు సమర్పించాము ఇవి ఈసారి మా సంక్రాంతి కానుకలు.

—సంపాదకురాలు.

చదువుకొన్న నాటుమనిషి

కృష్ణమూర్తి తల్లికి చదువుకొన్న కోడలు రావాలని. కృష్ణమూర్తికి చదువుకున్న భార్యకావాలని. తండ్రిలేని కృష్ణమూర్తిని తానే తల్లి తండ్రి అయి పెంచి పెద్దచేసిన తల్లికోరికా, గారాబంగా పెరిగి యిష్టంవచ్చినట్లూ తిరిగి సంఘంలో సరదాగా వుండడం అంటే ఏమిటో తెలుసుకున్న కృష్ణమూర్తి కోరికా ఒకటే కావడంతో యింక కష్టంఏముందీ? ముసలమ్మగారు లెక్కలేనంత మంది పెళ్ళిళ్ళ పేరయ్యలకు యీ వార్త కాస్తా చెవిన వేశారు. ఇంకే ముంది హౌసు కంట్రోలు ఆఫీసులో ఖాళీయిళ్ళ ఎడ్రసుల్లాగ జాతకాల తోటీ ఫోటోలతోటీ ఎక్కడ లేని చిరునామాలూ కృష్ణమూర్తి యిల్లు వెతుక్కుంటూ వచ్చి చేరాయి. రాత్రి తొమ్మిదీ పదిగంటలదాకా, స్నేహితులనీ, క్లబ్బులనీ సేవించి నాలుగైదుపత్రికలూసిగరెట్టు పాకెట్లూ చేతపట్టుకునియిల్లు చేరేసరికి కృష్ణమూర్తిని ఆహ్వానిస్తూ చక్కనిచుక్కల్లాంటి అమ్మాయిలు: ఆ ఫోటోలు తనగదిలోకి తీసుకొనిపోయి కూర్చొనేవాడు. అన్నం దగ్గిర తల్లి ప్రశ్నలకి సమాధానంగా నవ్వేశేవాడు. ఏరా నాయనా తెనాలిపిల్ల ఎంతచక్కగావుందో చూశావా? ఆ గుంటూరు అమ్మాయికి యూనివర్శిటీవాళ్ళు పతకాన్ని బహూకరించారటరా!: ఆ మూడో ఫోటో నాకేమంత నచ్చలేదురా. ఓ ఆకెక్కువ చదివిన పిల్ల మనకెందులే; తోచినంతవరకూ అలాచెప్పుకుపోవడంఆవిడకిఅలవాటు. భోజనం ముగిసేదాకా కృష్ణమూర్తిదృష్టి యింకోదానిమీద పడదు. అమ్మా, యీ ఫోటోలన్నీ ఎలా వస్తున్నాయి మనకి? కొడుకు ప్రశ్నకి ఆవిడ నవ్వేరు. అదేంవిడ్డూరంరా, పెళ్ళికెదిగిన కుర్రాడుంటే ఆడపిల్ల తండ్రుల కళ్ళుపడవుట్రా? "అయితే సరేకాని నన్నిలాఫోటోలతో వేధించకు, ఏ యిద్దర్నో ముగ్గుర్నో చూసి తర్వాత ముడి పెట్టుకోవచ్చు" అనేసి భోజనం ముగించి వెళ్ళిపోయాడు ఆవేళ కృష్ణమూర్తి. పెళ్ళి అంటే యింత సులభంగా తీసుకున్న కొడుకుని చూసి తల్లి నవ్వుకుంది. చక్కగాచదువుకున్న అందమైన అమ్మాయి కోడలుగా వస్తే యీ చులకన భావం ఏమవుతుందో కదా! అనుకుంది.



రచయిత్రి : శ్రీమతి కె. రామలక్ష్మి

కృష్ణమూర్తి కుడిభుజం జగన్నాథం. హైస్కూలు దగ్గిరనుంచీ సహపాఠులు. అంతకన్నా కూడా సన్ని

హితులయిన స్నేహితులు. ఆస్తిపాస్తులుండి దేనికీ అడ్డు చెప్పని తల్లివున్న కృష్ణమూర్తికి జగ్గాయి అణకువ చూస్తే లోకువ; కాని అధోవిధం అయిన గౌరవంకూడా లేక పోలేదు. అందుకే తన నిశ్చయాలని జగ్గాయి ఒప్పందానికి పెట్టే అలవాటయింది. "ఈ పెళ్ళి కూతుళ్ళ వరద నుండి ఎలాగురా తప్పించుకోవడం?" అంటూ ఒకనాటి మధ్యాహ్నంవేళ జగ్గాయి యింటిమీదికి దాడిచేశాడు. జగన్నా ధానికి వేళాకోళం చేయబుద్ధివేసింది. "నీ ముఖం; ఒక్కొ క్కళ్ళనే వెళ్ళిచూడు. ఏదో ఒంకపెట్టి చక్కారా" దానికి పెద్ద గొడవెందుకూ?" అన్నాడు. "చదువుకున్న అమ్మాయిలని యిలా చూసి చక్కావస్తే...నాలుగు తిట్టరుట్రా" అడిగాడు కృష్ణమూర్తి. ఇంతేనా తెలిసిందీ! ఎంతచదువుకున్నా అమ్మాయిలమ్మాయిలే — సాక్షాత్తు పట్టా పుచ్చుకున్న నా చెల్లెల్ని చూడు అంతకంటే ఏ పల్లెటూరిపిల్లైనా నయం:" అయితే ఒసారి ఆ అమ్మాయిని చూణ్ణో"అనేసి నాలిక్కరుచుకున్నాడు కష్ణమూర్తి. నిజమే మరి అందరమ్మాయిలవిషయంలాగా స్నేహితుడి చెల్లెలి విషయంలో ప్రవర్తిస్తే వీపు పగులుతుంది. "ఫరవాలేదురా కృష్ణా, కొంచెం అలాంటి గడుగ్గాయేలే మా పార్వతి. చూద్దువుగాని పట్నంలోవుండి కాలేజీ చదువు వెగిలిస్తూంది — మా మామయ్య ఉన్నాడులే ఆడపిల్లల చదువంటే చెవికోసుకుంటాడు" సముదాయించాడుజగన్నాధం "అఘోరించాడు అయితే కొడుక్కొనీ పున్నాడా ఆ మామకి?" కుతూహలంతో ప్రశ్నించాడు కృష్ణమూర్తి. "లేడోయ్ పిల్లలేలేరు అందుకే. ఏంఅలా అడిగావు?" జగన్నాధం ప్రశ్నకి సమాధానం ఏమిటి? చూడనిపార్వతిని తనుఅప్పుడే ప్రేమించేస్తున్నానని ఎలాగ చెప్పడం?

"ఒరేయ్ జగ్గా, అమ్మకోసం అయినా వెళ్ళి రెండు సంబంధాలు చూసిరావాలి. నువ్వుకూడా రాకూడాదూ? ఓ వారం సరదాగా తిరిగివద్దాం" "చంపేశావు! అనూరాధకి యిందుకు వెడుతున్నాం అనితెలిస్తే నిన్నూ నన్నూ కలిపి తిడుతుంది. అయినా ఒక్కరోజు పోయివచ్చిరా నేనెందుకూ" అన్నాడు జగ్గాయి.

"ఎవరా అనూరాధ?" మిగిలిన విషయాలు వినిపించుకోనట్టే అడిగాడు కృష్ణమూర్తి. "నా యింకో మేనమామ కూతురులే. ఎప్పటికేనా నాభార్యఅవుతుంది" ముక్తసరిగా సమాధానం చెప్పాడు. "అఘోరించావు నాకూ ఓ మేనమామవున్నా బాగుండును"విసుక్కున్నాడు కృష్ణమూర్తి.

ఓవారం రోజులు గడిచాయి కృష్ణమూర్తి యింటికి వెళ్ళిచూస్తే తాళం వేసివుంది. మళ్ళీ యింకో నాలుగైదు రోజులుపోయాక వెళ్ళిచూస్తే కృష్ణమూర్తి తల్లివున్నారు. ఆత్రంగా జగన్నాధం అడిగాడు. ఏమండీ, కృష్ణ రాలేదా? అని. కూర్చోనాయనా అని కొంచెం టిఫినూ కాఫీ పెట్టి పెళ్ళికూతురు చూపుల ముచ్చట్లు చెప్పడం ప్రారంభించింది. "నాయినా, నీ స్నేహితుడు కదా. నీ అంతటి యోగ్యుడూ అయేలాచూడలేవూ? పట్నంనుంచి ముగ్గురు పిల్లల తండ్రులు కోరారు రమ్మని. వారం రోజుల్లో ముగ్గుర్నీ చూశాం. ఒక్కత్తేనా సవ్యంగా వుంటేనా?... చదువుకుంటే మటుకు ఒక్కర్తెకికూడా మంచీ మర్యాద తెలియదు అవ్వ! చెప్పుకుంటేకూడా సిగ్గు. ఓ అమ్మాయి ప్రశ్నలు వేసి అబ్బాయి నిలా నించోపెట్టేసిం దంటే నమ్ము!... అయితే నీపెళ్ళి ప్రయత్నా లెప్పుడోయ్?" అమ్మయ్య అనుకున్నాడు జగన్నాధం. లేకపోతే సంతలో వస్తులను విలువచేసినట్లు వెధవ పశ్నలూ వీళ్ళూ. — ఆ అమ్మాయి ఎవరో కాని మంచిపనిచేసింది. అనుకున్నాడు "నాకంత వెతక వలసిన పనిలేదండీ. మేనరికం వుంది. అయితే కృష్ణ ఎప్పుడువస్తాడూ?" "ఏం చెప్పమంటావు నాయనా. మద్రాసులోరేసులు అయిపోగానేవస్తాను నువ్వు వెళ్ళు అన్నాడు" అంటూ ముసలి తల్లి నిట్టూరుస్తూంటే, ప్రాణం కొట్టుకుంది జగన్నాధానికి. అందుకే కాబోలు కొడుకుని అదుపులో పెట్టే కోడలు కావాలని తపించిపోతోంది ముసలిప్రాణం అనుకున్నాడు వస్తానండీ. మళ్ళీ వస్తాను అనేసి గబగబ యిల్లుదాటి వెళ్ళిపోయాడు. నడుస్తున్నాడన్నమాటేగాని తన అదృష్టానికి తన హృదయం ఆనందంతో తడబడుతూంటే అడుగులు గబ గబ పడడం లేదు. అనూరాధని పొందడం గమ్యంగా చదువు సంధ్యలు శ్రద్ధగా ముగించాడు. అనూరాధ సుఖంగావుండడానికి యిప్పుడు ఉద్యోగం చేస్తున్నాడు. దీంట్లో స్వార్థం లేకపోలేదు. అయితే మటుకు ఎదటి వాళ్ళకోసం అనుకుంటే తృప్తి. ఇంటికి వెళ్ళగానే కలం కాగితం తీసి అనూరాధకి ఉత్తరం రాయాలని నిశ్చయించు కున్నాడు.

ఓనాలుగు రోజులతరువాత కృష్ణమూర్తి పట్నం విశే

షాలతో ఉప్పొంగిపోతూ జగన్నాధం యింటికి వచ్చాడు. కుర్చీలు ఒక వారకు నెట్టేసి వున్నాయి. లోపల గది గుమ్మంలో బిందె చెంబూ ఫినాయిలు సీసా చీపురూ, మెట్లెక్కి హాల్లోకి తొంగి చూశాడు కృష్ణమూర్తి. స్తబ్ధుడయి వెనక్కి ఓ అడుగు వేశాడు. ఊపిరి గట్టిగా పీల్చుకున్నాడు. గట్టిగా జగన్నాధాన్ని కేకేద్దామా? పోనీ ఓ క్షణం ఓపికపట్టితే యీ సుందరాంగి యిటు చూడదంటావా? ఆవిణ్ణిపిలిచి అడిగితే?.... ఒక్కసారి మళ్ళీచూస్తే? చూడమని హృదయం ముందుకి తోస్తూంది. ఏమరిఉన్న సుందరాంగులని వారికి తెలియకుండా చూడడం సభ్యతా లక్షణం కాదని మెదడు హెచ్చరిక. ఏమయితేనేం? లోపలికి ఒక అడుగువేస్తూనే జగ్గాయి అనికేకవేశాడు. ఆమెను చూసినట్టూ అవుతుంది. జగన్నాథాన్ని పిలిచినట్టూ అవుతుందని నమ్మకం. ఎవరూ? అంటూ రెండడుగులు ముందుకి వచ్చింది సుందరాంగి. చేతిలో బూజులుదులిపే కఱ్ఱ. చేతులకి గాజులూ ఏంలేవు. చిరిగిపోవడానికి సిద్ధంగావున్న పాతరవిక నాటు నాగరికతా సృష్టి. కొత్తరకం అజంతా స్టయిలు జుట్టుముడి చక్కటి కొప్పు. నిద్రలేచి అద్దం చూసుకోలేదేమో అనిపించే కళ్ళకాటుక— దరిదాపు ముఖాన్నే ఆక్రమించుకుంది. చీర కుచ్చెళ్ళన్నీ జాగ్రత్తగా ఎత్తి నడుంమీద దోపింది. దంతంలా మెరిసే పిక్కలూ నాజూకైన పాదాలూ చూడ్డానికి చక్కగా వున్నాయి. నిలువెల్లా ప్రశ్నార్థకంలా వుంది. అలా చూస్తూనేవున్న కృష్ణమూర్తికి హఠాత్తుగా తెలివివచ్చింది. "జగన్నాధం వున్నాడాండీ" అడిగాడు. చిరుకోపంతో ముఖం చిట్లిస్తూ చేతిలోని బూజులకఱ్ఱ గదిలో ఒకమూలపెట్టి చీర కుచ్చెళ్ళు క్రిందికిదించింది. కాని ఆ రవికేచీరా ఏంచేస్తుంది? కొప్పు యిప్పటి కిప్పుడు యిప్పి సరిచేసుకుంటే బాగుంటుందా? ఊహుఁ యీయనెవడు కోన్కిస్కాగాడు హుఁ అనుకుంది. "అయితే జగ్గాయి అనిపిలిచి కొద్దినిమిషాలపాటు అలా నిలిచిపోయిన గొంతు మీదేనా?" అడిగింది. లేని నవ్వు తెచ్చుకుంటూ "అవునండీ, పాపం ఏదో పనిలో వున్నారనీ" నమిలే కృష్ణమూర్తిని పరీక్షగా చూస్తూంది. ఇంతల్లోనే చిన్న తుఫానులా మేడమీద నుంచి యింకో సుందరాంగి దిగింది. సగంచీర తడిసింది. ముఖాన చెమటలు కమ్ముకొని వున్నాయి. కష్టపడి పనిచేసినట్లు ఒగరుస్తూ ఒక్క పరుగున క్రిందికి వచ్చి గండు పిల్లిలా మాటా మంతీ లేకుండా ఒకరి నొకరు చూస్తూ గుమ్మానికవతల నించున్న అబ్బాయినీ యివతల నుంచున్న పార్వతినీ చూసి ఆగింది. అనూరాధ. "ఏమిటే పారూ, అలా హిప్నొటైజ్ చేస్తున్నట్లున్నావు?" తనరాకను తెలియచెప్తూ ప్రశ్నించింది రాధ. అందరికీ వినిపించేలా 'హమ్మయ్య' అన్నాడు కృష్ణమూర్తి. రాధే ముందరికి వస్తూ, సారీ, రండి, యిల్లూ అదీ కొంచెం కడుక్కుంటున్నాం. మీకెవరు కావాలి? అడిగింది. జగన్నాధం కోసం వచ్చాను. నాపేరు కృష్ణమూర్తి అయితే ఆవిడ పార్వతిగారా? అడిగాడు కొంటెగా పార్వతిని చూస్తూ "అవునండీ ఆవిడే పార్వతి నా ఆడబొడుచు" అంది నవ్వుతూ అయితే మీరు అనూరాధగారు అవునా? అడిగాడు కృష్ణమూర్తి. పార్వతి కిప్పటికి తోచింది. తాను సంభాషణలో పాల్గొనడం లేదని.... అవునండీ, అవును, యిక్కడ ఒకరికి తెలియని యింకొకరు లేరు. మా అన్నయ్య ధర్మమా - అంటూ రండి కూర్చుందాం. అని పక్కకి నెట్టేసిన కుర్చీలు ముందుకి లాగింది. సగం బూజులతో దుమ్ముతో నిండిన ఆగది నందనవనంలా వుంది కృష్ణమూర్తికి. జగన్నాధానికి యింత చక్కటి చెల్లెలుందని తన కెందుకు తెలియలేదు? అలాతెలిస్తే జగన్నాధం దగ్గిర కొంచెం జాగ్రత్తగా ప్రవర్తించే వాడే తను! (అంటె తను పేక ఆడతాననీ, బైనులా పొగవిడుస్తాననీ యింకా యింకా ఎన్నో తెలియనివ్వక పోదునే) యిప్పుడు ఒకవేళ తనలోట్లు తెలిసిన జగ్గాయి చెల్లెలికి తను తగనంటే తనకి తెలియకుండానే మెదడు ఆలోచించేస్తూంది. కృష్ణమూర్తి హఠాత్తుగా యిలా వుండడం చూసి పార్వతి అడిగింది. "ఏమండీ మద్రాసు వెళ్ళేరుట. ఎవరేనా నచ్చేరా?" రాధ నవ్వింది. కృష్ణమూర్తి జేబుతడివి సిగరెట్టు తీసి వెలిగించాడు, 'మా అమ్మపోరు పడలేక వెళ్ళానండీ' యింకా ఏదో చెప్పబోతూంటేనే పార్వతి అందుకుంది. అయితే మీ అమ్మగారు అడగమంటేనే అడిగారా అన్ని ప్రశ్నలు సరళని? అన్ని ప్రశ్నలు వేసిన సరోజకి బదులు చెప్పొద్దన్నారా?" "కృష్ణమూర్తి గట్టిగా నవ్వేడు. ఇవన్నీ మీదాకా రావడం నాకెంతో సంతోషంగా వుంది. రాధగారూ కొంచెం మంచినీళ్ళు యిస్తారా?" రాధ లేచి లోపలికి వెళ్ళింది. "చూడండి పార్వతిగారు, ఇన్ని తెలిసిన నన్ను మీరు మన్నించి మా యిల్లు పావనం చెయ్య

మని కోరుతున్నాను." పార్వతి చేయి తన చేతిలోకి తీసుకున్నాడు కృష్ణమూర్తి. ఒక్కసారి విదిలించుకుని లేచింది పార్వతి. "మరి నాకు యూనివర్శిటీలో క్లాసురాదు. ఫంట చెయ్యడం సరిగారాదు. అన్నిటికంటే ముఖ్యం మొద్దబ్బాయిల్లాంటి మొగవాళ్ళని చూసివూరుకోవడం అసలే రాదు." అంది చిన్న నవ్వునవ్వుతూ "ఫరవాలేదు. ధైర్యేసాహసే లక్ష్మి అన్నారు కదా పెద్దలు అన్నిటికీ సిద్ధపడే మిమ్మల్ని కోరుతున్నాను. మీరు ఊ అంటే జగ్గాయిని యిట్టే ఒప్పిస్తాను." పార్వతి ఏదో ఆలోచనలో పడి అలాగే కృష్ణమూర్తి ముఖంవైపు చూస్తువుండి పోయింది. ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు ఆవిడ సమాధానం కోసం కృష్ణమూర్తి. వెనకనుంచి నీళ్ళపట్టుకు వచ్చిన రాధ గుమ్మం మెట్లెక్కుతున్న జగ్గాయి యీ దృశ్యం చూసి ఆశ్చర్య పడ్డారు. ముందరికి వచ్చి ప్రేమగా కృష్ణమూర్తి భుజం మీద చెయ్యి వేస్తూ జగ్గాయి అన్నాడు. "ఏమిటే పారూ మా వాణ్ణి అలా భయపెట్టేస్తున్నావు. అసలే మొన్న మద్రాసు వెళ్ళి దడుసుకున్నాడు" అనీదాకా ఎవరికీ తెలివి లేదు. అందరూ ఒక్కసారి నవ్వేశారు. పార్వతి పల్చటి చెక్కిళ్ళు ఎర్రపడ్డాయి. అలుముకున్న కాటుక నలుపులో ఆ నునుసిగ్గుల ఎరుపులు ఎవరికీ కన్పించలేదు. తిరిగి జగ్గాయే అన్నాడు "పో, పార్వతీ ఆ తల దువ్వుకునిరా, అసలే వీడు ఎలిజబుల్ బ్రహ్మచారి !" 'ఫరవా లేదురా జగ్గాయి' అన్నాడు కృష్ణమూర్తి. "ముందర అలాగే అంటారు. పో, పారూ" అని సముదాయింపు స్వరంతో రాధ అనేసరికి పార్వతి ఒక్కగెంతులో మేడ ఎక్కింది చిలిపిగా రాధకేసి చూసి నవ్వేడు జగ్గాయి "నే వెళ్ళి మా అమ్మని పంపిస్తానురా ఒకసారి. నీకేమైనా అభ్యంతరాలుంటే చెప్పు నాకు మీపార్వతిని చేసుకోవాలనివుంది." అడిగాడు కృష్ణ. జగ్గాయికి ఒక్కసారి ఎక్కడలేని అభిమానమూ ప్రేమా, జాలీ, అన్నీ ఉప్పొంగేసరికి గొంతుక పూడుక పోయింది "చూడు కృష్ణా మన స్నేహం దీనికి దారితీస్తుందని ఎప్పుడో అనుకున్నాను. పార్వతి సుఖ దుఃఖాలు నా భుజాలమీద పెట్టి అమ్మా నాన్నా కన్ను మూశారు. ఆ భారం నీలాంటివాడి నెత్తిన హాయిగా పెట్టగలను కృష్ణా. ఆసంగతేనా పార్వతిని అడిగావు?" సిగ్గుపడుతూ అవునన్నాడు కృష్ణమూర్తి. అమాంతంగా స్నేహితుణ్ణి కౌగలించు కొన్నాడు జగన్నాధం.

సిగరెట్టు వెల్గించుకుంటూ మెట్లు దిగుతున్న కృష్ణమూర్తిని మేడమీది కిటికిలోంచి చూసింది పార్వతి. "ఇదిగో మిమ్మల్నే సరే అన్నానని చెప్తారా మీ అమ్మతో అని కేకే వేసింది. పైకి చూశాడు. విప్పారినకళ్ళతో పైకి చూస్తున్న కృష్ణమూర్తి ముఖంలో చిరునవ్వు వెలసింది. పసివాడి బోసినవ్వులా అమాయికంగా వున్న ఆ ముఖాన్ని చూసి వెక్కిరించింది పార్వతి. హఠాత్తుగాలోపలికి తిరిగి మేడమీదకి వెడుతూ వంటయింట్లోకి తొంగి చూశాడు. కృష్ణమూర్తి. అనూరాధని కౌగిటచేర్చుకుని తన్మయదశలో వున్న జగ్గాయిని చూసి గబగబ మెట్లెక్కి పార్వతిముందర వాలేడు. 'నిజంగానా పార్వతీ ... నేను చాలా చెడ్డవాణ్ణి. నాకు అసూయ ఎక్కువ. నన్ను నిజంగా ప్రేమించకలవా పార్వతీ? అంటూ ఆమెచేతులు తన చేత తీసుకున్నాడు. ప్రేమించ కలగడమేమిటి అబ్బాయీ, నిన్ను గురించి నాకు కంఠతా తెలుసు. కృష్ణా నీ కోసం ప్రత్యేకించాను యీ ఘొండిఘటాన్ని సరా? యింకవెళ్ళు వాళ్ళు చూస్తే బాగుండదు. ' వాళ్ళంత చూసే స్థితిలో లేరులే అంటూ పార్వతిని హృదయానికి హత్తుకుని క్షణంలోకోట్లమైళ్ళు ప్రయాణం చేయించాడు మనస్సుని. క్రిందికి దిగివస్తూంటే మెట్ల దగ్గిర అనూరాధ నిల్చుని వుంది. కృష్ణమూర్తిని చూడగానే నవ్వుతూ, ఎవరూ లేకుండా ఏందోచు కొందామనండీ ఇదిగో పెళ్ళి నాటిదాకా యీ బహుమతి దాచలేను ఇంటికి తీసుకువెళ్ళి మీ అమ్మగారికి మటుకు చూపకండి అంటూ ఒక కవరు అందించింది. దారిలోనే దాన్ని యిప్పి చూశాడు. పార్వతి ఫొటో. వెనకకి తిప్పిచూశాడు "సర్వసామాన్యంగా మాపారూ ఇంట్లోఇలాగేవుంటుంది" అనూరాధ. "అని రాసివుంది. నవ్వుకుంటూ జేబులో పెట్టుకున్నాడు. ఏరోజు ఉదయాన బూజుల కర్రతో పార్వతి సాక్షాత్కరించిందో యించు మించు అలాంటి పోజులోనే వుంది యీ ఫొటో. ఇంటికి వెళ్ళి అమ్మకి చూపిస్తే ! అనుకున్నాడు కృష్ణమూర్తి.

అనుకున్నట్లు కొద్ది మాసాల లోనే కృష్ణమూర్తి గృహాన్ని పావనంచేసింది పార్వతి. చదువుకున్న కోడలు కావాలని కలలు కన్న ముసలామె కోరికా తీరింది చదువుకున్న పిల్లలంటే దడుసుకుని మద్రాసునుంచి వచ్చేసిన కృష్ణమూర్తికి చదువుకున్న నాటునాగరికతారాణీదొరికింది.

ఆంగ్లకథ :

రహస్యంలేని రహస్యం

[ఆంగ్ల సాహితీరంగంలో ఆస్కార్ వైల్డు ఒక వింతస్థానాన్ని ఆక్రమించుకున్నాడు. ఇతడిరచనలు ఎంతటికుతూహలాన్ని కల్గిస్తాయోకొందరిలో అంతటిఅయిష్టతనీ రేకెత్తిస్తాయి. కాని ఇతడు ఆనాటి సాహిత్యాని కిచ్చిన బలమూ కొత్తరక్తమూ కాదనలేరు ఎవరూ. వ్యక్తిగతంగా వైల్డు జీవితం నాటకంగా అతి అవాస్తవికంగా గడచిపోయినా సాహితీవేత్తగా, వైల్డు వదలివెళ్ళిన రచనలు మటుకు నిజం. ఆతని జీవితం అనేక ఒడుదుడుకులతో ఝురీవేగాన నడచిపోయింది. బ్రతికివుండగా అతడెదుర్కొన్న అవమానానికి ప్రతిగా చనిపోయిన అతనికి వచ్చిన ఘనకీర్తి వున్నా, యిప్పటికీ చాలా మంది ఆస్కార్ వైల్డుని నేరస్థునిగాచూస్తారేగాని విమర్శకునిగా, కళాకారునిగా,చూడరు. అది అతని దురదృష్టం. వీరిసంకుచితత్వం. ప్రస్తుతం యీక్రిందికథ "స్ఫిన్క్స్ వితౌట్ ఎ సీక్రెట్" అన్న కథకి తెలుగు].



(1856—1900)
ఆస్కార్ వైల్డు

"క్రైఫె డిలా పైక్స్" కివతల కూర్చుని ఒకరోజు మధ్యాహ్నం పారిసు జీవితపు ఐశ్వర్యాన్ని అసంతృప్తినీ చూస్తూ కూర్చున్నాను. నాకళ్ళ ముందుగా సాగిపోతున్న జీవితపు గర్వాన్ని దారిద్ర్యాన్నీ చూస్తూ ఆశ్చర్యపోతూన్న సమయంలో ఎవరోనన్ను పేరుపెట్టి పిలిచారు. తిరిగిచూస్తే లార్డు మర్చిసన్ కనిపించాడు. పదేళ్ళ క్రిందట కాలేజీలో కలిసి వుండేవాళ్ళం. తరువాత మళ్ళా చూసుకోక పోవడం వల్ల అతణ్ణి చూస్తే సంతోషం వేసింది హృదయపూర్వకంగా కరచాలనంచేశాం. ఆక్స్ఫర్డులో మేం ప్రాణస్నేహితుల్లా వుండే వాళ్ళం. ఎంతో అందగాడు. ఉత్సాహ వంతుడు. గౌరవనీయుడు. అస్తమానూ అలానిజంమాట్లాడేయకుండా వుంటే మాఅందరిలోకీ మంచివాడుగా తయారవుతాడు అనుకునేవాళ్ళం. కాని నిజానికి అతని నిజాయితీనీ మేం ఎంతో గౌరవించేవాళ్ళం. అప్పటికీ యిప్పటికీ బాగామారిపోయి కన్పించాడు. అప్పుడెంతో గాభరాగానూ ఆదుర్దాగానూ కన్పించాడు. ఏదోవిషయంఅతన్ని అనవసరంగా ఆందోళన పరుస్తూన్నట్లు తోచింది. ఇక ఏదో స్త్రీ అయివుంటుందని నిశ్చయించుకున్నాను. అందుకే తక్షణం అడిగాను. యింకా పెళ్ళి గట్రా చేసుకోలేదా? అని.

'నాకు ఆడవాళ్ళు బాగా అర్థంకారు' అన్నాడు లార్డు మర్చిసన్.

"గెరాల్డు ! ఆడవాళ్ళు అర్థం చేసుకుందుకు కాదోయ్ ప్రేమించడానికి" అన్నాను.

"నా కెక్కడయితే నమ్మకం కుదరదో అక్కడ ప్రేమ ఎలా నిలుస్తుంది?" అన్నాడు.

"నీ జీవితంలో ఏదో చిత్రం వున్నట్లుంది అది విశదంగా నాకు చెప్పు" అన్నిఅడిగాను.

"అయితే నడు, యిక్కడరద్దీ ఎక్కువగా వుంది. అలా ఎక్కడికేనా పోయి కూర్చుందాం. అదుగో ఆ

పసుపుపచ్చ వాహనం మటుకు వద్దు. యింకేరంగయినా సరే" అన్నాడు. కొద్దిసేపట్లో మేం మెడలీన్ కేసి ప్రయాణం సాగిస్తున్నాం. 'సరే, ఎక్కడికి వెడదామో చెప్పు' అన్నాను.

"నీ కెక్కడ యిష్టం అయితే అక్కడికే... బోయిస్ లోని హోటల్‌కి వెడదాం. భోజనం చేశాక నిన్ను గురించి నువ్వు అంతా చెప్పాలి." "అదేం కాదు, నిన్ను గురించి ముందు చెప్పాలి. నీ జీవితంలోని మిస్టరీని ముందుగా నేను తెలుసు కోవాలి."

జేబులోంచి వెండితో కట్టబడిన ఒక మొరాకో తోలు పెట్టె తీసి నా చేతికి యిచ్చాడు. తెరచి చూశాను. లోపల ఆడదాని ఫొటో ఒకటి వుంది. పొడుగ్గా నాజూకుగా వుంది. విశాలం అయిన కళ్ళతో, గాలికి ఎగిరేటట్టు వున్న జుట్టుతో చూడడానికి చక్కగా వుంది. భవిష్యత్తుని చూడ కలిగే మంత్రకత్తెలా కన్పడింది. ఖరీదైన దుస్తులు ధరించివుంది.

"ఆ ముఖం చూస్తే నీకేం అనిపిస్తుంది? సత్యవాదిలా కన్పిస్తుందా?" అడిగాడు.

ఆ ఫొటోలోని స్త్రీ ముఖాన్ని ఎంతో జాగ్రత్తగా పరిశీలించి చూశాను. చూస్తున్న కొద్దీ ఏదో రహస్యం దాచుకున్న వ్యక్తిలా తోచసాగింది. ఆ రహస్యం మంచిదో చెడ్డదో మాత్రం వూహ కందడంలేదు. అందమైనదే ముఖం అయినా అనేక విచిత్ర రహస్యాల కూడికలా తోస్తుంది. ఆ అందం మనస్సుకు సంబంధించినది. శరీరానికి సంబంధించినది కాదు. కనీ కనబడనట్లు వున్న ఆ చిరునవ్వు ఎంత నేర్పుగా కన్పిపిస్తుందో అంత తియ్యనిదిగా తోచడంలేదు.

ఇక ఓర్చుకోలేక "సరే దాన్ని గురించి నువ్వేం అంటావు?" అని అడిగాడు గెరాల్డు. "ఈవిడ ఏదో మిస్టరీ. ముందు యీవిణ్ణి గురించి అంతా విననీ" అన్నాను.

ఇప్పుడు కాదు. భోజనం అయాక. అంటూ ఎన్నో విషయాలను గురించి మాట్లాడుకోవడం మొదలుపెట్టాము.

భోజనం అయింది. కాఫీ సిగరెట్లు తీసుకు వచ్చాడు వైటరు గెరాల్డుకి తనిచ్చిన మాటను జ్ఞాపకం చేశా.

కుర్చీలోంచిలేచి గదిలో యిటూ అటూ రెండుమూడు సార్లు పచారుచేశాడు. తిరిగికూర్చీలో కూర్చుని చెప్పడం ప్రారంభించాడు.

"ఒకనాటి సాయంత్రం బాండ్‌రోడ్డువెంట ఐదుగంటలప్పుడు నడిచి పోతున్నాను. రోడ్డుమీద రద్దీ మహా ఎక్కువ అయి దరిదాపు అన్ని బండ్లూ రోడ్డుమీదనే ఆగిపోయినట్లయింది. రోడ్డు ప్రక్కన పేవ్‌మెంటుకి దగ్గిరగా ఒక నాలుగు గుర్రాలబండి పచ్చరంగు వేసినది ఆగి వుంది. అది తక్షణం నన్నాకర్షించింది. దానికికారణం ఏమిటో చెప్పలేను. ఆలా ఆ బండి దగ్గిరనుంచి నేపోతో తూంటే చూడు యివాళ మధ్యాహ్నం నీకు చూపెట్టానే, ఆ ముఖం తొంగి చూసింది బయటికి. అంతే మరు క్షణంలో ఆ ముఖం నన్ను బందీ కృతుణ్ణి చేసింది. రాత్రంతా దాన్ని గురించే నా ఆలోచనలు. మరునాటి ఉదయం కూడా అంతే. వెళ్ళి ఆ రోడ్డుమీద పిచ్చివాడిలా యిటూ అటూ తిరుగుతూ ఆ పచ్చబండి కోసం కళ్ళు కాయలు కాచేలా చూశాను. కాని నా అందమైన క్రొత్త ముఖం కానరాలేదు. చివరికి విసుగెత్తి అదంతా ఒక కల అనుకుని వూరుకున్నాను. ఒక వారం గడిచింది. మేడమ్ రస్టయిల్‌తో భోజనం చేస్తున్నాను. ఇంకా భోజనానికి పిలుపు కోసం వేచివున్నాం. ఆ టైమ్‌లో తలుపుతట్టారు ఎవరో. నాహృదయం ఆనందంతో ఉప్పొంగింది. నే వెతికి వేసారిన అందకత్తె తలుపు తట్టింది. మబ్బురంగు బట్టలమధ్య చంద్రకిరణంలా మెరుస్తూంది. భోజనానికి నాతోకూడా ఆమె నడిచింది. నా ఆనందానికి అవధులులేవు. అందరం భోజనాలకికూర్చున్నాక, యాథాలాపంగా నేను అన్నాను "బాండ్‌వీధిలో మీ ముఖం చూసినట్లు జ్ఞాపకం లేడీ ఆల్‌రాయ్." ఆమె ముఖం పాలిపోయింది. నూతిలోంచి మాట్లాడుతూన్నట్లు అతి నెమ్మదిగా "ఆలాగట్టిగా మాట్లాడకండి. ఎవరేనా మనమాటలు వింటారు" అంది. నాకు ఆశ్చర్యం వేసింది. మొదట్లోనే యిలాంటి వింతధోరణిలో మా స్నేహం ప్రారంభం అయినందుకు చాలా బాధ అనిపించింది. ఇక అసంగతి మాట్లాడక, ఫ్రెంచి నాటకాలను గురించి తీవ్ర చర్చలు మొదలు పెట్టాం. లేడీ ఆల్‌రాయి చాలా తక్కువగా మాట్లాడింది. ఎప్పుడుమాట్లాడినా అదే మృదువైన కంఠస్వరం. ఎవరేనా తాము మాట్లాడే విషయాలు వింటారేమో అన్న పిరికితనం. నాలో భావోద్రిక్తత క్షణక్షణానికీ పెరిగింది. అతిగా ఆవిడని ప్రేమించ సాగేను. ఆవిడ సన్నిధిలో వున్న విచిత్ర వాతావరణం మిస్టరీలా తోచి నాలో ఎనలేని కుతూహలాన్ని కల్గించింది. భోజనాలు

కాగానే ఆవిడ వెళ్ళిపోడానికి సిద్ధం అవుతూంటే, మళ్ళీ ఎప్పుడేనా మిమ్మల్ని కలుసుకునే అవకాశం యివ్వండి అని అడిగాను. ఓ క్షణం తటపటాయించి, దగ్గిరలో ఎవ రేనా ఉన్నారేమో అని యిటూ అటూ చూసి చివరకి అంది "సరే. రేపు పావుతక్కువ అయిదుకి" అని వెళ్ళి పోయింది. లేడీ ఆల్‌రాయిని గురించిన వివరాలు చెప్ప మని మేడమ్‌ర్రస్టయిల్‌ను వేధించాను. నాకుతెలిసినదంతా ఆవిడ ఒకవితంతువు అనీ పార్కు లేన్‌లో చక్కటియిల్లు వుందనీని. నేను మెల్లిగా బయటపడి యిల్లుచేరుకున్నాను.

మరునాడు సరిగ్గా టైముకి పార్కు లేన్ యింటిదగ్గిర వున్నాను. కాని బట్లరు చెప్పాడు. లేడీ అల్‌రాయి అప్పుడే ఎక్కడికో వెళ్ళిందని. నాకు మతిపోయినట్లు అయింది. ఎంతో బాధ అనిపించింది. చాలా యోచించి, చివరకి లేడీ ఆల్‌రాయికి ఒక ఉత్తరం రాశాను. ఇంకో రోజు ఎప్పుడేనా మధ్యాహ్నంపూట రావచ్చేమో అడిగాను. చాలా రోజులదాక సమాధానంకూడ రాలేదు. కొన్నాళ్ళకి చిన్న చీటి ఒకటి వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం నాలుగు గంటల తరువాత రమ్మని. ఆశ్చర్యం ఏమిటంటే ఉత్తరానికి చిన్న తాజాకలంరాస్తూ "యిక్కడికి దయచేసి యికమీద ఉత్తరాలు వ్రాయకండి. దీని అర్థం మిమ్మల్ని కలుసుకున్నప్పుడు వివరిస్తాను" అని రాసింది.

ఆ ఆదివారం నన్ను ఎంతో ఉత్సాహంతో ఆహ్వా నించింది. ఎంతో అందంగా వుంది. నేను వెళ్ళ బోయే ముందు నన్ను ప్రాధేయపడుతూ, యిక ఉత్తరాలు రాసే అవకాశం కావాలంటే, రాయాలని ఉంటే, యీ చిరునా మాకి రాయవద్దనీ, 'మిసెస్ నాక్సు కేరాఫ్ విట్టర్స్‌లైబ్రరీ, గ్రీన్ స్ట్రీట్' అని వ్రాయమనీ చెప్పింది. నా యింట్లో నా ఉత్తరాలు నేను ఎందుకు అందుకోనో కారణాలు లేక పోలేదు అంటూ చెప్పింది.

కొన్నిమాసాల పాటు అవిడని అప్పుడూ అప్పుడూ చూస్తూనేవున్నా ఆవిడ చుట్టూ పొగమంచులా ఆవరించి వున్న విచిత్ర వాతావరణం మటుకు విడివడలేదు. నాకు అర్థం కాలేదు. కొన్ని సమయాల్లో ఎవడో మగవాడి అదుపు ఆజ్ఞలలో చిక్కుకుని వుండి వుందని అనుకునే వాణ్ణి. కాని, ఎవరికీ అందరాని దేవతలా కన్పిస్తున్న ఆమె ఒక పురుషుడి అధీనంలో వుండడం అనేది అసం భవం అనిపించి. ఆవిడని గురించి ఒక నిశ్చిత అభిప్రా యానికి రాలేక పోయాను. ఎందుకంటే మనం విచిత్ర వస్తుశాలల్లో అప్పుడూ అప్పుడూ చూసే స్ఫటికాల్లా, ఒక ప్పుడు వినీలాకాశంలా అతి నిర్మలంగానూ, ఒకప్పుడు మేఘాచ్ఛాదిత గిరిశిఖరాల్లాగానూ వుండేది ఆమె. చివరకి నన్ను భర్తగా స్వీకరించమని అడగాలని నిశ్చయించు కున్నాను. నారాకపోకల మీదా నే పంపిన కొద్ది ఉత్తరాల మీదా అల్లుకొనివున్న రహస్యధోరణి విచిత్ర వాతావరణం నాకు భరింపరానిదైంది. వచ్చే సోమవారం సాయంత్రం ఆరుగంటలకి లైబ్రరీ చిరునామాలో నన్ను కలుసుకునే అవకాశం కల్పించమని రాశాను. ఆవిడ సరే అనే సరికి నా హృదయం ఆనందపు టంచులకు విస్తరించింది. ఆవిడంటే నాకు పిచ్చి ప్రేమ ఏర్పడింది; ఆమె చుట్టూ అల్లుకొని వున్న విచిత్రవాతావరణం నా ప్రేమని అరికట్ట లేక పోయింది. అప్పుడలా అనిపించింది. ఇప్పుడు అది నిజం అని తెలుసుకున్నాను. కాని నిజానికి ఆ స్త్రీ హృద యాన్ని ప్రేమించాను నేను. ఆమె చుట్టూ ఆవరించి వున్న విచిత్రవాతావరణం — మిస్టరీ నన్ను బాధపెట్టింది. పిచ్చెత్తించింది. నన్నెందుకు విధి ఆదారిన పట్టించింది." లార్డు మర్చిసన్ నిట్టూరుస్తూ ఆగేడు.

"అయితే నువ్వు ఆ మిస్టరీని భేదించావా?"

"అదే జరిగింది అనుకుంటాను. విని నీకు నువ్వే తేల్చుకో" సోమవారం వచ్చింది. మా మేనమామ యింటికి వెళ్ళి సాయంత్రం నాలుగు గంటల వేళ మార్లి బోన్ రోడ్డులో వున్నాను పికాడెల్లీకి వెళ్లాలని నా ఉద్దేశం. దగ్గిరదారి కదా అని చిన్న చిన్న వీధులు దాటుకుంటూ బయలుదేరాను, హఠాత్తుగా నా ముందు నుంచి లేడీ ఆల్‌రాయి శీఘ్రంగా నడిచి పోతూంది. బాగా దట్టంగా ముసుగు వేసుకుంది. ఆ వీధి చివరి యింటికి వెళ్లి త్వరగా మెట్లెక్కి పక్కజేబు లోనుంచి తాళంచెవి తీసింది. లోపలకి వెళ్లింది..... ఇదా అసలు సంగతి అనుకున్నాను, త్వరగా నేనూ ఆయింటి దగ్గిరకి వెళ్లి అంతా పరీక్షగా చూశాను. కాపరాలకి యిచ్చే యిల్లులాగా వుంది ఆ యిల్లు. వీధి మెట్టుమీద లేడీ ఆల్‌రాయి జేబు రుమాలు పడివుంది. దాన్ని తీసి జేబులో పెట్టుకున్నాను. నేనేం చెయ్యాలి అని ఆలోచించడం మొదలు పెట్టాను. ఆవిడ కదలికలు గూఢచారిలా కనిపెట్టే హక్కు నాకేం వుంది?...తిన్నగా క్లబ్బుకి వెళ్లిపోయాను, ఆరుగంటలు అయాక ఆవిడని చూడడానికి వెళ్లాను. సోఫాలో వాలుగా పడుకుని వుంది. వెండి రంగు టిష్యూ ధరించి చంద్ర

కొంత రాళ్ల దండ వేసుకుని పడుకుని వుంది. ఎంతో అందంగా కన్పించింది. 'మీరు వచ్చారా చాలా సంతోషం. నేనీవేళ బయటకే వెళ్లలేదు' అంది. కన్నార్ప కుండా స్థబ్దుణ్ణయి ఆవిడకేసి చూస్తూ నిల్చున్నాను. జేబులోంచి చేతి రుమాలుతీసి ఆవిడకందిస్తూ "యీవాళ సాయింత్రం మీరు కమ్నర్ రోడ్డులో ఓ యింటి ముందు దీన్ని పారేసుకున్నారు" అన్నాను. భయపడి పోతూ జేబు రుమాలు అందు కుందుకు ప్రయత్నమే చేయలేదు. "అక్కడ ఏంచేస్తున్నారు ?" అడిగాను, "నన్ను అలా అడగడానికి మీకేం హక్కుంది ?" అడిగింది. "నిన్ను ప్రేమిస్తూన్న వ్యక్తికి ఎలాంటి హక్కు వుంటుందో అదే హక్కుతో అడుగుతున్నాను లేడీ ఆల్‌రాయి ! యీవాళ మిమ్మల్నినాభార్యకమ్మనిఅడుగుదామనివచ్చాను"అన్నాను. ముఖాన్ని చేతులతో కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది. "నాకు నిజంచెప్పాలి." అన్నాను. లేచి నిల్చుని "లార్డు మర్చిసన్ ! చెప్పడానికిందులో ఏంలేదు" "ఎవరినో కలుసుకోవడానికివెళ్లావు" అని గట్టిగాఅరిచాను. "ఆదే నువ్వుదాస్తూన్నరహస్యం" అన్నాను, అతిగా ఒణికి పోయింది లేడీఆల్‌రాయి. పాలిపోయింది. నేను "ఎవరినీ కలుసుకుందుకు వెళ్లలేదు," అంది. 'నిజంచెప్పలేవా? అడిగాను 'నేను నిజమే చెప్పాను' అంది. నాకు పిచ్చి కోపం వచ్చింది. ఆ కోపంలో యిక ఒళ్లు తెలియలేదు. నేనేం అన్నానో నాకే తెలియదు. కాని దారుణంగామాత్రం ప్రవర్తించాను. చివరకి ఆ యింట్లోంచి బయటకి వచ్చేశాను. మరునాడు ఒక వుత్తరం రాసింది ఆమె-కాని విప్పి చదవకుండానే తిరిగి పంపించేశాను. నార్వేకి ప్రయాణం కట్టి వెళ్లిపోయాను. ఒకనెల గడిచాక తిరిగివచ్చాను. నే వచ్చీ రాగానే "మోర్నింగ్ పోస్టు పత్రికలో" చూసినది లేడీ ఆల్‌రాయి మరణాన్ని గురించిన వార్తలు, ఏదో ఒపేరా చూస్తూండగా జలుబు పట్టిందనీ, ఊపిరితిత్తుల బాధలో ఐదురోజులతరువాత ఆమె మరణించిందనీ వార్త. గదిలో తలుపులు మూసుకుని కూర్చున్నాను. ఎవరినీ చూడాలనిపించలేదు.... ఆమెని ప్రేమించాను. పిచ్చిగా ప్రేమించాను .... ఆ స్త్రీని ఎంతగా ప్రేమించాను !

"ఆ వీధిలో ఆయింటికి వెళ్లి చూశావా ?" అడిగాను.

'ఔను వెళ్లి చూశాను, ఒక రోజు కమ్నర్ వీధిలో ఆయింటికి వెళ్లాను. నాకుతూహలాన్ని అణచుకో లేక పోయాను, వీధి తలుపు తట్టగానే గౌరవనీయురాలిగా కన్పిస్తున్న ఒకావిడ తలుపు తీసింది. ఈవైపున గదులు అద్దెకి కాళీగా వున్నాయా ? అని అడిగాను, "మధ్యహాలు నిజానికి అద్దెకివ్వవచ్చు నండీ, కాని ఆవిడ మూడు నెల్ల నుంచి రానేలేదు. అద్దె అనవసరంగా పెరిగిపోంతూంది. అందుకే అద్దెకివ్వెచ్చునని చూస్తున్నాను, మీకు కావలిస్తే చూసుకోండి" అంది. ఫోటో చూపిస్తూ 'యీవిడేనా అద్దెకి తీసుకున్నది ? అని అడిగాను.' "ఆవిడే నండీ. ఎప్పుడు తిరిగి వస్తారో తెలుసా ?" అడిగిందామె. "ఆవిడ చనిపోయింది" అన్నాను, "నిజంగానా?" ఆవిడనా కాపరస్తులందరిలోకీ మర్యాదస్తురాలండీ, అప్పుడూ అప్పుడూ నా హాల్లో కూర్చుందుకు వారానికి మూడు గినియాలు అద్దె యిచ్చేది." అంది ఆమె "ఇక్కడ ఎవరినేనా కలుసుకునేదా? అబ్బే "అదేంకాదు. ఆవిడ యిక్కడ ఎవరినీ కలుసుకుందుకు వచ్చేదికాదు అని ఆవిడ నన్నునమ్మించింది. ఎప్పుడూ ఒక్కర్తేవచ్చేది. కూర్చునిపుస్తకాలుచదువుతూ కాలక్షేపం చేసేది. ఎప్పుడేనా టీ కాస్త తాగేది" అని చెప్పి వెళ్లిపోయింది. నేనేం చెప్పను ? నేనేంచెయ్యాలమో తెలియక ఆ యింటావిడచేతిలో ఒక కాసువేసివచ్చేశాను ఇప్పుడుచెప్పు, దీనికంతకీ అర్థం ఏమిటంటావు ? "ఆ స్త్రీ నిజమే చెప్పిందంటే నువ్వు నమ్మకలవా ?" అడిగాడు లార్డు మర్చిసన్.

"నే నమ్ముతాను." అన్నాను,

"అయితే లేడీ ఆల్‌రాయి అక్కడికి ఎందుకు వెళ్లిందంటావ్ ?"

"గెరాల్డు, లేడీ ఆల్‌రాయికి మిస్టరీమేనియా. అంతకు మించి వేరేంలేదు. ఆ గదులు అద్దెకి తీసుకున్నది అందుకే. ఎవరికీ తెలియదని వూహించు కుంటూ, మాయగా ముసుగు ధరించి అక్కడికి వెళ్లి తానేమో పెద్దనాయికనని మురిసి పోయేది. అంతకి మించి దీల్లో ఏం లేదు. రహస్యంఅంటే, మిస్టరీ అంటే ఆవిడకి అంత సరదా, కాని, వ్యక్తిగతంగా ఆవిడకేం రహస్యాలు లేవు. ఆవిడ ఒక రహస్యంలేని రహస్యం." అన్నాను,

"నిజమే. అంటావా ?" అన్నాడు గెరాల్డు. "నిజమే. దాల్లో సందేహం అక్కర లేదు" అన్నాను.

మొరాకో పెట్టె తెరచి ఆ ఫోటో కేసి చూశాడు లార్డు మర్చిసన్.... చూసిచూసి చివరికి....'నిజం అంటావా ?' అన్నాడు.

★

"పెళ్లి కూతురు"

"సుశీ" అన్నాడు సూర్యం. అంతా అటువైపు చూశారు. సుశీల తలవంచుకుని అడిగిన ప్రశ్నకి సమాధానంగా అతని పాదాలకి వంగి నమస్కరించింది. రావు అటు చూడలేక ముఖం తిప్పుకున్నాడు."

రావుకి ఇద్దరే ఆడపిల్లలు. సుందరి, సుశీల ఇద్దరూ రెండేళ్ళు తేడాగా పెరిగి పెద్దవాళ్ళయినారు. పెద్ద పిల్లకి ఇరవై దాటుతున్నా పెళ్ళి ప్రయత్నం చెయ్యలేదని తల్లి రోజూ పోరుపెట్టడం పిల్లలు వింటూనే ఉన్నారు. పిల్లలకి చదువులు చదివించి వాళ్ళ ఇష్ట ప్రకారం వాళ్ళకి నచ్చిన వాళ్ళని పెళ్ళిచెయ్యమని అడిగినప్పుడు చెయ్యాలని తండ్రి అభిప్రాయం. ఏలోటూలేని ఆ ఇంట్లో అక్క చెల్లెళ్ళు అన్నదమ్ముల్లాగా స్వేచ్ఛగా తమకి కావలసినట్టుగా పెరుగుతూ వస్తున్నారు.

అక్కచెల్లెళ్ళ అందచందాలు వర్ణించాలంటే ఎవరు ఎక్కువో చెప్పలేము. ఇద్దరూ తెలివి తేటల్లో కూడా సమఉజ్జీలుగా కవలల్లాగా పెరుగుతున్నారు.

"ఏమండీ! మిమ్మల్నే! సుందరిని చూడడానికని రత్నమ్మగారు వస్తున్నారు. పిల్లవాడు మంచి ఉద్యోగంలో ఉన్నాట్ట. బాగుంటాట్ట. బోలెడుఆస్థి. ఒక్కడే ఒక్కడు"

"ఊ అయిందా ఇంకా ఉందా!" అంటూ విసుగ్గా చదువుతూన్న పత్రిక చేతిలో ఉంచుకునే సమాధానం చెప్పాడు రావు.


"ఆడపిల్లలకి సంబంధాలు రావడమే కష్టంగా ఉంటే ఇంటిముందు వచ్చిన ఇంత మంచివాళ్ళని కాదంటే ఏమన్నా బాగుంటుందా? చెప్పండి మీరే?"

"నిన్ను ఈ అధిక ప్రసంగం ఎవరు చెయ్యమన్నారు? పిల్లలు పసిపాపలా? మనంవాళ్ళకి చూడనే అక్కరలేదు. ఇంక ఊరుకో!"

"బాగుందండీ వరస. వాళ్ళా చూసుకుంటారు? అంతా మీ ఇష్టాలే అన్నమాట. ఇంకనేను ఎందుకూ అంట?" అంటూ కన్నీళ్ళు ఆపుకుంటూ లోపలికి చక్కాపోయింది రావుగారిభార్య.

"పోనీనాన్నా! వచ్చిచూస్తే ఏంమునిగింది? అమ్మమాట కాదనడం బాగుంటుందా రమ్మందటగా. వచ్చిచూడనీ" అన్నది సుశీల, అక్క చెల్లెళ్ళ వాదనలు మాటకి మాట అన్నిముగిసి ఆఖరికి పెళ్ళివారు రావడానికి ఒప్పుకున్నారు అందుకే ఆతల్లి ఆనందపడి పోయింది.

పెళ్ళికొడుకూ, తల్లీ తండ్రీ అన్నట్లుగానే వచ్చారు. కావలసి పెళ్ళివారిని వెనక్కి పంపెయ్యాలని పెంకిపిల్లలు ఇద్దరూ వికారంగా కనపడాలని వెక్కిరిస్తూ కూచున్నారు. పరిచయాలు అయాక రావుకి తెలిసింది. తనతో పాటు చదువుకున్న స్నేహితుడి అన్నకొడుకే అని, అందంగా ఉన్న ఆ పిల్లవాణ్ణి స్థితిమంతులైన పెద్దల్ని చూశాక రావు



రచయిత్రి శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవి.

కొంత అటు మొగ్గాడు. పెళ్ళివారికి మర్యాదలు చేస్తూ అటూ ఇటూ ఖంగారుగా తిరిగింది రావుభార్య. పెళ్ళివారు లేచి వెళ్ళుతూ రెండురోజులలోనే కబురు చేస్తామన్నారు. వీధి గుమ్మందాకా అందరినీ సాగనంపి లోపలికి వస్తూ "నీకు ఇష్టమయితే మాత్రం మంచి సంబంధం" అన్నాడు రావు సుందరిని చూసి నవ్వుతూ.

మేడమెట్లు ఎక్కుతూన్న సుశీల తండ్రిమాటలు వింటూ ఒక్క నిమిషం ఆగిపోయింది.

బియ్యంచాట చేతిలోనే ఉంచుకుని పెళ్ళివారి సంగతులన్నీ మళ్ళాచెప్పింది తల్లి. సుందరి మాట్లాడకుండా గది లోకి వెళ్ళిపోయింది.

"మీరే దానికినచ్చచెప్పండి. కట్నాలుఇస్తామని తిరుగుతున్నారుట. ఇంతకన్న మంచి సంబంధం ఇంకరాదు" అంటూ బియ్యంచాట అక్కడే మరిచి పరధ్యాన్నంగా వంటఇంటివైపు ఆలోచనగా వెళ్ళింది రావుభార్య.

ఆఫీసునించి అప్పుడే వచ్చినరావు కాఫీకప్పు అందుకుంటూ "సుందరి నచ్చిందనీ, లగ్నం పెట్టమనీ కబురు పంపారు. ఏమనికబురుచెయ్యను? లేనిపోనిదేవచ్చిందే!"

"వాళ్ళిష్టం. వాళ్ళిష్టం, అంటున్నారు. ఇంతకన్న మంచిసంబంధం తెచ్చుకుంటారా, నామాటవిని, దాన్ని ఒప్పించి చేశెయ్యండి."

"ఊరుకోమ్మా! ఎవరికో ఒకరికిచ్చి తొందరగా పెళ్ళి చేశెయ్యాలంటావ్. నేనేంచేసుకోను!" అంటూ సుందరి తల్లిని కేకలువేస్తూ వెళ్ళిపోయింది.

ఈజీచెయిరులో పడుకున్నరావు చుట్టవెలిగించి భార్య మాటలు తలచుకొని ఆలోచనలో పడ్డాడు.

వచ్చిన మంచి సంబంధాన్ని వదలుకోలేక కొన్ని నెలలు గడువు కావాలని రావు అడగడం ఇంట్లో అందరికీ తెలిసింది.

"ఎందుకు నాన్నా! బొమ్మనక నానుస్తున్నావు"

"అలాతీసివేశే సంబంధం కాదమ్మా! బాగాఆలోచించుకో. తొందరేంలేదు"

"అదేమిటినాన్నా చదువు పూర్తి అయితేనేగాని పెళ్ళి సంగతే నేను ఆలోచించను"

"చదివి మాత్రం ఏంచెయ్యాలని! అయినా నీ ఇష్టం. నాకు మాత్రం ఈ సంబంధం ఎంతో నచ్చింది" అంటూ ఆఫీసుకి వెళుతూన్న తండ్రిని చూసి ఆశ్చర్య పడుతూ "సుశీ, నాన్న ఎందుకో ఇలా అయిపోయాడు. అమ్మ మాట వింటున్నాడు" అంటో దిగులుగా చెప్పుకుంది చెల్లెలికి. సుశీల ఏం మాట్లాడకుండా నవ్వుతూ వెళ్ళి పోవడం సుందరికి మరీ కోపంవచ్చింది.

"ఏమండీ విన్నారా? సుశీలసంగతి, మీకేం తెలియదు ఇంటి గొడవలు."

"ఏవిటే నీగోల?"

"అదే ఆగోలే చెబుతున్నాను. ఆ నీలకంఠంగారి అబ్బాయి సుశీలతో చదువుతున్నాట్టగా, ఇద్దరూ కలిసి తెగ తిరుగు తున్నారుట. నిన్నరాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చిందే ఆ అబ్బాయితో సినిమాకు వెళ్ళిందట. ఏమిటా స్వేచ్ఛ, ఈ తిరగడాలున్నూ!"

"అబ్బబ్బ! అన్నీనీకు గోలలే. వెళితే తప్పేం?"

"తప్పేంలేదు. నిన్న నేను పేరంటానికి వెళితే నీలకంఠంగారిభార్య ఈ ప్రస్తావనతెచ్చి వెక్కిరిస్తూచెప్పింది. సిగ్గుపడి తలవంచేసుకుని ఇంటికి వచ్చాను. మీకేం తెలియదు కదా!"

ఇంతవరకూ భార్య మాటల్ని విసుగ్గా వింటూన్న రావు ముఖం చిరాగ్గాపెట్టి "సుశీ" అంటూ గట్టిగా పిలిచాడు కోపంగా. తండ్రికేక వినగానే భయపడి పోతూ మెల్లిగా వచ్చి తలుపు ఓరగా నిలబడింది సుశీల.

"అమ్మ చెప్పినదంతా నిజమేనా? రాత్రిళ్ళుఎవరితోనో సినిమాకు వెళుతున్నావా? నిజమేనా?" ఎన్నడూ పల్లెత్తు మాట అనని తండ్రి కోపంగా అడిగేసరికి సుశీల వణికి పోయింది.

"వెళ్ళాను నాన్నా? అతను నాక్లాస్‌మేటు"

"అయితే? ఒక్కదానివి అలా వెళ్ళడం ఎంత అవమర్యాద! ఫలానావారి అమ్మాయి అన్నాక ఇంక మర్యాద ఎలా వస్తుంది?" అంటూ తండ్రి మరీ గద్దించగానే సుశీల ముఖం ఎఱ్ఱబడింది. తలవంచుకుంది చీరెకొంగు సవరించుకుంటూ.

"పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించు కున్నాం. అతనూ నేనూ. అక్కయ్య పెళ్ళితో కలిపి చేశెయ్యి." అంటూ గిరుక్కున తిరిగి సిగ్గుతో భయంతో మేడమీదకి వెళ్ళి పోయింది. రావు సుశీల మాటలు విని నిర్ఘాంతపోయి ఒక అడుగు ముందుకువేసి తువాలుతో ముఖం తుడుచుకుంటూ పచార్లు చేస్తూ ఉండగ్గా—

"ఇప్పుడైనా తెలిసిందా!" అంటూ గర్వంగా రావు ముందు నిలబడి నవ్వింది భార్య.

"మొత్తానికి గట్టివానివే, ఇద్దరికీ ఒకేసారి చేశొద్దాము. జాతకాలు ఇలా ఇయ్యి," అంటూ భర్త అనగానే భార్య ఆనందంతో ఉప్పొంగింది.

"సుశీ! వాళ్లని కనుక్కున్నాను. అతను అమెరికా వెళతాడట, నాలుగేళ్లకి గాని రాడట, అందాకా పెళ్లి చెయ్యము అని అన్నారు, నీకేమన్నా తెలుసా?"

"అతన్ని అడిగావా నాన్నా"

తల్లితండ్రుల ఇష్టం అన్నాడు. ఇంతే తేలింది ఏంచెయ్యాలో మీ అమ్మనే అడుగుదాం పిలు!"

"ఏంచెయ్యా లేమిటండీ, ప్రధానం చేసి తాంబూలాలు పుచ్చుకోండీ సుందరికిమాత్రం ఆలగ్నానికి పెళ్లిచేశొద్దాం"

"తల్లి మాటలు విని తండ్రి ఆనందించడం చూసి సుందరికి అమిత చిరాకు వేసింది. తల్లిని తిడుతూ అక్కడి నించి వెళ్లి పోయింది.

పెళ్లి పందిలితో, ఇల్లంతా బంధువులతో రావు ఇల్లు సందడిగా ఉంది. పెళ్లి కూతురికి కొన్ని నగలూ, చీరెలూ, రావు భార్య అందరికీ చూపిస్తూంది.

పందిలి ముందు బాండు వాయిస్తున్నారు, పట్టు చీరెలతో పేరంటాళ్లు అటు ఇటు పళ్లాలతో హడావిడిగా తిరుగుతున్నారు. పెళ్లివారు వస్తున్నా రన్నారు ఎవరో, పెళ్లికి వచ్చే వారంతా గుంపులు గుంపులుగా పందిట్లో చేరుకుంటున్నారు. పురోహితులు అరుస్తూ అవీ ఇవీ కావాలని హడావిడి చేస్తూ ఉండగా పెళ్లి కొడుకు ఊరేగుతూ వాకిలి ముందుకి వచ్చాడు. జరగ వలసిన తంతు అంతా ముగిసి, హారతి ఇచ్చి, లోపలికి పిలుచుకు వచ్చి కూచోపెట్టారు. ఘరానా కుటుంబానికి చెందిన వియ్యాల వారిని వారి తరపు వారిని ఆప్యాయంగా పలకరిస్తూ మర్యాదలు చేస్తూ తిరుగుతున్నాడు రావు. ఇంతలో అతని చెవిలో వేసిన కబురు విని తొందరగా మేడ మీది గదికి పరుగెత్తాడు.

"ఏమైనా సరే, చంపినా సరే! అతన్ని చేసుకోను నాకీ పెళ్లొద్దు" అంటూ ఒకటే ఏడుస్తున్న సుందరినీ. సుందరిని ఓదారుస్తున్న భార్యనీ చూసి తెల్లపోయాడు. కూతురి ఏడుపు చూసి తండ్రి గుండెలు గతుక్కుమన్నాయి. అవతల వాయిద్యాలు, పెళ్లివారు, పురోహితులు. అతని తల తిరిగి పోయింది. అతని ముఖంలోని ఆదుర్దా ఆరాటం చూసి అందరూ ఏమయిపోతాడో అనుకున్నారు.

తలమీద చెయ్యి పెట్టుకుని కూచున్న తండ్రి దగ్గిరకి సుశీల వచ్చింది. తండ్రి బుజంమీద చెయ్యివేసి మెల్లిగా.

"నాన్నా! నన్ను తీసికెళ్లండి, నేచేసుకుంటాను, నలుగురిలో అవమానం కావద్దు" అంటూ తండ్రి చెవి దగ్గరగా చేరి చెప్పి సమాధాన పరిచింది. సుశీలని దగ్గిరగా తీసుకుని తలమీద చెయ్యివేసి కన్నీళ్లతో "సిద్ధంగా ఉండు తల్లీ" అంటూ కాళ్లు తడబడుతూ, ఆయాస పడుతూ కిందికి వెళ్లి పోయాడు.


"మావయ్యా! నాన్న వెంట ఉండు. నాన్న ఎలాగో అయిపోతున్నాడు" అంటూ సుశీల కన్నీళ్లు నించింది.

పెళ్లి కూతురు తల్లివెంట రావడం అందరూ వింతగా చూశారు, కొందరు గుసగుస లాడారు, వియ్యంకుడు తెల్లబోతూ లేవ బొయ్యాడు, వియ్యపు రాలు కొంగు సరి చేసుకుంటూ కోపంగా లేచి నిలబడింది నలుగురిలో నాలుగూ అడగాలనే కోపంతో, పెళ్లి కొడుకు తండ్రిని చూసి దగ్గరగా రమ్మని ఏదో చెప్పాడు, అంతా సద్దుమణిగింది. వాయిద్యాల సందడిలో అందరూ అరుస్తున్న అరుపులలో సుశీల మెడలో మంగళ సూత్రం కట్టాడు పెళ్లి కొడుకు, అక్షింతలు అంతా ఒక్క సారిగా చల్లారు, "ఆనంద మానంద మాయెనే" అంటూ సన్నాయి పాట అందరి చెవుల్లో ఒక్క సారిగా మోగింది. వధూవరులు పెద్దలందరికి నమస్కరిస్తూ అందరి దీవెనలూ అందుకుంటున్నారు.

"సుశీ!" అన్నాడు సూర్యం. అందరూ అటువైపు చూశారు. సుశీల తల వంచుకుని అడిగిన ప్రశ్నకి సమాధానంగా అతని పాదాలకి వంగి నమస్కరించింది. రావు అటు చూడలేక ముఖం తిప్పుకున్నాడు.


తండ్రి అవమానానికి తల వంచిన సుశీల గుండెలు కొట్టుకుంటూ ఉండగా, దడదడ లాడి ఊగిపోతూ ఉండగా పక్కనే ఉన్న పెళ్లి కొడుకు గట్టిగా పట్టుకున్నాడు. సరదా గల పెళ్లివారు హాస్యంచేస్తూ నవ్వారు. సూర్యం వెనక్కి తిరిగి వెళ్లిపోవడం సుశీల కన్నీళ్లతో చూసింది. అతని బూడ్సుల చప్పుడుకి ఆమె గుండెలు అదిరి పోయాయి. పందిలంతా చిన్న బోయినట్లయింది సుశీలకి తనజీవితంలోని ఆనందాన్ని ఆశలని అన్నింటిని అతను తీసుకు వెళుతున్నట్లయి నిర్జీవంగా నిలబడింది.

"సుశీ!" అంటూ తల్లి పెళ్లి కూతుర్ని లోపలకి పిలుచుకుని వెళ్లింది. ★


Your Family Needs....
SUN BRAND
FOR QUALITY & DURABILITY
MYSORE PREMIER METAL FACTORY
H.K.S
MADE IN INDIA
M.M.JAYAM
THE MYSORE PREMIER METAL FACTORY
manufacturers of: ALUMINIUM, BRASS & STAINLESS STEEL UTENSILS
GRAMS "SUNBRAND" 124, MINT STREET, MADRAS-1. PHONE: 2535

"త్యాగమే అనురాగము"

వెంకట్రావు, లక్ష్మి, అన్నాచెల్లెళ్ళు. లక్ష్మి వివాహమయిన సంవత్సర మునకు వెంకట్రావు తన వివాహము చేసికొన్నాడు. లక్ష్మికి ప్రసవ సమయమని జాబువచ్చింది. ఆ సాయంత్రమే చెల్లెలిని తీసుకువచ్చాడు.



రచన : శ్రీమతి చిట్టూరి అన్నపూర్ణా దేవి

నవవధువు జానకి కూడా వచ్చింది. పెద్దవాళ్ళు లేని ఆ యింటికి, తానే పెద్దఅయింది. "నవవధువు" అన్నమాట మరచిపోయి, ఇల్లాలి, బాధ్యతలను అతియోగ్యతతో నిర్వర్తించుతోంది. భర్తకు సమయానికి అన్ని సదుపాయాలూ చేస్తుంది. ఆడుపడుచు లక్ష్మికి సేవచేస్తూంది

ఒక నాటితెల్లవారు ఝామున, లక్ష్మి ఒక మగబిడ్డను కని. పోవడం జరిగింది. ఆ పసి బిడ్డకు తానే తల్లి అయింది. జానకి. పుట్టిన రెండు మాసాలలోనే తల్లి దండ్రులను పోగొట్టుకున్న ప్రసాద్ మేనమామ భార్య దగ్గర మాతృప్రేమను సంపాదించు కొంటు న్నాడు. ప్రసాద్‌ను అంటే తన నన్న కంటె ఎంతో బాధపడేది. అన్నవారితో "మరెప్పుడూ అలా అనవద్దు" అని చెప్పేది.

* * *

ప్రసాద్ అయిదు సంవత్సరముల వాడైనాడు. జానకికీ ఒక పాప పుట్టింది. ఆమెకు సజల అని పేరుపెట్టారు.

ప్రసాద్ రెండో ఫారము చదువుచున్నాడు. సజలను కూడా ఆడపిల్లల బడిలో 1 వ తరగతిలో చేర్చారు. జానకిప్రసాద్‌తో సజల చదువు విషయంలో శ్రద్ధతీసికొనమని చెప్పింది. ఇకనేముంది? ప్రసాద్ సజలకు మాష్టర్ అయి కూర్చున్నాడు.

టీచర్లకు భయపడని సజల ప్రసాద్‌కు భయపడేది. ప్రసాద్ చిన్నచిన్న కొంటె పనులు చేసినా. చదువులో మాత్రం అందరికంటె ముందుకే వుండేవాడు. అందు చేతనే సజల ఆటలుసాగేవి కావు.

* * *

సజల నాలుగో ఫారము చదువుతూంది. ప్రసాద్ స్కూలు ఫైనలుకి వచ్చాడు. ఆ రోజు చిన్న చిన్న చినుకులు పడుతున్నాయి. ప్రసాద్ మామూలుగా బయలుదేరి సజలను కూడా రమ్మన్నాడు. నేనురాను బాబు, యీ

వర్షంలో అంది. "ఏం? అంత సుకుమారివా? మొక్క మొలుస్తావా? పద పద బడికి" అంటూ ఆమె చెయ్యి పట్టుకుని విరవిరా లాక్కు పోయాడు ప్రసాద్.

మూడవ పిరియడ్ జరుగుతూంది. వర్షం పెద్దదయి ఉరుములు, మెఱుపులలోకి దిగింది. సగంలో ఒక పెద్ద శబ్దమయింది. లెక్కబోధిస్తున్న మాష్టర్.

"అయ్యో ! ఎక్కడో పిడుగు పడిందన్నాడు." పిల్లల కలాలు ఒక్కసారి ఆగిపోయాయి. ప్రసాద్ ఒక్క గంతులో క్లాసుదాటి బయట పడ్డాడు. మాష్టర్ అనుమతి కూడా తీసికోలేదు. ఒక పెద్దమెఱుపు మెరిసింది. అంతే! ప్రసాద్ శాశ్వతంగా అంధుడైనాడు.

ప్రసాద్ కళ్ళు ఇకరావని డాక్టర్లు చెప్పారు. ఇంట్లో అందరూ చాలా బాధ పడ్డారు. ప్రసాద్‌కు శూన్యం ! ఇక యీ గ్రుడ్డివాని గతి యేమిటి?" అన్నాడు.

"ఇంత వరకూ ఎలా చూచానో ఆలాగే నిన్ను నా బిడ్డకంటే ఎక్కువగా చూచుకుంటాను. నీ మనస్సు పాడుచేసుకోకు, అని ఓదార్చింది. జానకి.

* * *

సజలకు పదహారవ ఏడు. తండ్రి వెంకట్రావు వరాన్వేషణ మొదలుపెట్టాడు. ఎన్నో సంబంధాలు వచ్చి కట్నాలు చాలవని తిరిగి వెళ్ళిపోయారు. సజల స్కూలు ఫైనలు పాసయింది. ఆడ పిల్లలకు పై చదువులు అనవసరమని వూరుకొన్నారు.

"పిల్ల నచ్చింది. మరి కట్నం సంగతేమిటి?" అన్నాడు ఒక పెద్దమనిషి.

"మూడు వేలకంటె యిచ్చుకోలేను," అన్నాడు వెంకట్రావు. పెండ్లి పెద్దలంతా "వస్తామండీ ! అంటూ బయలుదేరారు. వెంకట్రావు నిలువునా నీరయిపోయాడు. జానకి చిన్నబుచ్చు కొన్న ముఖంతో పెరట్లోకి వెళ్ళిపోయింది. ప్రసాద్, "అక్కా ! అక్కా"! అంటూ గబగబ బయటకు వచ్చాడు. దారిలో బల్లతగిలి క్రింద పడ్డాడు. ప్రసాద్ తలకు పెద్దగాయం తగిలింది. జానకి దగ్గరకు వెళ్ళి కూర్చొని "తొందరగా ఎందుకు నడిచావు? ఎవరినైనా సాయముడగక పోయావా?" అంది రక్తం తుడుస్తూ. ప్రసాద్ ఆ దెబ్బను లెక్క చేసినట్లులేదు "అక్కా ! నీతో ఒక్క మాటచెప్పాలి." అన్నాడు. "చెప్పు నాయనా !" అంది జానకి.

"అయితే నాతాలూకు ఆస్తి నంతా కట్నంగా యిచ్చి వెంటనే సజల వివాహం మంచి వరుణ్ణిచూచి చెయ్యండి" జానకి అంది, "ప్రసాద్! ఒకప్పుడు సజలను నీకిచ్చి వివాహం చేసి మీ దాంపత్యం చూచి, ఆనందిద్దామనుకున్నాం."

"ఇప్పుడు మాత్రమే మయిందమ్మా?" అంది సజల

"సజల ఒట్టి అమాయకురాలు అక్కా ! జరిగిపోయిన దానికి విచారించకు మీరు చేసిన మేలుకు, యింత కంటె యేమి చేయగలను?" అన్నాడు.

"నాయనా ! నీ ఆస్తి తీసికుంటే నీ బ్రతుకెలాగు?".

"మీతోనే నా బ్రతుకు. నేను మీ బిడ్డనయితే మానతారా? ఆలోచించకండి. నా కోరిక చెల్లించండి."

"మీ మామయ్య వచ్చాక నీ అభిప్రాయం చెబుతానులే"

రాత్రి సజల జానకి మంచం దగ్గరకు వెళ్ళి. "అమ్మా! అంది. "ఏమిటి సజలా"

"నా పెండ్లిగురించి ఎందుకంత బాధమ్మా"

"ఆడపిల్లల గల తల్లిదండ్రులకు ఇది సహజమేనమ్మా.

"అమ్మా" "ఇంట్లో వున్న బావను వదలి మరెవరి కొరకో చూస్తారెందుకు?" అంది. జానకి నివ్వెరపోయింది. "ఆలోచించే మాట్లాడు తున్నావా?" అంది. "బాగా ఆలోచించానమ్మా," "ఏమిటది? మేము కట్నం యిచ్చి సరియైన వరుణ్ణి తేలేమనేనా?" అంది రుద్ధంగా. "అలా అనుకొనికాదమ్మా. బావకు నన్ను చిన్నతనం నుండి యిద్దామనుకున్నారు. అతని కళ్ళు పోవడంతోనే ఆ ఉద్దేశ్యం మార్చుకున్నారు. కాని బావ ఉద్దేశం మాత్రం మారలేదని గ్రహించలేదు" అంది. "అంటే" అంది జానకి కటువుగా. "తొందర పడకమ్మా, అతను నీవనుకున్నంత నీచుడుకాడు. నాకు మంచి వరుణ్ణి తెచ్చి, ఆతనిఆస్తినంతాయిచ్చి వివాహం చేయమనలేదూ? దానివల్ల అతను నన్నెంతగా ప్రేమిస్తున్నాడో గ్రహించమ్మా !" అంది. సజల తల్లి"నీమాట నిజమే కాని చూస్తూ కండ్లులేనివాడికి ఏ తల్లిదండ్రులు తమ బిడ్డను యివ్వగలరు సజలా?"

"కాని నిర్మలప్రేమమూర్తి కాదంటావా?"

"కాదని ఎవరంటారు సజలా ! తన సర్వస్వాన్ని నీ సుఖంకొరకు ధారపోస్తానంటూంటే?" "అయితే ఆడదానికి ప్రేమించే భర్తకంటే కావలసిందేముం దమ్మా?"

"కానీ, సజలా! మీనాన్న ఎంత బాధపడతారు? ఆలోచించావా?" "వివాహమయిన తరువాత అంధుడైతే ఏంచేస్తామమ్మా?" "మేమేదిచేసినా మీ మేలుకోరేగా. నీ యిష్టమొచ్చినట్లు చెయ్యి. అన్నిటికి భగవంతుడే ఉన్నాడు." అంది జానకి. సజల తల్లికాళ్ళకు నమస్కరించి, "దీవించమ్మా." అంది.

శుక్రవారం. సజల తలారా స్నానంచేసి, తులసి పూజ పూర్తిచేసుకొని తిన్నగా ప్రసాద్ గదికి వెళ్ళింది. ఏదో దీర్ఘంగాఆలోచిస్తున్న అతని పాదాలమీద చేతులు పడ్డాయి. అతను త్రుళ్ళి "ఎవరు?" అన్నాడు. "నేనే "ఆరాధ్యదైవాన్ని సేవిస్తున్నాను బావా!" అంది ప్రశాంతగాం. "నీకు మతిపోలేదుకదా?" "మతిపోయినవాళ్ళు మంచిపని చేస్తారా బావా?" అంది నవ్వుతూ.

"నీవు చేసే పని మంచిదా సజలా?" "అవును"

"ముమ్మాటికి మంచిపనికాదు సజలా." అన్నాడు.

"అయితే ప్రేమించినవాళ్ళను ఆరాధించడం తప్పా?" ప్రేమించడం ఏమిటి? నీధోరణి నాకు అర్థంకావడంలేదు

"అర్థంచేసుకొవడానికి ప్రయత్నించు" అంది.

"సజలా గ్రుడ్డివానితోనా నీ హాస్యం?" అన్నాడు. "కాదుబావా. నిన్నుతప్ప మరెవ్వరినీ ఆరాధించలేదు."

క్షమించు సజలా. అందుకు యోగ్యుడనుకాను నేను. నీకు నాయందు దయవుంటే మరొకలాగ చూపించు. కానీ, యిలా పరిహాసించకు." అన్నాడు. "పరిహాసించటం కాదు బావా!" సత్యంచెపుతున్నాను.

"గ్రుడ్డివాడిని వివాహమాడు తానంటే, అల్లారు ముద్దుగాపెంచిన తలిదండ్రులకు తీరని దుఃఖముకాదూ?" "అయితే నేచేసేదంతా తప్పేనా బావా?" "పూర్తిగాను"

"ఆయుస్సులేని సత్యవంతుణ్ణే పెండ్లాడుతానంది సావిత్రి?"

"అది ఆకాలం, ఈకాలానికి పనికిరాదు."

"అయితే ప్రేమించినవానిని వదలి మరొకరిని పెండ్లాడడం యీకాలపు మర్యాదా?"

"ఏమిటి నీ ప్రశ్నలు సజలా?" "సరియైనవే. నీవు కూడా సరియైన జవాబు యివ్వాలి. అంటూ అతనిచేతిలో పువ్వుపెట్టి "ఇది నాతలలో పెట్టుబావా అంది." అతను ఆ పువ్వును ఆమె తలపైవేసి ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు. సజల సంతోషంతో లోపలకు వెళ్ళింది. ప్రసాద్ మనస్సులోనే అనుకున్నాడు. "ఈమెకు ఎలా నచ్చచెప్పగలను? ఎంత బాధ పడతారు?" అని.

సజల కోరిక ప్రకారమే వివాహం ప్రసాద్‌తోనే నిశ్చయించారు, వారికి కావలసింది బిడ్డ ఆనందం. తెల్లవారితే పెండ్లి. రాత్రి ప్రసాద్ గదిలో కూర్చొని ఏదోగ్రుడ్డివ్రాత వ్రాస్తూ మధ్య మధ్య కళ్ళు తుడుచుకుంటున్నాడు.

వ్రాయడం పూర్తిచేసి కాగితం మడత పెడుతూండగా అతని చేతిమీద వేడి కన్నీటిబొట్లు జల జల రాలాయి. "ఎవరు"? అన్నాడు "నేనుబావా," అంది కారుతున్నకన్నీటిని తుడుచుకుంటూ. ఏంచేస్తున్నావు?" "నీవువ్రాస్తున్న ఉత్తరం చదువుతున్నాను. నీవు చేయబోయే అన్యాయాన్ని తలచుకొని ఏడుస్తున్నాను.

"అన్యాయమా? అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును ఇంతకంటే అన్యాయముందా? నిన్ను విడిచిపెట్టి బ్రతుకగలనా బావా? నీవులేని ఈజీవితం నాకు అవసరం లేదు. నన్ను అన్యాయంచెయ్యనని ప్రమాణం చెయ్యిబావా, అంటూ అతని పాదాలు పట్టుకుంది. కొంతసేపు ప్రసాద్ నోటినుండి మాట రాలేదు.

"క్షమించు సజలా! నీహృదయాన్ని గాయపరచాను. అంటూ లేవదీశాడు. "దీవించుబావా, జీవితాంతం సౌభాగ్యవతిగా వర్ధిల్ల"మని అంటూ తిరిగి అతని పాదాలకు నమస్కరించింది. తొలికోడి కూసింది.

వారికది జీవన సుప్రభాతమే!

"ప్రతిబింబాలు"

రచన :

"శార్వాణి"

ఆ ప్లాటుఫారమ్ మీద అంతకుముందే ట్రయిను వచ్చి వెళ్లిపోయింది. గమ్యస్థానాలను వెతుక్కుంటూ వచ్చిన జనాన్ని, రైలు బండి భరిస్తూ తీసుకొని వెళ్లిపోయింది. విశాలమైన పొడుగాటి ప్లాటు ఫారమ్ నిర్మానుష్యంగా వుండుట వల్ల బోసురు మంటోంది.

వేప మ్రాను ఆనుకొని బెడ్ హోల్డాల్ మీద కూర్చున్న నీరద తప్ప ఆ ప్లాటుఫారమ్ మీద ప్రయాణికులెవరు కన్పించి నట్లులేదు. తాను వెదుకుతున్న గమ్యం ఎక్కడో తెలియలేదు. రెండు మూడు సార్లు బుకింగ్ దగ్గరకు రావడం, తిరిగి వెనక్కు వెళ్లి పోవడం జరిగింది. గార్డు పచ్చన జండా వూపినపుడు, బండి కూత కూసి, కదిలినపుడు కూడా, వెదుక్కుంటున్న గమ్యం చిక్కనేలేదు. పూర్తిగా ఆలోచనలో పడిపోయింది.

"జీవితపు విలువలను గ్రహించి ఉత్తమంగా బ్రతకడంలో నీతిని కాపాడటం జరుగుతుంది" మంచిని వెతుక్కుంటున్న ఆమె హృదయం, ఏదో బాధతో మూల్గుతూనే వుంది. ధర్మాన్ని కోరుకుంటున్న ఆమె మనస్సు ధర్మానికి దూరమై పోతున్నానేమోనని నిరాశ పడుతూనే వుంది. నీతి నియమాల్లో నిలవాలని వువ్విళ్లూరుతున్న ఆమె సౌశీల్యం దారి తప్పి బొమ్మ జెముడు ముళ్ల మధ్య యిరుక్కుంటుందేమో అని నిర్వేదిస్తూనే వుంది.

మంచిగా బతకాలి! ధర్మాన్ని కాపాడాలి!! నీతిని నిలబెట్టాలి!!!

"మనం పుట్టింది దీని కోసమే! దీని కోసమే బ్రతకాలి. దీనితోనే చావాలి." నీరద తల్లి తన జీవితానుభవాన్ని వెళ్ల బోసినపుడు నీరదకు వళ్లు మండి పోయింది. ...."నీతిని నాశనం చేయుటకోసం పుట్టామా అమ్మా నా మార్గానికి అడ్డుగా నిలబడకండి."

"నీ చెల్లెలు నల్గుర్నీ మెప్పించి ఎంత డబ్బు గడిస్తూందో చూడు?"

అన్నెముపున్నెము తెలియని కన్నె హృదయానికి చిల్లులు పొడుస్తోంది అమ్మ. నా గుండెలో కూడ దూరి నాశనం చేయాలని చూస్తోంది అమ్మ.

"ఇది మన వృత్తి, మానవులు మారినా, తరాలు తరలినా, మన వృత్తులు మనతోనే వస్తాయి. వద్దని దూరంగా తప్పుకొని పారిపోతున్నా, అవి వెంబడిస్తునే వుంటాయి." అమ్మ హితబోధ. నీచాతి నీచంగా బ్రతకడం వృత్తా? దొంగతనం చేయడం, ఖూనీలు చేయడం, శీలాన్ని అమ్ముకోవడం, ఇవన్నీ వృత్తులేనా? సంస్కృతిని, నాగరికతను, ధర్మాన్ని, నీతిని మంట గలిపే వృత్తులకు నివృత్తి లేదా ?
పునర్జన్మ సిద్ధించదా?

అమ్మ మభ్య పెట్టింది. మనస్సును మార్చి మచ్చిక చేసుకోవాలని నానా తంటాలు పడింది.

"నా కోసం పడి చచ్చేవాడు, నన్ను లక్షణంగా పెళ్లి చేసుకొని, ధర్మంగా బ్రతకడానికి ఎందుకు వెనుకాడాలి?"

నా ప్రశ్నవిని అమ్మ ఖంగుమని నవ్వింది

"లక్షాధికారి పెళ్లి ఎప్పుడో అయిపోయింది?"

"అయితే నా కోసం ఎందుకు రావడం?"

"మన వంశాన్ని నిలబెట్టడానికి. మనం నాల్గు కాలాలు బ్రతకడానికి" జీవితాలను శరీరాలను అమ్మగా వచ్చిన డబ్బుతో విలువ కట్టే అమ్మకు నీతి నిజాయితీ ఎట్లా అర్థ మవుతుంది?

"నా గొంతులో ప్రాణం వుండగా వొప్పుకోను, నీ కెంతో పుణ్యంవుంటుంది. నన్నైనా నీతిగా బ్రతకనివ్వు."

అమ్మ కాళ్ల మీద పడి ఏడ్చాను, ప్రతిఫలం గదిలో పడేసి బయట గొళ్లెం పెట్టివెళ్ళింది,

ప్రక్కగదిలో నుంచి నవ్వులు. చెల్లి!

పదహారు వసంతాలు పూర్తిగా నిండలేదు. డబ్బు

కోసం మంచిని మరచి పోయింది. మెరుగులు చూపించి ప్రపంచాన్ని మోసంచేస్తోంది. అమ్మ చెప్పిన పాఠాలు నెమరువేసుకుంటూ, ఇంటిని నరకకూపంగా చేస్తోంది. మరి తనో? పతిత కాకూడదు. పతివ్రత కావాలి.

గది తలుపులు తెరచిన శబ్దం విన్పించేసరికి, పులిక్కిపడి వెనక్కి తిరిగి చూస్తే, భయంకరమైనరూపం.

లోతుకుపోయి ఎర్ర జీరలు పడ్డ చారడేసి కళ్లు, నా కళ్లలోకి భయంకరంగా చూచాయి, ఆకృతి తూలుతూ తూగుతూ మంచంమీద పడింది. ఆకృతి. గట్టిగా నవ్వాడు. గదిలోని ప్రతివస్తువు వణికి పోయింది. నోరు పెద్దగా తెరచుకొని ఆవులించాడు.

కోటు జేబులోనుంచి. రెండు చేతులు పోనిచ్చి, రెండు నోటు కట్టలను తీశాడు.

ఆ కురూపికి పవిత్రమైన యవ్వనాన్ని ఆ రాక్షసికి విలువైన శీలాన్ని అంకితంచేయాలా????? నీతి అంగీకరిస్తుందా? ధర్మం వొప్పుకుంటుందా? జాతి వూరుకుంటుందా? డబ్బు చూపించాడు. నవ్వలేక నవ్వాడు. ఆ దయ్యం దగ్గరకు రాబోతే ఒక్క తోపు తోసేసరికి కుప్పగా నేలమీద పడ్డాడు.

వళ్లు దులుపుకుంటూ, మళ్లా వెనక్కి తిరిగి చూడకుండా నిష్క్రమించాడు. అదృష్టవశాత్తూ బ్రతికిపోయాను. అర్జంటుగా అమ్మ బెజవాడ వెళ్లవలసి వచ్చింది. చెల్లెమ్మను ఏమార్చి వచ్చేశాను,

చెక్కిళ్ల మీద జాలువారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ, బరువుగా నిట్టూర్చింది నీరద.

*　　　*　　　*

ప్లాటు ఫారము చివర భాగం నుంచి తొందర పడుతూ వస్తున్న వెంకట్రావు నిర్మానుష్యంగా వున్న స్టేషను చూచి కంగారు పడ్డాడు. చెట్టు క్రింద నీరద కన్పించింది.

"ట్రయినింకా రాలేదా?" సమాధానం కోసం చూడకుండానే, ముందుకు నడిచి వెళ్లాడు. తిరిగి వచ్చి ఆమెకు సమీపంలో నించున్నాడు.

"బండి వెళ్లి పోయి వుంటుంది" గొణుక్కుంటూ అతడు స్టేషనులోనికి వెళ్లి, బండి వెళ్లినట్లు నిర్ధారణ చేసుకున్నాడు. నిస్పృహతో వేపచెట్టు దగ్గరకు వచ్చాడు. నీరద తల వంచుకొని కూర్చుంది.

"పిన్ని అనుకున్నంత పని చేస్తుంది." బాధతో మూల్గుతున్న కళ్లు, అద్దాల్లో నుంచి బరువుగా మూల్గుతున్నాయి. నీరద తలపైకెత్తి చూచింది. ముఖం మీద పడుతున్న వెంట్రుకలు అతని ముఖంలో వ్యక్తమయే ఆవేదనను కొంచెం కూడ దాచలేక పోతున్నాయి. నీరద అతనివేపు పరీక్షగా చూచింది.

"పిన్ని ఆస్తంతా దగ్గరుండి వ్రాయించేసుకుంటుంది. ఆశలన్ని నిరాశలయాయి."

జరిగిపోయిన కష్టాలను విస్మరించి, జరగబోయే బాధల గురించి, అతని హృదయం క్షోభతో కుమిలి పోతోంది.

సులభంగా ప్రసవించిందని డాక్టరు చెప్పాడు. వంటరిగా బల్ల మీద విచారంగా కూర్చున్న నాన్న హృదయం గతుక్కు మంది.

లోపల అమ్మ కడుపు కోశారు,

కళ్లు మూతలు పడేవున్నాయి. బిడ్డ మెల్ల మెల్లగా చిన్ని కళ్ళను విప్పుతున్నాడు. మానవుడుగా ప్రపంచంలోనికి రాబోతున్నాడు. అమ్మ మెల్లగా కళ్లు తెరచి చూచింది. ప్రక్కనున్న బిడ్డను చూచి మురిసి పోయింది ముమ్మూర్తులా నాన్న పోలికేనని మరీ సంతోషించింది. అమ్మ మృదువుగా పాప వంటి మీద చేయివేసి బుజ్జగించి, లాలించి లేత బుగ్గల మీద ముద్దిడాలని తహతహలాడి పోయింది. చేయి కదలలేదు. పాప ఏడ్చాడు. అమ్మ, మొదటి సారిగా పాపకు పాలివ్వాలని కుతూహల పడింది, లేచే ఓపికలేదు.

అమ్మ ఏదో అనబోయింది, అమ్మ ముఖం మీదకు వంగి నాన్న వినబోయేడు, కంఠంలో మాట కంఠంలోనే విలీనమయిపోయింది.

"బిడ్డ దక్కిందే!" అదే కావాలి, కాబట్టి. తన ప్రాణం పోయినా ఫర్వాలేదనుకుంది. బిడ్డను దక్కించుకున్నందుకు సంబర పడిపోయింది.

అమ్మను బ్రతికించడానికి డాక్టరు శాయశక్తులా ప్రయత్నం చేశాడు. కాని అంతా బూడిదతో పోసిన పన్నీరు.

శాశ్వతంగా కళ్లు మూసింది.

"అమ్మ!"

గట్టిగా అరిచాడు వెంకట్రావు.

నీరద వులిక్కిపడి అతని వంక చూచింది.

అతని కళ్లు చెమ్మగిల్లాయి. బాధతో విషాదిస్తున్నాయి.

"అమృత మూర్తి అమ్మ. అమరజీవి అమ్మ!" నా కోసం అమ్మ తన నిండు ప్రాణాన్ని ధారబోసింది. భగవంతుడు నా ప్రాణాన్ని తీసుకొని. అమ్మనెందుకు బ్రతికించ కూడదు? అమ్మ అందుకు ఒప్పుకోలేదు. నన్ను బ్రతికించ మని ఎన్నో దేవుళ్లకు మొక్కుకుంది."

వెంకట్రావు మాటలు నీరదకి విన్పించక పోయినా నీరద బరువుగా నిట్టూర్చింది.

వెంకట్రావు కమీజుతో కన్నీళ్ళు తుడుచుకొని. నవ్వును తెచ్చుకొని. తనలో తాను నవ్వుకుంటున్నాడు.

నీరదకు అర్థం కాలేదు. ఆ నవ్వులో భావాన్ని అందుకో లేక పోయింది. అతడు చూస్తున్న నక్షత్రం వంక తను కూడా చూస్తోంది. ఇద్దరి చూపుల్లో ఒకటే భావం తొణికిస లాడింది.

"అమ్మ మరణించిన సంవత్సరంతిరగ కుండానే నాన్న మరో వివాహం చేసుకున్నాడు. తన వినోదాలకు విలాసాలకు అడ్డని నన్ను అమ్మమ్మదగ్గర వదిలి పెట్టి వెళ్లిపోయాడు. అమ్మమ్మ వృద్ధాప్యం దాఘరించి పరలోకానికి వెళ్లి పోయింది. నాన్న దగ్గరకు వెళ్లితే నాన్న దర్శనం కానీయకుండా చేసింది పిన్ని. నా మీద పిన్నికి దయరాలేదు."

* * *

కాళ్లీడ్చు కుంటూ. పంపు దగ్గరకు వెళ్లాడు. పంపు తిప్పాడు. విసిగెత్తి చివరకు విచార వదనంతో ఇసికమీద వచ్చి చతికిల పడ్డాడు. దాహం బాగా వేస్తోంది. నాలుక పిడచ కట్టుకు పోతోంది. వత్తిగిలి, ఎంత బలవంతంగా కళ్ళు మూసినా నిద్ర పట్టలేదు. అటూ ఇటూ ఇసిక మీద దొర్లుతున్నాడు.

మరచెంబులో వున్న నీళ్లను, గ్లాసులో పోసి, అతని దగ్గరకు వచ్చి నిలబడ్డ నీరదను గమనించి, వెంకట్రావు లేచి కూర్చున్నాడు. గ్లాసునేల మీద పెట్టి. నీరద మరి యొక వైపుకి మొహం పెట్టింది. గబగబా మంచి నీళ్ళు గొంతులో పోసి, ఖాళీ చేసిన గ్లాసునునేల మీద వుంచాడు.

ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. ఇద్దరకీ ఏమి మాట్లాడాలో తెలియలేదు.

ఇద్దరూ బాధ పడుతున్నారని ఎవరికి వాళ్లకే తెలుసు. బాధను వ్యక్తం చేయడం మాత్రం ఏవరు నేర్చుకోలేదు.

ఘడియలు గంటలు దొర్లి పోతున్నాయి. ప్లాటు ఫారము మీదా జనం నిండు కుంటున్నారు. తెల్లవారు ఝూమున వచ్చే బండికి. జనం ఎదురు చూస్తున్నారు. వెంకట్రావు లేచి నిలబడి. నీరద దగ్గరకు వచ్చాడు. నీరద వేపచెట్టు నానుకొని నిద్ర పోతోంది. చెరగని కన్నీటి మరకలు పసిమి బుగ్గలపై స్పష్టంగా కన్పించాయి

స్టేషనులో గంటలు మ్రోగాయి. నిద్ర పోతున్న నీరద త్రుళ్లి పడి. కళ్ళు తెరచి. చూచింది. "బండి వచ్చే వేళయింది" మెల్లగా అన్నాడు "ఎక్కడకు వెళ్లాలి?" తనలో తాను సతమత మవుతున్న నీరద ప్రశ్నకు సమాధానం దొరకలేదు.

"టిక్కట్టు తీసుకొని రమ్మంటారా?" "ఏ ఊరికి"

దానికి సమాధానం రాలేదు. ఆమె నుండి జవాబు లేక పోవడం. వెంకట్రావు మనస్సు చివుక్కు మంది.

"చూడండి!" సన్నగా విన్పించేసరికి. వెళ్తూన్న వెంకట్రావు వెనక్కు తిరిగి వచ్చాడు.

"మీరేవూరు వెళ్తున్నారు?" "పాల కొల్లు."

"ఆ ఊరువెళ్తే మీ మనస్సులో పీడిస్తున్న బాధలన్నీ తొలగి పోతాయా?" అతనికెటువంటి సమాధాన మివ్వాలో అర్థం కాలేదు. తను బాధ పడుతున్నట్లు ఆమె గ్రహించి వుందని తెలుసుకున్నాడు.


"మీరు ఏవూరు వెళ్లాలి?" ఆమె అడిగిన దానికి తిన్నగా సమాధానం చెప్పక. మరొక ప్రశ్నవేశాడు.

"అంతా అగమ్య గోచరంగా వుంది."

ట్రయిను కూత విన్పించింది. "బండి వచ్చేస్తూంది." వెంకట్రావు తొందర పెట్టాడు. నీరద పర్సులో ఐదు రూపాయలు నోటుతీసి అతని చేతిలో పెట్టి. "పాల కొల్లు ఒక టికట్టుతీసుకోండి"అని గబుక్కున అనేసింది.

ప్రతి బింబాల్లా. నీరద వెంకట్రావులతో రైలు బండి కదిలింది.

అనుకోని అదృష్టం



★ కుమారి టి. జి. శ్యామలాదేవి ★

'జానీ' అంటూ వెఱ్ఱికేక వేశాడు లోపల్నించి మోహన్. అప్పుడే బండిదిగి, వసారాలో అడుగు పెడుతున్న జానకి అలాగే నిలబడిపోయింది. ఆ పరిచిత కంఠాన్ని విని, స్తబ్ధురాలైపోయింది. ఆ కంఠస్వరాన్ని యిక్కడ ఎలా వినగలిగిందో అర్థంకాలేదు ఆమెకు. ఇంతలోనే లోపల్నించి ఒక్క పరుగునవచ్చి, జానకి రెండు బుజాలు పట్టుకొని వూపుతూ "జానీ" అని సంతోషంగా పిలిచాడు మోహను. ఇప్పుడు జానకి మరీ అయోమయంలో పడిపోయింది. తనకళ్ళను తానే నమ్మలేకపోయింది. కలేమోనని భ్రమ పడింది. జానకి స్థితిచూసి మోహన్ గాభరాపడిపోయాడు. "జానీ, అలావున్నవేం" అంటూ ప్రశ్నించాడు. "చాలాచిక్కిపోయావు, వంట్లో బాగాలేదా?" అని అడిగాడు. "ఇక్కడి కెలావచ్చావు మోహన్" అనిమాత్రం అనగల్గింది. "జానీ! లోపల అమ్మవుంది పద, తర్వాత అన్నీ మాట్లాడుకుందాం" అంటూ చెయ్యిపట్టుకొని లేవతీయబోయాడు మోహన్. కాని జానకి తన చేతినిమాత్రం ఎలాగో విడిపించుకోగల్గింది. "అమ్మా జానీ వచ్చింది" అంటూ కేకవేశాడు. సీతమ్మగారు లోపల్నించి ఒక్కపరుగున వచ్చింది జానకిదగ్గరకు. అత్తను చూచేసరికి, జానకి దుఃఖం ఆగలేదు. అత్తని కావలించుకొని ఏడ్చింది

జానకి పుట్టేంతవరకు ఆమె తలిదండ్రులు బాగా సిరిసంపదలతో తులతూగువుండేవారు. జానకి భూమిమీద పడిందిమొదలు క్రమంగా వారి సిరిసంపదలు హరించిపోసాగినవి. ఈకారణంగా జానకి తన అన్నదమ్ముల యొక్కగాని, తండ్రియొక్కగాని ప్రేమకు పాత్రురాలు కాలేకపోయింది. తల్లిమాత్రం కంటికి రెప్పలా జానకిని ఏలోటూ లేకుండా కాపాడేది. తన అన్నలూ, తండ్రీ ఎందుకు తననింత తక్కువగా చూస్తున్నారో అర్థమయ్యేదికాదు జానకి లేతహృదయానికి. ఇంటిపనులు చేస్తే తనను వాళ్ళు ప్రేమగా చూస్తారేమోనని అనుకునేది.

జానకి అందచందాల్ని, వినయ విధేయతల్ని, ముద్దులొలికే నవ్వుని, తీయని కంఠాన్ని చూసి మోహన్‌తల్లి సీతమ్మగారు చాలా మురిసిపోయేది. జానకికూడా ఆమెను అత్తాఅని పిలిచేది. ఒకసారి ప్రస్తావనలో తనకోడలుగా జానకినితప్ప యింకెవరిని చేసుకోనని సీతమ్మగారు జానకి తల్లితో చెప్పింది. తనకూతురి అదృష్టానికి జానకితల్లి చాలా మురిసిపోయింది. మొదటినుండీ కూడా యీ రెండు కుటుంబాలు బంధువులకంటె కూడా ఎక్కువగా కలిసిమెలసి వుండేవారు. సీతమ్మగారి పుట్టింటివారు దూరాన్నవున్నా జానకి తలిదండ్రులవలన ఆమెకాలోటు తీరిపోయేది. అందుకే తమస్నేహానికి, ప్రేమకి శాశ్వతచిహ్నంగా జానకినే తనకోడలుగా చేసుకుంటానని మాటయిచ్చింది సీతమ్మగారు. ఇందుకు మోహన్ తండ్రి, అన్నలూకూడా అడ్డు చెప్పలేదు.

ఇలా తల్లి, సీతమ్మగార్ల యొక్క ఆదరణలతో గారాబం

గానే పెరిగింది జానకి. జానకి, మోహన్‌ల స్నేహం కూడా దినాదినాభివృద్ధి చెందుతూనే వుంది. ఒకసారి జానకి మోహనులు గుళ్ళోకెళ్ళి దేవుని సాక్షిగా, అమాయక హృదయాలతో పెళ్ళి చేసుకొని వచ్చేశారు. ఇలా రెండేళ్ళ వరకు రెండు కుటుంబాల జీవితాలు ప్రశాంతంగా జరిగి పోయినాయి.

జానకి పన్నెండో యేట తల్లి ఆకస్మికంగా మరణించింది. తల్లి మరణమే, జానకి కష్టాలకు నాంది. తల్లి చనిపోయిన నాటినుంచి జానకి జీవితంలో మార్పు వచ్చింది. ఇంటి బాధ్యత అంతా జానకిపైన పడింది. సీతమ్మగారు జానకిని అన్నివిధాల కాపాడుతూ వుండేది. బాధగా వున్నపుడల్లా అత్త వళ్ళో పడుకుని యేడ్చి, తనబాధనంతా పోగొట్టుకునేది జానకి. బాధ గాకనుపిస్తే "జానీ నేవున్నాగా యింకా బాధ ఎందుకూ" అంటూ ఓదార్చేవాడు మోహన్. ఈ ఆసరాతో జానకి తనబాధను మర్చిపోతూవుండేది.

సీతమ్మగారు జానక్కి పెండ్లి చేయమని అడిగింది. పెద్దవాళ్ళకు కానిదే. దానికి యిప్పుడేమంత తొందరంటూ తోసేశాడు జానకి తండ్రి. ఉన్న కాస్త ఆస్తిని అమ్ముకొని, జానకి తండ్రి పిల్లలతోసహా పట్నంనుంచి కాపరం ఎత్తేశాడు. కొన్నాళ్ళు బెజవాడలో కాపరం పెట్టాడు. ఇప్పుడు జానకికి మరీ బాధ లెక్కువయినాయి. కాని తన బాధను తనలోనే యిముడ్చుకొనేది. క్షేమ సమాచారములు మాత్రమే అత్తకు వ్రాస్తూవుండేది. సీతమ్మగారు జానకిని చూడాలని వుందని ఎన్నో వుత్తరాలు వ్రాసింది. జానకి తండ్రికి. కాని జవాబిచ్చేవాడు కాడు. ఒకసారి సీతమ్మగారే స్వయంగావచ్చి, బలవంతంగా జానకిని తీసికొని వెళ్ళింది పట్నం. పట్నం విడిచి వెళ్ళే నాటికే జానకి స్కూలు ఫైనలు పాసయినందువలన యీసారి వచ్చినపుడు వూరికే వుండలేదు. కష్టపడి చదివి యింటరు పరీక్షకి వెళ్ళింది. ఈసంగతి తెలిసి, తన కూతురు స్వతంత్రిస్తోందని అపోహపడి, పట్నంవెళ్ళి బలవంతంగా తీసుకు వచ్చాడు జానకిని తండ్రి. ఏదోవంక పెట్టి కూతుర్ని కొడుతూ తిడుతూవుండేవాడు. పట్నంకి ఉత్తరాలువ్రాయకూడదని ఆంక్ష పెట్టాడు.

బెజవాడలోకూడా జరగటం కష్టమయ్యేసరికి జానకి తండ్రి అక్కడినుంచి కాపరం పల్లెటూళ్ళో పెట్టాడు. పల్లెటూరి చాకిరి చెయ్యలేక జానకి చాలా అవస్థపడేది. తండ్రి ఇంట్లోలేనపుడు ఇరుగు పొరుగులవాళ్ళకి భారత, భాగవతాలు చదివి వినిపించేది. జానకిఅంత మంచిపిల్ల లేదనిపించుకున్నది ఆవూర్లో. ఇరుగు పొరుగువాళ్ళు కూడా జానకిని వోదారుస్తూ ఆమె పనుల్లోసహాయపడుతూ వుండేవారు. ఇటు తండ్రి బాధలూ, అటు మోహన్ ఎడబాటు సహించుకోలేకపోయింది. చచ్చిపోదామని ప్రయత్నించింది. కాని భగవంతుడు కూడా జానకిని స్వీకరించటానికి యిష్టపడలా.

తన బాధలను ఎవ్వరికీ తెలియనీయకుండా, ధైర్యంగా నవ్వుతూ జీవితాన్ని గడుపుకుంటూ వస్తున్నది జానకి. ఇంతలో తండ్రి తనకు పెళ్ళిప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుసుకుంది. మోహనుని తప్ప యింకెవర్నీ చేసుకోనని తండ్రితో చెప్పింది ఎలాగో ధైర్యం చేసి. "పుట్టి మాయిల్లు గుల్ల చేశావు. చాలదూ? యింక వాళ్ళనుకూడా నాశనం చెయ్యాలా?" అంటూ కోపంతో వెర్రికేక లేశాడు. జానకి హృదయం కలుక్కుమంది. తండ్రి అన్నమాట నిజమేననుకొన్నది. ఇంక యేమీ మాట్లాడలేకపోయింది. ఇలా జీవితం జరుగుతోంది జానక్కి. తిండికికూడా గతిలేకపోయింది వాళ్ళకు. దిగులుతో మంచమెక్కాడు. ఒకరోజు "నాన్నా" అనిపిలచింది జానకి. బాధలో వున్న తండ్రి ఆమెకేసి చూశాడు "నేను ఉద్యోగంచేస్తే ఏంనాన్నా" అని అడిగింది. జాలిగా, బాధగా చూశాడు కూతురివంక "ఆడపిల్ల నొమ్ముతిని, పాపం మూటకట్టుకోమన్నావా? నాకంఠంలో ఊపిరిఉండగా నీవు ఉద్యోగం చెయ్యడానికి వీల్లే"దన్నాడు. ఏమీ మాట్లాడలేకపోయింది జానకి. తండ్రి జబ్బు విషమించిపోయింది. శక్తి వంచన లేకుండా సేవచేసింది తండ్రికి జానకి. కాని మృత్యుదేవత జానకి సపర్యలనేమీ లెక్కచేయ్యలేదు. జానకి ప్రపంచంలో యేకాకి అయింది. ఈ ఆపదసమయంలో రామయ్య పంతులు కుటుంబమే జానకిని ఆదరించారు. ఆ దంపతులిద్దరూ జానకిని తమఇంట్లో పెట్టుకొని, తలిదండ్రులు లేని లోటును తీర్చారు. వారి ప్రేమాదరణలతో జానకి తన దుఃఖాన్ని మర్చిపోయింది. ఉద్యోగానికి ప్రయత్నించింది. రామయ్య పంతులు సహాయంవల్ల బొంబాయిలో ఆమెకి ఉద్యోగం దొరకింది.

బొంబాయి వెళ్ళేముందు పట్నంవెళ్లి అత్తని, మోహ

నుని ఒకసారి చూచివద్దామనుకున్నది మనసులో. కాని వెళ్ళటానికి మనస్కరించలేదు. వాళ్ళని బాధపెట్టాల్సి వస్తుందేమోనని భయపడింది. బొంబాయి వెళ్ళిపోయింది. ఆప్తులెవరూ లేకపోయినప్పటికీ, ఉద్యోగంవల్లా, స్నేహితులవలన శాంతిగానే జీవితాన్ని గడుపుతుంటోంది. ఇప్పుడు జానకిని వివాహమాడుటకు చాలామంది తయారయ్యారు. రామయ్యపంతులుకూడా పెండ్లి చేసుకుంటే బాగుంటుందని వ్రాశాడు జానకికి. స్వయంగా రెండు, మూడు సంబంధాలుకూడా వ్రాశాడు. కాని జానకి మాత్రం తాను బ్రహ్మచారిణిగా వుండదలచానని, పెళ్ళి చేసుకోనని'' జవాబు వ్రాసింది. రామయ్యపంతులు ఏమీ మాట్లాడలేదు యీ విషయంగురించి.

రామయ్యపంతులుయొక్క ఉదాసీనం చూసి జానకి చాలా భయపడ్డది. ప్రపంచంలో తనకున్న ఆ కాస్త ఆదరణ దూరమయిపోతుందేనని ఝడిసిపోయింది. ఆయనకు కోపం వచ్చిందేమోనని తలచి, వెంటనే రెండునెలలు సెలవుపెట్టి, ఆయనను చూడాలని బొంబాయినుంచి వచ్చింది జానకి. బండిదిగి, లోపల అడుగు పెట్టగానే "జానీ" అనేకేక విన్నది. మోహను అక్కడ ఉంటాడని కలలోకూడా అనుకోలేదామె. వాకిట్లో అలాగే నిశ్చేష్టురాలై కూర్చుండిపోయింది. పెరట్లో ఏదో పనిచేసుకుంటున్న రామయ్యపంతులూ, భార్యా ఈ సందడిచూసి గబ గబా వాకిట్లోకి వచ్చారు. జానకినిచూసి ఆశ్చర్యపోయారు. రామయ్య దంపతులు ఎన్ని పిలచినా పలకలేకపోయింది. చివరకు సీతమ్మగారే నెమ్మదిగా జానకిని లేవదీసి, స్నానంచేయించింది. ఎలాగోఅలా అన్నం తిన్నాననిపించింది జానకి. ఆమెలో సందేహాలు, సమస్యలూ మెదలుతూనేవున్నాయి. రామయ్యపంతులు, ఆయన భార్యా, సీతమ్మగారు పనులు పూర్తి చేసుకొని వచ్చారు. సావిట్లో అందరూ తీరుబడిగా కూర్చున్నారు. రామయ్య పంతులు అడిగాడు సీతమ్మగారిని మీకు, జానకికి పరిచయమేమిటని.

"పరిచయమేమిటి అన్నయ్యా, జానకి మాయింట్లో అందరికీ పంచ ప్రాణాలునూ. పట్నంలో జానకి తల్లీ తండ్రీ మాయింటి ప్రక్కనే కాపరం వుండేవారు. నీవు దూరంగావున్న లోటును తీర్చేవాడు జానకితండ్రి. నేను కూడా ఆయనను అన్నయ్యా అని పిలిచేదాన్ని. జానకి పుట్టగానే మోహనుకి చేసుకోవాలని అనుకున్నాం. అలాగే వీళ్ళిద్దరూకూడా చిలకా గోరింకల్లా పెరుగుతూ వచ్చారు. అంత ప్రేమగావుండేవారు. కాని జానకి తండ్రి ఆర్థికపరిస్థితులు పాడయిపోవటంవలన బెజవాడకి మకాం మార్చేశాడు. జానకి అప్పటికి పెళ్ళియీడుకి వచ్చింది. పెళ్ళి చేయమని అడిగా వాళ్ళనాన్నని. పెద్దవాళ్ళు వాళ్ళ అన్నలకేకాలేదు, దానికిప్పుడు తొందరేమిటి అన్నాడు. వీళ్ళు బెజవాడ వచ్చినతరువాత ఒకసారి మాత్రమే జానకిని మాయింటికి తీసుకువచ్చాను. ఆతర్వాత వీళ్ళజాడే తెలియలేదు. నేనూ, మీ బావ ఎన్నో వుత్తరాలు వ్రాశాం. కాని ఒక్కదానికి జవాబులేదు. ఎక్కడున్నదీ తెలియలేదు. మోహను చాలబాధపడేవాడు. ఇంతలో మీ బావ మోహనుకి పెళ్ళిప్రయత్నాలు మొదలు పెట్టారు, ఇది తెలిసి మోహను బెజవాడవచ్చి గాలించాడు. జాడయేమీ తెలియలేదు. జానకినితప్ప యింకెవరిని చేసుకోనని పంతం పట్టాడు. కాని ఆయన వినలేదు. "దానికి అనుభవించే యోగ్యత లేదు, అందుకు నీవు పెళ్ళి మానుకోవటం తెలివితక్కువ'' అని మందలించారు. పట్టుదలగా సంబంధాలు చూశారు. మోహను మతిలేకుండా తిరిగేవాడు. అన్నంతినేవాడుకాదు. ఆరోగ్యం పాడయిపోయింది. నేనుకూడా ఆయనతో చెప్పిచూశాను వాడికిష్టంలేని పెళ్ళిచేసి వాణ్ణి బాధపెట్టడం ఎందుకని పెళ్ళయితే అన్నీమరిచిపోతాడన్నారు. నచ్చచెప్పాల్సిందిపోయి, నీవుకూడా వాణ్ణి మద్దతు చేస్తున్నావా అని కోప్పడ్డారు. సరోజనిచ్చి బలవంతాన పెళ్ళిచేశారు. ఆతరువాత కొన్నాళ్ళకు మోహన్‌కు మతిపోయింది. వాణ్ణిచూసి ఇంట్లో అందరం ఏడ్చేవాళ్ళం. అమాయకురాలు సరోజనిని చూస్తే జాలివేసేది. ఒక్క నెల్లాళ్ళనుంచే వీడు మామూలుగా ఉంటున్నాడు. గాలిమార్పులకే ఇక్కడికి తీసుకు వచ్చాను.'' అని సీతమ్మగారు ఎంతో బాధగా చెప్పింది.

"మంచిపని జరిగింది అత్తా. మోహన్‌కి పెళ్ళి చేసినం

దుకు చాలా సంతోషం. లేకపోతే మావాళ్ళు దరిద్రులై బాధపడినట్లే మీరూ కష్టపడాల్సి వచ్చేది" అంటూ కన్నీరు కార్చింది జానకి.

"అదేమిటి పిచ్చిదానా! నీవంటి రత్నం అందరికీ దొరుకుతుందా?" అన్నాడు రామయ్యపంతులు. మోహన్ జానకి కళ్ళల్లోకి జాలిగా చూశాడు. నేను దురదృష్టవంతుణ్ణి కదూ అన్నట్లు.

జానకి తన కష్టాలన్నీ మర్చిపోయి, రామయ్యపంతులింటిలో సంతోషంగా గడుపుతోంది. పట్టుపట్టి సరోజనిని కూడా ఆవూగు పిలిపించింది. మోహనుని ప్రవర్తన చూసి, భార్యను సరిగా చూచుట లేదని గ్రహించింది జానకి. సరోజను ప్రేమగా చూడమని అతన్ని చాటుగా మందలించేది.

ఇలా వుండగానే జానకికి పట్నంలో బదిలీ అయినట్లు ఉత్తరం వచ్చింది. పట్నంలో తమదగ్గరే వుండమని మోహన్, సరోజలు బ్రతిమాలారు. కాని జానకి ఒప్పుకోలేదు. శలవయిపోయిన తరువాత జానకి పట్నంలో వేరే ఇల్లు తీసుకొని వుంది. జానకి పట్నం వచ్చినతరువాత మోహనులో పూర్తిగా మార్పు వచ్చింది.

ముగ్గురికీ సుఖంలేకపోయింది. మోహన్ ఆశలు చిగురిస్తున్నాయి. సరోజకు ద్రోహం చెయ్యలేనని జానకి స్థిరపరుచుకొంది. జానకీ మోహనుల చిరప్రణయానుబంధాలను సరోజిని గ్రహించి అర్థం చేసుకుంది.

ఇప్పుడేంకావాలి? విడని సమస్యగా పరిణమించింది. చివరకు సరోజిని త్యాగం జానకీ మోహనులకు అనుకోని అదృష్టం అయింది. ★

టెస్ ఆఫ్ ది డూబర్ వెల్లిస్

ప్రసిద్ధ ఆంగ్ల నవల "టెస్ ఆఫ్ ది డూబర్ వెల్లిస్" కథా సంగ్రహం.



థామస్ హార్డీ

1840 — 1928

[థామస్ హార్డీ నవలలు చదవడం మొదలు పెడితే పూర్తి అయేదాకా వదలలేం. కొందరికి అతను ఉపయోగించే దేశీయాలూ ప్రకృతి వర్ణనలూ విసుగనిపించవచ్చు. కాని కథా సంవిధానం, పాత్రలు ప్రముఖంగా చిత్రించబడి వుండడంవల్ల చదవడం కష్టం అనిపించదు. విషాదాంతకం అయిన టెస్ జీవితగాథ పూర్తిగా చదవాలేకాని కథలా చెప్పుకుంటే దాని పూర్తి అందం తెలియదు. ప్రేమించాననుకొనిన ఒక వ్యక్తి క్రూరప్రవర్తన ఒక యువతి జీవితాన్ని ఎంత విషాదంలో ముంచిందో, లేత హృదయం, యౌవనపుఉద్రేకం, లోకంలోని కుటిలత్వం తెలుసుకోలేని అమాయికత్వం టెస్‌ని ఎటువంటిముళ్ళదారిన నడిపించాయో నవల చదువుతే తెలుస్తుంది ఈ అమాయికత్వం, కుటిలత్వం, హృదయవేదన, ప్రతీకారాల నుంచి థామస్ హార్డీ చిత్రించిన ఈ కథ మహిళల హృదయాలని కలవర పెడుతుంది.]

ప్రపంచానికి దూరంగా బ్లాక్‌మూర్ లోయలో వుంది మార్‌లాట్ అనే చిన్న పల్లె. ఆ పల్లెవాసి జాక్ డర్బీఫీల్డ్. తాగుబోతు. సగంవేళాకోళంగానూ, సగం సీరియస్‌గానూ ట్రింగ్‌హామ్, ముసలివాడైన ఆవూరి పార్సన్ ఒకరోజు జాక్‌తో అన్నాడు: నువ్వు గొప్పవంశంవాడివి. నీతరం అతి ప్రాచీనం అయిన 'డ్యూబర్ వెల్లిస్' హంశకలది. ఆ వంశం అంతరించి పోయిందనీ, వారి ఐశ్వర్యం చెల్లా చెదరుగా అయిపోయిందనీ అంటారు. కాని నువ్వు సాక్షాత్తు ఆ వంశం వాడివి జాక్. గుడ్‌నైట్ సర్‌జాక్- అది నిజమే అని అజ్ఞానీ తాగుబోతూ అయిన జాక్ నమ్మేశాడు. త్వరత్వరగా యింటికి వెళ్ళి యీ విషయం భార్యా పిల్లలకి చెప్పాడు. సంఘంలో తమకు అనుకో

కుండా లభించిన యీ గౌరవాన్ని గురించి చెప్తూంటే జాక్ పెద్ద కుమార్తె అందకత్తె ఆత్మాభిమాని అయిన టెస్ కిటికీలోంచి బైటికి చూస్తూ కూర్చుంది. ఎవర్ని చూస్తుంది? అందకాడూ గౌరవనీయుడూ అయిన ఏంజిల్ క్లేర్‌ని. పదయాత్ర చేస్తూ దారిలో తన సహోదరులతో కలిసి యీ పల్లెపిల్లలతో నాట్యంచేసి పోదామని కొద్ది రోజులు ఆగేడు ఏంజిల్ క్లేర్. ఏంజిల్‌క్లేర్ ఒక వికార్ కొడుకు. అతన్ని చూడగానే ప్రేమించింది టెస్. అందుకే కోరికలుగుప్పించేకళ్ళతో దీనంగా అతనికేసే కిటికీలోంచి చూస్తూంది. నాతో యీ మేమాసపు వుత్సవాలలో. వేడు కలలో నాట్యంచెయ్యి కూడదూ? అని కోరుకుంటుంది. ఇంటి దగ్గిర : గొప్పవంశజుల హంశ మనం అన్నవార్త విని "అయితే దానివల్ల మనకేం లాభం అమ్మా?" అని తల్లిని అడిగింది. తల్లి జోన్ దయాదాక్షిణ్యాలు కలది. కాని జాక్ లాగేయిదమిత్థ మయిన ఆలోచనలు లేనిది. అందుకే గొప్పవంశంవారి సంతతే మనం అని తెలియ గానే రంగు రంగుల కలలు కనడం ప్రారంభించింది. "అలా అంటావేం టెస్. ట్రాన్ ట్రిడ్జిలో డూబర్ వెల్లిస్ పేరుతో ఒకావిడ వుంది. ఆవిడతో చుట్టరికం కలిపి అక్కడ వుంటే నీకో చక్కని సంబంధం చూస్తుంది!

టెస్ జీవితం విషాదాంతం కావడానికి యిదేనాంది. చిన్న పిల్లల పరిస్థితులు బాగుపడతాయనీ తల్లి సంతోషిస్తుందనీ టెస్ ట్రాన్‌ట్రిడ్జికి ప్రయాణం కట్టింది. అక్కడ అంధురాలయిన తల్లి తరఫున ఎలక్ డూబర్ వెల్లిస్ టెస్‌ని హృదయపూర్వకంగ ఆహ్వానించాడు. కోళ్ళనీ వాటినీ చూసుకునే పనికి నియమింప బడింది టెస్. మొదట్లోనే ఎలక్ చెప్పాడు. అనవసరంగా ఆశలు పెట్టు కోకు నువ్వు దర్జాఫీల్డువే. డూబర్ వెల్లిస్ వంశం దానివి మటుకుకాదు" అని. అంతకిమించి నేనేమీకోరను అంది టెస్.

ఎలక్ నిజానికి డూబర్ వెల్లిస్ వంశంవాడు కాదు. అయినా ఆపేర చలామణీ అవుతున్నాడు. టెస్ అందాన్ని చూసి మంత్ర ముగ్ధుడయాడు. ఏలాగైనా ఎప్పటికైనా ఆమెని తనవశం చేసుకోవాలని నిశ్చయించు కున్నాడు. అందుకే మొదటినుంచీ ప్రారంభించాడు. కాని టెస్ అన్ని విధాలా అతన్ని దూరంగా వుంచి తన పనేదో తాను చేసుకుపోతూంది. చక్కటి అవకాశంకోసం ఎదురు చూస్తున్నాడు ఎలక్.

ఒకనాడు ఆ అవకాశం రానే వచ్చింది. సెప్టెంబరు మాసంలో ఒక సాయంత్రం మార్కెట్టునుండి తిరిగివెడు తున్న కొందరు వర్తకులు టెస్‌ని చూసి వేళాకోళం చేశారు. చిన్న రోడ్డు దెబ్బలాట ప్రారంభం అయింది. ఆ సమయంలో ఎలక్ డూబర్ వెల్లిస్ వచ్చి టెస్‌కి అండగా నిలచి ఆమెని తన గుఱ్ఱంమీద ఎక్కించుకుని బయలు దేరాడు. ఆ వర్తకులని వెతుకుతున్నట్లు నటిస్తూ టెస్‌ని దూరంగా వున్న ఒకచిట్టడవికి తీసుకుపోయాడు. అలసి సొలసి వున్న టెస్ నిద్రపోయింది. ఆమె కంటి వెంట వచ్చిన కన్నీటి మరకలు సహితం ముఖంమీద నుంచి యింకా చెరిగిపోలేదు. అటువంటి సమయంలో ఎలక్ తనకోరిక నెరవేర్చుకున్నాడు. చీకటి నలుదిశలా వ్యాపించింది. కాని తనను రక్షించిన ఎలక్ అదృశ్యుడయ్యాడని గ్రహించింది టెస్,

కొన్ని వారాలు గడిచాక. టెస్ విపరీతం అయిన మానసిక బాధను మోసుకుంటూ యింటికి తిరిగి వచ్చింది. వెళ్ళేముందర ఎలక్‌తోఅంది "నువ్వు తలపెట్టినదారుణం ఆలస్యంగా గాని అర్థం కాలేదు నాకు" అని. హేళనగా నవ్వుతూ, "అందరాడవాళ్ళు అంతె అంటారు టెస్. నీ అందం దాచుకోకు. అదిఅదృశ్యం అయిపోయే ముందుగా ప్రపంచానికి చూపు" అంటూ ఉపదేశించాడు ఎలక్.

ఇంటికి వచ్చిన టెస్‌కి తిట్లే ఓదార్పు అయాయి. "ఇక్కడి నుంచి నే వెళ్ళేటప్పటికి చిన్నదాన్ని. ప్రపంచంలో యింతటి కష్టాలుంటాయని నాకెందుకు చెప్ప లేదమ్మా?" అంటూ ఏడుస్తుంది టెస్. తల్లి హృదయం కరిగిపోయింది. "ఏంచేస్తాం, దైవనిర్ణయం అంటూ మొండిధైర్యాన్ని తెచ్చుకుంది.

నెలలూ ఋతువులూ మారి మళ్ళా ఆగస్టు వచ్చేనాటికి టెస్ మాతృమూర్తి అయింది. నీరసించి ఉత్సాహంలేని రూపం మిగిలింది టెస్‌కి. అందరితోపాటు పొలం పని లోకి పోతూ, విశ్రాంతిసమయంలో పిల్లవాడికి పాలిచ్చేది. అదిచూసి అందరూ వేళాకోళం చేసేవారు. అయినా కన్న తల్లి ప్రేమ అది. అవమానకరం అయినా పిల్లడి మీది మమత అటు వంటిది టెస్‌కి.

గురించి చెప్పింది టెస్. స్తబ్ధుడయి విన్నాడు. తరువాత పొలాల్లో పని చేసుకుంటూంటే వచ్చి, జరిగిన దానికి ప్రాయశ్చిత్తంగా యిప్పుడు మళ్ళీ కలుసుకుందాం. నీవు పెళ్ళి చేసుకుని నాతోపాటు ఆఫ్రికా వస్తావా? అక్కడ మతబోధకునిగా వుందామనుకుంటున్నాను అనిఅడిగాడు. తను యింకొకరిని వివాహమాడిన సంగతీ, అతనెలా తనని వదిలివేసినది చెప్పింది టెస్. కాని ఎలక్‌డ్యూబర్ వెల్లిస్ కోరికలు చావలేదు. టెస్ కోసం తిరిగి అతని హృదయం ఆరాటపడం మొదలు పెట్టింది. ఆమెని చూడగానే అతని కోరికలు చిగిరించాయి. బోధనా విషయాలు జాగ్రత్తగా చూడడం మానేశాడు. రోజులు గడిచినకొద్దీ అతని రూపమే మారిపోసాగింది. "నాలో విశ్వాసాన్నీ మతంపట్ల నమ్మకాన్నీ, నువ్వు తొలగించేశావు టెస్. నా పతనాన్నే నువ్వు పంచుకో! ఆ మొగుడన్న వాణ్ణి పూర్తిగా మరిచిపో" అన్నాడు. ఒళ్ళుతెలియని కోపంతో ఆవేశంతో చేతికి తొడుక్కుని వున్న తోలు తొడుగుని అతని ముఖంమీదికి విసిరింది. రక్తం చిమ్మింది. ఎలక్‌కి కోపం వచ్చింది. జ్ఞాపకం వుంచుకో టెస్. ఒకప్పుడు నీ అధికారిని నేను. తిరిగీ నీ అధికారిని అయితీరుతాను?" అంటూ వెళ్ళిపోయాడు.

దారితోచని సమయంలో హృదయం కరిగేలాంటి ఉత్తరాన్ని రాసింది ఏంజిల్‌కి. తన దగ్గిరికి రమ్మంది. నన్ను భయపెడుతూన్న వీడినుంచి రక్షించు అంటూ రాసింది.

రోజుకి రోజు ఆమెలో ఆశలు నశించడం మొదలు పెట్టాయి. కష్టాలమీద కష్టాలు వచ్చిపడ్డాయి. తండ్రిచచ్చిపోయాడు. తల్లీ పిల్లలూ వున్నయిల్లు ఖాళీచేసి యింకో చోట తలదాచుకోవలసిన అవసరం ఏర్పడింది. వాన కురుస్తూంటే కిటికీలోంచి చూస్తూ కూర్చుంది టెస్. ఈ బాధ ఇంతగా వుండకపోను తన గౌరవం మంటకలవకపోతే. అయినా ఎలక్ తనని చేపట్టడానికి ఒప్పుకుంటే తల్లినీ అన్న తమ్ములనీ తన యింటికి తీసుకువెళ్ళి ఆదరిస్తానన్నాడు. కోపంతో ఆ వ్యక్తిని కాలతన్నుకుంది. ఆ రాత్రి ప్రప్రథమంగా తిడుతూ ఏంజిల్‌కి ఉత్తరంరాసింది. "నన్నెందుకిలా చేశావు? యింత దారుణమైన ప్రవర్తన నాపట్ల తగదు. దానికి నేను అర్హురాలని కాను ఏంజిల్, నువ్వెందుకింత క్రూరంగా ప్రవర్తించావు. యికమీదట నిన్ను మరిచిపోడానికి ప్రయత్నిస్తాను- నీ టెస్" ఈ లోపున టెస్ స్నేహితురాళ్ళు కూడ ఏంజిల్‌కి ప్రార్థనాపూర్వకంగా వుత్తరాలు రాశారు: "నిజంగా మా టెస్ నిన్ను ప్రేమిస్తున్నంతగా మీ రామెను ప్రేమిస్తూంటే ఓ సారి మీ భార్యనిచూడండి. స్నేహితుని రూపంలో భయపెడుతూన్న శత్రువునుంచి ఆమెని రక్షించండి" అని....

* * *

ఒకనాటి సాయంత్రం ఏంజిల్ క్లేర్ వచ్చాడు. ఇంటి దగ్గిర వున్నఉత్తరాలు చూసుకున్నాడు. బయలుదేరి టెస్ తల్లిగారింటికి వెళ్ళాడు. టెస్ తల్లి జోన్ యితన్నిచూసి ఆశ్చర్యపోయింది. టెస్ ఎక్కడుందో తెలియదంది. కాని, ఏకాకిని నిరాశాపూరితుణ్ణి నాపై దయయుంచి టెస్ చిరునామా చెప్పండి అని ప్రాధేయపడ్డాడు ఏంజిల్. ఫలితంగా చిరునామా యిచ్చింది తల్లి.

వెతుక్కుంటూ, అందమైన ఒక యింటిముందు నిలిచాడు ఏంజిల్ క్లేర్. ముందుగదిలో కూర్చోమన్నారు. చక్కని కాశ్మీర్ గౌను వేసుకుని టెస్ వచ్చింది. ఆమె అందాన్ని ఆ దుస్తులు రెట్టించాయి. ఏంజిల్‌ని చూడగానే ఆమెకళ్ళు విపరీతంగా మెరిశాయి. "చాలా ఆలస్యంగా వచ్చారు. మీకోసం వేచియుండి వుండి అలసిపోయాను. ఇక లాభంలేదు ... అతను మా అందరిపట్లా దయగా ఉంటున్నాడు. పైన పడుకుని నిద్రపోతున్నాడు. ఇప్పుడతడంటే అసహ్యం వేస్తూంది! దయచేసి వెళ్ళిపోండి, త్వరగా వెళ్ళిపొండి" అంది. ఏంజిల్ హృదయం చల్లబడిపోయింది, విషాదంతో ముఖం ముకుళితం అయింది, మళ్ళీ తను ఏకాకిగా మిగిలిపోయాడు, ఆ యింటిని వదలి నడవడం ప్రారంభించాడు, ఎక్కడికోఅతనికేతెలియదు.

కొంతసేపటికి గాబరాగా పరుగెత్తుకుంటూ వచ్చి అతన్ని కలుసుకుంది టెస్. పరుగెత్తిరావడం వల్ల ఊపిరి అందడంలేదు, మాటలు తడబడు తున్నాయి..... "అతన్ని చంపేశాను! యిప్పుడేనా నాతప్పుని క్షమిస్తావా నువ్వు?" అడిగింది. అడుగుతూంటే విచార పూరితం అయిన ఓ చిరునవ్వు వెల్గి ఆరింది ఆమె ముఖంమీద.

ఆ తుదిక్షణంల్లో క్లేర్ హృదయాన్ని దయ ఆక్రమించుకుంది. టెస్‌ని తన కౌగిలిలోకి తీసుకుని ముద్దు పెట్టుకుంటూ "నిన్నిక వదలను టెస్, నిన్ను నేను రక్షి

స్తాను. నువ్వు ఏంచేసినా సరే ఫరవాలేదు నేను నీ అండ నిలుస్తాను" అన్నాడు.

ఇద్దరూ కలిసి నడిచారు. అలా నడిచినడిచి ఒక కాళీ యింట్లో సేదదీర్చుకుందుకని ఆగేరు. న్యూ ఫారెస్టులో మనుష్య సంచారానికే దూరం అయిన ప్రదేశం అది. అక్కడ ఏ చీకూ చింతాలేకుండా పక్షులే సహచరులుగా గడిపారు ఐదురోజులు. ఆఐదురోజులూ టెస్ జీవితంలో ఎన్నడూ ఎరగని ఆనందాన్ని అనుభవించింది. ఇక ఆ యిల్లు వదలడం. అక్కడనుంచి కదలడం శ్రేయస్కరం అని యిద్దరూ బయలుదేరారు "ఇక నా జీవితం వారాల్లో పడింది ఏంజిల్. ఇంత కంటే అక్కరలేదు. నా పట్ల నీ అభిమానం మళ్ళా పోకుండానే నేను కన్నుమూస్తాను, అంతకి మించిన యింకో కోరిక లేదునాకు. చచ్చిపోతే నైనా నయంకాని నువ్వు నన్ను అసహ్యించు కుంటు న్నావంటే బ్రతకలేను" అంటుంది.

"ఇకమీదట ఎప్పుడూనిన్ను అసహ్యించుకోను టెస్" అన్నాడు ప్రేమతో క్లేర్.

నడిచి నడిచి అతి ప్రాచీనం అయిన కట్టడం దగ్గిరికి వచ్చారు. అది ఒక హీథన్‌గుడి. శతాబ్దాల క్రితం అల సిన టెస్ ఒక రాతిపలక మీద తలవాల్చింది. "నాకెంతో నిద్రవస్తూంది ఏంజిల్" అంది. "నువ్వు చర్చిలో ఆల్టార్ ముందు పడుకున్నాపు టెస్" అంటూ ఆప్యాయంగా ఆమె పెదవులు చుంబించాడు ఏంజిల్.


ఆమె నిద్రపోతూంటే కాపలా కాశాడు ఏంజిల్ క్లేర్. వెనక పక్క నుంచి ఎవరో నడిచి వస్తూన్న చప్పు డయింది. ఒకమనిషి కన్పించాడు. తరువాత యింకొకరు యింకొకరు అదరిపడి లేచి కూర్చుంది టెస్. "వాళ్ళు నాకోసమే వచ్చారా ఏంజిల్?"

"అవును టెస్ నీకోసమే...."

"నాకు సంతోషంగా వుంది ఏంజిల్! నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూంది" నెమ్మదిగా అంది. తరువాత వచ్చినవాళ్ళతో "నేను సిద్ధంగానే ఉన్నాను" అంది టెస్.

జూలై వేడి ఉదయము ఎనిమిది గంటలవేళ యిద్దరు యౌవనలు చేతిలో చేయివేసుకుని మెల్లిగా కొండఎక్కు తున్నారు. ఏంజిల్; టెస్ చిన్న చెల్లెలు లీజాలూ కొండ మీద వున్న కటకటాల కిటికీలతో నిండిన భవంతివైపు నడుస్తున్నారు. ఏంజిల్‌కి ఆపట్నానికిమచ్చగా కన్పిం చింది ఆ భవంతి, అన్ని విధాలా టెస్ పోలికలున్న లీజాని ఏంజిల్ రక్షణకింద వుంచుకొమ్మని తన ఆఖరు ఘడియలలో కోరింది టెస్. పెళ్ళి చేసుకుని దానిసుఖాన్ని చూడమంటుంది. లోకంనుంచి రక్షించ మంటుంది. బ్రతకడ మెలాగో నేర్పమంటుంది.

భయంకరంగా వున్న ఆ భవంతిమీద ఎత్తుగా ఒక కంబంనాటేరు, కొండఎక్కి వెళ్ళిన లీజాలూ ఏంజిల్ దృష్టి దానిమీదనే నిలచివుంది. కొన్ని నిముషాల తరు వాత ఒక నల్లజెండా ఆ కంబాన్ని అలంకరించింది. "న్యాయం" అమలు జరుపబడింది. చనిపోయిన టెస్ ఆత్మశాంతి కోసం క్షణంసేపు ప్రార్థించారు. తిరిగిలేచి చేతిలో చేయివేసుకుని యిద్దరూ ముందుకి నడకసాగిం చారు... నల్లజెండా మటుకు గాలిలో రెపరెప లాడుతూ ఎగురుతూంది.



సంక్షేమం

ANDHRA MAHILA
SAMKSHEMAM
JANUARY '57

మూడేళ్ళ చిన్నారి బిన్నా

డాక్టర్ బి. ఆనంద్

"బిన్నా!" అని పిలిచాడు వాళ్ళనాయన. జవాబు లేదు. బడికి వెళ్ల డానికి సిద్ధంగా వుందో లేదో చూడ్డానికి ఆయన లోపలికి వెళ్ళాడు. ఆ ప్రక్కనే ఏడుస్తున్న బిడ్డను చూసి "ఏమమ్మా! ఇవాళ బడికి పోవాలని లేదూ?" అని అడిగాడు.

"వెళ్ళాలనే వుంది. కాని అన్నయ్య వీల్లే దంటున్నాడు" అంది.

"ఏడవకు తల్లీ, నువ్వు బడికి వెడుదువు గానిలే, మా అమ్మవు కావు, ఏడవకు" అని ఆ తండ్రి బుజ్జగించగానే ఆమె ఏడుపు మానింది. ఆమె కెంతో సంతోషం కలిగింది. ఆ యింటికి వచ్చిన వారొకరు "ఇంత చిన్న వయస్సులో బడికి వెళ్ళాలనే కుతూహలం ఈ బిడ్డకు ఎంత కాలం నుంచి వుంది?" అని అడిగారు.

"ఓ! ఒక నెల రోజుల నుంచే!" అన్నా డాయన, మూడేళ్ళ బిడ్డకు బడికి వెళ్ళడానికి ఇలా ముచ్చట పడగలదని ఎవరైనా పదేళ్ళ క్రిందట ఊహించగలిగే వారా?

మూడేళ్ల పిల్లలో కలిగిన ఈ మార్పులే గత పది సంవత్సరాలలోని విద్యా విధానంలోను, పాఠశాలలోను, కుటుంబంలోను, కలిగిన పరిణామాన్ని సూచిస్తూంది. చిన్నారి బిన్నాకు తన బడి అంటే ఎంతో యిష్టం – అక్కడి ఆటలన్నా, తోటి పిల్లలన్నా తగని మక్కువ. అక్కడ ఎన్ని ఆటలున్నాయి. ఊగే పడవ, జారుడురాయివంటివి ఎన్నో వున్నాయి. మొక్కలకు నీళ్ళుపోయడంఅంటే ఆమెకు ఎంతో సరదా.

భోజన సమయంలో గంట కొట్టగానే తను కూడా మిగిలిన పిల్లలతో పాటు బత్తాయి నారింజ పండు తింటుంది. ఆ పండు తిన్నాక తొక్కలను కొంత దూరంగా నున్న తొట్టిలో పడవేస్తుంది. ప్లేటులు ఎక్కడపెట్టాలో. అక్కడే పెడుతుంది. తోటిపిల్లలతోపాటే చాపలమీద పడుకొని కాస్సేపు విశ్రాంతి తీసుకొంటుంది.

తమ బిడ్డకు బడి అంటే వున్న మక్కువను ఆమె తలిదండ్రులు కూడా పంచుకొంటారు. ఆమె తల్లికీ, తండ్రికీ కూడా గవర్నమెంటు ఉద్యోగాలున్నాయి. బిన్నాకుబడిలో చక్కగా కాలక్షేపం కావడం వారికి ఎంతో సంతోషం కలిగిస్తుంది. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాల్లో వున్న కుటుంబాలకి బిడ్డలను నర్సరీ పాఠశాలలకు పంపడం అవసర మనుకోరాదు, అవి ఎరికైనా అవసరమే. తమ బిడ్డల మనోవికాసానికి, అభివృద్ధినికాంక్షించే వారికందరకూ అవి ఉపయోగకరమే. అటువంటి బడులలో ప్రజాస్వామిక జీవనానికి సమాజంలో ఎటువంటి వైఖరి, నడవడి అవసరమో వాటిని బిడ్డలు నేర్చుకో గలుగుతారు.

వినోదం మూలంగా విశ్రాంతి తీసుకో వాలనే లక్ష్యాన్నే నర్సరీ పాఠశాలలు బిడ్డలకు బోధిస్తాయి. ఇదంతా పలక, బలపం, పుస్తకాలు అక్కర్లేకుండా జరిగే బోధనే.

★

శ్రీ స్పర్గాన్ ఎం. కీనీ మిత్రరాజ్యసమితి ఆధ్వర్యమున నడుపబడుతున్న శిశు సంక్షేమ కార్యక్రమాలు వ్యవహర్తలలో ఒకరు. వీరు దేశసంచారం చేసి, వివిధ దేశాలలోని శిశువుల సమస్యలను పరిశీలించి వారికి కలిగిన మనోభావాలను, ముఖ్యంగా తూర్పుదేశాల ఆరోగ్య పరిస్థితులను గూర్చి చక్కగా వ్యక్తపరచారు.

శిశు సంరక్షణ

మిత్రరాజ్యసమితి బాలలనిధి చేస్తున్న అపూర్వకృషి

స్పర్గాస్ ఎం. కీనీ


క్రిందటి వారం ఒక ఓడ బియ్యంతో బ్యాంగ్‌కాక్ నుంచి చిట్టగాంగ్‌కు బయలుదేరి వెళ్ళింది. ఈ బియ్యాన్ని థాయ్‌లెండ్ మిత్రరాజ్యసమితి ఏర్పాటు చేసిన బాలల సంరక్షణ నిధికి కానుకగా యిచ్చింది. తూర్పు పాకిస్తాన్‌లో వరసను రెండు సంవత్సరాలుగా వరదలవల్ల పంటలు పాడైపోయినందున అక్కడ ఆకలిబాధతో అల్లాడుతున్న బిడ్డలకోసం పంపబడుతున్నాయి. ఈ బియ్యం సహాయము నిజంగా అవసరమో, కాదో తెలుసుకొన్న పిదపనే మిత్రరాజ్యసమితి బాలలనిధి నిర్వాహకులు రవాణాకు ఉత్తరువు చేస్తూవుంటారు. అది నిజంగా అవసరమో కాదో తెలుసుకొనడానికి అనేక మార్గాలున్నాయి. ఏదేశం బియ్యం సహాయం కోరిందో దాని నిపుణులను పంటలకు సంబంధించిన వివరాలను, దాని నిల్వలను, కొత్త పంట చేతికందే తేదీలను తెలుపవలసినదిగా కోరడం ఒక మార్గం. బజారుకు వెళ్ళి బియ్యం వర్తకునితోనో, అతని ఖాతాదారులలో కొందరితోనో మాట్లాడడం మరొక మార్గం.

నేను మర్పూర్ వెళ్ళి దర్యాప్తు చేశాను. అక్కడ బియ్యం ధర తక్కువకాదు. సాదా బియ్యమైతే పౌను బియ్యానికి ఆరు సెంట్లు. మరో మేలు రకం బియ్యమైతే తొమ్మిది సెంట్లు ఖరీదు. ఒక కుటుంబ పరిస్థితి ఎలా వుంటుందో తెలుసుకోడానికి ఒకనిని పిలిచి అడిగాను. నాతో కూడా వున్న ద్విభాషి నా ప్రశ్నలను ఆ పౌరునికి చెప్పి, తెలుసుకొన్న జవాబులను తిరిగి నాకు చె తున్నాడు.

జీవితావసరాలు :

ఆ పౌరుని స్థానంలోనే నేను వున్నట్లు భావించుకొ నలుగురు పిల్లల తండ్రిని ఎలా కుటుంబం పోషిం కోగలనా అని యోచించుకో సాగాను. నా కుటుంబ కంటె పెద్ద కుటుంబాలు అనేకం వున్నాయి. మరి ము మైన జీవితావసరాలనే తీర్చుకుందాం. ఈ సంవత్సర కొత్తకారు కొనవద్దు; కేవలం కుటుంబానికి కాలం గడి పోవడానికి అవసరమైన వాటినే సమకూర్చుకుందాం.

“ఇంతకూ నేను ఒక కార్మికుడిగా గ్రహించుకొన్నా వారానికి ఆరు రోజులు పనిచేసే శ్రమజీవిగా భావిం కొన్నాను. మిత్రరాజ్యసమితి బాలల సంరక్షణనిధి వ్య హర్తగా వారానికి అయిదు రోజుల పూట మాత్ర పనిచేస్తున్నా అక్కడికి అదే చాలా కష్టమైన పని అ వారు బోలెడుమంది వున్నారు. నేను యిక్కడ కార్మికుడనై వుంటే వారానికి కిట్టుబడి అయ్యే జీత 1 డాలరు 56 సెంట్లతో సమానం. నాలుగు వారాల వచ్చే జీతం ఎంత ? ఖర్చు ఎంత ? ఈ ఆర్జన అం పెట్టి ఒక్క బియ్యమే కొంటే, నాకు కుటుంబంలో భార్య-నలుగురు పిల్లలకు రోజుకు 12 ఔన్సుల బియ్య వసాయి. భోజనానికిది చాలనుకున్నాను.



మళ్ళీ కాగితం పెన్సిలు తీసుకొని లెఖలు వేసి చూశాను. ఔన్సుకు 100 కాలరీల వంతున రు॥కు 1200 కాలరీల బియ్యం వచ్చాయన్నమాట. అయితే అమెరికాలో ఏపనీ చెయ్యకుండా పడుకొనివుండే ఒక మనిషికి రోజంతటికీ 1200 కాలరీల ఆహారం అవసరం. అని చెప్పారు. ఇక్కడ నేను పడుకొంటే వారం చివర 1 డాలరు 56 సెంట్ల జీతం యజమాని యిస్తాడా? అందుచేత జీతం హెచ్చించమని అడగాలి. నాకంటే తెలివి తేటలుకల వాళ్ళు అనేకమంది నా పనికోసం కాచుకుని కూర్చున్నారు. మరోపనికూడా చేస్తే- రోజంతా పగలు ఈ ఉద్యోగం చేస్తూ, రాత్రి మరోపనిచేస్తే- అదనపు రాబడి వుంటుంది. కాని రాత్రిళ్ళకూడా దొరికే పనులు చాలా తక్కువ. నాలాగే రాత్రిళ్ళకూడా మరో పనిచెయ్యడానికి సిద్ధపడ్డవాళ్ళు అనేకులున్నారు. ఉన్న పనులన్నీ వారు అప్పుడే చేజిక్కించుకొన్నారు.

ఇక చాలీ చాలని జీతంతో కాలం గడవదు, అప్పు చెయ్యాలి. అప్పెవరిస్తారు? భార్య వొంటిమీద నగలు తాకట్టు పెట్టాలి. అయితే భార్య వొంటిమీద వున్న నగలే చాలా తక్కువ. అవి పుట్టింటివారు పెట్టినవి. వాటిని నేను తీసుకువెళ్ళి తాకట్టు పెట్టడం చట్టవిరుద్ధం. బాగా డబ్బున్న అమ్మాయిని పెళ్ళి ఆడి వుండాల్సింది, పౌర

పిల్లలకు పాలు:

ఆగుంపులో వున్న మరొకరిని "నీ కెంతమంది పిల్లలయ్యా? అని అడిగా.

తొమ్మండుగురని చెప్పాడు. మిత్రరాజ్యసమితి శిశు సంరక్షణనిధి కార్యక్రమాలకు ఆసియాలో వ్యవహర్త ఉద్యోగం చేస్తూన్నా. తూర్పు పాకీస్తాన్‌లో తొమ్మండుగురు బిడ్డలు గల పేద పౌరుని సమస్యలుగాని, ఆసియాలోని మరే దేశంలోనైనా వుండే పేదవాని పరిస్థితిగాని సరిగా ఊహించుకోగలిగే తెలివి తేటలు లేవనే తట్టుతుంది.

ఆసియాలోని కోటానుకోట్ల పౌరులలో నేను కూడా ఒకడనై వుంటే నా భార్యకు, నా బిడ్డలకు వారు ఆరోగ్యవంతులై కడుపునిండా తిండి ఎంత కావాలో ఊహించగలిగి వుండేవాణ్ణి. మిత్రరాజ్యసమితి శిశు సంరక్షణనిధి పిల్లలకు సప్లయి చేస్తున్న డబ్బా పాలను కోరి తెచ్చుకొనేవాణ్ణి. ఈ సంస్థ సాలుకు 40,000 టన్నుల డబ్బాపాలు ఆసియాలోని పిల్లలకు పంచిపెడుతూవుంది. ఈ డబ్బా పాలు అమెరికా ఉచితంగా యిస్తుంది. ఈ సంస్థ టన్నుకు 40 డాలర్ల వంతున రవాణా ఛార్జీలను మాత్రమే

వైద్యసహాయం :

నా బిడ్డలకు జబ్బుచేస్తే వారికి నాకూ వారానికి వచ్చే 1 డాలరు 56 సెంట్లు వేతనంలోను డాక్టర్లకు యివ్వ డానికి మిగిలేది ఏమీ ఉండదుకనక ఎక్కడ ఉచితంగా చికిత్స లభిస్తుందో తెలుసుకో గోరుతాను. నా భార్య గర్భవతి అయితే అవసరమైన సలహాలు, మందు పాలు పొందగల చోటు ఎక్కడ వుందో తెలుసుకొన గోరుతాను. గ్రామంలోని ప్రజలకు అవసరమైనపుడు శిక్షణ పొందిన నర్సుగాని, మంత్రసానిగాని అందు బాటులో స్థానికంగా వుందో లేదో కూడా తెలుసుకొన గోరుతాను.

నర్సుల శిక్షణ :

ఈ ఏర్పాట్లు అన్నీ చేసుకొనడంలో అన్నిదేశాల ప్రభుత్వాలకు తోడ్పడడమే మితరాజ్యసమితి ఏర్పాటు చేసిన శిశు సహాయ సంరక్షణనిధి లక్ష్యం. 1956 సంవత్సరాంతానికి యిటువంటి సదుపాయాలు, సౌక ర్యాలు సమకూర్చే 6,000 కేంద్రాలు ఆసియాలో నెల కొంటాయి. తగిన మందులు, సాధనసంపత్తి కలిగి ప్రతిరోజు 1,50,000 మంది తల్లులకు, పిల్లలకు తోడ్పడుతూ వుంటాయి థాయ్‌లెండ్ రాజధాని బ్యాంగ్ కాక్‌లోని శాథోరన్ వీధిలో యిటువంటి కేంద్రం ఒకటి వుంది. నగరంలో మాట అలావుండగా శిశు మరణాల సంఖ్య ఎక్కువగా వుండే గ్రామీణ ప్రాంతాలలో యిటువంటి కేంద్రాలు చాలా వున్నాయి, ఈ సంస్థ గ్రామాలలో వుండే మంత్రసానులకు ప్రత్యేక శిక్షణ నిప్పించడంలోకూడా సహాయంచేస్తూవుంటుంది. ఇప్పటికి 20,000 మంది మంత్రసానులకు ప్రత్యేక శిక్షణ నిప్పించ డంలో తోడ్పడింది. ఈ శిక్షణకు పిమ్మట ప్రతీ మంత్ర సానికీ ఉచితంగా ఉపకరణాలన్నీ వుండే ఒక కిట్ యివ్వబడుతుంది. థాయ్‌లెండ్ వచ్చేఏడు 2,000 మంది మంత్రసానులకు శిక్షణ నిప్పించడంలో సహాయం చెయ్యవలసినదిగా ఈ సంస్థను కోరింది. 1960 నాటికి 24,000 మంది మంత్రసానులకు ఈ ప్రత్యేక శిక్షణ నిప్పించడానికి ఇండియా సంకల్పించుకొని వుంది.

మలేరియా నిర్మూలనం :

పిల్లల ఆరోగ్యం విషయంలో తలిదండ్రులకు ఎప్పుడూ తాపత్రయం తప్పదుగదా. చీటికీ మాటికీ ఏదో జ్వరం వస్తూనే వుంటుంది. దీనిలో ఎక్కువగా వచ్చేది మలేరియా జ్వరం. ఆసియాలో 30 కోట్ల మంది ప్రజల లోను సగం మందికి పైగా మలేరియా జ్వరం రాకుండా రక్షణ లభిస్తోందని తెలుసుకొన్నప్పుడు నాకు చాలా సంతోషం కలిగింది. బర్మా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, సిలోన్‌లకు కూడా మిత్రరాజ్యసమితి శిశు సంరక్షణనిధి చేస్తున్న మలేరియాకృషి తోడ్పడుతూవుంది. ఈ కృషి ఫలితంగా సిలోన్‌లో మలేరియా పూర్తిగా మటుమాయ మై, గతఏడేళ్ళలోను అక్కడ శిశుమరణాల సంఖ్య సగా నికి తగ్గింది. నా కుటుంబానికి గాని, ఇరుగు పొరుగు కుటుంబాలకు గాని మలేరియా జ్వరం సోకకుండా తగు రక్షణ లభించేవరకూ నాకు స్థిమితం వుండదు.

క్షయనిరోధం :

ఒకవేళ బ్యాంగ్‌కాక్ వంటి నగరంలో నేను, నా కుటుంబం ఒక గదిలో నివసిస్తూ వుంటే వారికి క్షయ వ్యాధిసోకకుండా జాగ్రత్త పడవలసి వుంది, ఆసియాలో క్షయవ్యాధి నిర్మూలనకు మిత్రరాజ్య సమితి శిశుసంరక్షణ నిధి విస్తృత కార్యక్రమాన్ని నిర్ణయించు కొనివుంది. ఈ సంవత్సరం జూన్‌నెలవరకు ఆసియాలో 1,28,00,000 మంది పిల్లలకు, పరీక్షించ బడిన పిమ్మట, టీకాలువేశారు. దీనివల్ల సమగ్రరక్షణ కలగక పోయినప్పటికీ పిల్లలలో ఈ వ్యాధి సంభవించే కేసులసంఖ్య నూటికి 50 నుంచి 75 వరకు తగ్గిపోయింది. దీనికయ్యే వ్యయం చాలా తక్కువ. ఇండియాలో పిల్లలను పరీక్షించడానికి కేసుకు మూడు సెంట్లు అవుతుంది. అందులో ఒకసెంటు శిశు సంరక్షణనిధే భరిస్తుంది, థాయ్‌లెండ్‌లో 60 లక్షలమంది పిల్లలు పరీక్షించ బడ్డారు. 22,50,000 మందికి టీకాలు వేశారు. పరీక్ష చెయ్యబడిన ఆరుకోట్ల మందిలోను నా పిల్లలు కూడా వుండాలనే నేను అభిలషిస్తాను.

ట్రకోమా కంటివ్యాధి :

పిల్లలు తమ కళ్లు బాధగావున్నాయని చెబితే ఒకవేళ వారు ట్రకోమా అనే కంటిజబ్బుకు గురికాలేదు గదా అనే సంగతి చూస్తాను. తైవాన్ (ఫార్మోజా) లోని స్కూలు పిల్లలలో సగంమంది ట్రకోమాతో బాధపడు తున్నారు.

ఇండోనీసియాలో 32,000 మంది పరీక్షించబడ్డారు. జావాలోకూడా యింతమందికి ఈ కంటిజబ్బున్నట్లు తేట పడ్డది. మిత్రరాజ్య సమితి శిశుసంరక్షణనిధి ఈ నేత్ర వ్యాధుల విషయంలో చికిత్సకు ఏర్పాట్లను యిప్పుడిప్పుడే చేస్తూవుంది. తైవాన్‌లో 20 లక్షలమంది పిల్లలు పరీ క్షించ బడినారు, అవసరమైన చికిత్సలు చెయ్యబడినవి. ఇండోనీసియాలో చికిత్సా కార్యక్రమం యిప్పుడే ప్రారంభమౌతూవుంది. ఆసియాలోని కొన్ని దేశాలలో

లుకోమా కంటి జబ్బుకు చికిత్స జరిపించడం ముఖ్య మైన సమస్య అవుతున్నది. నా బిడ్డలు పెద్దవారైనపుడు ఏ విధమైన దృష్టిలోపం లేకుండా నేను ముందుగానే జాగ్రత పడతాను.

మహావ్యాధి :

ఆ తర్వాత అన్నిటికంటె భయంకరమైన జబ్బు మరొకటున్నది. అది కుష్ఠువ్యాధి. కుష్ఠువ్యాధి క్షయకంటె చాలా తక్కువ అంటు వ్యాధి అని వైద్యులు చెబుతారు గతకొలది సంవత్సరాలలోను కుష్ఠువ్యాధి సల్ఫోన్స్‌ద్వారా నివారణకు సాధ్యపడుతున్నట్లు కనుగొన బడింది. ఈ చికిత్సకు కొన్ని సంవత్సరాలు పట్టుతుంది కాని ఉపయో గించే మాత్రలకు కేసుకు ఒకడాలరు కంటె ఎక్కువ ఖర్చుకాదు. ఈ మాత్రలను క్రమం విడువకుండా సరి యైన సమయాలలో రోగులకు ఎలా యివ్వడమా అనేదే పెద్ద సమస్య. ఇవి ఇంజెక్షన్ ద్వారా ప్రయోగించవచ్చు. ఈ ఇంజెక్షనులు కొంచెం బాధనే కలిగిస్తాయి. రోగి తాను సరియైన చికిత్స పొందుతున్నట్లు గ్రహించ గలుగు తాడు.

ఈ వ్యాధి చిన్నతనంలోనే వ్యాపించేటట్లు కనిపిస్తుంది ఈ వ్యాధికి లక్షణం ముందు శరీరంమీద మచ్చలు బయలు దేరతాయి, నా బిడ్డలు ఇటువంటి లక్షణాలు ఏమీ లేకుండా వున్నారోలేదో రుజువుచేసుకొనడంకోసం అప్పుడప్పుడు వారిని వైద్యపరీక్ష చేయిస్తాను. వైద్యుడు కనక అటువంటి మచ్చలున్నాయని కనక చెబితే వెంటనే తగుచికిత్సకు ఏర్పాట్లు చేస్తాను.

మిత్రరాజ్య సమితి ఏర్పాటు చేసిన ఈ శిశు సంరక్షక నిధి కొత్తసంస్థ. చాలా మందికి యిప్పటికి దీనిపేరు దీని లక్ష్యం. యిది చేస్తున్న కృషి తెలియవు. ఈ సంస్థ వ్యయానికి సాలుకు 50, లేక 60 లక్షలడాలర్లు మాత్రమే మొత్తంమీద ఆసియాకు కేటాయించ బడుతూవుంది. ఆఫ్ఘనిస్థాన్‌నుంచి సామోవావరకు గల ప్రతి దేశంలోను ఎంతోకొంతగా 125 ప్రాజెక్టులపై ఈ ధనం వినియో గించ బడవలసి వుంది.

ఈ సంస్థకు 72 దేశాలనుంచి విరాళాలు లభిస్తాయి. డి. డి. టి. పెన్సిలిన్. వంటి ఘనమైన మందులద్వారా అపూర్వమైన ఫలితాలు సాధించ బడుతున్నాయి. ఈ రాళాలలో నూరింట 90 వంతుల ద్రవ్యం ప్రభుత్వాలవి నుంచి, మిగిలినది వ్యక్తులనుంచి. క్రిస్మసు కార్డులఅమ్మకం నుంచి డానీకేయీ ఫిల్ములనుంచి సమకూర్చ బడుతుంది. అన్నిదేశాలు థాయ్‌లెండ్ వలెనే వితరణ చూపితే ఈ సమస్య అతి సులభంగా పరిష్కారం అవుతుంది. థాయ్‌లెండ్ సాలుకు 3,000 టన్నుల బియ్యం వంతున గత ఆరు సంవత్సరాలనుంచి యిస్తున్నది. ఈ అంకెల మాట వివరాలమాట ఎలా వున్నప్పటికీ నా బిడ్డలకు, కుటుంబానికి కొంత సహాయం లభించడమే నాకు ముఖ్యం. నామట్టుకునేను ఏ బావులు త్రవ్వడంలోనో, కాలువలు త్రవ్వడంలోనో, వారానికి కిష్టే ఒకడాలరూ యాభై అరుసెంట్ల వేతనములోను ఏమీఖర్చుపెట్ట వలసిన అవసరంలేని పద్ధతిని నాకుతోచినంత సహాయం చేస్తూనే వుంటాను,





భారత మహిళా ఉద్యోగినులు

యుద్ధశాఖలలోతప్ప తక్కిన ప్రభుత్వ కార్యాలయములన్నింటిలోనూ, స్త్రీలకు ఉద్యోగార్హతగలదని స్వతంత్ర భారతరాజ్యాంగం ప్రకటించింది. వైదేశికవ్యవహారాలలోనూ, డిప్లొమేటిక్ శాఖలలోనూకూడ స్త్రీ లనేకులు కడుసమర్థతతో కార్యభారమును నిర్వహించుచున్నారు. స్వాతంత్ర్యసిద్ధిఅయిన తక్షణం ఒక్క స్త్రీ గవర్నరుపదవి అలంకరించినది. వేరొక వనిత విదేశాలలో భారత రాయబారియై వినుతికెక్కినది. మరొక నారి కేంద్రప్రభుత్వమున ఆరోగ్యశాఖా మంత్రియైనది. దేశ సౌభాగ్యకారకమైన ప్రథమ పంచవర్ష ప్రణాళిక నిర్మాతలు అయిదుగురిలో ఒకరు మహిళ. పరిపాలనా దక్షతలో స్త్రీలు పురుషులకు తీసిపోరని చెప్పుట అతిశయోక్తికాదు.



భారత మహిళా ఉద్యోగినులు

వృత్తులన్నిటిలో రోగులసేవ సర్వోత్కృష్టమైనది. ఇందులకు స్త్రీ సహజవాత్సల్యము తగినదని ప్రశంసగన్నది. దేశారోగ్యసౌష్ఠవం మంత్రసాని, దాదుల నిస్స్వార్థసేవమీదనే ఆధారపడిఉన్నది.

ఇండియాకు కనీసం, 7 లక్షలమంది నర్సులూ, 87,500 మంది మంత్రసానులూ అవసరమని భోర్ కమిటీవారు శిఫార్సుచేశారు. దేశం మొత్తంమీద 1952 సం॥లో, 17,683 నర్సులూ, 20,531 రు మంత్రసానులు మాత్రమేకలరు. ఈలోటును భర్తీచేయుటకు కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ నర్సులకు, మంత్రసానులకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయుచున్నది.



భారత మహిళా ఉద్యోగినులు

వేలాది గృహాలలోఉన్న అసంఖ్యాకులైన ప్రజలను స్త్రీ తన కోకిల కంఠంతో ముగ్ధులను చేస్తూంది. సంగీతమేకాదు- ప్రకటనలూ, వార్తలూ ప్రసారముచేయుటకు స్త్రీ సర్వవిధములా తగిఉన్నది.



భారత మహిళా ఉద్యోగినులు

మగనర్సూ, మగ టెలిఫోను ఆపరేటరు! లోకానికి భీతి కల్గదా? అపరిచితులనూ, పరిచితులైన మిత్రులనూ సంధానపరచుటకు మృదు మధురమైన స్త్రీ కంఠస్వరం శక్తివంతమైనది. పరిశ్రమలకూ, వాణిజ్యానికీ, సంభాషణలకూ టెలిఫోను ఆపరేటర్ ప్రముఖపాత్ర వహిస్తూంది. ఆమె వల్ల మనం సన్నిహితుల మౌతున్నాం.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో యువకులకు శిక్షణ

ఢిల్లీ జమియామిల్లియా కేంద్రం

గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభావంతులైన యువకుల తెలివితేటలు నిరర్థకమవడానికి కారణమైన విషచక్రాన్ని విచ్ఛేదించడానికై ఇండియాలో పది గ్రామీణ ఉన్నత విద్యా కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నం జరిగింది.

ఈ కేంద్రాలలో మొదటిది ఢిల్లీలో నెలకొల్పబడింది. 55 మంది విద్యార్థులుగల మొదటి జట్టుతో ఈ శిక్షణ కేంద్రం ఆగస్టు నెలలో జమియామిల్లియావద్ద ప్రారంభించబడింది. ఈజట్టులో యువతులూ యువకులూ కూడా వున్నారు. వీరు పంజాబ్, పెప్సూ, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీలనుంచి వచ్చినవారు.

ఇప్పుడున్న ఉన్నత విద్యాలయాలు పెక్కు నగర ప్రాంతాలలోనే వున్నవి. గ్రామప్రాంతాలలో సౌకర్యాలు తక్కువైనందున గ్రామస్థులలో ప్రతిభ సమర్థత కలవారు పట్టణాలలో నివసించడానికే ఎన్నుకొనడంతో ఆప్రాంతాల పరిస్థితి మరింత అధ్వాన్నమయింది. అవసరమైన సౌకర్యాలు సమకూర్చవలసిన ఆవశ్యకత మరింత దుర్ఘటమైంది.

గ్రామప్రాంతాలలో విద్యాభివృద్ధి :

అయితే దేశం జనాభాలో ఎక్కువ భాగం 5,50,000 కు మించిన గ్రామాలలోనే నివసిస్తున్నందున మన విద్యాభివృద్ధిప్రణాళికలు గ్రామ ప్రాంతాలలో ఉన్నత విద్యాభివృద్ధికి సౌకర్యాలు సమకూర్చబడదగు విధంగా విస్తరించబడడం అవసరమైంది. ఈ ఆవశ్యకత యిటీవలనే గుర్తించబడింది. 1949లో యూనివర్శిటీ ఎడ్యుకేషన్ కమిటీ చేసిన సిఫారసులలో యిది ఒకటి. ఇదే విధంగా 1953లో మొదలియార్ కమిషన్ కూడా సిఫారసు చేసింది.

గ్రామీణ ఉన్నత విద్యాసంఘం :

ఈ సిఫారసులకు తగినట్లే సంఘసేవకులు, గ్రామీణ సంక్షేమసంఘాలు కూడా గ్రామ ప్రాంతాలలో విద్యాభివృద్ధి పట్ల ఎక్కువ శ్రద్ధాసక్తులు చూపడం ఫలితంగా 1954లో గ్రామీణ ప్రాంతాల ఉన్నత విద్యా సంఘం నియమించబడింది. ఈ సంఘం ఉన్నత విద్యా సంస్థలకు, గ్రామ ప్రాంతాలలో ఉన్నత విద్యా సౌకర్యాలు సమకూర్చడానికి గల అవకాశాలను, అవసరాన్ని సమగ్రంగా పరిశీలించి దేశంలోనే వేర్వేరు ప్రాంతాలలో ఉన్నత విద్యా బోధనకు ముందు పది గ్రామీణ ఉన్నత విద్యాలయాలను స్థాపించాలని సిఫారసు చేసింది.

నేషనల్ కౌన్సిల్ :

ఈ సిఫారసు ఫలితంగా గ్రామప్రాంతాలలో ఉన్నత విద్యాభివృద్ధి సాధనకు నేషనల్ కౌన్సిల్ ఏర్పాటు చెయ్యబడింది. గ్రామ ప్రాంతాలలో ఉన్నత విద్యాభివృద్ధికి సంబంధించిన అన్ని సమస్యలపైన ఇండియా ప్రభుత్వానికి తగు సలహాలనిచ్చే నిమిత్తం ఈ కౌన్సిల్‌కు కేంద్రప్రభుత్వ విద్యాశాఖ ఉపమంత్రి అధ్యక్షులుగా ఎన్నుకోబడినారు. 1956 ఆగస్టుమాస మధ్యంనాటికి పది గ్రామీణ విద్యాలయాలు నెలకొన్నాయి. అవి శ్రీనికేతన్ ఉదయపూర్, మధురై ముజాఫర్పూర్, సనూసర్, (సౌరాష్ట్ర) అమరావతి, కొల్హాపూర్, జమియామిల్లియా (ఢిల్లి)ల వద్ద ప్రారంభించబడ్డాయి.

శిక్షణ పథకం :

ఈ విద్యాలయాలలో మూడు శిక్షణ విధానాలకు సిలబస్ రూపొందించబడింది. మొదటిది: గ్రామీణ సేవలో మూడేళ్ళ డిప్లొమా కోర్సు, రెండవది: వ్యవసాయ, ఇంజనీరింగ్ శాస్త్రాలలో రెండేళ్ళ సర్టిఫికెట్ కోర్సు సివిల్, రూరల్ ఇంజనీరింగ్‌లలో మూడేళ్ళ సర్టిఫికెట్ కోర్సులు రూపొందించబడ్డాయి. ఇవి అప్రువు చెయ్యబడ్డాయికూడా. బీదవిద్యార్థులకోసం ఒక స్కాలర్‌షిప్

పథకం ఏర్పాటు చెయ్యడాన్ని గురించికూడా యోచించబడుతూంది.

ఉదాహరణకు, జమియామిల్లియావద్ద ఏర్పాటు చెయ్యబడిన విద్యాలయంలో క్రిందటినెలలోనే గ్రామ ప్రాంతాలకు సంబంధించిన మూడేళ్ళ డిప్లొమాకోర్సు మొదటి సెషన్ ప్రారంభించబడింది. ఈశాఖలో నాగరికత, చరిత్ర, గ్రామీణ ఆర్థిక, సాంఘిక, వ్యావసాయక, ఇంజనీరింగు ఆరోగ్య పారిశుధ్య సమస్యలు, సహకారం గృహనిర్వాహక శాస్త్రాలు, గ్రామీణ పరిశ్రమలు, లలితకళలుకూడా మామూలు ఉన్నత విద్యాభ్యాసంలోని అంశాలతోపాటు బోధించబడతాయి.

వ్యవసాయ శాస్త్రాలకు సంబధించిన రెండేళ్ళ సర్టిఫికెట్ కోర్సులు గ్రామప్రాంతాలకు ఆసక్తి కలిగించి గ్రామీణ పరిశ్రమలు, తోటలపెంపు, పశుపోషణ, పాడి సమస్యలు బోధిస్తారు. సివిల్, రూరల్, ఇంజనీరింగ్ తరగతులకు చెందిన మూడేళ్ళ సర్టిఫికెట్ కోర్సుక్రింద వర్కుషాపులో వడ్రంగి, ఫిటింగులు, కమ్మరం, రోడ్లు, వంతెనల నిర్మాణం, ప్రజారోగ్యం, ఇరిగేషన్, అప్లయిడ్ మెకానిక్సు మున్నగునవి బోధిస్తారు.

ఈ విద్యాలయాలు, దురదృష్టంకొలదీ మనదేశంలో సంస్కృతికి, కాయకష్టానికీ, మానవస్వభావానికి, శిల్పాది విద్యలకు, అవాస్తవికతకు, వాస్తవికతకు మధ్య ఏర్పడిన అవధులను తొలగించడానికి కూడా తోడ్పడతాయి. గ్రామీణ జీవిత సమస్యలను ఏవిధంగా గ్రహించి, వాటి పరిష్కారానికి కృషి చెయ్యవలసినదికూడా విద్యార్థులు తెలుసుకోగలుగుతారు.

మానసిక వికాసం :

ఉన్నత విద్యవలన కలిగే "మానసిక వికాసపు విలువలను" ఈ బోధనాక్రమం ఎంతమాత్రం తగ్గించబోదు. అయితే సృజనాత్మకమైన వేర్వేరు కార్యక్రమాలు, సాంఘికానుభూతులు, బుద్ధి వికాసానికి ఎక్కువగా దోహదమీయగలవనే సత్యాన్ని మాత్రం ఇది నిరూపిస్తుంది.

గ్రామీణ విద్యాసంస్థలు ఇంకా మరికొన్ని ప్రయోజనాలను కూడా సాధించగలవు. వాటిలో అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించిన పరిశోధనలు జరిపించడం, పైలట్ ప్రాజెక్టులను ప్రోత్సహించడం మొదలైనవి కలవు, ఈ గ్రామీణ సంస్థలను జలకోసం అభివృద్ధి ప్రణాళికలను నిర్ణయించే క్రేంద్రాలుగా రూపొందించడమే ప్రధానలక్ష్యం. ఇవి గ్రామ ప్రాంతాలలో ఉన్నత విద్యాలయాలుగా ఉపకరించడమేగాక, గ్రామీణ ప్రాంతాల ప్రజల సాంఘికసాంస్కృతికజీవిత పునరుజ్జీవనానికికూడా దోహదకారి కాగలవు.

కమ్యూనిటీ ప్రాజెక్టులు, జాతీయ వికాస కార్యక్రమాల నిర్వహణకు తరిఫీజునిచ్చే నిమిత్తం నెలకొల్పబడుతున్న సంస్థలతో కూడా ఇవి సన్నిహిత సహకారం పెంపొందించగలవు. ఇవి వేర్వేరు ప్రమాణాలలో అటువంటి శిక్షణకు కేంద్రాలుగా కావలసివుంది. గ్రామ కార్యకర్తలకు, యువజన నాయకులకు, ప్రజానాయకులకు సాంఘిక విద్యాశాఖాధికారులకు, కమ్యూనిటీ ప్రాజెక్టుల ఉద్యోగులకు శిక్షణనిచ్చే కేంద్రాలుగా యివి రూపొందాలి ఈ ఉద్యోగులకు తమ విధ్యుక్తధర్మ నిర్వహణలో ఎప్పుడు ఎట్టి సందేహాలు కలిగినా అవి తీర్చగల విజ్ఞాన కేంద్రాలుగా విలసిల్లాలి.



పిల్లల ఖర్చుకు డబ్బులు

శ్రీ షీలారామ్

పిల్లల చిల్లర ఖర్చులకు తలిదండ్రులు డబ్బులివ్వడం (పోకెట్ మనీ)విషయంలో అనేక చోట్ల భిన్నమార్గాలు, పరిస్థితులు, అభిప్రాయాలు ఏర్పడి వున్నాయి.

కొంత మంది తలిదండ్రులు తమ బిడ్డలకు వారి యిష్టానుసారంగా ఖర్చు పెట్టుకొన డానికి ఎప్పుడూ డబ్బులివ్వరు. దీనితో డబ్బు విలువ తెలుసు కొనడానికి, వితరణ నలవరుచు కొనడానికి బిడ్డలకు గల అవకాశాలు పరిమితమై పోతూవుంటాయి. అటువంటి పిల్లలు ఏ పని అయినా చేయడానికి డబ్బు కావలసివస్తే దానిని సంపాదించు కొనడానికి యత్నిస్తారు అది సంభవమైతే చాలా మంచిదే. కాని సాధారణంగా పిల్లలు ఇంట్లో ఎక్కడైనా డబ్బులు కనిపిస్తే దొంగతనంగా వాటిని తీసుకుపోతారు. తక్కువ జీతాలున్న నౌకరులలో కూడా ఈ దుర్గుణం కనిపిస్తుంది.

కొందరు తలిదండ్రులు దీపావళి వంటి పండుగలకు పుట్టిన రోజుల నాడు పిల్లల ఖర్చుకు చిల్లర డబ్బులేవో యిస్తూవుంటారు. అయితే తరుచు ఆ బిడ్డలు భీష్మించుకు కూర్చుని తల్లిదగ్గరో తండ్రి దగ్గరో మారాంపెట్టి, హర్తాళ్ గాని, సత్యాగ్రహం కాని చేసినపుడే ఆ డబ్బులివ్వడం జరుగుతూ వుంటుంది. అటువంటప్పుడు ఇంట్లో శాంతి నెలకొల్ప కొనడానికే తల్లి గాని తండ్రి గాని బిడ్డలకు బహుమానమో, లంచమో యివ్వడం జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో నిజంగా ఏ అల్లరీ చెయ్యకుండా బుద్ధిగా వుండే బిడ్డకు ఏమీ దక్కకపోవడం, మహా కల్లోలం చేసే బిడ్డకు డబ్బులు ముట్టడం సంభవిస్తూ వుంటుంది.

ఇలాగాక కొందరు తలిదండ్రులు తమ బిడ్డలకు ప్రతీ వారంగాని నెల కొకసారిగాని ఏదో ఒక రోజు నియమము పెట్టుకొని చిల్లర ఖర్చుల నిమిత్తం డబ్బు యిస్తూవుంటారు. అలా ఇచ్చేమొత్తం తండ్రి ఆర్థిక పరిస్థితిని బట్టి స్తోమతను బట్టి రకరకాలుగా వుంటుంది.

ఇండియాలో చాలా మంది తలిదండ్రులు తమ బిడ్డలకు చిల్లర ఖర్చుల నిమిత్తం నెలకు నాలుగణాలైనా యివ్వలేని వారున్నారు-కొందరు దానికంటె కొంచెం ఎక్కువగానే ఇస్తారు. ఎంత యిచ్చినా ఒక క్రమంతప్పకుండా యివ్వడమే ముఖ్యం. ఇది పెక్కుచోట్ల సంభవం కాక పోవడానికి కారణాలు కాక పోలేదు. ఎలిమెంటరీ స్కూళ్ల నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఉపాధ్యాయుల పరిస్థితిని చూడండి. వారి జీతాలు నెలనెలా ఒక క్రమాన్ని బట్టి ముట్టవు. దీని వల్ల వారి జీవితావసరాలు తీరడానికే చిక్కుగా వుంటుంది.

"పిల్లలకు ఖర్చు పెట్టుకోడానికి డబ్బివ్వడమెందుకూ?" అని కొందరు ప్రశ్నిస్తూ వుంటారు. విదేశాలలోని పిల్లల జీవిత పరిస్థితుల్ని-మన దేశంలోని పిల్లల పరిస్థితుల్ని గమనించి చూడండి. కొంత మంది పిల్లలు తమకివ్వబడే డబ్బు అంతా తిను బండారాలకు ఖర్చు పెట్టేస్తూ వుంటారు. అటువంటి బిడ్డలకు మామూలుగా సంతుష్టిగా భోజనం పెట్టినప్పటికీ వారి పెంపుకు కావలసిన పోషక పదార్థాలు ఆ ఆహార పదార్థాలలో వుండక పోవచ్చు. ఇటువంటి బిడ్డలకు జున్నో ఉర్లగడ్డతోనో, బఠాణీలతోనో, కాచిన పాలో యిచ్చినపుడు వారు వాటిని ఎక్కువగా ఆరగించ గోరితే, వారుతినే ఆహారంలో ఏదో ఒక లోపం వుందనే సంగతి రూఢి అవుతుంది. లేదా పిల్లలకు పండ్లు యివ్వండి. అందులో సి. విటమిన్ వుంటుంది. సి. విటమిన్ తక్కువైనపుడే తీపి పదార్థాలపై పిల్లలకు ఎక్కువ కోరిక కలుగుతుంది.

కొంత మంది పిల్లలకు తమ అలంకారాల కోసం రిబ్బన్లు, తలనూనెలు మొదలైనవాటి కోసం తలిదండ్రులు తమ ఖర్చుకిచ్చే డబ్బులు వినియోగిస్తూ వుంటారు. సౌందర్యం పట్ల, అలంకరణ పట్ల వారికి మోజు వుండడం వల్లనే యివి కొనుక్కునే కోరిక కలిగినప్పటికీ సరియైన విద్యలేక పోవడం వల్ల సువాసన ద్రవ్యాలను ఎన్నుకో

వడంలో పొరపడుతూ వుంటారు. కొందరు మరీ ఎక్కువ ఖరీదైన సువాసన ద్రవ్యాలను ఉపయోగిస్తారు. అందంపైన, అలంకారాలపైన పిల్లల మోజు తీరడానికి దుస్తుల విషయంలోనేమి, యితర వస్తువుల విషయంలోనేమి తమ అభిరుచికి తగినట్లుగా ఎన్నుకొనే అవకాశాన్ని తలిదండ్రులు బిడ్డలకివ్వవచ్చు. తల నూనెలు, సెంట్లు మొదలైన సువాసన ద్రవ్యాలను బిడ్డలు యింటిలో స్వయంగా తయారు చేసుకొనడానికి కూడా తలిదండ్రులు అనుమతించ వచ్చు.

చినిగి పోతే కుట్టడానికి, ఉతకడానికి వీలుకాని ఖరీదైన ఉడుపులకంటె తేలికగా, కుట్టడానికి వీలుగా, వుండే దుస్తులు ధరించడమే అందాన్ని యినుమడింప జేయగలదని తలిదండ్రులు బిడ్డలకు నచ్చచెప్పాలి. ఎక్కువగా చిరుతిళ్లు తినడానికి, అలంకారాలు, ఖరీదైన ఉడుపులూ ధరించడానికి అలవాటు పడిన పిల్లలు, మోజున్న పిల్లలు తమకు తలిదండ్రులు చిల్లర ఖర్చుకిచ్చే డబ్బును వాడుకొని, ఇంకా ఎక్కువగా కావాలని అడుగుతూ వుంటారు.

ఇటువంటి వాటినే గాక పుస్తకాల కోసం, తమ మిత్రులకు యిచ్చేకానుకల నిమిత్తం, దానధర్మాల కోసం తమకు తలిదండ్రులిచ్చే డబ్బును వినియోగించుకొనే పిల్లలు కూడా వున్నారు. తమ కివ్వబడే డబ్బును సరియైన ఉత్తమ లక్ష్యానికి వినియోగిస్తున్న పిల్లలు వీరు. తలిదండ్రులు బిడ్డలకు ఈ విధంగా తమ చిల్లర ఖర్చులకు డబ్బునిచ్చేటప్పుడు ఒక చిన్న ఎకౌంటు పుస్తకం, పెన్సిల్ కూడా ఇవ్వడం మంచిది. దీనివల్ల వారు తమ డబ్బును ఏయే బాపతుల క్రింద ఎంతెంత వినియోగించు కోవాలని ఆలోచించుకొంటూ దేనికిఎంత ఖర్చుపెట్టాలో ఒక బడ్జెట్ తయారు చేసుకొనడానికి అవకాశం వుంటుంది. అయితే తలిదండ్రులు పిల్లలు కోరి తమ లెఖలు సరిగా వున్నాయో లేదో చూడమని కోరితే తప్ప తలిదండ్రులు ఆ ఎకౌంటు పుస్తకం జోలికే పోరాదు.

ఈ విధంగా చెయ్యడం వల్ల పిల్లలు నాణ్యమైన వస్తు సామగ్రిని, దేని నెంతకు కొనేదీ తెలుసుకొని, ఆ ఖర్చును లెఖవేసుకొనే అలవాటు పెంపొందుతుంది. నిర్మాణాత్మకము, ఉపయోగకరమూ అయిన అలవాట్లను పెంపొందించు కొనడానికి కూడా ఈ పైకం (పోకెట్ మనీ) వినియోగ పడుతుంది. నేను ఎరుగున్న ఒక బాలునికి ప్రకృతి దృశ్యాలను చిత్రించడం ఒక అభిమతం. అయితే తాను అందుకు యత్నిస్తే అంతా చూసి నవ్వుతారేమో అని భయపడ్డాడు. తలిదండ్రులను రంగుల కోసం, కాగితాల కోసం కావలసిన డబ్బును ఈ కారణం చేతనే అడగలేక పోయాడు. నిజంగా ఆ బాలునికే కనక క్రమంతప్పకుండా చిల్లర ఖర్చు కోసం తలిదండ్రులు డబ్బు యిచ్చివుంటే ఈ రంగులు, ఉపకరణాలు సేకరించుకొని రహస్యంగా ప్రాక్టీసుచేసి, ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు చిత్రలేఖనాన్నే జీవనోపాధిగా పరిగ్రహించినపుడు బంధువులను ఆశ్చర్యచకితులను కావించినట్లే ముందుగానే చిత్ర కళలో విశిష్టతను సమకూర్చుకొని వుండేవాడు. ఒక బాలిక ఏడవఏట రెండు రూపాయలతో ప్రారంభమైన (పోకెట్ మనీ) పదహారవఏట 10 రూపాయల వరకు హెచ్చిన సందర్భంలో దాచుకొన్న డబ్బులు 12 వ ఏట ఎన్‌సైక్లోపిడియాలు, ఇతరము లైన ఉత్తమ గ్రంథాలు తనకు నిత్యోపయోగానికి కావలసిన టాయిలెట్ సామగ్రి కుట్టుపనిఉపకరణాలు మొదలైన వాటితోపాటు కొనుక్కొంది, చేతిపని ద్వారా ఆమె కుట్టిన ఉడుపులు ఎన్నో పిల్లలకిచ్చింది, ఎన్నో వస్తువులను యితరులకు బహూకరించింది.

బిడ్డల శారీరక, మానసిక వికాసాన్ని పెంపొందించే పద్ధతి నిజంగా విద్యవలెనే ప్రబోధాత్మకమైనది. పాఠశాలలలో బోధన విద్యలో ఒక భాగం మాత్రమే- వ్యక్తిత్వాన్ని పువ్వువలె వికసింప జేయడం కూడా విద్యలో ఒక లక్ష్యమే. ఈ లక్ష్యసాధనకు పాఠశాలలలో చెప్పే విద్య కొంత వరకు తోడ్పడితే, చిల్లర ఖర్చులకు డబ్బిచ్చే పద్ధతి పిల్లలకు అనుభవం సేకరించు కొనడంలో తోడ్పడుతుంది.

కాబట్టి తలిదండ్రులు సాధ్యమైనంత వరకు ఒక క్రమపద్ధతిలో తమ బిడ్డలకు చిల్లర ఖర్చులనిమిత్తం డబ్బుయిస్తూ వుండడమనేది తిండి పెట్టడం, బట్టలు తొడగడం ఎంత ముఖ్యమైనవో అంత ముఖ్యమైనదీ నని చెప్ప వచ్చు.

ప్రభుత్వ కార్యాలయాలలోను, యితర సంస్థలలోను పని చేసే యువతులకు హాస్టలు సౌకర్యాలు అత్యవసరం. కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ సహాయంతో బ్రిటన్ లోవలె మన దేశంలో గూడ యిట్టి హాస్టల్సు నిర్మింపబడుతున్నాయి.

ఇంగ్లండులో యువతులకు హాస్టల్సు

శ్రీమతి పద్మినీ సేన్ గుప్త

విక్టోరియా ఈటన్ స్క్వేర్ లో పనిచేసుకొనే యువతులకోసం స్థాపింపబడిన లండన్ కౌంటి కౌన్సిల్ హాస్టల్ ని నేను చూడడం తటస్థించినప్పుడు నా కాశ్చర్యం కలిగించినది. యీ పెద్దపట్టణంలో పనిచేసుకునే చాలా మంది బ్రిటిష్ యువతులూ, యితరదేశాలనుంచి వృత్తి నేదైనా నేర్చుకుందుకనీ, చదువుకుందుకనీ వచ్చిన యితర యువతులూ అందరూ కలసి మెలసి ఒక పెద్ద కుటుంబం లాగా వున్నారు. అప్పుడప్పుడే స్కూళ్ళను వదలీ కాలేజీలను వదలీ ఏదోఒక ఉద్యోగంలో ప్రవేశించిన యువతులకి తగిన వసతి అత్యవసరం. తరచుగా పల్లెటి ప్రాంతాలను వదలి యీ మహాపట్టణంలో యిల్లు వంటి దాన్ని ఏర్పరచుకోవలసిన అవసరం ఎందరెందరో యువతులకి వుంటుంది. వీరు తల్లినీ తండ్రినీ నాఅన్న వారినీ వదలి వస్తారు. ఇటువంటివారు మంచి పద్ధతులపై నడుపబడుతూ రక్షణ యివ్వకల్గిన వసతి గృహాలలో వుండడం, చిన్న చిన్న గదులలోనూ, బోర్డింగులలోనూ వుండడంకంటే అన్నివిధాలా ఉత్తమం. ఉన్న కొన్ని నిబంధనలూ మంచివిగానే తోచాయినాకు. ఉదాహరణకి- ఒక నిర్ణీత కాలానికి అందరూ వసతిగృహంలోవుండి తీరాలన్నదీ [illegible]



రావడానికి పర్మిషన్ వున్నవారు సహితం అర్థరాత్రికి ముందుగానే వచ్చి తీరాలన్నదీ సదుద్దేశంతో ఏర్పరుపబడ్డ నిబంధనలు.

ఈటన్ స్క్వేర్ లోని యీ ఎల్. సి. సి. హాస్టల్లో సాధారణ హాస్టళ్ళలో వుండే వాతావరణమే కన్పించలేదు నాకు. సరికదా, ఇదొక చక్కని యింటిలాగా, సూపర్ వైజింగ్ అధికారి మాతృస్థానాన్ని ఆక్రమించుకున్న వ్యక్తి లాగ తోచింది. ఎప్పటికేనా నా కుమార్తె కనుక యీపట్టణంలో ఎక్కువకాలం ఉండవలసివస్తే యిటువంటి హాస్టల్ లోనే వుంచుతాను అనుకున్నా. ఉదయపు భోజనం మధ్యాహ్నపు భోజనం, పడక వసతులూ అన్నీకలసి తగుమాత్రపు కర్చులోనే సమకూర్చ బడుతున్నాయని చెప్పారు. సంపాదించుకొనే యువతి సంపాదనలో సులభంగా సరిపడే కర్చుయిది.

నే వెళ్లీ వెళ్లగానే, సూపర్ వైజింగ్ అధికారి నన్ను ఆహ్వానిస్తూనే వేడిటీ యిచ్చారు. ఆ చలిలో తేమగా ఉన్న ఆ ఉదయంపూట యింతకు మించిన ఆదరణ నాకు వేరొకటి వుండి వుండదు. తరవాత వసతి గృహం అంతా [illegible]

ప్రస్తుతం వుంటున్నారు. ముగ్గురు మొదలు ఆరుగురి దాకా ఒక్కొక్క గదిని పంచుకుంటున్నారు. ప్రతి గదిలోనూ కూడా వ్యక్తిగత చిహ్నాలను చాటే వస్తువులు కన్పిస్తూనే వున్నాయి. చాలా మంది యువతులు తమ పడకల తల దిక్కుగా మత సంబంధమైన బొమ్మలు తగిలించారు. కొందరు సినిమా తారల బొమ్మలు పెట్టుకున్నారు. యింకొందరు అన్ని బొమ్మలు బాగున్నవి పెట్టుకున్నారు. పడక గదులు చూసిన తరువాత వెళ్లి భోజన శాల చూశాను. భోజనాని కని అన్నీ సంసిద్ధం చేసి అట్టే పెట్టారు. అంతా అతి శుభ్రంగా వుంది. ప్రతి యువతి ప్రత్యేక స్థలం. అక్కడే కుర్చీకి వున్న సంచీలో ఆమె చేతి తువ్వాలు పెట్టి వుంది. నాకు తెలియ చెప్పిన భోజన పదార్థాలను పట్టి చూస్తే-యిక్కడ యివ్వబడే ఆహారం సమృద్ధిగానూ, ఆరోగ్యవంతంగానూ, యున్నట్టే తోచింది. అందరూ కూర్చునే కామన్ గదీ, చదువుకొనే గదీ కూడా వెచ్చగానూ, సుఖంగానూ, కూడ వున్నాయి. చదువుకొనే గదిలో ముగ్గురు స్పెయిన్ యువతులు కన్పించారు. వారు చాలా తీక్షణంగా చదువు కుంటున్నారు. పని రోజునాడు నాలుగ్గంటల వేళ వీరు విశ్రాంతిగా వుండడం చూసి అడిగాను, వీరు కూడా లండన్‌లో పని చేస్తున్నారా? అని ఒక యువతి చెప్పింది యిక్కడికి యింగ్లీషు చదువు కొందుకు వచ్చాం అని ; ఈ ముగ్గురినీ కూడా ఇంగ్లీషు భాష చదువు కొందుకని యింగ్లాండు పంపించారని తెలుసుకున్నాను. ఇలాగే యితర భాష నేర్చు కొందుకని వచ్చిన యువతులని యిదివరలో ఒకసారి చూశాను జెనివాలో. జెనివాలో, ఏ జర్మనో ఇటాలియనో తప్ప తెలియని వాళ్లు వచ్చి కొద్ది మాసాలు వుండి ఫ్రెంచి భాష నేర్చుకు వెళ్లారు. యిలా విదేశ భాష నేర్చుకొందుకు యిలాంటి వసతి గృహాన్ని మించిన యింకో స్థలం వుండ దనుకున్నాను. ఎందరో పని చేసుకునే యువతులకి ఒక భాష కంటె హెచ్చు భాష కావలసిన అవసరం వుంది. అందులో ఖండాంతరాలలో కూడా యిలాంటి వసతి గృహాలు తప్పక కావాలి.

వంట శాలలో వంటా మెనీ ఆవిడకి సహాయం చేసే వారినీ చూశాను. పని ఎక్కువే అయినా అంతా ఎంతో ఉత్సాహ వంతంగా కన్పించారు. నేను ఎక్కడెక్కడికి వెళ్లినా అంతటా యిటువంటి ఉత్సాహ పూరితం అయిన వాతావరణమే ఎదురయింది. ఇలాంటి సహృదయతతో నిండిన పెద్దకుటుంబ వాతావరణం వంటిది పని చేసుకొనే యువతికి ఎంతేనా మేలు చేస్తుంది.

"యిక్కడ పనిచేసేందుకు చాలామంది ఉన్నారా?" అని అడిగాను. చాలా కొంచెంమందిమే వున్నాం. కాని హాయిగానే గడిపేస్తున్నాం- అవునా అంటూ పక్కన నేల తుడుస్తున్న మనిషిని ప్రశ్నించింది సూపర్ వైజర్. "అవునమ్మా," అంటూ సంతోషంగా వచ్చింది సమాధానం.

"ఎవరేనా ఇండియన్ యువతులు యిక్కడ బసచేస్తున్నారా?" అని అడిగాను. "వున్నారు యిదుగో, సరిగ సమయానికి మిమ్మల్ని కలుసుకో గలిగారు" అంటూ అప్పుడే ఆఫీసులోకి వస్తున్న చక్కటి యువతులిద్దరికి నన్ను పరిచయం చేశారు. అందమైన చీరలు ధరించివీరు ఉత్సాహంగా వున్నారు. నన్ను కలుసుకున్నందుకు చాలా సంతోష పడ్డట్టు కన్పించారు. వీరు ఈస్ట్ ఆఫ్రికా నుంచి వచ్చిన భారతీయులు. మీరుకూడ యిక్కడ పని చేస్తున్నారా అని అడిగాను. లేదు ఇక్కడ బట్టలు కుట్టడంలో తర్ఫీదు పొందుతున్నాం ; అన్నారు. అయితే ఈస్ట్ ఆఫ్రికా వెళ్ళిపోయాక అక్కడ పనిచేస్తారా? అని అడిగాను. అవును. మేం బట్టలు కుట్టే కొట్టు నొకదాన్ని ప్రారంభిస్తాం అన్నారు.

నిజానికి నాకెంతో గర్వంగాతోచింది. ఇంకా యౌవన దశలో ఉన్న నాదేశపు మహిళలు ప్రపంచపు నలుమూలలా పయనించే ధైర్య సాహసోపేతలుగా వుండడం నిజంగా నాకెంతో గర్వం అనిపించింది. ఇక్కడఇంగ్లండులో వున్నంత కాలం యింత సంతోషంగా కాలంగడిచే వసతి గృహం వుండడం నా గర్వాన్ని రెట్టించింది. ఎల్. సి. సి నడిపిస్తున్న అనేక యితర సంస్థలకితోడుగా యిటువంటి వసతి గృహాలు ఉండడం మూలంగా పని చేసుకునే యువతుల భవిష్యత్తు చక్కబడిందనే చెప్ప వచ్చు. పనినుంచిఅలసివచ్చే యువతిరాకని ఎదురుచూస్తూ వేడివేడి భోజనం అందించే యిల్లువంటిది నిజంగాకోరుకో తగ్గది.

ఈటన్‌స్క్వేర్ వదలి బైటకి వచ్చేసరికి వర్షం తెగ కురుస్తూంది. సూపర్‌వైజింగ్ అధికారి నాకోరబ్బరు గుడ్డని బహులిచ్చింది. వర్షంలో తడవకుండా ఇటువంటి చిన్న సహాయాలు అంతర్జాతీయ స్నేహసౌహార్ద్రాలకి పునాదులంటే అతిశయోక్తి కాదు. నేను మాతృదేశానికి తిరిగివచ్చేస్తూన్నప్పుడు నా హృదయంలో యింగ్లాండు పట్లా రకరకాల ఉదారత ప్రదర్శించిన ఎల్. సి. సి. సంస్థలపట్లా ఆనందపూరితం అయిన వూహాలు నిండి వున్నాయి. ★



బొమ్మలాట

శ్రీ మహేశ్వర్ దయాళ్

నాగరికత ప్రారంభమైనప్పటినుంచి చారిత్రక ఘట్టాలనుగురించి తెలుసుకోవాలంటే బొమ్మలే చాలామట్టుకు అధారమౌతున్నాయి. రాతి యుగంనుంచి మానవజాతి బయటపడిన తర్వాత ముందు మతానికి, తరువాత వినోదానికి చిన్న చిన్న బొమ్మలే ఉపకరిస్తూ వచ్చాయి.

కీలు బొమ్మలని, తోలు బొమ్మలని నేడు మనం చూస్తున్న బొమ్మలాటలో ఉపయోగించబడే బొమ్మలు మానవ స్వరూపాల ప్రతిమలూ మానవులను అనుకరించే ప్రతిమలూ కావు. మానవుల గుణ దోషాలను వైవిధ్యాలను సూచించి తమ కదలికలద్వారా ప్రేక్షకులకు వినోదం గలిగిస్తాయి. ఈ బొమ్మలకు స్త్రీ పురుష భేదం లేదు. వాటి స్వేచ్ఛాచలనమే వింతగా తోస్తుంది. ఆ ఆటలో అవి అంతర్లీనమై పోయే పద్ధతిచూసి మనం ఎంతో అబ్బురపాటు పొందుతాము.

ఈ బొమ్మలు శిల్పానికి, కళా చాతుర్యానికి చిహ్నాలు. కళాకారుడు, లేక శిల్పి వీటిని హాస్యంగా, విచారకరంగా, వికృతంగా, రూపొందించ గలడు. మానవులకు ప్రతి రూపాలు కావు కనక వీటినిర్మాణంలో పరిమితులు ఏమీ లేవు. ఒక విధంగా ఇవి మానవాతీతమైనవని చెప్పవచ్చు.

ఇవి కీలు బొమ్మలు కనక వాటి చలనాన్ని బట్టి సజీవంగా కనిపిస్తాయి. వాటి ప్రదర్శనకు వారు వీరు అనే భేదం లేకుండా సైనికులు, రైతులు, పిల్లలు, పెద్దలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా ఉత్సుకతతో చూస్తారు. బొమ్మలాటను చూడవచ్చే ప్రేక్షకులలో మనం అన్ని తరహాల వారిని చూడగలం.

పిల్లలకు విద్యా వినోద సాధనం :

ఈ కీలు బొమ్మలు హాస్యం, వినోదం కలిగిస్తాయి. కనక స్కూలుకార్య క్రమాలకు ఎంతగానో ఉపకరిస్తాయి. భిన్న రంగాలలో సమర్థత, ప్రతిభ కల బాలురు, బాలికలు ఈ బొమ్మలాటలో పాల్గొనవచ్చు. ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా బాలబాలికలు వినోదించడమేగాక విజ్ఞానాన్ని కూడా సేకరించుకొనగలరు.

ప్రదేశాల్లలోని జీవన విధానాలను, చరిత్రలోని ప్రసిద్ధ ఘట్టాలను ఈ బొమ్మలాటతో అనుగుణంగా తయారుచేసి, ప్రదర్శించ వచ్చు. చదవడం, వ్రాయడం, పరిశుభ్రంగా వుండడం వంటి మంచి అలవాట్లవలన ఒనగూడే ప్రయోజనాలను చిన్న చిన్న నాటకాలుగా చిత్రించి

బొమ్మ లాటలతో ప్రదర్శించ వచ్చు. పిల్లల సృజనాత్మకమైనకళపట్ల ఆసక్తిని పెంపొందించడానికి, పరిశీలక శక్తిని హెచ్చించడానికి బొమ్మలాటలు ఏర్పాటుచేసి, వాటియెడల తమకు కలిగిన అభిప్రాయాలను చిత్రాలద్వారా, పెయింటింగులద్వారా వ్యక్తీకరించవలసినదిగా ప్రోత్సహించి పెంపొందించ వచ్చు.

బాల భటుల శిబిరాలలోనేమి, సాంఘిక కేంద్రాలలోనేమి వినోదం కలిగించడానికి యివి మిక్కిలి ఉపయుక్తమైనవి.

సంఘ పునరావాస కల్పన :

మంచి కాలక్షేపం కలిగించడమేగాక బాల నేరస్తుల సంరక్షణకు యిది ఎక్కువగా ఉపకరిస్తుంది. మనదేశంలో బొమ్మలాట ఈప్రయోజన సాధనకు ఇంకా వినియోగించ బడకపోయినప్పటికీ, బాల నేరస్థులను, యితర సాంఘిక దురలవాట్లకు బలియైనవారిని సంస్కరించడానికి యివి తప్పక వినియోగపడగల వని రూఢిగా చెప్పవచ్చు. ఈ ఉద్దేశంతో ఏర్పాటు చేసే బొమ్మలాట ప్రదర్శనలు సంస్కరణకు వుద్దేశించబడిన సంస్థల బోధనకార్యక్రమంలో ప్రవేశపెట్టవచ్చు. బొమ్మలు మాట్లాడుతూవుంటే సమాధానా లీయడం ద్వారా ప్రేక్షకులు కూడా ప్రదర్శనలో పాల్గొనగలరు.

అలా ప్రేక్షకులు పాల్గొనడంవల్ల ప్రదర్శనలోని పాత్రలలో ఎక్కువగా సాన్నిహిత్యం పెంపొందించుకో గలరు. అంతేగాక ప్రదర్శకులు ప్రేక్షకులు కూడా తమ అభిప్రాయాలను ప్రకటించు కొనడంద్వారా భయసందేహానుమానాలను తొలగించు కొనడానికి అవకాశం కలుగుతుంది. కొన్నికొన్ని సమస్యలను పదేపదే పునశ్చరించడంద్వారా వాటిపరిష్కారానికి మార్గాలను అన్వేషించడం సాధ్యపడుతుంది. ఇటువంటి పద్ధతి నేరస్థుడు తన చిక్కులను వెల్లడించు కొనడానికి ప్రజలుకూడా ఆ చిక్కులు సంఘానివిగానే భావించి వాటి పరిష్కారానికి తోడ్పడడానికి వీలు కలుగుతుంది.

ఈ పైన పేర్కొన్న లక్ష్యసాధనకు బొమ్మలను ఉపయోగించ గోరేవాడు మానవుని నడవడిలోని వైవిధ్యాలను బాగా గ్రహించవలసివుంది. మానవుని సమస్యలను, కష్టనిష్టూరాలను సమగ్రంగా గ్రహించవలసివుంది. ఆదుర్దాకలిగించడం, భయ విద్వేషానుమానాలను రేపడం సులభం. కాని యిటువంటి అనుభూతులను బొమ్మలాట నిర్వాహకుడు నిర్మాణాత్మక విధానంలో రూపొందించడానికి నేర్పు అవసరం. అంటే బొమ్మలాట నడిపే కళాకారుడు మానవ మనస్తత్వ పరిజ్ఞానం ఎక్కువగా తెలిసిన వాడైవుండాలన్న మాట.

ఆసుపత్రులలో :

ఆసుపత్రులలోను, నర్సింగ్ హోమ్సులోను వుండే రోగుల కాలక్షేపానికీ వినోదానికీ యిటువంటిచోట్ల ఒకచోటు నుంచి మరొక చోటుకు సులభంగా కదలించడానికి వీలిచ్చే మొబైల్ పప్పెట్ థియేటర్లుండాలి. ఒకరిద్దరు రోగులు చక్రాలమర్చిన త్రోపుడుకుర్చీలమీదకూర్చుండే ప్రదర్శన నిర్వహించవచ్చు. చేతితో నడిపే కీలుబొమ్మలైతే ప్రదర్శనకు స్టేజీకూడాఅవసరంలేదు. ఈ చిన్న బొమ్మలు రోగి బెడ్‌పైనే నాట్యం చేస్తాయి పైకి, క్రిందికీ పరుగెడతాయి. అతని గుండెల మీదే నిలబడి, మాట్లాడుతాయి. రోగే తయారు చేసుకొని నడిపేబొమ్మ దేనితో తయారు చెయ్యబడినా యిబ్బంది లేదు. ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో జరిగే ప్రదర్శన వారు ఆరోగ్యంగా త్వరగా కోలుకొనడానికి తోడ్పడుతుంది. ఈ బొమ్మలు మనుష్యులకంటె ఎక్కువ త్వరితంగా తమ వైఖరులను మార్చుకో గలవు. క్షణకాలంలో మహోత్సాహం నుంచి, దుర్భరవిచారంవరకు భావాలనుప్రకటించి చూచు వారి మనస్సులకు గాఢంగా హత్తగలవు. ★

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

REPORT FOR NOVEMBER 1956

IN-PATIENT MATERNITY

No. of Patients admitted for Deliveries	158
,, ,, Surgical cases treated	2
,, ,, Medical cases treated	44
,, ,, Gyneac and Abortions	29
,, ,, Post Natal	3
,, ,, babies (Lodgers)	100
Grand total	336
,, ,, normal Deliveries	98
,, ,, abnormal Deliveries: forceps 7, Craniatomy 1, Breech 4	12
Total	110

OUT-PATIENT DEPARTMENT

No. of Surgical cases	103
,, ,, Medical cases	1120
,, ,, Gyneacological cases	146
,, ,, Ante-natal cases	264
,, ,, Post-natal cases	118
,, ,, E.E.N.T. cases	66
Total No. of New patients	1817
Total No. of Old patients.	2018
Grand Total	3835

NURSES' TRAINING CENTRE

The first batch of Auxiliary Nurse Midwives discharged from the institution, numbering 11, are all employed now. The second batch of 30 trainees completed their training in July and will be taking their final examination this month. They will all be immediately taken into service, some in the Community Development Blocks, Andhra Government and the rest in the Welfare Extension Projects, Andhra State. The 3rd batch of 15 trainees will do their first examination during this month. The 4th batch of 15 trainees will do their first examination in December. The 5th batch of 30 trainees are admitted on the 1st of August. The strength at present is 60 excluding the 30 that are waiting for their examination.

Mrs. V. LAKSHMI PARVATHI
Secretary and Convenor
Mrs. A. C. KRISHNA RAO
Administrative Secretary

Dr. M. PAVANA BAI
Medical Superintendent



మహిళాభ్యుదయానికి, శిశుసంక్షేమానికి కృషిచేస్తున్నసంస్థలకు సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు యిచ్చినగ్రాంటులు :

	మహిళాభ్యుదయం	శిశుసంక్షేమం
1953-54	రు. 6,66,600	రు. 3,87,300
1954-55	3,39,600	3,17,700
1955-56	13,83,636	12,57,557



శ్రీమతి బండారు అచ్చమాంబ

చరిత్రరచన మగవారికే కొంతకష్టసాధ్యం. అట్టితరి ఒక మగువ సాహసించి చరిత్ర రచనకు పూనుకొని ప్రప్రథమంలోనే, మహోత్కృష్ట గ్రంథాన్ని మహిళాలోకానికి ప్రసాదించిన మగువ నిజంగా ధన్యజీవి కదూ—

ఆమె అచ్చంగా పదహారణాల ఆంధ్ర మహిళ అనటం ఆంధ్రుల అపూర్వ సంపదే—ఆమే శ్రీమతి బండారు అచ్చమాంబ—ఆమె రచించిన స్త్రీహస్తంనుండి జాలువారిన తొలికవిత—"అబలా సచ్చరిత్ర రత్నమాల"

ఈమె తన కన్న బిడ్డలను కాలదేవికి కప్పగించి కన్నీరు కారుస్తుంటే ఆమె కాలక్షేపానికి తమ్ముడు కొమర్రాజు లక్ష్మణరావు కలాన్ని చేతికిచ్చిన ఫలితమే ఈమె కన్నీరు, కవితగా కలం ద్వారా ప్రవహించింది. ఈమె ఆంధ్రములోనే కాక, సంస్కృత, మహారాష్ట్రాంగ్లభాషలలో కూడ పాండిత్యము సంపాదించెను.

ఈ మహాసాధ్వి స్మారక చిహ్నముగ సారస్వతమునకు సంబంధించిన కొన్ని రచనలను పాఠకులకు సమర్పించుచున్నాను.

—సంపాదకురాలు.

సాహితీ ప్రపంచంలో

ప్రశంసలందిన మహిళా మణులు

★

శ్రీమతి కె. రామలక్ష్మి ఆరుద్ర

★

ఆడవాళ్ళు రాయడం, వారి రాతలకి బహుమతులు యివ్వడం చాలామందికి బాధ కల్గించింది. పాపం! ఆడవాళ్ళు అని యిచ్చారు అని నచ్చచెప్పుకున్న వారినీ, అఁ అంతా లోపాయికారీ అని యిట్టే తేల్చేసిన వారినీ నేనెరుగుదును. నే గట్టిగా వాదనకి దిగేసరికి బుకాయించి నోరు మూయించిన ఉదంతం చెప్తే మీరు నమ్మరు. ఫలానా ఆవిడ ఏకాంకికలు వ్రాశారు. వారికి భాషాసమితి వారు బహుమతి నిచ్చారు అని తెలిసిన నాడు రకరకాల ఊహలతో సతమతం అయిన పురుష సింహులని నేనెరుగుదును. ఏమండీ ఎందుకుబహుమతి రాకూడదు ! అస్తమానూ పత్రికల్లో అచ్చయిన పేరుకే నా పాటవం వుంటుంది? అని అడిగితే. నీ ముఖం, తెల్లకాగితాలు కలం చేతికిచ్చి గదిలో కూర్చోపెట్టి ఆవుని గురించి వ్యాసం రాయమంటే మూడు పేజీలు నింపలేరు. అన్నాడొక పెద్ద మనిషి. నేను నిజంగా ఎంతపందెం? అనేసరికి వూరుకున్నాడనుకొండి, అది వేరేసంగతి. ఇంతకి చెప్పవచ్చేదేమిటంటే, ఆడదానిపేర రచన అచ్చుపడితే సరి అది తప్పకుండా మొగవాళ్ళు రాసినదే అని నిర్ణయించేస్తారు. అస లలాంటి వాళ్ళ చేయూత లేకుండా అబలలు రాయనే లేరని.

అడవాళ్ళ పేరున పంపితేనే కాని రచనలు అచ్చుపడవు. అని చాలామంది మగవాళ్ళు ఆపని చేస్తుండేవారు. ఇప్పటికీ అక్కడక్కడ చేస్తూనే వున్నారు. కొద్దిమాసాలుగా యీ ఆడపేర్ల మగరచయితల ముమ్మరం తగ్గినట్లు తోస్తుంది. నిజం నిలకడమీద అన్నట్లు. కాలకమాన సిసలయిన రచయితలుగా రాటుతేలుతున్నది స్త్రీ రచయితలే నని పత్రికలు చదివే పాఠకులకి నెమ్మదిగా విశదం అవుతూనే వుంది.

తెలుగు భాషాసమితివారు ఏటేటా కొన్ని తరహాల పుస్తకాలకి బహుమతు లిస్తూంటారు. కొద్ది సంవత్సరాలుగా ప్రారంభం అయిన యీ పద్ధతిలో యిప్పటికి ముగ్గురు స్త్రీలకి బహుమతులు లభించాయి. ఇందులో ఒక సంవత్సరపు బహుమతిని ఒకే వస్తువు తీసుకుని గ్రంథాలు తయారు చేసిన శ్రీమతులు కోడూరు లీలావతీ గుడిమెట్ల బాలాత్రిపుర సుందరిగారలు పంచుకున్నారు. వీరురచించిన గ్రంథం గృహవిజ్ఞానానికి సంబంధించినది. మరుచటి సంవత్సరమే కుమారి గుడిమెట్ల బాలా త్రిపుర సుందరి ఆరు ఏకాంకికలు రచించి తిరిగి భాషా సమితి వారిచే గౌరవింప బడ్డారు. ఇలాగే ఒక సంవత్సరం ఆంధ్ర కవయిత్రుల చరిత్ర సవివరంగా వ్రాసి శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు బహుమతిని పొందారు.

కుమారి గుడిమెట్ల బాలా త్రిపురసుందరి జీవితచరిత్ర చూస్తే చిన్న చిన్న అడ్డంకులను చూసి బెదరిపోయే అమ్మాయిలకి ఏనుగంత బలంరావాలి. సామాన్యమైన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి, సనాతన ఆచారపరాయణురాలయిన తల్లిచేత చదువు సంధ్యల పట్ల నిరుత్సాహింపబడీకూడ త్రిపురసుందరి అన్ని సదుపాయాలూ వున్న అమ్మాయిల కంటే కూడా రాణించకల్గింది. పదవయేటనే తండ్రిని కోల్పోయి అన్నయ్యలోనే తండ్రినిచూసుకుంది. "ఆడపిల్లలకి చదువు ఎక్కువ అనవసరం" అనివాదించే తల్లీ అమ్మమ్మా చేరి చదువుకి స్వస్తి చెప్పించారు. స్త్రీ

విద్య అంటే చెవికోసుకునే అన్నయ్య స్వతంత్రు డవడంతో (1943 లో బి. ఎస్‌సి పాసయి దయాల్‌బాగు ఇంక్ ఫాక్టరీ మేనేజరుగచేరారు) చెల్లెలి విద్యావిషయాల పట్ల స్వతంత్రంగా నిర్ణయాలు చెయ్యకలిగారు. యింటి దగ్గిరే చదువు చెప్పి ఆంధ్రా మెట్రిక్‌కి ప్రైవేటుగా కట్టించారు. 1949 మార్చిలో ఇంటరూ 52 లో బి. ఏ. పరీక్షలు ప్యాసయారు. తరువాత గుంటూరులో చేరి ఒక ఏడాదిపాటు చదివి బి. యిడి. డిగ్రీకూడా పుచ్చుకున్నారు. ప్రస్తుతం గౌహతీ విశ్వ విద్యాలయంలో చేరి ఎం. ఏ. (ఎకనామిక్సు) పరీక్షకి చదువుతున్నారు. కుమారి త్రిపుర సుందరి మనోనిబ్బరానికి పై విద్యావ్యాసంగం చాలు. ఉత్సాహం, ముందుచూపుకల యీయువతి యింకాయింకా చదవాలన్న కుతూహలాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎం. ఏ పట్టారాగానే బెనారెస్‌విశ్వవిద్యాలయంలో పి. హెచ్.డి. కి రిసెర్చి చేయాలని యీ మెకోరిక. ఇది కుదరకపోతే దయాల్బాగు విమెన్సు ట్రైయినింగ్ కాలేజీలోచేరి ఎమ్. ఇడి కి చదవాలని. "దీని కంతకూ మా అన్నయ్య ప్రోద్బలం వుంది"అంటూ నమ్రతతోఅంటారేగాని ఆత్మ విశ్వాసం దృఢ నిశ్చయం కూడ లేక పోలేదు. స్త్రీ విద్య విషయంలో తిరువాన్కూరు కొచ్చిన్‌లతో, యు. పి రాష్ట్రాలతో పోల్చిచూసుకుంటే ఆంధ్రులం చాలా వెనక బడే వున్నామన్న సంగతి నిజం. ఆంధ్రప్రదేశ్ అవతరణతో యీ విషయంలో తగిన శ్రద్ధ చూపడం జరుగుతుందని కోరుదాం. ఎక్కడచూసినా చదువుకున్న పిల్లలే కన్పించే యీ రోజులలో కూడా జనాభా మొత్తంమీద చూస్తే చదువుకున్న స్త్రీలు—యింకా కావలిస్తే అక్షరాస్యులయిన వారి సంఖ్య అతి తక్కువగా వుంది అని చెప్తే కూడా నమ్మలేం. కాని నిజం అదే.

కొందరికి కళలు సహజంగా అలవడుతాయి. అటువంటి వారిలో శ్రీమతి ఒకరులా తోస్తారు. ఎక్కడ రచనా వ్యాసంగంలో పాల్గొనక పోయినా బాలా త్రిపుర సుందరి ఆంధ్రభాషాసమితి వారి బహుమతులు రెండు సంవత్సరాలు వరసగా అందుకున్నారు—అంటే కొందరిని ఆశ్చర్యపరిచింది. కొందరికి అనుమానం వేసింది. కాని. నివురు కప్పివున్న రచనా పాటవం తగిన ప్రోత్సాహం లభించడంతో విజృంభించి వెల్లివిరిసినదని అనిపించలేదు. అయినా యీమె బహుమతుల నందిన గ్రంథాలని చూస్తే ఒక నిజం తెలుస్తుంది : ప్రథమ ప్రయత్నంగా యీ రచనలు గోచరిస్తాయి. (ఎప్పుడేనా అక్కడక్కడా చిన్ని రచనలు చేశారేమో మనకితెలియదు) 1953 లో తెలుగు భాషాసమితివారు యీమె వ్రాసిన "గృహనిర్వహణ శాస్త్రాని"కి బహుమానం యిచ్చారు. ఆ పుస్తకం యింకా ప్రచురింప బడలేదు. కాని రచయిత్రి దృష్టికి అది రివైజు చెయ్యాలని తోచింది. అప్పుడుకాని ఎక్కువ ఉపయోగం ఉండదని తోస్తుందని రాశారు. తీరిక చిక్కగానే ఆ గ్రంథాన్ని రివైజుచేసి ప్రచురించాలన్నారు. త్వరలోనేరచయిత్రి ఆపనిచేస్తే పఠితల కుతూహలాన్ని గుర్తించిన వారవుతారు. మహిళలకు ఎక్కువగాఉపయోగించే గృహశాస్త్రం వంటి గ్రంథాలు తెలుగులో చాలాతక్కువ. అటువంటివి ఎన్ని ఉంటే మహిళల విజ్ఞానాభివృద్ధికి అంత దోహదం కల్గుతుంది.

కుమారి గుడిమెట్ల బాలా త్రిపురసుందరి గృహశాస్త్రానికి పుచ్చుకున్న బహుమానం అదే విషయాన్ని గురించి వ్రాసిన శ్రీమతి కోడూరి లీలావతిగారితో పంచుకున్నారు. అంచేత, యీమె ప్రత్యేకంగా పుచ్చుకున్న బహుమాన గ్రంథం గురించి వ్రాస్తాను.

1954 లో తెలుగు భాషాసమితి వారి పోటీలో "ఆరు ఏకాంకికలు" వ్రాసి బహుమానం అందుకున్నారు కుమారి త్రిపురసుందరి. ఈ నాటికలు కూడా గ్రంథ రూపంలో రాలేదుకాని పఠితలకుతూహలాన్ని ఆంధ్రవారపత్రికవారు తీర్చారు. ఆరు నాటికలనీ వరుసగా ప్రచురించారు. (ఈ సందర్భంలో బహుమాన ప్రదానం చేసిన భాషా సమితి వారు గ్రంథ ప్రచురణకి కూడా పూనుకోవడం ఉత్తమం అని సూచించడం సాహసంకాదు. ఎందుకంటారా? బహుమతులను గురించి కావలసినంత ప్రచారం చేస్తుంటారు. అందుకున్న రచయితలకీ అలాగేప్రచారం లభిస్తుంది. ఇదంతా చదువుతూ వింటూ వుండే పాఠకులకు సహజంగానే అసలు బహుమానాలు పొందిన గ్రంథాలని చదవాలని వుంటుంది. గ్రంథం ప్రచురించడంలో రచయితలు తగినంత కుతూహలం చూపనప్పుడు ఆ బాధ్యత బహుమతినిచ్చిన సంస్థ వహించడం అంత కష్టం కాదేమో !)

ఈమె రాసిన ఆరునాటకాలూ కూడ స్టేజికి తగినవే, కాని వీటన్నిటిలోకీ ఎక్కువగా ప్రచారం పొందిందని చెప్పబడుతున్న నాటకం, "సినిమాపిచ్చి" అన్నది.



గృహాలంకరణ
చిత్రణ: శ్రీ కేతినీడి భాస్కరరావు

"ఝాన్సీ లక్ష్మి" నాటకం ఒకమూఢుడూ ఉదర సంరక్షణంమించి వేరు గమనించనివాడూ అయిన రైతుబిడ్డలో వీరావేశాన్ని కల్గించుతుంది ఝాన్సీలక్ష్మి. కాని దురదృష్టవశాత్తూ యీ నాటకంలో పాత్రలకు తగిన భాష ఉపయోగించక పోవడం వల్ల రంగస్థలంమీద వేస్తూంటే- రైతు వేషంలో ఉన్న పెదకన్నయ్య శుద్ధ సంస్కృత పాండితీ ప్రభావాన్ని ప్రదర్శించే సంభాషణలు సాగిస్తూంటాడు. అలాకాకుండా పాత్రోచిత భాషను ఉపయోగించి వుంటే యీ నాటకం రంగస్థలంమీద బాగానే వుండేది. "లవంగి" నాటకంలో కూడ యింతే జరిగింది. పండిత రాయలూ, లవంగీ ఉచితంగానే కవితాధోరణిలో సంభాషణ సాగించారు. కాని సుబేదారు వచ్చేసరికి పసచెడింది. ఒకే గుక్కలో శుద్ధ గ్రాంధికమూ అతిగ్రామ్యమూ కూడా ఉపయోగిస్తాడు : "కవులంటే పడిచస్తావుగాని చూశావూ? దండికవీశ్వరుండు ముసుతావశించినచోట నెట్టుల నిండెనో బ్రహ్మదండి" గమనించితివా?" అంటాడు. కాని లవంగి పండితరాయల సంభాషణలు చదువుకోందుకు చాలా బాగుంటాయి. అన్ని నాటకాలలోకినాకు నచ్చినది "ధృవతార" ఈ నాటకరచకిన ప్రోత్సాహాన్ని కల్గించినది ఒక చిత్రం అని రచయిత్రి వివరించారు. వెరెష్ చెగిన్ రష్యను అభ్యుదయలో చిత్రకారుడు. "బ్రిటీష్ యిండియా ఫిరంగులతో కాల్చి చంపడం" అని పేరెట్టి ఒకచిత్రాన్ని రచించాడు. ఆ చిత్రమే యీ నాటకానికి దోహదం. 1856 ప్రాంతంలో బ్రిటిష్‌వారి దారుణ చర్యల చిత్రణఅది. దీనికి తోడు నేతాజీ ప్రారంభించిన విప్లవం గురించి కూడా చదివి దాన్నే మననం చేసు కుంటూ పడుకోవడం వల్ల రూపందాల్చిన కలే యీ "ధృవతార" బ్రిటీషుసార్జంట్ల దారుణప్రవర్తన, దేశభక్తుల అచలితమైన భక్తిప్రపత్తులు యీ నాటకంలో అద్దంలోలా కన్పిస్తాయి. "మండే నీడలు" అన్ననాటకం అందరికీ తెలిసిన బౌద్ధ కథ. కష్టం కల్గని యింటిలో నుండి పిడికెడు బియ్యంతెస్తే చనిపోయిన పసికందుకి ప్రాణం పోస్తానంటాడు బుద్ధుడు. అదినాలా సాధ్యం? అధారంగా "మండేనీడల" నాటికరంచించారు రచయిత్రి. ఇక మిగిలిన రెండునాటకాలూ సాంఘికాలు అనతగ్గవి."వాడు వత్తి శుంఠరా"అన్నది- వినదగు నెవ్వరు చెప్పిన, విననంతనె వేగపడక వివరింపదగున్- అన్న నీతిబోధకం. "సినిమాపిచ్చి" అన్నది అనేక ఏమెచూరు నాటకసంఘాల, మన్నన పొందిన నాటకం. సినిమాపిచ్చి బాగా తలకిపట్టి లోభి సహితం ఎలా వేలకి వేలు ఖర్చు పెట్టాడో, నిజానికి ఎలాఅతనిచేత నలుగురూకలిసి ఖర్చు పెట్టించారో యీ నాటక యితివృత్తంలో విశదీకరింపబడింది.

బహుమానం అందుకోవడంతో ఆంధ్రలో పేరుతెచ్చుకున్న రచయిత్రి కొంచెం శ్రమకోర్చి యీ నాటకాలని



శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు

పుస్తక రూపంలో తెస్తే బాగుంటుంది. అంతేకాదు-ప్రతి నాటకానికీ రంగస్థల. అవసరాలని. జాపితా చేసి తగిన సూచనలు కూడా ప్రచురిస్తేబాగుంటుంది. ఈ సంవత్సరపు పోటీకి ప్రజాతంత్రాన్ని గురించి రాయాలని ఉత్సాహ పడుతున్న కుమారి త్రిపుర సుందరిగారు బద్ధకించక ఆ గ్రంథాన్ని సహితంరాయాలని నా కోరిక. మహిళా లోకా నికి ఆదర్శప్రాయం కావాలని నా ఆశ.

*　　*　　*


జగమెరిగిన బ్రాహ్మణునికి జంజమేల? అన్నది లోకోక్తి. శ్రీమతి ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ గారిని గురించి పరిచయ వాక్యాలు రాయ బూనడం జగమెరిగిన బ్రాహ్మణునికి జంజము వేయ చూడడమే. సాహితీ రంగంలో ఊటుకూరు కవయిత్రి ప్రస్తుతం ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకుని ఉన్నారు. జననం 1917 డిసెంబరులో. రాజమండ్రి వైశ్య సేవాసదనంలో చిన్నప్పటి నుండీ విద్యా వ్యాసంగం. తరువాత ఆంగ్ల విద్యాభ్యాసం కోసం గవర్నమెంటు బాలికా పాఠశాలకి వెళ్లి గాంధేయోద్యమం ఉధృతంగా నున్న ఆరోజులలో ఆ చదువుకి స్వస్తి చెప్పి తిరిగి సేవాసదనానికీ వచ్చారట। ఆ రోజులలో ఒక సారి పోలీసుల లాఠీలకి కూడా గురి అయిన బాలిక లక్ష్మీకాంతమ్మ. ప్రతి సంవత్సరం ప్రప్రథమురాలిగా పరీక్షలలో ఉత్తీర్ణురాలవుతూ, 1934 మార్చిలో ఆంధ్రా యూనివర్సిటీ వారి ఉభయ భాషాప్రవీణ పరీక్షలో యూనివర్సిటీకి ఫస్టుగా నెగ్గారు యీమె. కళాశాల చదువు ఒక దిశ సాగుతూంటేనే యింకొక ప్రక్కలోన యిమిడి వున్నకవితాశక్తులు విజృంభించుతూనేవున్నాయి. స్కూల్లో చదువుతూన్నప్పుడే తేటగీతులూ మొదలయినవి రాస్తూండే వారు. 1934 లో శ్రీ హయగ్రీవగుప్తగారితో యీమె వివాహం జరిగింది. పెండ్లి అయాక శ్రీమతి విద్యాభ్యాసానికి ఉదారులూ, విద్యాభిలాషులూ అయిన గుప్తాగారు ప్రోత్సహించి పెంపొందింప చేశారు.

లక్ష్మీకాంతమ్మగారు ప్రప్రథమంగా వేదికనెక్కి పద్యాలు చదవడం, దివంగతులయిన కీర్తిశేషులు శ్రీ మోతే గంగరాజుగారి షష్ఠిపూర్తి సందర్భంలోనట. కీ. శే. గిడుగు రామమూర్తి పంతులుగారి జన్మదిన సందర్భంలో 'భాషా-వ్యాకరణము' అను విషయముపై వ్యాసం చదివి పెద్దల మన్ననలను అందుకున్నారు. అంతే కాదు, అదే సందర్భంలో శ్రీ రాయప్రోలు వారు యీమెకు 'ఆంధ్ర విదూషీ కుమారి' బిరుదు నిచ్చి గౌరవించారు. తరువాత, అఖిలాంధ్ర వాఙ్మయ సభలు (1936)లో యీమెకు 'విద్వత్కవయిత్రి' బిరుదు నిచ్చి యీమెను గౌరవించారు. అది మొదలు వాస్యరచనా,' పద్య రచనా వ్యాసంగాలు జరిగాయి. అనేక సంస్థలలో ఉపన్యాసాలు యిచ్చారు. సేవాసదనం అధ్యక్షురాలయిన శ్రీమతి బత్తుల కామాక్షమ్మగారి షష్ఠిపూర్తి సందర్భంలో ఆంధ్ర నలుమూలలా పర్యటించి ఆ సంస్థకు 20 వేల వరకూ విరాళం పోగు చేసిన సేవకురాలు శ్రీమతి లక్ష్మీకాంతమ్మ. కామాక్షీ విజయ సంచిక అని ఒక సంచికను కూడా ప్రచురించారు.

ప్రతిఫలరహితంగా యిన్నాళ్లుగా సాగిన యీమె సాహిత్య సేవ ఎన్నదగినది. 1951 లో మద్రాసు ప్రభుత్వపు టాధ్వర్యాన తెలుగు భాషాసమితి వారి పోటీకి 'ఆంధ్ర కవయిత్రుల' చరిత్రతో రిసెర్చి గ్రంథాన్ని రాసి పంపారు లక్ష్మీకాంతమ్మగారు. అది విజయం పొందింది. దానితో లక్ష్మీకాంతమ్మకు పల్లెలలో పట్టాలలో ఎన్నెన్నో సన్మానాలు జరిగాయి. 1952 కీ. శే. శ్రీ కేసరిగారు స్థాపించిన 'గృహలక్ష్మి' అధ్వర్యాన స్వర్ణ కంకణం తొడిగి గౌరవించారు. ఒకప్పుడు మహిళా గాన సభవారు జరిపిన వీణావాయిద్యపు పోటీలో దేవత శ్రీ రామమూర్తి స్వర్ణ పతకాన్ని గెలిచారు యీమె. గ్రంథరచనను శ్రీ ఆత్మూరి లక్ష్మీనరసింహ సోమయాజి సంఘ స్వర్ణ పతకాన్నీ, వక్తృత్వ పోటీలో శ్రీ చుండూరి శ్రీ రాములుగారి స్వర్ణ పతకాన్నీ, పరీక్ష విజయానికి శ్రీమతి కామాక్షి

స్వర్ణపతకాన్నీ యింకా ఎన్నెన్నో స్వర్ణ పతకాలని. ఎన్నో బిరుదులని పొందిన అఖండ విజయలక్ష్మి శ్రీమతి ఊటుకూరులక్ష్మీకాంతమ్మ. ఆంధ్రకవయిత్రుల చరిత్రతో అనేక అభ్యుదయ సాహిత్య సంస్థలలో సభ్యత్వం యిచ్చారీమెకు. 1953 లో హైదరాబాదు ప్రభుత్వంవారు నడిపిన కవిత్వ పోటీలు నిర్ణయించే వారిలో యీమెనొక జడ్జిగా నియమించారు. శ్రీ విశ్వనాథ వారితోకలిసి రాష్ట్రాలలో అ పర్యటనకు ఏకైకస్త్రీ ప్రతినిధిగా యీమె వెళ్లారు. తెలుగు వాగ్గేయికారులు, పరమహంస కావ్యాలు యిప్పటికి వీరి యితర రచనలు. అనేక అధికార అనధికార సంస్థలలో ప్రధాన పాత్ర వహిస్తూ శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గారు మహిళా లోకపు తలమానికంగా యీనాడు వెల్లివిరుస్తున్నారు. తెలుగు భాషాసమితి వారివిజ్ఞాన సర్వస్వానికి యీమె-కీర్తన వాఙ్మయచరిత్ర-ఆధునిక పద్యవాఙ్మయ చరిత్రలను గురించిన వ్యాసాలు రాసియిచ్చారు.

ఆంధ్ర కవయిత్రుల చరిత్ర ఒక రకంరిసెర్చి గ్రంథం. ఇందులో తెలుగులో రచించిన కవయిత్రుల జాపితాలూ, రాసిన ఉదాహరణలూ యివ్వబడ్డాయి. ఈ సాహితీ విమర్శన-తొలి మలితరము తరములుగా ఐదుతరములుగా విభాగించినది. తొలి తరంలో రచయితలు ప్రాచీనాంధ్ర కవయిత్రులు-చానమ, గంగాదేవి, తాళ్లపాక తిమ్మక్క, ఆతుకూరి మొల్ల, మొదలగు యిరువది నల్గురుకవయిత్రుల చరిత్ర సమీక్షింపబడింది. మలి తరము, వీరేశలింగ యుగము—దీనిలో శ్రీమతి బండారు అచ్చమాంబ శ్రీరాణీచిన్నమాంబ కందుకూరి రాజ్యలక్ష్మమ్మ మొదలు గాగల ఇరవైతొమ్మండుగురి జీవిత చరిత్రలూ కవిత్వ ధోరణులూ సమీకృతం అయాయి. మూడవ తరము ఆధునిక అంధ్రవాఙ్మయము- శ్రీమతికాంచనపల్లికనకమ్మ మొదలు గాగల పంధొమ్మండు గురి వాఙ్మయ పటిమ సమీక్షింప బడింది. నాల్గవతరమున స్థానాపతిరుక్మిణమ్మ, పుట్టపుర్తి కనకమ్మ మొదలయిన పదకొండుగురినీ, ఐదవ తరమున తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, బసవరాజు రాజ్యలక్ష్మమ్మ మొదలయిన నలభై యిద్దరినీ సమీక్షించారు.



శ్రీమతి కోడూరి లీలావతి.

ఇంకా చరిత్ర కెక్కని ఎంద రెందరో కవయిత్రుల చరిత్రలు యీ గ్రంథంలోకి రావడం ముదావహం.

అన్ని విమర్శన గ్రంథాలలోనూ మచ్చుకయినా స్థానం యివ్వబడని కవయిత్రులకి ప్రత్యేకత యిచ్చిన తెలుగు భాషా సమితి వారు అది ఊతగా నందు కొని గ్రంథ రచన కుపక్రమించి విజయం గాంచిన లక్ష్మీకాంతమ్మగారు కూడా గౌరవనీయులు, ప్రస్తావనలో "స్త్రీల కవిత్వాన్ని గురించి ఎక్కడా ఇంత వరకూ ప్రస్తావన జరిగి ఉండక పోవడం చేత, నా మనస్సుకు ఏ మాత్రం యింపుగా వున్న, కొద్ది పద్యాలు వ్రాసిన వారిని కూడా కవయిత్రుల లిస్టులో చేర్చాను" అన్నారు చరయిత్రి. ఇందువల్లనే కాబోలు. అక్కడక్కడ, ముఖ్యంగా నవ్యాంధ్ర యుగపు విభాగంలో రచయిత్రుల జీవిత విశేషాలూ, వారు ఉత్సాహాన్ని అంది పుచ్చుకున్న వాఙ్మయ ఋరుల ప్రస్తావనే ఎక్కువగా కన్పించింది. ఇలాంటివాటికి ప్రముఖ నిదర్శనగా కన్పించేది-కొత్త పల్లి లలితగారి విభాగం. రచయిత్రి చెప్పినట్లు వీరందరినీ యిలా కూడ కట్టితే ఎవరేనా యింకొకరు ఇంకొక కవయిత్రుల చరిత్ర రాయడానికి ఉపయోగిస్తుందేమో అన్న ఉద్దేశ్యం బాగుంది. ఆ దృష్ట్యా చూస్తే యీ ఆషా

మాషీ కవయిత్రుల చరిత్రలు యిందులో వుండడం బేస బవు కాదు.

రచయిత్రి చెప్పినట్లు స్త్రీలను గురించినరచనలు స్త్రీలే చేస్తే ఎక్కువ స్వభావ సిద్ధంగావుంటాయి. అందుకు స్త్రీ రచయితలు ఎక్కువగా తయారు కావాలి. రచయితలను అన్ని విధాలా ప్రోత్సహింప చూస్తున్న పత్రికలూ, ప్రభుత్వమూ, ప్రచురణ కర్తలూ తగిన ప్రోత్సాహాన్ని యిస్తే యీ పని సాధ్యం కావచ్చు.

ఇక, కుమారి గుడిమెట్ల బాలాత్రిపుర సుందరి గారితో పాటు తెలుగు భాషాసమితిలో వారి బహుమానాన్ని పంచుకున్న శ్రీమతి కోడూరి లీలావతీదేవి గ్రంథం గృహవిజ్ఞానం. ఈ గ్రంథం కేంద్రప్రభుత్వపు బహుమానాన్ని కూడా అందుకోవడం గమనింప తగ్గది. భారత ప్రభుత్వ విద్యాశాఖ వారు వయోజన విద్యావ్యాప్తి కోసం రచనలని ప్రోత్సహిస్తూ బహుమానాలని యిస్తున్నారు. అలాంటి వాటిలో 1954 లో వుత్తమ గ్రంథంగా యీ గృహవిజ్ఞానం నిర్ణయింప బడింది.

శ్రీమతి కోడూరి లీలావతీదేవిగారు కీర్తిశేషులు దేవత శ్రీరామమూర్తిగారి కుమార్తె. తల్లి దేవత లక్ష్మీదేవమ్మ. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన లీలావతిగారిని తండ్రే తల్లి అయి పెంచి పెద్దచేశారు. దేశ భక్తుడు, కళాభిమాని, త్యాగశీలి, విమల హృదయుడు అయిన శ్రీరామమూర్తిగారి ముద్దు బిడ్డగా పెరిగి సద్గుణాలనన్నీ వంట పట్టించుకున్న ధీమంతురాలు కోడూరి లీలావతీ దేవి.

'గృహవిజ్ఞానం' సులభగ్రాహ్యంగా వుండి వయోజనులకు ఎంతో ఉపయుక్తంగా వుంటుంది. బస్తీ అమ్మాయి సుశీల పినతల్లిగారి పల్లెటూరికి వెళ్లి-అక్కడ నలుగురినీ కూడ కట్టి సాధారణంగా అందరికీ తెలియవలసిన విజ్ఞాన విషయాలు సులభశైలిలో బోధిస్తుంది. తత్ఫలితంగా ఆ పల్లె ఆదర్శ గ్రామం కావాలని అక్కడి ప్రజలు ఆరోగ్యనిధులు కావాలని బస్తీ అమ్మాయి కోరిక. అన్నీ విడ్డూరాలని నమ్మే పల్లె ప్రజలని విజ్ఞానోన్ముఖులుగా చెయ్యడం, కొత్తగా వచ్చిన ప్రతీదీ 'జబ్బు' అనే పల్లెటూరి నమ్మకాన్ని తొలగ చేయడం మాటలతో పనికాదు. "కంచాల నిండా అన్నాలూ కడవల నిండా ఊరగాయలూ సారం లేక పోవడం ఏమిటీ? అనే పల్లెటూరి తత్వాన్ని మార్చి విటమినుల అవసరం గుర్తింప చెయ్యడం కష్టం. అలాంటిది, బస్తీ అమ్మాయి సుశీల చేత సులభం అయిన మాటలలో అనేక ఆరోగ్య విషయాలు-ఉండీ యిల్లు, త్రాగే నీరు, తినే ఆహారం ఎలా వుండాలి? యిల్లు పరిశుభ్రంగా ఎలా వుంచుకోవాలి? ఆహారంలో విటమినులు ఎందుకుండాలి? తాగే నీరు పరిశుభ్రంగా ఎందుకుండాలి? రోగాలు రాకుండా ఏం చెయ్యాలి? సాధారణంగా వచ్చే కొన్ని రోగాలు ఎలా అరికట్టాలి? ఆ రోగాలు వచ్చిన వారి పట్ల ఎలాంటి శ్రద్ధ తీసుకోవాలి?...అనే అనేక విషయాలని చెప్పించారు లీలావతీ దేవిగారు. కొత్తగా చదవడం నేర్చుకున్న మహిళలందరూ సులభంగా చదివి అర్థం చేసుకోగల గ్రంథం- యీ గృహ విజ్ఞానం.

ముగ్గురు మహిళలు బహుమానం పొందితే సరా? కాదు అవకాశం ఉన్న ప్రతి మహిళా సారస్వత కృషికి చేతోడు కావాలి. ఒక్క కవిత్వమే సారస్వత సేవ, ఒక్క నవలే సారస్వత సేవ అనుకోవడం తప్పు. విజ్ఞాన ప్రదం అయిన ఉత్తమ రచనలు-అవి కవిత్వం కాక పోయినా, కథలు కాక పోయినా అందరూ తెలుసుకో వలసిన విజ్ఞాన విషయాలని చాటే రచనలు ఎన్నైనా కావాలి మనకి. వాటి కోసం మహిళలు సహితం ప్రయత్నం చేస్తారని ఆశిద్దాం ఆదర్శంగా, ఉదాహరణగా మనకి కావాలంటే యీ ముగ్గురు మహిళలూ ఉన్నారు కదా?

సాహిత్యములోని ఉమ

★ శ్రీమతి కె. సీతాదేవి ★



శబ్దము శబ్దమునకు సంబంధమైన యర్థము సాహిత్యమనిపించు కొంటుంది. శబ్దమునకు అర్థమునకు ఎడబాటుండదు. ఆ శబ్దార్థములు రెండు మహాకవి కాళిదాసు దృష్టిలో పార్వతీ పరమేశ్వరులవలె నారాధ్య దేవతలైనవి. అందువల్ల సాహిత్య మనగా విశుద్ధమైన శబ్దార్థముల సమ్మేళనమని నిర్ణయించు కొనవచ్చును. సాహిత్యము దేవతయైన సరస్వతీ దేవియొక్క ఆత్మ విలాసం, అది ఆనందమూర్తి. అటువంటి సాహిత్యమును తరుస్తున్నకొలది ఆత్మకు ఆనందం కలిగించే రసానుభవం మనకు లభిస్తుంది, అంతేకాకుండా సాహిత్య మనగా యనేక విషయముల కలయిక. ఇటువంటి సాహిత్యమె మానవ జీవితానికి మార్పు కలిగించగలదు. అందుకనే గ్రంథములలో వర్ణించబడినవారి గుణశీలములను, వినయ వివేకాదులను, విన్నప్పుడు కొంతకాలముననైనను కొందరకైనను జ్ఞానము కలుగకపోదు. ఆ విజ్ఞానం కలిగించుకొనుటయే సాహిత్యముయొక్కముఖ్యోద్దేశము. నాయిక యంటే కథలో జెప్పబడిన స్త్రీ. ఒక్కొక్క గ్రంథంలో ఒక్కొక్క నాయికను గూర్చి చెప్పబడు చున్నది. శ్రీనాథ కవిచే రచింపబడిన శృంగార నైషధంలో దమయంతీ, పింగళ సూరనార్యునిచే వ్రాయబడ్డ ప్రభావతీ ప్రద్యుమ్నమునందు ప్రభావతీ, భారతములో గాంధారీ, వసుచరిత్రలో గిరికా వర్ణించబడ్డారు. ఒక్కొక్క నాయికలో ప్రత్యేకమైన గుణముండుటచే వారు ప్రసిద్ధికెక్కిరి. ప్రస్తుతము మన కథా భాగం ఉమను గురించి. ఉమ యంటే పార్వతీ దేవి. ఆమె కా నామధేయ మెట్లు వచ్చినదో చూద్దాం. దక్షయజ్ఞంలో దేహము చాలించి పర్వతరాజ పుత్రికగా జన్మించిన తర్వాత పార్వతికి యుక్తవయస్సు రాగానే వివాహమునకు తగిన వరుని వెదుక ప్రయత్నిస్తాడు హిమవంతుడు. అట్టి సమయంలో త్రిలోక సంచారియగు నారదుడు హిమవంతునివద్దకు వచ్చి హిమవంతుని మనోగతం తెలుసుకుని పార్వతి సామాన్యకన్యగా దని యా నిటలాక్షునకే యర్ధాంగి కాగలదని జోస్యము జెప్పి వెళ్ళిపోతాడు. హిమవంతుడు దానిని మనస్సులో నుంచుకొని ఈశ్వరుని యుపచారమునకు పార్వతిని నియమిస్తాడు. ఇది యిట్లుండగా తారకాసురుని బాధల కోర్వజాలని దేవతలు బ్రహ్మతో మొర

పెట్టుకొనగ ఈశ్వరాంశ సంభూతుడే తారకుని సంహరించగలడని చెపుతాడు కమలసంభవుడు. శివుని తపోభంగమునకై దేవతలు మన్మథుని పంపగా అతను పుష్పబాణములు వేయ, ఈశ్వరునికోపాగ్నికి గురియై భస్మమయి పోతాడు. పుష్పాస్త్రుని దగ్ధముచేసి, ఈశ్వరుడు స్త్రీల సమక్షములో నుండుట తగని పని యని యదృశ్యుడై పోతాడు. అప్పుడు పార్వతి తన సౌందర్యాన్ని నిందించుకొని తపస్సు చేత పురారిని స్వాధీనుని చేసుకొనదలచి

యద్దుష్కరం యద్దురాపం యద్దుర్గం యచ్చదుస్తరమే
తత్సర్వం తపసాప్రాప్యం తపోహి దురతిక్రమమ్.

చేయుటకు, పొందుటకు, ప్రవేశించుటకు, దాటుటకు ఏది సాధ్యముకాదో అదంతా తపస్సువల్ల పొందవచ్చుననే స్మృతి వాక్యాన్ని తలచుకొని శివునికోసం తపస్సు చేయుటకు చెలికత్తెలతో బయలుదేరుతుంది. ఆ సమయంలో పార్వతి తల్లి ఉ = ఓ బిడ్డా, మా = తపస్సు చేయుటకు వెళ్ళవద్దని యడ్డుకొనుటవల్ల పార్వతికి ఉమ యనే నామము సార్థకమైనది. కుమార్తె దృఢస్వభావం గుర్తెరింగినవాడై నందువల్ల హిమవంతు డామె తపస్సున కంగీకరిస్తాడు. కాళిదాసు తన కుమారసంభవ కావ్యములో పార్వతి బాల్య యౌవనాదులను వర్ణించినది చూస్తాం. పార్వతిని మహామేధావినిగాను యేకసంథగ్రాహినిగాను వర్ణించెను.

శ్లో॥ స్థిరోపదేశా ముపదేశకాలే
ప్రపేదిరే ప్రాక్తన జన్మవిద్యాః.

దృఢమైన పూర్వజన్మ సంస్కారంగల పార్వతికి విద్య నేర్చుకొనే సమయం రాగానే పూర్వజన్మ విద్యలన్నీ తమంతట తామె ఆమెను వచ్చి పొందినవి.

ఆమె తేజస్వంతురా లనుటకు

శ్లో॥ తయాదంహితాను రాంచసీకా
స్ఫురత్ప్రభామండలయా సవిత్రా.

ఒడిలో నుండు చిన్న బిడ్డయైన పార్వతి కాంతిచేత ఆమె తల్లి ప్రకాశించిందన్నాడు. సామాన్యముగా తేజస్సు, తెలివి ఉన్నప్పటికి సౌందర్య ముండుట యరుదు. కాళిదాసు పార్వతి సౌందర్యాన్ని వర్ణిస్తూ బ్రహ్మదేవుడు సౌందర్యమంతా ఒకేచోట చూడ తానే కోరికపడ్డట్టు సర్వోపమాన లక్షణములతో పార్వతిని సృష్టించా డన్నారు. కాళిదాసు తన కావ్యములో పార్వతిని మహారాజకన్యగా వర్ణించేడు. కాని ఆమెలో గల పవిత్రతను మాత్రము విడువలేదు.

శ్లో॥ సంస్కారవత్యేవ గిరామనీషీ
తయాసపూతశ్చ విభూషితశ్చ

వ్యాకరణము చేత శుద్ధమైనవాక్కు పండితునికివలె పార్వతీదేవి హిమవంతునికి పవిత్రాకారముగాను నలంకారముగాను యున్న దన్నాడు అంతేకాక హిమవంతుని రాజనే వాడాడు. కాళిదాసు భోజమహారాజు యాస్థానములో నుండుటచే రాచమర్యాదలు, హోదాలు తన కావ్యంలో కనపరచాడు. సాహిత్య మార్గంలో పార్వతిని కావ్య నాయికగా సృష్టించాడు. కాళిదాసు పార్వతి తపశ్చర్యలో నున్నప్పుడును, ఆమె యన్నివిద్యలు నభ్యసించునప్పుడును మానవత్వంకంటే దేవత్వమునే యెక్కువగా సృష్టించాడు. ఇంక శివపురాణమును ఆధారముగ జేసికొని వ్రాసిన నన్నెచోడుని ఉమాపాత్ర చిత్రణలోగల నేర్పరితనమును కొంచెం విచారిద్దాం. ఈ నన్నెచోడుడు రాజ్యాధికారముగల ప్రభువు అయినను భోగములందు ఇచ్ఛలేనివాడు. ఈయన సృష్టిలో పార్వతి జగదంబికయే పరమపావనియే. బాల్యమునుండియు శివభక్తురాలే. అంతయెందులకు శివభక్తురాలగు పార్వతి తల్లిగర్భములో నున్నప్పుడు ఆమె తల్లికి కూడా శివుని యారాధించవలెనని కోర్కె కల్గే దిట,

ఉ॥ ఆధవళాయతాక్షి విషమాక్షు సదాశివు నిచ్చమెచ్చ నా
రాధన సేయగోరు నుడురాజశిఖామణి జూడ దారభూ
మీధర మెక్కగోరు నెడ మేనక మానక భక్తియుక్తిగం
గాధరు గొల్వగోరు మదిగౌరి మనంబున గోర్కె
గూడగాన్.

పార్వతి బాల్యంలో చెలికత్తెలతో నాడునప్పు డందరాడుచుండే యామె శివార్చన చేసేదట. ఆ విషయాన్నే కవి యీ పద్యంలో పొందుపరచాడు

చ॥ తరుణులు చిల్కబొమ్మలును
చంతపు బొమ్మలు మేలిగాజు బ
న్నరులును వ్రానిచొప్పికలు
నల్గడపోలిన పేర్చి లీలచే

కురబొమరిండ్లు జేయనగు
　　కూళ్ళను వండుచు బొమ్మపెండ్లి మా
నరముగ జేసె యాడ నగ
　　జాత శివార్చన సేయు నయ్యెడన్.

పార్వతికి విద్యలన్నీ రావడానికి ఆమె శివార్చనయనియే నమ్మినాడు నన్నెచోడుడు.

ఆ. వె. మఱియు నఖిలలోక మాన్యంబులగువిద్య
　　లెల్లనివ్విధమున నెసగ మెసగ
　　నభ్యసించె నీశ్వరార్చనబలమున
　　హరుడు గురుడు గాగ నగతనూజ.

అని చెప్పినాడు. పార్వతి తపస్సునకు వెళ్ళబోవునప్పుడు యింటివా రందరు ఆమెను తపస్సునుండి మరల్చుటకు

కం॥ ఆలవు బాలవు గడుగోమ
　　రాలవు కోమలివి ముద్దరాలవు దగ మం
　　బాలవు నీకలవుగాదిది
　　లీలయే తపమున నీకపార కాంతారములన్.

అన్నారు. దానికి పార్వతి ఏమిచెప్పిందంటే నన్ను మీ రందరు పెద్దచేసి చెప్పుచున్నారు. నా కీ జన్మలో ఈశ్వరుడే భర్త. నా సర్వస్వము అతనే నని చెప్పింది. పైగా "శివపద పంకజార్పణము చేసితి పాసితి మిమ్ము నందరన్" నాకీ సంసార సుఖములతో సంబంధంలేదు. భగవంతునికి సేవచేసి మనోవాక్కాయ ములు ఆయనకే పప్పగించానంటుంది.

ఇంకొక విశేషము కూడావుంది. "పాసితి మీకు నింత తోన్" అని చెప్పుటలో మీకు నాకు తీరిపోయిందనే చెప్పింది. అంతేకదా. లోకంలో సంసారంకావలసిన వాళ్ళకు దైవంలేదు. దైవచింతగలవారికి సంసారంలేదు. పార్వతి శివుడే కావలెననుకొన్నది కాన యెల్లరను వదిలి తపస్సుకు వెళ్ళింది.

ఇంక శ్రీనాథుడు హరవిలాసమను పేరుతో ఒకటి రచించెను. అది సంపూర్ణ సంస్కృత భాషాంతరీకరణ కాదుకాని గౌరీకల్యాణము కాళిదాసు కుమారసంభవమున కాంధ్రీకరణముగనే కనపడుచున్నది.

ఉ॥ అధోపయంతారమలం సమాధి నా
　　నరత్న మన్విష్యతి మృగ్యతేహితం.

దీనికి శ్రీనాథుడు "దేవలోక నివాసంబున కాశపడెదరేని అది వృథాశ్రమంబు. నీ పుట్టినిల్లు దేవభూమియేకదా. తగిన వరుని కామించి సమాధి వహించితివేని అదియు నీకు దగదు. రత్నం బొరునిచే నన్వేషింపబడునుగాని ఒరు నన్వేషించునే"—ఇలా మాయాబ్రహ్మచారి చెప్పి నను ఆమెపట్టుదలవదలలేదు. శివుడు నిజరూపము చూపించి.

　　అరుదగు నీతపంబునకు నమ్మడువోయితి నేలుకొమ్ము నీ
　　వరవుడనంచు శూలి ప్రియవాక్యములం దగ గారవింపగా
　　ధరణి ధరేంద్రనందన యుదగ్రతపోవహనీయవేదనా
　　భర మఖిలంబువీడ్కొలిపె భావమునం
　　　　　　　　బరితోషమందుచున్.

శివుడి మాట అన్నకతనే తన తపస్సువల్ల కలిగిన భార మంతయు ఒక్కసారి పోయినట్లు అయిందట ఉమకు. ఇది సాధ్వీమతల్లి కుండవలసిన లక్షణాన్నే చూపించాడు కవి. శివుడు బ్రాహ్మణ రూపములో వచ్చి ఆతనిలో నుండు దోషములు చెప్పి వారించినను ఆమె తన పట్టును విడువలేదు. అందువల్ల నామెలోనుండు భక్తి శ్రద్ధలకు ఆ పన్నగాభరణుడు తన నిజరూపాన్ని చూపించాడు. తరువాత నా పార్వతీపరమేశ్వరులకు వైభవోపేతముగ వివాహము జరిగినది. తరువాత పార్వతి తన పాతివ్రత్య మహిమచేత సర్వలోక పూజ్యురాలైంది. భారతీయులకు జగజ్జనని మహిషాసురాదులను మర్దించింది. ఆశ్రయించిన వారిని అందల మెక్కించింది. అందులో కాళిదాసుడే యగ్రతాంబూలం. మూగవాడు దేవి నారాధించి స్వచ్ఛ మైన వాక్కు పొంది 500 శ్లోకములతో దేవిని కొని యాడినాడు. ఆతనిపేరు మూక కవి. ఆ శ్లోకాలు ఆరు మాసాలు పఠిస్తే ఆశుకవిత్వం వస్తుందని ప్రతీతి. ఆ యుమాదేవియే కాళి యని, బాల యని, త్రిపురసుందరి యని, దుర్గయని, కామాక్షి, మీనాక్షి, విశాలాక్షియని, అన్నపూర్ణయని ఆయాప్రదేశములలోనుండు భక్తులచే పిలువబడుచున్నది.

రుక్మిణి వివాహసమయంలో గౌరీపూజకు తీసికొని వెళ్ళినప్పుడు తనకు కృష్ణుని పతిగా చేయుమని ఉమనే ధ్యానించింది.

ఉ॥ నమ్మితి నామనంబున సనాతనులైన యుమా
　　　　　　　　మహేశులన్
　　మిమ్ము బురాణదంపతుల మేలుభజింతుగదమ్మ మేటి పె
　　ద్దమ్మ దయాంబురాశివిగదమ్మ హరింబతి సేయుమమ్మ ని
　　న్నమ్మినవారి కెన్నడును నాశము లేదుగదమ్మ
　　　　　　　　యీశ్వరీ.

ఆదిశక్తి- దయాస్వరూపిణి. అందుకనే పోతన "దయాంబురాశి" యన్నాడు. అంతులేని దయకలదన్న మాట. అట్టి పరమపావనియైన యుమాదేవిని యెల్లరును దినము ధ్యానించి నట్లయిన వాంఛితములను నెరవేర్చ గలదు.

★

కృషీవలుడు

కవయిత్రీ తిలక శ్రీమతి వసంతాదేవి

తొలి ప్రొద్దుపొడుపు చేతులనుండి బంగారు
　　పూత పూయుచు నున్న లేతయెండ,
చల్లగా మెల్లగా చనుదెంచి యుల్లంబు
　　కొల్ల గొట్టుక పోవు పల్లగాలి,
కలకలారవముల చెలిమి కల్మల దెల్ప
　　పలుకరించుచు నున్నపక్షిగణము,
పసిడి తలల్ వంచి ముసి ముసి నగవుల
　　మంటి తల్లికి మ్రొక్కు పంటచేను,

అందములు చిందు నానంద మందిరమున
కతిథులం జేసి భావరసామృతమ్ము
నీయ గ్రోలుచు నుంటివా హాయి మీర
కలి కృషీవల, నీ భాగ్య గరిమ మెంతొ!

* చెడ్డసంగాతంపు బెడ్డల నేరుచు,
　　దోర్బల దోషాల దుక్కి దున్ని,
బలిమి కల్మలు తల మానికము లైన
　　వెల లేని సుగుణాలవిత్తు చల్లి,
కరుణ, జ్ఞానము, హితకార్య మాదిగ గల్గు
　　నొక్కొక మొక్కనే యూడ్పు చేసి,
చిరకాల తపముల తిరిగి సాధించిన
　　కూర్మిరాసుల నెల్ల కుప్ప వోసి.



రచయిత్రి

సేవ, సంప్రీతి వృషభాలచేత నూర్చి
స్వార్థభావంపు పొల్లుల నడ్డు పట్టి
పరహిత మ్మను పంటను పురుల గట్టి
కలి కృషీవల. నీ భాగ్యగరిమ మెంతొ!

కొండల పిండుపోలికను కోర్కులు
　　తారల నంటుచుండు నీ
నిండు మనమ్ము లోని నవనీత
　　సమాన స్వభావ పుంజముల్
పండిన పంటకై తగిన భాగ్య
　　ఫలమ్ము లొసంగ తృప్తిమై
నుండుమి ఓ కృషీవల, మహోజ్జ్వల
　　భాగ్య విధాతవై యిలన్!

పంటలేని నడుమ నొంటిగా గూర్చుండి
మూగవోవు గుండె రాగ మొలుక
తావు లెన్నొ చిమ్ము భావ సమాధిలో
కరగి పోవు భాగ్యగరిమ మెంతొ!

ఎండి కృశించుచు న్నొరియ లిచ్చుచు
　　గ్రీష్మపు మండుటెండలో
బెండయి పోవగా గని గభీర
　　మనమ్ము కరంగ మేఘ దే
వుండు దయార్ద్రశీతల వపుష్కుడు
　　ధారలచేత తన్పగా
గుండెలు పొంగి పొర్లి కనుగొల్కుల
　　నిండ కృతజ్ఞమూర్తివై

తొలకరించిన పులకలు మొలక లెత్త
తలకు చిరునవ్వు పంటల నొలకబోసి
ఆణిముత్యాల నీరాజనాదిక మిడు
పుణ్యజనకల్పవల్లి మా పుడమితల్లి

ఎండ వాన యనక యెల్లవేళలయందు
తనువు వంచి, వేయి కనులతోడ
తన్ను గొల్చుచున్నదాసుల దయతోడ
కలుము లొసగి కాచు గాక సతము!

సంస్కృతము ఆదిభాషయా?

★

శ్రీ కొత్త భావయ్య చౌదరి

★

మనదేశములో నున్న భాషలన్నిటికీ సంస్కృతమే ఆదిభాషయనీ, దానికి మూలము వైదిక భాషయనీ, చాల మంది సంస్కృత పండితులు నుడువుట పరిపాటి యైపోయినది. కాని దీనిని గురించి పరిశోధన చేసిన గొప్పశాస్త్రజ్ఞులది తప్పని తలంచుచున్నారు. మన దేశములో ఆర్యులు ప్రవేశించకపూర్వమే గొప్ప నాగరికతయు, రాజ్యములు, నగరములు, భాషా లిపులు సైతము ఉండి యార్యులచే నాశనమొనర్పబడినట్లు ఋగ్వేదాదులందు స్పష్టముగా చెప్పబడియున్నది. మహెంజోదారో, హరప్ప ప్రదేశములలో లభించినశిథిలనగరములు, అచటి వస్తు విశేషములు, లిపులు ఆర్యులకు పూర్వపు నాగరికతను, భాషను, స్పష్టము జేయుచున్నవి. అచట దొరికిన మట్టి సీళ్ళలోగల లిపి ద్రావిడ సాంప్రదాయమని కొందరు చరిత్రజ్ఞు లభిప్రాయ పడిరి. ఋగ్వేదములో ఆర్యులు తమ శత్రువులను దస్యులని పేర్కొనిరి. ఆనాటికి వీరు కోటలు గట్టుకుని చక్కగా రాజ్యపాలన జేయుచు, ఆర్యులకన్న హెచ్చు నాగరికులైయున్నట్లు పరిశోధకులు తలచుచున్నారు. ఆర్యులకు లిపిలేక, శ్రుతులు నోటితో వల్లించు కాలమునాటికే, ఆర్యుల శత్రువులగు దస్యరాజులకు లిపి యున్నట్లు మహెంజోదారో, హరప్ప ప్రదేశ విశేషములు ఋజువుపరచుచున్నవి. అది మూల ద్రావిడభాషా లిపియని గొప్ప పండితుల విశ్వాసము. అందుచే వైదికభాషా లిపులకన్న ప్రాచీనమైన యొక భాషయు లిపియు మన దేశమున నున్నట్లు నిశ్చయింప వచ్చును. దాని పేరేదైనను ఋగ్వేదములో ఆర్యులు వారి నాగరికతను రూపుమాపి, వారి కోటలు వగైరాలు వశపరచుకొని నాశనము చేసినట్లు కనపడుచున్నది.

ఇంద్రుడు ఆర్యవర్ణుల నుద్ధరించువాడనియు, ననేక దస్యుల నీరీతిగా సంహరించుచుండెననియు, దస్యులు అవ్రతులు అనగా నియమము లేనివారనియు, అవ్రతులు అనగా యజ్ఞయాగాలు చేయనివారనియు, వారిలో చాల మందిని గుహలలో బెట్టుచుండెననియు ఋగ్వేదము 1,2,3,4 మండలములందు చెప్పబడియున్నది.

ఆర్యులకు మొదటి రాజగు యింద్రుడు, ప్రాచీన రాజుల నందరిని ధ్వంసముజేసినట్లు ఋజువు అగుచున్నది. అందుచేత ఆనాటివరకు ఉన్న నాగరికతలో చాలా భాగము నశించి, ఆర్యనాగరికత, వారిభాష, వారి శ్రుతులు మొదలైనవి ప్రాచీన ప్రజలలో ప్రవేశించి, క్రమముగా వారి భాషానాగరికతలకు మార్పు వచ్చినను, ఆర్యభాష యగు వైదిక భాషనుండి, యుద్భవిల్లిన సంస్కృతమునుండి మాత్రమే ప్రపంచభాషలన్నియు జనించెనని వాదించుట సహేతుకముగాదు.

ఆర్యులీ దేశములో ఆదిమవాసులనియు, యిచటి నుండియే యితర దేశములకు వెడలిరనియు కొందరు పండితులు వచింతురుగాని యావిషయము కొన్నిదేశములకే వర్తించును. పై ఋగ్వేద విషయములనుబట్టి ఆర్యులు మొదట మనదేశమునకువచ్చి, కొందరు ఆదిమవాసులను వెడలగొట్టినట్లు, నశింపజేసినట్లు, కొందరిని లోబరచుకొన్నట్లు దృఢముగా చెప్పవచ్చును— వీరు ద్రావిడభాషా సంప్రదాయకులు గానిచో మరెవ్వరగుదురు? నేడు ద్రావిడ భాషా కూటమిలోనివిగా చెప్పబడుచున్న కొండు, మాల్టు, ఒరియాన్, పషై, షీనా, తమిళ, కన్నడ, తెలుగు భాషలన్నియు హిందూదేశ ప్రాచీన ఆదిమనివాసుల భాషా సంప్రదాయములనుండి యుద్భవిల్లినట్లు చెప్పవచ్చును. గాని కేవలం సంస్కృత భాషలోనుండి యుద్భవిల్లెననలేము. ఈ భాషలలోని ధాతువులు వేరువేరుగా గనబడుచు, దగ్గరిసంబంధములు కల్గియున్నవి. వాక్యములందు కర్త, కర్మ, క్రియలు వరుసగా ద్రావిడ భాషలో నున్నవిగాని సంస్కృతమున నట్లులేదు. ఇట్లనేక గుర్తు

లను భాషా పరిశోధకులు తెలుపుచున్నారు. కాని ఆర్య సంస్కృతి, భాషలు వేల సంవత్సరాలకు పూర్వమే మన దేశములో, మన భాషలలోనికి ప్రవేశించుటవల్ల, మన భాష లిప్పుడు మొదటి స్వరూపములు గుర్తు పట్టలేనంతగ మారిపోవుట మాత్రము నిజము. ఇప్పటికి అనేక యితర భాషాపదములు గూడ జేరినట్లు స్పష్టముగా తెలియు చున్నది. తెలుగుభాష ప్రాచీన ద్రావిడభాషనుండి యుత్పత్తియై, వైదిక సంస్కృత, ప్రాకృత భాషా సమ్మేళనమున పరిణతిజెంది, యితర భాషా పదములచే పరిపూర్తి జెందుచున్నట్లు విశ్వసించవలసియున్నది. పంజాబీ, హిందీ, గుజరాతీ, మరాటీ, ప్రాకృత, సంస్కృత భాష లొకే కూటమివైనను, అవి కొన్ని ప్రాచీన భాషా కూటములలో కలియకపోయినట్లు వేరుపడి యుండవు. పైశాచి, మాగధి మున్నగు ప్రాకృతభాష లిట్లేర్పడినవే. ఆర్యులు మనదేశమునకురాకపూర్వము నాటిదే మహెంజోదారో, హరప్పల నాగరికత, భాషలు నని పురాతన శాస్త్రవేత్తల యభిప్రాయము. ఆర్య నాగరికతకన్న మిక్కిలి హెచ్చుగా నున్నట్లు చెప్పబడిన యీ ద్రావిడ లేక దస్య నాగరికత, భాషలు సంపూర్ణముగా మనదేశమున నశించి, కేవల వైదికభాషయు, తజ్జనిత భాషలు మాత్రమే ణ్ణలోప, వర్ణాగమాదులచే నుత్పత్తి యైనట్లు చెప్పుట పరిహాస పాత్రము.

వైదిక, సంస్కృత భాషలలోగూడ మనదేశ ప్రాచీన వైదికేతర, సంస్కృతేతర పదములు క్రమముగా కొన్ని చొచ్చినట్లు కనబడుచున్నదిగాని, యివి చాల స్వల్పములు. పూర్వము అధికార భాషలగు వీనికి తక్కిన వానినుండి హెచ్చుగా తీసుకొనవలసిన యావశ్యకతలేదు. ఇదిగాక మన దురదృష్టవశమున ఆ వేదకాలపు ద్రావిడ భాష యప్పటిరీతి ననగా ఆర్యులు మనదేశమునకు వచ్చు నాటి కున్నరీతిని తెలుపు సాధనములు దొరకలేవు. అందుచేతనే వేదములలో నితర భాషా పదములున్ననూ అవి యా భాషలోనివిగనే లెక్కించుట మన పండితుల కలవాటైపోయినది. ఆర్యులలో బహు ప్రాచీనుడగు అగస్త్యుడు ద్రావిడ దేశమునకు వచ్చి వారి భాష నేర్చి దానికొక వ్యాకరణము రచించినట్లు చెప్పుదురు. అప్పటినుండి వైదికభాషా సంపర్కము ద్రావిడ భాషలకు కల్గియుండును గాని వైదిక భాషనుండియే ద్రావిడ భాష యేర్పడెననుట చరిత్రను విస్మరించుటే. ఎన్ని యితర భాషాపదములు శబ్దములు తీసుకొన్నను, ద్రావిడ భాషలు వేరుగా నిలిచి, వాని వ్యక్తిత్వములను చూపుచున్నవి. ★

తెలుగు శతకములు

"శతకా లల్లినవారు క్షుద్రులనుచున్ శాస్త్రజ్ఞులం ద్రద్దిరా!
శతకా లల్లనియట్టి కోవిదులహో క్ష్మామండలిం గల్గిరే?
శతకా లల్లినవారు కారె కన ధూర్జట్యాదు లవ్వారి యా
యశకీర్తింగొరయేమి కల్గినది దక్షారామ భీమేశ్వరా!"

★

శ్రీ కురుమెళ్ళ వేంకట రావు

★

శతకములు అనేవి ఆ యా కవుల మనోభావాలను వ్యక్తపరుస్తూ భగవంతుణ్ణి ఉద్దేశించి వ్రాయబడిన నూరు పద్యముల కావ్యఖండములు, ఆది కవులు నన్నయాదులు పురాణములను తెలుగు చేయడంతో తెలుగు వాఙ్మయం ప్రారంభించినది, శతకములుకూడ ఆదినుండియు తెలుగు వాఙ్మయానికి అమూల్యాలం కారణములైనవనిచెప్పడానికి సందేహంలేదు, రాయల కాలంలోనే ప్రబంధాలకు శంఖు స్థాపన జరిగి మొదటి ప్రబంధముగా మనుచరిత్ర కవితా పితామహుడైన అల్లసాని పెద్దనచే రచింపబడి వెలుగొందినది. క్రమంగా అనేక ప్రబంధములు విలసిల్లి ఆంధ్ర వాఙ్మయము సర్వసంపన్నమైనదిగా తయారైనది. దండకములు భగవంతుని స్తోత్రపాఠములై జటిల సమానభూయిష్టములై నారికేళ పాకమున విలసిల్లిననూ, శ్రోత్రపేయముగ నుండెడివి.

శతకములు సుమారు నూరు పద్యములకు తక్కువ కాకుండ చెప్పబడినవి, ఆ యా కవియొక్క ఇష్టదైవ నామము పద్యాంతమున వచ్చునట్లు సంతరింపబడి సంబోధనాత్మకముగ నుండుటచే నూరు మార్లు తమ ఇష్ట దైవమును నోరార నుచ్చరించి తన హృదయావేదనను సముఖమున నివేదించుకొనునట్లు, ఎదుటనే తన దైవతము నిలిచియున్నట్లు, తన కష్టసుఖము లాతనితో నివేదించుకొన్నట్లు, కవి ఆనందించుచున్నాడు. అలాగే "దాశరథీ కరుణాపయోనిధీ" అని రామదాసు అనే కంచర్ల గోపన్న, శ్రీకాళహస్తీశ్వరా అని ధూర్జటి, సీతాపతీ అని సాహెబ్‌రాణ రామకవీ, 'వైరిహరరంహ 'సింహాద్రి నారసింహ అని గోగులపాటి కూరనాథకవి, రామలింగేశ రామచంద్రపురవాస, అని అడిదము సూర కవీ, మదరిభువిపాల మునిజనహృదయలోల వేణుగోపాల భక్త సంత్రాణశీల అని వంకాయలపాటి వేంకట కవీ ఎన్నో విధాల తమ తమ ఇష్టదైవాలను ప్రస్తుతించి, భూషించి, తిరస్కరించి- దూషించి కూడా- ప్రార్థించి తమ కష్ట సుఖాలను నివేదించుకున్నారు. ఇలాగే ఎందరో కవులు, ఎందరి దేవుళ్ళనో ఎన్నో విధాల కొనియాడారు.

ఇవిగాక, నీతి బోధాత్మకములైన శతకములు కూడ కొన్ని వెలసినవి. "సుమతీ" "కుమారీ" మొదలైనవి, తమకు తామే సంబోధించుకుంటూ, నీతులూ, లోకానుభవాలూ, సచ్ఛీలమూ, మున్నగువానిని ఉటంకించుకుంటూ వ్రాసిన శతకాలుకూడా వెలువడ్డాయి—

గువ్వలచెన్న శతకం, కవిచౌడప్ప శతకం, మానస బోధ శతకం మున్నగునవి అలాంటివే.

భక్తిశృంగార రసములకుగల సన్నిహితత్వమును పురస్కరించుకొని, శృంగార రసపూరితములై భక్తిని ప్రతిపాదించు శతకములు కూడ సంతరింపబడినవి. ఇందుకు ఉదాహరణ పోలిపెద్దివేంకటరాయకవి రచించిన లావణ్య శతకము.

కొంత కాలమునకు శతకరచన ప్రతికవికి ఒక తప్పని సరియైన ముఖ్యావసరమైనట్లు కనబడుచున్నది. అది వారికి

పద్యరచనము అలవాటు చేసుకొనుటకు ఉపయోగించు ననియు, భగవంతుని స్తోత్రముచేయుటచే ఉభయతారకముగ నుండుననియు భావించబడిన ట్లనిపించుచున్నది. సర్వాలంకార సమన్వితమై, అర్థోక్తి యుక్తమై, చిత్ర కల్పనారంజితమై, శ్లేషాత్మకమై, భావబంధురమై వివిధ రీతుల సంఘటితములైన పద్యరాజము లెన్నియో ఇందు కలవు.

లెక్కకు మించిన ఈ శతకములను గూర్చి స్థూలముగ తెలుసుకొనుటకన్న వేర్వేరు వైశిష్ట్యంతో వివిధానుభవాలతో నిండియున్న వీనిని ప్రత్యేకముగా ఒక్కొక్కదానిని గూర్చి సూక్ష్మముగ తెలుసుకొనుట ప్రతి ఆంధ్రుని కర్తవ్యమైయున్నది. శైలికి, భావగాంభీర్యమునకు, పద గుంభనమునకు, రచనా చమత్కృతికి కొన్ని శతకములు పేరెన్నికగన్న కావ్యములకు తీసిపోవు.

సామెతలు, లోకోక్తులు, ధర్మసూత్రాలూ అక్కడక్కడ జొనుపబడి అప్పటి జాతియ జీవితములోని పరిస్థితులను, వాతావరణమును, చారిత్రక సంఘటనలనూ ప్రస్ఫుటముగ చిత్రించిన పద్యము లన్నిశతకములలోనూ కానవచ్చుచున్నవి.

"సెన రావంతయు లేనివాడవుకదా
 నీవా జగన్మాత సీ
తను తప్పించక అగ్ని దూరుమన డెం
 దం బొప్పి యున్నట్టి నీ
కు ననున్న ల్గడగండ్ల పాల్పరచుటల్
 గొప్పానె నిన్ రవ్వజే
సెన మేలేమిక నేటికిన్ తెలియవ
 చ్చెన్ గట్టు సీతాపతీ"

అని సాహెబ్ రాణ రామకవి తన సీతాపతి శతకములో శ్రీరాముని స్తోత్రం చేసి చేసి, ప్రార్థించి ప్రార్థించి, విసుగెత్తి దయమాలినవాడు అని భగవంతునియెడ నిష్ఫ్రహను వెల్లడించుకున్నాడు.

"కరినేలింది హుళక్కి ద్రౌపదికి కో
 కల్మెచ్చి ఇచ్చింది దబ్బర కాకా
సురునిం కటాక్షమున చే
 పట్టెం దబదంబహో!
శరణన్నన్ పగవానితమ్మునికి రా
 రాజ్యంబిచ్చుటల్ కల్ల ఇ
త్తరి నన్నేలిన నిక్క మీ కథలనం
 తా భావనారాయణా!"

అలాగే ఒక కవి మున్నెన్నడో ఎవరినో ఆపదలనుంచి రక్షించి కటాక్షించిన కథలన్నీ ఉత్త అబద్ధాలనీ, ఇప్పుడు తనను రక్షిస్తేనే ఆ కథలన్నీ సత్యాలుగా నమ్ముతాను అనిన్నీ వాపోయాడు.

భగవంతునికి కూడా ప్రచారం కావాలి అన్నట్లు రామదాసు తన ఇష్టదైవము భద్రాద్రి రామునికి మించిన రెండవ దైవం ఈ భూమిమీద లేదని అతని గుణగణాలనూ, సామర్థ్యాన్నీ పొగుడుతూ ఏనుగు ఎక్కి ప్రళయగంభీరంగా లోకానికి దండోరా వేసి చాటుతాను అని ఈవిధంగా అన్నాడు.

భండనభీము డార్తజన
 బాంధవు డుజ్జ్వలబాణతూణ కో
దండకళాప్రచండభుజ
 తాండవకీర్తికి రామమూర్తికిన్
రెండవసాటి దైవమిక
 లేడనుచున్ గడగట్టి భేరికా
డాండ డడాండ డాండ నిన
 దంబు లజాండమునిండ మత్తవే
దండము నెక్కి చాటెదను
 దాశరథీ! కరుణాపయోనిధీ!

తెలుగునాట రామభక్తులలో నాయకమణి అయిన గోపన్న రచించిన ఈ శతకం బహువ్యాప్తమై

దాసినచుట్టమా శబరి
 దాని దయామతి నేలినావు నీ
దాసునిదాసుడా గుహుండు
 తావక దాస్యమొసంగినావు నే
జేసిన పాపమో వినుతి
 చేసిన కావవు కావవయ్యా నీ
దాసులలోన నేనొకడ దాశరథీ! కరుణాపయోనిధీ!

వంటి పద్యము లనేకములు పండిత పామరుల నోట తరుచు వినవచ్చుచుండును.

పిఠాపురంలో వెలసిన కుక్కుటేశ్వరస్వామి నుద్దేశించి భానుకవిలాస పీఠికాపురనివాస, కుముద

హితకోటి సంకాశ కుక్కుటేశ ! అని సీసపద్యాంతమున సంతరించి నీతిబోధకములైన పద్యములను

"న్యాయపద్ధతి భూషణము ధరాధిపునకు
పొలతికి మానంబు భూషణంబు
శమదమంబులు భూషణములు నిశ్చలునకు
పొసగనింటికి సతి భూషణంబు
నరుని కల్మికి భూషణము దానవైఖరి
భూసురునకు విద్య భూషణంబు
నలినబంధుడు భూషణము నభోవీధికి
పుడమికి సస్యంబు భూషణంబు

బుధులకెప్పుడు నీ పదాంభోజయుగళ
పూజనాసక్తి వెలలేని భూషణంబు
భూనుత విలాస పీఠికాపుర నివాస
కుముదహితకోటిసంకాశ కుక్కుటేశ.

ఈవిధముగా కూచిమంచి తిమ్మకవి రచించాడు.

కవిచౌడప్ప శతకములోని పద్యములు అశ్లీలములనియు, హాస్యప్రధానములనియు, జుగుప్సాకరమైనవనియు పేరు బడినవి. కాని

ఇయ్యగ ఇప్పించగల
యయ్యలకే కాని మీస మందరికేలా
రొయ్యకులేదా మీసము
కయ్యమునకు కుందవరపు కవిచౌడప్పా !
విద్దెల మే లెరుగని నరు
డెద్దేగా గడ్డితినెడిదెద్దా ? పశులం
దెద్దుకు కొంత వివేకము
గద్దప్పా ! కుందవరపు కవిచౌడప్పా !
రంగేశుని సమదైవము
గంగకు సరియైననదియు కానము జగతిన్
బంగారువంటి లోహము
సంగీతమువంటి విద్య కవిచౌడప్పా !

వంటి పద్యము లనేకములు నీతి దాయకములై కన్పట్టుచున్నవి.

శ్రీకృష్ణ లీలలన్నా, గోపికా ప్రణయ గాథలన్నా సర్వ జనులకూ ఆనందదాయకముగా ఉంటాయి. గోదావరీ పావనోదకాలను పానం చెయ్యడంవల్ల రససిద్ధమైన మనస్సుతో బాలగోపాల శతకము, కృష్ణలీలామృతమును భక్తిరస పూరితములైన గ్రంథములను రచించిన పుసులూరి సోమరాజామాత్యకవి 'ఇందు' శతకమనే శతకమును మనోహరముగ రచించాడు. దీనికే చంద్రదూత అని ఇంకొక పేరు కలదు. ఇందు విప్రలంభ అగు ఒకానొక భక్తురాలు చంద్రోదయ సమయమున చంద్రుని ఉద్దేశించి బృందారణ్యంలో ఉన్న శ్రీకృష్ణునిగూర్చి

బృందారణ్యము సేమమా ? అచటి గో
బృందంబులున్ లెస్సలా
నందుండున్ సతియున్ సుఖాన్వితులె ? నా
నా గోపగోపాలికా
సందోహంబులతో హలాయుధుడు, కృ
ష్ణస్వామి క్రీడింతురా
ఇందూ ! నందుని మందనుండి గద నీ
వేతెంచుటల్ రాకలన్.

అని ఎంతో ఆప్యాయంగా అడుగుతుంది. తరువాత

మందన్ రేపటిమాపు వచ్చుతరి ప్రే
మం కృష్ణు నీక్షించి నా

చందంబంతయు తెల్పి యాతనికి, నా
 సాష్టాంగముల్ చెప్పి గో
విందుం దోడ్కొనిరమ్ము నీయుపకృతిన్
 వేయేండ్లమన్ మర్వనో
ఇందూ! నందుని మందనుండిగద నీ
 వేతెంచుటల్ రాకలన్.

ఇందలి పద్యములన్నియు శార్దూలవిక్రీడితము లగుటయే గాక ప్రాసాక్షరము 'ద' అన్నింటను ఒక్కటే యగుట విశేషమై మృదుమధురమైనశైలితో కవితామాధుర్యమును వెదజల్లుతూ ఉండుననుటకు సందేహములేదు.

సింహాచల దేవాలయమును ఆక్రమించి ధ్వంసము చేయుటకు మహమ్మదీయులు దండయాత్ర సాగించు చుండగా భక్తకవి అయిన గోకులపాటి కూర్మనాథ కవి తన మనోవేదనను భరించలేక నూరు సీసపద్యములు "వైరిహరరంహ సింహాద్రి నారసింహ!" అని రచించాడు. వరాహలక్ష్మీనరసింహ శతకమునకే సింహాద్రి నారసింహ శతకమనే నామాంతరము కలదు. ఈ కవి ఎత్తిపొడుపులకూ, దూషణవాక్యములకు ఓర్వలేక నరసింహమూర్తి ఒక తుమ్మెదల దండును తురకలమీదికి పంపెననియు వారు చెల్లాచెదరైపోయిరనియు కథగా చెప్పుకొందురు.

యవనధాటికి భయమందియే కాబోలు
 అక్కజంబుగ కొండ ఎక్కినావు
ఖానులకడలిరె కాబోలు సంపూర్ణ
 పౌరుషంబున కత్తి బట్టవైతి
నఖిలపాశ్చాత్యుల నలమలేకయపోలు
 తాపసగతి జడ దాల్చినావు
మ్లేచ్ఛనాయకబలాలికి జంకికాబోలు
 మిక్కిలి గంధంబు మెత్తినావు.

గట్టిగానీవు తురకలు ముట్టకుండ
నవవరాహాకృతి ధరించినావు స్వామి
వలదు నిందలబడ తురుష్కుల వధింపు
వైరిహరరంహ సింహాద్రి నారసింహ.

ఎన్ని ఎత్తిపొడుపు మాటలతో దేవుని ఉద్బోధించాడు :

కాంతలజెరబట్ట కనుగొనుచుంటివి
 పాంచాలి వెతయెట్లు బాపినావొ
గోవధసేయ గన్గొనుచుంటి విప్పుడు
 కరుణతో కరినెట్లు గాచినావో
ద్విజులుబాధలంపడ తిలకించుచుంటివి
 భువి కుచేలునినెట్లు బ్రోచినావొ
సత్ప్రభురాజ్య నాశనమొంద గంటివి
 ధ్రువుని కెట్లిచ్చితో దొడ్డపదవి

దుష్టశిక్షణమొనరించి శిష్టరక్ష
జేయకుండిన పూర్వప్రసిద్ధిచెడును
ఆర్తరక్షణ బిరుదంబు హానిజెందు
వైరిహరరంహ సింహాద్రి నారసింహ !

అని, ఇప్పుడు యవనుల బారద్రోలకున్నచో మున్నతని కున్న దుష్టశిక్షణ శిష్టరక్షణ బిరుదమునకు ముప్పు వచ్చి అపకీర్తికి పాలవుదువని భగవంతుని హెచ్చరించాడు.

తపనీయకశిపుండు దండించు తరువాత
 గాని ప్రహ్లాదుని కావలేదు
కురురాజు పాంచాలి కొప్పుపట్టీడిపించిన
 వెనక గాని రక్షింపలేదు
కరిరాజు మొసలిచే కడుకష్టపడిన పిమ్మట
 గాని వేంచేసి మనుపలేదు
పాండవు ల్బాధలు పడిన యనంతరంబున
 గాని సిరులిచ్చి బ్రోవలేదు

భక్తులెప్పుడు కొన్ని ఆపదలుపడక
ముందు పోషింప నట్లయకా కొందరికిని
మును శిశువునేడిపింపక ముద్దురాదు
వైరిహరరంహ సింహాద్రి నారసింహ !

చిన్నపిల్లలను ఎందరో ఎన్నివిధాలగానో లాలిస్తారు. కొందరు ముద్దు పెట్టుకుంటారు. కొందరు ముంగురులను ఒత్తుతారు. కొందరు బుగ్గలు నిమురుతారు. కొందరు గిల్లి పిల్లవాణ్ణి ఏడ్పించి తరువాత తమ హృదయాలకు అత్తుకొని ముద్దుపెట్టుకుంటారు. ఆ విధంగా తమను ముందు బాధలు పెట్టి తరువాత రక్షించాలని చూస్తున్నావా అని భగవంతుని సోదాహరణంగా ప్రశ్నిస్తాడు.

సుబోధకమై సులభశైలిలో రచింపబడి, సర్వులకూ అర్థం అయేటట్టు భక్తి, నీతి వైరాగ్యములను ప్రతిపాదిస్తూ ప్రజానీకంలో ఎక్కువ ఆమోదం పొందిన నృసింహశతకం ప్రశస్తిగన్న శతకాలలో ఒకటి. దీనిని

హైదరాబాదు రాష్ట్రంలో ధర్మపురి అను గ్రామమున వెలసిన నృసింహస్వామి నుద్దేశించి శేషప్పకవి రచించాడు. మచ్చునకు ఒక పద్యం ఉదహరిస్తాను.

బ్రతికినన్నాళ్ళు నీ భజన తప్పను గాని
మరణకాలమునందు మరతు నేమొ
ఆవేళ యమదూత లాగ్రహంబున వచ్చి
ప్రాణము ల్వెకలించి పట్టునపుడు
కఫవాత పైత్యముల్ కప్పగా బరచేత
గంపముద్భవమంది కష్టపడుచు
నా జిహ్వతో నిన్ను నారాయణా యంచు
పిలుతునో శ్రమచేత పిలువలేనొ

నాటి కిప్పుడె భక్తి నీనామమిదిగో
తలచెదను చెవి నిడవయ్య ధైర్యముగను
భూషణవికాస శ్రీధర్మపురనివాస
దుష్టసంహార నరసింహ దురితదూర.

ఈశతకంలో చాలా పద్యాలు శ్రీమనోహర, పద్మలోచన. నరసింహ, ఆదినారాయణ, ఇభరాజవరద, భువనరక్షక, తాపసార్చిత, దనుజారి, కమలలోచన, కువలయశ్యామ, పుండరీకాక్ష, పక్షివాహన, పద్మాక్ష, గరుడవాహన, భువనేశ, నాగేంద్రశయన ఇత్యాది చక్కని సంబోధన పదంబులతో ప్రారంభించబడి నామోచ్చారణచేతనే పద్యములు చదువ నిచ్చగొలుపుచుండును.

ఇంక కాళహస్తీశ్వర శతకం తీసుకుందాం. కాళహస్తీశ్వర మహాత్మ్యం అనే ప్రబంధాన్నీ, కాళహస్తీశ్వర శతకాన్నీ ధూర్జటి కవి రచించాడు. కృష్ణరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజములలో నొకడుగా పరిగణింపబడిన ఈ ధూర్జటికి జారుడనే ప్రశస్తి గలదు. ఆయనే అన్నాడు "కాయల్గాచె వధూనఖాగ్రములచే కాయంబు" అని యౌవనం అంతా ఖర్చయిపోయిన తరువాత సంసారంమీదా, మన్మథవిహారంమీదా రోత పుట్టి "విరక్తు చేయగదవే శ్రీకాళహస్తీశ్వరా" అని అన్నాడు.

"సుకుమారవార వనితా జనతాపహార సంతత మధురాధరోదిత సుధామధుధారలు క్రోలుట" వలన అతనికబ్బిన వేవికం చివరి రోజుల్లో "అంతా మిథ్య తలంచి చూచిన" "శరీరఘటనంబంతా విచారంబె." మహాకవియగుటవలన నీతిని శతకమందలి పద్యములు భావపూరితములై కావ్యధోరణిలో నడిచినవి. సామాన్యులకు అలభ్యమైన మహద్భోగములు అనుభవించి రాజులను సైతము అసహ్యించుకుని వాళ్ళని దుమ్మెత్తిపోశాడు. శ్రీకాళహస్తీశ్వరునిలో సాయుజ్యంపొంది తమ పేళ్ళచే తనే ఈశ్వరునికి నామకరణం చేసిన చెలదిపురుగు పన్నగము, కరిరాజు, తన శ్రద్ధాభక్తులచే ఈశ్వరునిచేత కూడ మాంసమును భుజింపచేసి, తన కన్నులను సైతము ఊడబెరికి ఈశ్వరునికి అర్పించిన బోయ తిన్నడూ తరుచూ ఈశతక పద్యములందు ఉదహరింపబడతారు.

ఏ వేదంబు పఠించెలూత, భుజంగం
బే శాస్త్రముల్ చూచె తా
నే విద్యాభ్యసనం బొనర్చె కరి, చెం
చే మంత్రమూహించె బో
ధావిర్భావని దానముల్ చదువు ల
య్యా కావు నీపాదసం
సేవాసక్తి యెగాక జంతుతతికిన్
శ్రీకాళహస్తీశ్వరా.

మహారాజుల నాశ్రయించి వారిచేత స్త్రీలను, ఆభరణాలను, వాహనములను బహుమతిపొంది సర్వభోగాలను అనుభవించి ఆ రాజులనీ, భోగాలనీ కూడా నిరసించి జ్ఞానలక్ష్మిని దయసేయమని ప్రార్థించాడు.

రాజుల్మత్తులు వారిసేవ నరక
ప్రాయంబు వారిచ్చు నం
భోజాక్షీ చతురంతయాన తురగీ
భూషాదు లాత్మవ్యథా
బీజంబుల్ తదపేక్ష చాలు పరితృ
ప్తింబొందితిం జ్ఞానల
క్ష్మీ జాగ్రత్పరిణామమిమ్ము దయతో
శ్రీ కాళహస్తీశ్వరా.

కామ క్రోధ మోహాలకు ఒక హద్దు లేదనీ, ఎంత అనుభవించినా ఇంకా మిగిలే ఉంటుందనీ ఉద్ఘాటిస్తూ

అమరస్త్రీల రమించినం జెడదు మో
హంబింతయుం బ్రహ్మప
ట్టము సిద్ధించిన నాసదీరదు నిరూ
ఢ క్రోధమున్ సర్వలో
కముల న్మ్రింగిన మాన దిందుగల సౌ
ఖ్యంబొల్లనీ సేవ జే
సి మహాపాతక వారిరాశి గడతున్
శ్రీకాళహస్తీశ్వరా.

అని అన్నాడు. నీ రూపం ఏదో తెలియదు. ఎందరో భక్తులు నిన్ను ఎన్నో క్షుద్రవస్తువులలో దర్శించారు. నా సందేహాలన్నీ తీర్చి "నా కన్నారన్నపదీయమూర్తి సగుణాకారంబుగా జూపవే చిన్నరేజవిహార మత్తమధుపా శ్రీకాళహస్తీశ్వరా" అని ప్రార్థించుకున్నాడు.

అలంచు స్మెడగట్టి దానికి నప
త్య శ్రేణి గల్పించి త
ద్బాల వ్రాతము నిచ్చిపుచ్చుకొను సం
బంధంబు గావించి యా
మాలర్కంబున బాంధవం బనెడి ప్రే
మం గొందరం ద్రిప్పగా
సీల స్సీల యమర్చిన ట్లొసగితో
శ్రీకాళహస్తీశ్వరా!

అని భార్యా పుత్రాదులయెడ గలుగు ప్రేమ సీల బిగించి నట్లు దృఢతరంచేసి మమ్మిలా మోహవారాశిలో ముంచ తగునా అని మొరపెట్టుకుంటాడు.

వరాహగిరి కొండ్రాజు తన జగన్నాయక శతకంలో ప్రతి పద్యంలోనూ చివరి భాగంలో ఒక ఉపమానం సంధించి నూరు పద్యాలూ రచించాడు. శైలి సులభంగా ఉంటూ పద్యాలు రసవంతంగా ఉంటాయి.

కలలో నైనను సద్గుణ గ్రహణముం
గావించులే కాని త
ప్పులు వట్టంగ దలంప క్యాయెడల నుం
పుణ్యాత్ము లెట్లన్న గుం
డలలో నీళ్ళను బాలునుం గలిపి పె
ట్టి స్నీళ్ళు వర్జించి మే
లై లివిం బాలు గ్రహించు హంసల గతిన్
దేవా జగన్నాయకా!

వేమన శతకం :

"వేమ నిట్లు చెప్పె వేల పద్యంబులు" అని వేమనయే అన్నాడు. అతడు చెప్పిన వేల పద్యములలో ప్రకాశకుల ఇష్టానుసారం నూరు పద్యాలు ఎంచి శతకంగా ప్రక టించారు. వేమన యోగిని గూర్చి ఎంతో చెప్పవలసి ఉంటుంది. ఆటవెలది ఆయన సొమ్ము. ఇతర పద్యాలు కూడా రచించినాడు కాని ఈ సొంపు వానికి రాలేదు. ఇతని పద్యములన్నింటను చెడుగును దూషించినాడు. వ్రతాలూ, ఉపవాసాలూ, విగ్రహపూజలూ మొదలైన ఆడంబర కర్మలన్నింటినీ తెగనాడినాడు. మానవులలో సర్వసమానత్వ మీతని మతము.

మూర్ఖుల పద్ధతిని నిరసించుచూ

అలిమాటలు విని అన్నదమ్ములరోసి
వేరుపడుచునుండు వెర్రిజనుడు
కుక్కతోక బట్టి గోదావ రీదును
విశ్వదాభిరామ వినురవేమ.

దాంభికులను ఉద్దేశించి

పట్టుబట్టగట్టి పట్టిసామము బెట్టి
పట్టి భ్రాంతి జెంది వైష్ణవుడయి
లొట్టిదాగి నతడు లోకుల జెరచురా
విశ్వదాభిరామ వినురవేమ.

అన్నాడు.

మనన వృత్తిలోని మహిమ నెరుంగుచు
మనసునందె పూజ మహిమ గనుచు
మనుచునుండు వాడె మర్మజ్ఞుడగు యోగి
విశ్వదాభిరామ వినురవేమ.

అని విద్వత్పద్ధతిని బోధించాడు.

నూదినంటురాయి సూత్రము గా నాత్మ
సాధనంబు మీరి సంతరించి
పాదుకొల్పు నరులు పరమాత్మ రూపులు
విశ్వదాభిరామ వినురవేమ.

అని దైవ పద్ధతిలోనూ ఇలాగే ఎన్నో వేల పద్యాలు వ్రాశాడు.

మూడేళ్ళవయసు పిల్లల బుడిబుడి నుడువులు వినుటకు ఎంతో ముచ్చటగా ఉండును. మన ఇళ్ళల్లో పూర్వంనుంచీ చిన్నపిల్లలకి నోరు తిరగకముందే కృష్ణ శతకం, కుమారీ శతకం, సుమతీ శతకాలలోని పద్యాలు తల్లి వాళ్ళకి చెప్పి, ఆ చిన్నపిల్లలచేత ఆ మాటలు పలికించి కంఠస్థం చేయించేవారు. ముఖ్యంగా మగపిల్లలచేత కృష్ణ, సుమతీ శతకాలూ, ఆడపిల్లలకి కృష్ణ, కుమారీ శతకాలలోని పద్యాలూ చెప్పేవారు.

మొన్ననే ఒక స్నేహితుని ఇంటికి వెళ్ళేను. ఆయన తన నాలుగేళ్ళ కొడుకును చూపించి, "చూడండీ మా వాడు పద్యాలు చదువుతాడు వినండీ" అని,

"నాన్నా, ఏదిరా మేష్టారి దగ్గర పద్యాలు చదవరా" అనేసరికి వాడు నిలబడి చేతులు కట్టుకుని

నారాయణ పరమేశ్వర
ధారాధర నీల దేహ దానవ వైరీ
క్షీరాబ్ధి శయన యదుకుల
వీరా నను గావు కరుణ వెలయగ కృష్ణా!
హరియను రెండక్షరములు
హరియించును పాతకములు నంబుజనాభా
హరి నీ నామ మహత్త్యము
హరిహరి పొగడంగ వశమె హరి శ్రీకృష్ణా!

ఇంతలో వాళ్ళ అమ్మగారు వచ్చి ఇంకో పద్యం అందించారు. అందించినదే తడవుగా

శ్రీరాముని దయచేతను
నారూఢిగ సకల జనులునౌ రాయనగా
ధారాళమైన నీతులు
నోరూరగ చవులుబుట్ట నుడివెద సుమతీ!

ఎంతో ముచ్చటయింది.

కుమారీ శతకం సాధారణంగా ఆడపిల్లలచేత కంఠస్థం చేయించేవారు. అప్పటికి అర్థం తెలియకపోయినా పెద్ద అయిన తరవాతనైనా అర్థం తెలుసుకుని అందులోని నీతులు కొంతయినా అలోచించుకుంటారనే ఉద్దేశంతోనేమో!

సరకులయెడ జాగ్రత్తయు
జరుకు పనులయందు భక్తి, సుజనులయందున్
గరుణ యనాథుల యెడలం
దరుణికి జెలువారవలయు ధరణి గుమారీ!

విఱుగబడి నడువగూడదు
పరులవడక లెన్ని తప్పుబట్ట జనదు ని
ష్ఠురములు పచింపగూడదు
కఱపగవలె మేలు మేలుగలదు కుమారీ!

మహాభాగవత రచయిత బమ్మెర పోతనామాత్యుడు క్రీ॥ శ॥ 1500 ప్రాంతంలో నారాయణశతకం అను దానిని రచించాడు. ఇందలి పద్యములు భాగవతశైలికి దగ్గర దగ్గరగా ఉండుటవలన ప్రారంభదశలో భాగవతమునకు ముందుగానే రచించి యుండవచ్చును.

ఆంధ్రలోని ఆబాల గోపాలానికీ కూడా నాలుకపై నర్తించే

"ధర సింహాసనమై నభంబు గొడుగై
తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయములెల్ల వంది గణమై
బ్రహ్మాండ మాగారమై
సిరి భార్యామణియై విరించి కొడుకై
శ్రీగంగ సత్పుత్రియై
వరుస న్నీఘనరాజసంబు నిజమై
వర్ధిల్లు నారాయణా"

అనే పద్యము నారాయణ శతకంలోని మచ్చుతునక.

రేమెళ్ళ రామదాసు అనే కవి తన మహిజా మనోహర శతకమున స్వవిషయమునే చెప్పుకొనుచు "పలుక వదేలనో పతిత పావన రామ" "ఇప్పుడు బ్రోవ కున్న మరెప్పుడు బ్రోతువు" "న్యాయముగాదు యింత కఠినమ్ము వహించుట" "ఎంతని వేడుకొందు జగదీశ్వర" "పరమ కృపానిధే" "ఘనుడ వటంచు నమ్మితిన్" మొదలుగాగల వాక్యాలతో తన యిష్టదైవాన్ని పిలిచి చెప్పుకుంటాడు.

మధ్యయుగంలో వందలాది శతకములు బయలు దేరినవి. ఏ కవీ ముందుగా ఒక శతకమును రచియింపక పోలేదు అనిపిస్తుంది. ఇటీవలనే రచియింపబడ్డ శతకములలో భక్తచింతామణి శతకము పేరెన్నికగని ఏకేశ్వరోపాసకులచే తరచు పఠింపబడుచు వచ్చినది.

నీకుం బ్రేమసమానమన్నిటియెడన్
నిక్కంబు సర్వేశ యీ
లోకంబందు సమస్త జంతువుల కె
ట్లో నిత్య మాహార మీ
వే కావే దయసేయుచుందువు తం
డ్రీ అట్లు కాకున్న మం
దాకం బే క్రియ రాతిలో బ్రతుకుచుం
డున్ భక్తచింతామణీ!

ఇదే ఫక్కీలో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రచించిన 'కృపాంభోనిధీ' శతకము, ఆదిపూడిసోమనాథరావుగారు రచించిన 'సర్వమాన్య' శతకము హిందువులే గాక అస్తికులైన సర్వమతముల వారిచేతను పఠింపదగినవై యున్నవి. తెలిసికోదగిన అమూల్య శతకములెన్నో ఉన్నా గ్రంథ విస్తర భీతిచే ఇట పేర్కొనసావకాశము లేనందున విరమిస్తున్నాను. అమృత గుళికల వంటి ఈ పద్యములను మన బాల బాలికలు కొన్నింటినైన కంఠస్థము చేసిన భాషా జ్ఞానమునకుతోడు సత్ప్రవర్తనకూ భక్తియుత జీవితమునకు ఎంతయో తోడ్పడునని ఆశించుచున్నాను.

★

అన్ని నొప్పులకు


అమృతాంజనము

60

సంవత్సరముల
సేవచే
పేరొందినది!




అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు
బొంబాయి
కలకత్తా



భారత మహిళోద్యమ కృషి ఏదీకూడా తగిన ప్రచారసాధకములేనిదే ఫలప్రదమై కొనసాగ జాలదు. 'ఆంధ్ర మహిళ' పత్రికాప్రచురణ ఆంధ్ర మహిళా సభ బహుముఖ కార్యక్రమాలలోనొక అనుబంధశాఖగా ప్రారంభింపబడినది. ఆంధ్ర మహిళా సభ మద్రాసులోని మహిళలకు శిశువులకు కావించే అమూల్యసేవను సూక్ష్మంగా గమనించే సదవకాశం నాకు లభించినది. తమ ఉత్కృష్ట కృషిని వేలాది ఆంధ్ర గృహములలో ప్రతిబింబింపజేయుటయే 'ఆంధ్ర మహిళ' ఉద్దేశము. అందుకు ఇది సర్వసమర్థమై యున్నది. కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ తరపున ఇందు నిరంతరము ప్రచురింపబడు "సంక్షేమం" ప్రత్యేక శీర్షిక పత్రికకు వన్నె తెచ్చుచున్నది. సాంకేతిక దృష్ట్యా పరికించిన యెడల పత్రికకేకొరతయు లేదు.

'ఆంధ్ర మహిళ'కు నిరంతర విజయాభివృద్ధులు ఆకాంక్షిస్తున్నాను.

సి. డి. దేశ్‌ముఖ్



సంగీతము, నాట్యము

సంగీతం అందరికీ సాధ్యం కాదు. అది దైవదత్తం కాని సంగీతాన్ని ఆనందించే శక్తి ఎంతోకొంత అందరిలోనూ ఉంటుంది. తాననుభవిస్తూ శ్రోతలనుకూడా అనుభవింపచేసట్లు చేసేది స్వరరాగయుత మైన సంగీతమే. పడగఊనే పామునీ, పాలబుగ్గల పసిపాపనీ, పశువునీ కూడా పరవశపరచేది సంగీతం.


ఎన్నడో ఆలపించిన త్యాగరాజుపాట నేటికీ యావద్భారతదేశం లోనూ ప్రతి ధ్వనిస్తూనే, ప్రతి హృదయంలోనూ ప్రసారితమౌతూనే ఉన్నది. శ్రీమతులు బెంగుళూరు నాగరత్నమ్మ, వంగల వాణీబాయి మున్నగు గానకళావిశారద లెందరో ఆ నాదమునే కొనసాగించుతూ వచ్చారు. సంగీతరత్నాకరులు శ్రీ ద్వారం వేంకటస్వామి నాయుడుగారు తమ సునిశితమైన అంగుళులచే ఆ నాదమునే సంచారితము చేస్తున్నారు.

కుమారి రామాయణం భారతి 'కర్ణాటక సంగీతము-త్యాగరాజు'ను గురించి వ్రాస్తూ సంగీతానికీ సన్మానవునికీ గల అవినాభావ సంబంధము నిరూపించారు.

కుమారి ద్వారం మంగతాయారు రచించిన 'కళాకారుల హృదయ సంపద'లో ప్రపంచ ప్రఖ్యాతిపొందిన వయొలిన్ వాగ్గేయకారకుడు క్రైస్లర్ జీవితం కళతో, కరుణతోగల సామరస్యాన్ని వ్యక్తపరుస్తుంది. శ్రీమతి నాళం సుశీలమ్మగారు గానకళ ఆవశ్యకతనుగూర్చి ముచ్చటించారు.

భారతదేశంలో వ్యాప్తిలోనున్న అనేక నాట్యపద్ధతులలో కూచిపూడి పద్ధతి ఒక విశిష్ట స్థానాన్ని అలంకరించుకుని ఉన్నది. కూచిపూడివారి నాట్య రీతులగూర్చి శ్రీ వసుమర్తి వేణుగోపాలశర్మ విపులముగ విశదీ కరించి వ్రాసిన వ్యాసము అందరికీ సుబోధకము.

—సంపాదకురాలు.



నిధిచాల సుఖమా రాముని సన్నిధిసేవ సుఖమా నిజముగ బల్కు మనసా
దధి నవనీత క్షీరములు రుచియో దాశరధి ధ్యానభజనసుధారసములు రుచియో॥
శమదమ మను గంగాస్నానము సుఖమా కర్దమ దుర్విషయకూపస్నానము సుఖమా
మమత బంధనయుత నరస్తుతి సుఖమా సుమతి త్యాగరాజనుత నీ కీర్తన సుఖమా॥

కర్ణాటక సంగీత చరిత్ర

కుమారి రామాయణం భారతి

"సద్యో జాతాదిపంచవక్త్రజ, సరిగమపధని వరసప్త స్వరవిద్యాలోలం." పైవాక్యమునుబట్టి సృష్టికి పూర్వమే పరమశివుని పంచవక్త్రములనుండి యొక ధ్వనియుత్పన్నమైనట్లునూ, ఆ ధ్వనిలోనుండియే "సరిగమపధని" అను సప్తస్వరములతోకూడిన సంగీత విద్య సృష్టింపబడినట్లునూ గ్రహింపవచ్చును. ఆ ధ్వనియే నాదమని చెప్పబడెను. ఒక ధ్వని నాధారముగాజేసికొని ఆదే ధ్వనిలో కొంతసేపు దీర్ఘముగా కంఠస్వరమును సారించినయెడల ఆ ధ్వని సహజముగానే వినుటకు ఇంపుగానుండును. ఇదియే షడ్జధ్వానమని చెప్పబడెను. ఈ షడ్జమస్వరము నాధారముగాజేసికొని కొంచము దూరముగా పైకిపోయిన యెడల మధ్యమ స్వరము, అట్లే కొంచముదూరముగా క్రిందికి దిగినయెడల పంచమ స్వరము దొరకును. ఈ మూడు స్వరములు సహజముగా సృష్టిలోనే వినుటకు ఇంపు కలిగించు ధ్వనులు. వీటిని కనుగొనినవారు మన పూర్వఋషులు. ఇంకేమేమి ధ్వనులు గలవో చూతమని వారు కంఠస్వరమునట్లే మరి కొంచము పైకి, క్రిందికి పోనిచ్చి చూచిరి కాని తిరిగి తిరిగి వారికి మరల మొదట లభించిన ధ్వనులుతప్ప చెవికి ఇంపు కలిగించు మరి యొక క్రొత్త ధ్వని లభించలేదు. అయితే వారు అంతటితో విడిచిపెట్టక షడ్జ, మధ్యమ, పంచమము లనెడి మూడు స్వరములనుండియు రిషభ, గాంధార, ధైవత, నిషాద ములనెడి మరి నాల్గు క్రొత్త స్వరములను సృష్టించిరి. వరుసగా ఈ షడ్జ, రిషభ, గాంధార, మధ్యమ, పంచమ, ధైవత, నిషాదములనబడు స్వరసప్తకమే ఉచ్చారణ సౌకర్యార్థం "సరిగపమధని" అను సాంకేతికాక్షరములతో నేడుభారతీయ సంగీతమునందు ప్రచారములోనున్నది.

ఈ స్వరములను కనుగొనుట వేదకాలమునాటిమాట. పేరుకి సప్తస్వరములు ఉన్నవను మాటయే కాని వాటి నన్నిటిని ఒకే పర్యాయము ఉపయోగించుకొను అవశ్యకత వారికప్పటికి కలుగలేదు. ఎందువల్లననగా అప్పటికి రాగమను ఊహయే వారికి ఏర్పడలేదు. వేదములు

గానము చేయునప్పుడు వారికీ స్వరముల ఆవశ్యకత కలిగినది. సాధారణముగా ఒక్క స్వరములోగాని రెండు స్వరములలోగాని తప్పితే మూడు స్వరములందుగాని వారు వేదములను గానము చేసెడివారు. అట్లు ఒక్క స్వరములో గానము చేయబడినపద్ధతి "ఆర్చిక" అనియు రెండు స్వరములలో గానము చేసిన విధము "గాధిక" అనియు మూడు స్వరములలోనైనట్టి విధము "సామిక" అనియు చెప్పబడెను. అట్లనే నాల్గు స్వరముల పద్ధతికి "స్వరాంతరము" అని పేరుగలదు. పైచెప్పిన సప్త స్వరములనూ వారు సామవేదము గానము చేయునప్పుడు ఉపయోగించుకొనిరి. అప్పటి ఆ సప్తస్వర సముదాయమునకు "సామగానమూర్ఛన" అనియు, నది షడ్జమ స్వరము నాధారముగా జేసికొని ఏర్పడిన స్వరముల సమూహముగనుక "షడ్జ గ్రామము" అనియు దానికి పేర్లుగలిగెను. ప్రాచీన కాలమునందు కొన్ని కుటీరములతో కొలదిమంది జనులకు నివాసయోగ్యముగానుండిన వాటిని గ్రామములని చెప్పినట్లుగానే ఈ షడ్జాది స్వరసప్తకముగూడ షడ్జ గ్రామమని పేర్కొనబడెను. 22 శృతులుగా విభజింపబడియున్న ఈ షడ్జ గ్రామము నాధారముగాజేసికొని మధ్యమ, గాంధార గ్రామము లుత్పన్నమైనట్లునూ, గాంధార గ్రామము దేవతలపరము కాగా షడ్జ, మధ్యమ గ్రామములనుండి పదునాల్గుమూర్ఛనలు వాటినుండి పదునాల్గు సప్తకములు కనుగొనబడినట్లు తేలియున్నది. ఇప్పటి "రాగ" మనునది అప్పటి "జాతి" అనబడు దాని పరిణామ స్వరూపమని తెలియనగును.

తరువాత "రాగ" మనునది. ఎప్పుడు ఏర్పడెనో చెప్పలేముగాని క్రీ॥ శ॥ 5 వ శతాబ్దమునాటి "బృహద్దేశి" అను గ్రంథములో రాగముయొక్క స్వరూపము తెలియజేయబడినట్లు చెప్పబడెను. ఏడుగాని, ఆరుగాని, అథవా ఐదుగాని స్వరములను కల్గి, గ్రహ, అంశ, న్యాస, విన్యాస, అపన్యాసాదిత్రయోదశలక్షణములచే విలసిల్లునదే, రాగమనబడునని అందు పేర్కొనబడినట్లు తెలియనగును. అట్లు ఐదు స్వరములు గల దానికి ఔడవరాగమనియు, ఆరుస్వరములుగల దానికి షాడవరాగమనియు, సప్తస్వరములు ఉన్నయెడల దానికి సంపూర్ణరాగమనియు సంగీత పరిభాషలో ఆ యా రాగములకు చెప్పబడిన పేర్లు.

ఆ వెనుక అనగా 5, 6, 7 శతాబ్దముల నడుమకాలమున జరిగినది తెలిసికొనుటకు ఏ మాత్రము చరిత్రలో రక్షింపబడలేదు. ఎందువల్లననగా 7 వ శతాబ్దమునుండి 12 వ శతాబ్దమువరకు మన దేశమునందు వ్యాపించిన సాంఘిక, రాజకీయపరిణామములవలనను, చెలరేగిన మత వైషమ్యాలవలన కల్గిన రాజ్యకల్లోలమువలననూ మన దేశపు సర్వవిద్యలు, సమస్త కళలతోపాటు అప్పుడప్పుడే వికాసము చెందుచున్న సంగీత కళకుగూడ అఘాతము కలిగియుండవచ్చును. అందువలన ఆ కాలములో ఏ యే గ్రంథములు రచింపబడెనో సంగీతకళ ఏ మాత్రము అభివృద్ధిచెందెనో ఆ ఒక్క కాలపురుషుడు తప్ప చరిత్రకారులు తెలిసికొనలేకపోయిరి. పిమ్మట 12 వ శతాబ్దములో శ్రీ జయదేవకవి "గీతగోవింద" మును రచించెను. ఇదియే ప్రప్రథమ భారతీయ సంగీత లక్ష్య గ్రంథము. అటుపిమ్మట 13 వ శతాబ్దమునుండి భారతీయ సంగీతము "ఔత్తరాది సంగీతము" "దాక్షిణాత్య సంగీతము" అని రెండు శాఖలుగా విడిపోయినది. అందు దాక్షిణాత్యసంగీతమే నేడు "కర్ణాటక సంగీత" మను పేరుతో వాడుకలోనున్నది. 16 వ శతాబ్దమువరకు దాక్షిణాత్య సంగీతము లక్షణ దృష్ట్యా అభివృద్ధిచెందెను. కాని లక్ష్యదృష్టితో అనగా ప్రయోగ దృష్ట్యా ఒక సక్రమ పద్ధతి అప్పటికింకను ఏర్పాటు కావింపబడలేదు. అంతవరకూ, సోమనాథుడు, అహోబలుడు, వెంకటమఖి, మొదలగు శాస్త్రకారు లనేకలక్షణ గ్రంథములు రచించిరే కాని సంగీతమును ఇతరులకు ఎట్లు బోధింపవలయునో, దానిని ప్రాక్టికల్‌గా అభ్యాసకులచేత ఎట్లు అభ్యసింపజేయవలయునో అట్టి ఒక నిర్దిష్టమగు పద్ధతిని ఏర్పాటుచేయలేదు. ఈ లోపమును 16 వ శతాబ్దపు వాగ్గేయకారకుడునూ, కర్ణాటక బ్రాహ్మణుడునూ అయిన "పురందరదాసు" పూర్తి జేసెను. ఇతడు దక్షిణాది సంగీతమును బోధించుటకు ఏర్పరచిన బోధనాపద్ధతి సుదృఢమైనది. ప్రారంభకులకు సంగీతము బోధించుటకు ఇతడేర్పరచిన "మాయా మాళవగౌళ" రాగము 72 మేళకర్తలలో స్వరస్థానముల రీత్యావిద్యార్థులకు సులభముగా పట్టుబడునది. ప్రాథమిక అభ్యాసపాఠములకు పనికివచ్చు స్వరావళులు, అలంకారములు, గీతములు మొదలగునవి యనేకములు ఇతను రచించెను. ప్రసిద్ధ సంగీత శాస్త్రకారులనేకులు. అనేక గ్రంథములు రచించిరిగాని, దాక్షిణాత్య సంగీత మహాసౌధమును అభ్యాసక సులభబోధనా పద్ధతి అను పునాదిమీద నిలువబెట్టిన ఘనత ఒక్క పురందరదాసునకే దక్కును. కనుకనే నాటినుండి దక్షిణదేశ సంగీతమునకు "కర్ణాటక సంగీత"మను నామమునూ, ఇతనికి "కర్ణాటక సంగీత పితామహ" "ఆదిగురువు" అను బిరుదములునూ కలిగెను. నాటినుండి నేటివరకు ఇతను ఏర్పరచిన పద్ధతి

చెక్కు చెదరక నిలిచిఉన్నదంటే దీనినిబట్టే తెలియుచున్నది. ఇతను ఏర్పరచిన బోధనాపద్ధతి సుదృఢమైనది. "కీర్తన" అనబడు సంగీత రచన ఏర్పడినకాలము ఈ పదహారవ శతాబ్దమే. కన్నడభాషలో మొదట కీర్తనలు వ్రాసినవాడు పురందరదాసు. తెలుగులో మొట్టమొదటకీర్తనలు రచించినది, తాళ్ళపాక "అన్నమాచారి" "చిన్నమాచారి" అనువారు. 18, 19 శతాబ్దము కర్ణాటక సంగీత చరిత్రలో స్వర్ణయుగమని చెప్పవచ్చును. ఆ కాలమున జనించిన వాగ్గేయకారకులందరిలో 1. శ్రీత్యాగరాజు, 2. ముత్తుస్వామిదీక్షితరు, 3. శ్యామశాస్త్రి ముఖ్యులు. వీరు ముప్వురు కర్ణాటక సంగీతకళను లక్ష్య లక్షణ సమేతముగా పుగోగముంపజేసి కర్ణాటక సంగీత చరిత్రలో "సంగీత త్రిమూర్తు"లని ప్రసిద్ధికెక్కిరి. వీరికి పూర్వము, తరువాతకూడ అనేకమంది వాగ్గేయకారకులు తమ అమూల్య రచనలను సంగీతలోకమునకు సమర్పించిరి. ఇంకను అనేకమంది పండితులు స్వరజితులు, తాన వర్ణములు మొదలగు అభ్యాస రచనలను రచించి సంగీత విద్యార్థి లోకమునకు సమర్పించిరి.

త్యాగరాజు పూర్వుల నివాసస్థానము ఆంధ్రదేశమే. అయిననూ వారు తరువాత దక్షిణదేశము వలసపోయిరి. అచ్చటనే తంజావూరుజిల్లా తిరువయ్యారు గ్రామమునందు 1759 లో త్యాగరాజు జన్మించెను. సంగీతవిద్యలో శ్రీ శొంఠి వెంకటరమణయ్యగారు ఈతని గురువు. ఇతను శ్రీరామభక్తుడు. సంపదలకొరకు రాజులనుగాని, మరి ఏధనికులనుగాని ఆశ్రయింపక తన సంగీతవిద్యతో శ్రీరాముని కీర్తించుచు, నిరాడంబర జీవితమును గడపెను. ఇతను చెప్పిన ప్రతికీర్తన ఏదో ఒక సందర్భముతోనో వృత్తాంతోనోకూడి భావావేశంతోనూ రాగభావ సమన్వితంగాను చెప్పబడినది.

"నాద తనుమనిశం శంకరం నమామి మే మనసా శిరసా॥
మోదకరా నిగమోత్తమసామ వేదసారం, వారం, వారం॥
సద్యోజాతాది పంచవక్త్రజ, సరిగమపదని వరసప్తస్వర,
విద్యాలోలంవిదళితకాలం,విమలహృదయత్యాగరాజపాలం"॥

పైనుదహరించిన కీర్తనలో నాదోత్పత్తిని చెప్పుచునితడు పరమేశ్వరుని స్తుతించినవిధము మెచ్చదగినది. ఈతని భాషకూడ మృదుమధురముగానుండి యతి, ప్రాస మొదలగు ఛందోనియములు సహజముగా వాటికవేవచ్చి భాషలో చేరినట్లుండును. కనుకనే ఇతని రచనలు ద్రాక్షాపాకసదృశములని ప్రసిద్ధికెక్కినవి. ఇతని గాత్రమతి మధురమైనదనియు, వీణవాయించెడివాడనియు చెప్పుదురు. కర్ణాటక సంగీతమునగల రాగములన్నిటిలో రాగాలాపనచేయుటకు మిక్కిలి కష్టమగు "దేవగాంధారి" రాగమును ఇతను ఎనిమిది దినములు అత్యద్భుతముగా ఆలాపించెనని చెప్పుదురు. ప్రసిద్ధరాగములందు అనేక రచనలు చేయుటయేగాక, ప్రచారములోలేని అనేక రాగములతోగూడ నితడు తన అమూల్యములగు రచనలు సాగించి ఆయారాగములకు ఒక స్వరూపమును, వ్యక్తిత్వమును ఇచ్చి సంగీత లోకమునకు విడిచిపెట్టెను. ఇతనికి నారదమహర్షి "స్వరార్ణవ"మను గ్రంథమును ప్రసాదించినట్లు ఈతని జీవితచరిత్రలో చెప్పబడినది. ఇతను సంస్కృతములోనూ, ఆంధ్రములోను సుమారు 24 వేల కీర్తనలు రచించినట్లు తెలియుచున్నది. కృతులు కాక దివ్యనామ సంకీర్తనలు, ఉత్సవ సాంప్రదాయ కీర్తనలు, తీర్థయాత్రలు జేయునప్పుడు దర్శించిన అనేక దేవతలను గూర్చిన కీర్తనలు జేసెను. "ప్రహ్లాదభక్తవిజయము" "నౌకాచరిత్రము" ఈతని రచించిన సంగీత నాటకములు. ఘనరాగపంచకమునందితడు రచించిన "పంచరత్నములు" అను 5 కృతులును ఇతని రచనలన్నిటిలోను రత్నములవలె ప్రకాశించుచు పంచరత్నములను పేరునకెంతయు తగియున్నవి. వీటిలో నితడు వాడిన "కనకకశిపుసుత" "కమలభవుసుఖము" మొదలగు పదజాలముగూడ అనుపమానము. ఇట్లే మహనీయుడు 88 సంవత్సరములు జీవించి 1847 లో పరమపదించెను. ఇటువంటి మహనీయునిగన్న ఆంధ్రమాత ఘనత గర్వించతగినది.

కళాకారుల హృదయ సంపద

కుమారి ద్వారం మంగతాయారు

(హృదయ పరిపక్వత కళాకారులకి కేవలం కళకే కట్టువడి వుండక, లోకవర్తనంలో కూడా ఏరీతిని ద్యోతకమౌతుందో ఋజువు చేసేందుకు ప్రపంచానికంతకూ మహోత్కృష్టుడైన విద్వాంసుడని పేరెన్నిక గన్న "క్రైసలర్" (Kreisler) మహా మహుని యొక్క హృదయంలోంచి వాగులై ప్రవహించిన కరుణాసింధువులాంటి యథార్థాన్ని వినిపిస్తా.)

కళాకారులైన వారికి హృదయ సంపదవుండి తీరుతుంది. లలితకళలన్నీ హృదయం నుండే ఉత్పన్న మౌతాయి. కేవలం బుద్ధిబలం నుండి సంపాదించేవి విద్యలుకాని లలితకళలుకావు. అంతమాత్రంచేత బుద్ధిబలంఅవసరంలేదనికాదు. బుద్ధిబలం అనేది అనేకమందికి వుండేఒకలక్షణం. గొప్ప మేధాసంపన్నులు లలితకళను అభ్యసించి కొంచెం కూడా సంగ్రహించ లేక పోయేరు. హృదయం, భావం వాళ్ళ బుద్ధిబలం కొంచెం కుంటుపడ్డా, లలితకళా సామ్రాజ్యానికి ఏలిక లైనారు. ఈ పరిజ్ఞానం మానవునికి జన్మతో నే కలగాలి-కృషివలన ఎంతమాత్రం లాభంలేదు. అందుకే "కళాకారులు పుడతారు. కాని తయారుచేయబడరు" అని ఇంగ్లీషులో సూక్తిగలదు. (Poets are born not made) ఈ హృదయసౌభాగ్యం కళాకారులకి కేవలం కళకేకట్టుపడి వుండక లోక వర్తనంలో కూడా ఏరీతిని ద్యోతక మౌతుందో ఋజువు చేసేందుకు ప్రపంచానికంతకు మహోత్కృష్టుడైన విద్వాంసుడని పేరెన్నికగన్న "క్రైసలర్" (Kreisler) మహామహుని యొక్క హృదయంలోంచి వాగులై ప్రవహించిన కరుణాసింధువు కథలాంటి యథార్థాన్ని వినిపిస్తా—

క్రైసలర్ ఆస్ట్రియా దేశపు వైలన్ వాగ్గేయ కారుడు. ఈయన వియన్నాలో సంగీత విద్య నభ్యసించేడు. 1888 వ సంవత్సరములో అమెరికా దేశంలో సంచారంచేసి మరియొక ఏడాది విద్యాభ్యాసం చేసి 1889 సంవత్సరమున బెర్లిన్ పట్టణంలో పరిపక్వమైన ప్రౌఢిమ చూపించే మొదటి కచేరీ చేసేడు. సంగీత లోకం అంతా ముగ్ధులైనారు.

క్రైసలర్ ఈనాడు వైలెన్ వాయించు పండితులలో అగ్రగణ్యుడు. వైలెన్ చక్రవర్తి. సంగీతమునందు ఈయన స్వయంప్రతిభ అఖండము. ఒక సాయంత్రం కచేరీకి 2000 పౌనులు పుచ్చుకొంటాడు. ఈయన వైలెన్ వాయిద్యానికి ప్రజలు విరగబడి వస్తారు. ఎంతో ధనాన్ని ఆర్జించేడు. ఎంతో ధనాన్ని ధర్మం చేసేడు. కళాకారులు యావన్మందీకూడా దేశసేవ అంటే అప్రమత్తులై వుంటారు తన దేశానికి విపత్తువచ్చినప్పుడు కాపాడ వలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన వుంటుంది. కళా కారులైనవారు మేము యుద్ధానికి పనికిరాము, మేము సంగీతానికి, కళకీ సంబంధించిన వాళ్ళమని అనడం అహంతో తప్పించుకొనేందుకు అనే మాటలుగాని యథార్థాలుకావు. కళా కారులైనవారు, కానివారు

కూడా మానవులే. అందుచేత మానవధర్మాన్ని నిర్వర్తించడం సహజం అయివుండాలి. క్రైసలర్ అంతటి మహానుభావుడుకూడా మొదటి ప్రపంచ మహాయుద్ధానికి ఐదుమార్లువెళ్ళి గాయపడ్డాడు. మొదటి ప్రపంచ మహా యుద్ధానంతరం తగిన ఆహారంలేక పోవడం నుంచి రికెట్సు (Rickets) అనే జబ్బుకి దేశంలోవున్న పిల్లలు ఎక్కువ మంది గురిఅయినారు. అటువంటి పిల్లల సంరక్షణార్థము ఎన్నో కచేరీలు చేసి రెండు లక్షల పౌనులార్జించి పసి పిల్లల ఆరోగ్యంకోసం పంచిపెట్టిన పరమ పురుషుడు క్రైసలర్.

ఆనాడైనా ఈ నాడైనా సంగీత విద్య నభ్యసించే వారు పెక్కుమంది బీదవారై వుంటారు. ధనవంతులే అవుతే ఉన్నత విద్యలకు పోతారు. ఈ నాడుకూడా మన దేశంలో, దక్షిణ దేశంలో, విజయనగరంలో మాతంగ్రడిగారు ప్రిన్సిపల్ పదవి నలంకరించి వున్నప్పుడు ఎంతోమంది విద్యార్థులు తమకు ఉచిత భోజన వసతి ఏర్పరచితే వచ్చిసంగీతాన్ని అభ్యసిస్తామని అనే వారు. విజయనగరం మహారాజులు విద్యార్థుల సౌకర్యముకొరకై సత్రము నొకటి నెల కొల్పినారు. మాతంగ్రడిగారు విద్యార్థులను పరీక్షించి సంగీతము వస్తుందని నమ్మకముండి యథార్థంగా వాళ్ళు బీద వాళ్ళు అవునోకాదో తెలుసుకొని సత్రములో భోజన వసతి కల్పించేవారు.

క్రైసలర్ ఒకప్పుడు బీదవిద్యార్థే. ఆయన వియ్యాన్నాలో సంగీతవిద్య అభ్యసించే దినాలలో తాను తన తోటి విద్యార్థులకు ఇద్దరు మరువలేని వ్యక్తులు ఉండేవారని వారెంతో ఉదారస్వభావులని సంగీతమంటే గొప్ప అభిరుచి ఉండేదని వారిద్దరిలో ఒకాయన తాకట్టు పట్టే షావుకారు అని రెండో ఆయన భోజనశాలలో ఉండే ఒక బట్లర్ అని చెబుతూ సాధారణంగా మానవనైజం ఎటువంటిదంటే సామాన్య పరిస్థితుల్లో ఉన్నప్పుడు అనేకమందిదగ్గర ఉపకారాలు పొంది ఒక ఉత్కృష్టపదవి అందుకొన్నాక స్వల్పమైన ఉపకారములు పొందిన వారిని మరచి పోవడం ఒక పరిపాటైపోయింది. అంతఃకరణ ఉన్నవాళ్ళు ఆర్ద్రమైన కళల నార్జించే కళాకారులు ఎన్నడూ మరువలేరు. వారియొక్క హృదయ సౌభాగ్యానికి తార్కాణంగా నిదర్శనాలు కనబడి తీరుతాయి.

క్రైసలర్ తోటిబీదవిద్యార్థులుతమకుధనము లేక బాధపడే ఆ విద్యార్థి దశలో ధనము కావాలి అన్నప్పుడు షావుకారి వద్దకుపోయి తనచేతి గడి



రచయిత్రి కుమారి ద్వారం మంగతాయారు, ఈమె విజయనగరం సంగీత మహిళా సభ అధ్యక్షురాలు. శ్రీమతి దుర్గాబాయ్ దేశ్ ముఖ్ విజయనగరంలో ఈమెకు రజతపాత్ర బహూకరించారు.

యారాలు నెలరోజులకు విడిపించు కుంటామని హామీ ఇచ్చి ఒడ్డికి తాకట్టుపెట్టి నెలల తరబడి విడిపించుకోలేక పోయినా వాడి దగ్గర ఒక నెల రోజుల వడ్డీతప్ప ఒకగవ్వకూడ ఎక్కువఎన్నడూ పుచ్చుకోలేదని మరువలేని స్నేహితులలో ఇతడొకడని, చెప్పేవాడు.

క్రైసలర్ చదువు కొంటూయున్న విద్యాలయానికి అనతి దూరంలో ఒక భోజనశాల ఉండేదట. విద్యార్థులంతా ఆ భోజనశాల లోనే పూటకూళ్ళుచెల్లించి క్రైసలర్ బీదవాడనవడం చేత ధనాభావంచేత పూటకూళ్ళకు చెల్లించలేక ఒక్కొక్కప్పుడు ఐదు పౌండ్లు వరకు పెరిగినా గూడ చెల్లించలేని పరిస్థితిలో ఉండటం ఈ దౌర్భాగ్యపు స్థితిచూచి ఆ భోజన శాలలో వడ్డించే స్థితినీ గమనించి తనకిచ్చే స్వల్ప వేతనం లోంచి క్రైసలర్ ఇవ్వవలసిన ఐదుపౌండ్లు హోటల్ అధికారికి— ఎంత కరుణాంతరంగుడు ! ధనవంతుడు చేసే త్యాగంకంటే బీదవాడు చేసే త్యాగం ఎంతో ఉత్కృష్టం, ఈ లోకంలో గొప్పవారు చేసే త్యాగం గణనకె వస్తుందిగాని బీదవారు చేసినదిరాదు అదే లోకం పోకడ...

క్రైసలర్ విద్యార్థిదశదాటి అఖండయశస్సు ఆర్జించాక రెండోప్రపంచ మహాయుద్ధంవచ్చింది. పాశ్చాత్య దేశానికి ఈ యుద్ధం తీసుకొచ్చినంత అనర్థం ఎన్నడూ వాటిల్లలేదు. అనేక మంది ప్రజలు వికలాంగులై ఆస్థులు పోగొట్టుకొని చేసేందుకు పనిలేక తినేందుకుతిండిలేక బిచ్చబికారులయ్యారు. యుద్ధ విరామం అయిందని తెలిసి ఆరోజున ఎంతోమంది బీదవారికి క్రైసలర్ అన్నదానం చేశారు. అన్నదానానికి వచ్చిన అనేకమందిలో ఒ కాయన క్రైసలర్ ప్రక్క రెండు మూడు మార్లు తీక్షణంగ చూచి క్రైసలర్ పెట్టిన అన్నాన్ని తిరస్కరించాడు. క్రైసలర్ ప్రాధేయంగా సిద్ధాన్నాన్ని ఎందుకు తిరస్కరిస్తావు? నీకు కావలసిన అన్నం పెట్టలేదా, మన్నించి అన్నం తినమన్నాడు. అందుకు ఆ వింతమనిషి నన్నునీవు గుర్తించలేదు, అందుచేత నేను అన్నం తినదల్చుకోలేదు అని చెప్పినాడట. క్రైసలర్ అతనిప్రక్క పరికించిచూచి తనవిద్యార్థిదశలో భోజనశాలలో వడ్డించే భట్లర్ను గుర్తుపట్టి ఎంతో ఆనందాన్ని పొంది కౌగలించుకొని బట్లర్ యొక్కబీద తనాన్ని గమనించి తన దగ్గర కొన్ని దినాలుండమని క్రైసలర్ ప్రాధేయపడి అడిగాడట. వల్లెయని బట్లర్ క్రైసలర్ దగ్గిర కొంతకాలం గడపినప్పుడు ఒక రోజు ఎవ్వరికీ తెలియకుండా వియ్యాన్నాలో ఉన్న పెద్ద హోటల్ అమ్ముతున్నారని తెలిసి ఆ హోటలు తను కొన్ని వేల పౌండ్లుకు కొని ఆ హోటల్కు ఆరుమాసాలకు సరిపోయే సామగ్రిని అక్కడ పనిచేసేవార్కి జీతాలు చెల్లించి తాను ఇంటికి వచ్చి తన ఆప్తమిత్రుడైన భట్లర్ను తీసుకొని ఫలహారం కొరకు తను కొన్న హోటల్కే తీసికెళ్ళి ఇద్దరూ కలిసి ఫలహారం చేస్తున్నప్పుడు బట్లరన్నాడట. "ఎంత అందమైన హోటలో ఇది ! యుద్ధం రాకుండా ఉంటే నేను గూడ స్వంతహోటల్ని ఇంతఅందమైన దాన్ని సంపాదించి యుండేవాడను" అని అతి దీనంగా విషాదంగా క్రైసలర్తో అన్నాడట. అందుకు క్రైసలర్ ఆనందాశ్రువు లొలుకుతూ మిత్రుడా నీదే ఈ హోటల్ నీకొరకే ఇది కొన్నాను, నా కృతజ్ఞత స్వీకరించు అని కౌగలించుకొని అన్నాడట. అందుకు ఆ బట్లర్ చెప్పలేని ఆనందాన్ని వెలిబుచ్చుతూ క్రైసలర్కు సాష్టాంగ ప్రణామము ఆచరించి తన ఆనందాశ్రులతో కాళ్ళుకడిగాడట.

స్త్రీలు - గానకళాసేవ

శ్రీమతి నాళం సుశీలమ్మ

సృష్టిలోని జీవరాసులన్నింటిలోను, మానవులు విజ్ఞానం వలన అధికులుగా పరిగణింపబడడం అందరికీ తెలిసిన విషయమే. ఈ విజ్ఞానము సంగీతము, సాహిత్యము, చిత్రలేఖనము, శిల్పము మొదలైన కళలరూపమున మిక్కిలి పరిణతిచెంది, మానవుని ఔన్నత్యానికి చిహ్నంగా విలసిల్లడమే కాకుండ, మానవుని చరమప్రయోజనమైన మోక్షప్రాప్తికి కూడ సాధనమై యున్నది.

ఈ విధముగా మానవుని ఉన్నతికి కారణభూతములైన కళలలో సంగీతము మిక్కిలి యున్నత స్థానాన్ని పొందియున్నది, అఖండమైన నాదశక్తి దీని కాధారము కావడము వలననే ఈ కళ ఇంత ప్రాధాన్యము పొందినదని చెప్ప వచ్చును. ప్రపంచానికి కారణ భూతమైన నాదంయొక్క సంపూర్ణశక్తి యీ కళలో ఇమిడియున్నది. కాబట్టి, శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణిః అనే శ్లోకములో, శిశువును, పశువును, ఫణిని కూడ యీ గానకళ ఆకర్షించి వశంచేసికోగలుగుచున్నదని వర్ణింప బడియున్నది. అట్టి మహాశక్తి సమన్వితమైన గానకళ ఆంధ్రులకు కొంగుబంగారం కావడం అనే విషయం నిజంగా ఒక వరప్రసాదమన వచ్చును.

ఆంధ్రభాష సంగీతానికి మిక్కిలి అనుకూలమైన భాష అన్న విషయం అందరూ గుర్తెరిగినదే. అంగీకరించినది కూడ అయి యున్నది. అట్టి సంగీతానుకూలమైన భాషలో ఆంధ్రుల అదృష్టమువలన అనేక మంది వాగ్గేయకారులు పుట్టి తమ తమ అమూల్య రచనల వలన సంగీత సరస్వతికి ఎంతో గొప్ప సేవచేసి ఆంధ్రులకు దేశదేశాల్లో కీర్తి ఆర్జించి యున్నారు. అందులోనూ, త్యాగరాయలు చేసిన సేవ ఇంతా అంతా అని చెప్పడానికి వీలైనది కాదు కాని త్యాగరాయల అమూల్య సేవలనుగుర్తించి ఆ మహానుభావుడు తెలుగువారి కిచ్చిన ఆ అపారసంపదను వినియోగించుకోవడానికి కూడా తెలుగు వారికి తీరిక లేకపోవడం చాలా శోచనీయమైన విషయం!



రచయిత్రి

ఆంధ్రులు కళాభిజ్ఞులని, కళాపోషకులనీ చాలా గొప్ప పేరు ప్రపంచములో వ్యాపించి ఉంది. కాని, ప్రస్తుత స్థితి చూస్తే ఆంధ్రులు రాజకీయాల్లో పడి కళాసేవ మరచి పోయినారేమోనని పిస్తుంది. ఎంత చిన్న వారిని పలకరించినా, ఏజాతి వారిని కదిలించినా రాజకీయాల మీదా ఉద్యోగాల మీదా, వారికి ఉన్న ఆసక్తి కళలపైన కానరావడం లేదు.

ఆంధ్ర రాష్ట్రమైతే ఏర్పడింది. కాని దీనికి తక్కినరాష్ట్రాలతో సమానమైన ప్రతిపత్తి మాత్రం లభ్యం కాలేదు! దీనికి కారణం దేశములో పదవీ వ్యామోహం ఎక్కువ కావడమే. వైజ్ఞానికాభి వృద్ధి

తక్కువ కావడమున్ను. మగ వారంతా నాయకత్వం కోసం పోటీలుపడే వారే కాని దేశాన్ని వైజ్ఞానికంగా, ఎట్లా పైకి తీసుకురావాలి అని ఆలోచించే వారు లేరు. అందువలననే కళాదృష్ట్యా దేశంపురోగతి పొందటంలేదు.

మగ వారికెంత మాత్రం ఓపిక, తీరికా లేపు కాబట్టి, సహజంగా కళామయమైన చైతన్యం కనిగినస్త్రీలు పూను కొని ఆంధ్రదేశాన్ని వైజ్ఞానికంగా ముందుకు తీసికొని రావడానికి సహకరించవలసిన అవసరం ఎంతైన ఉన్నది.

అందులోనూ స్త్రీల కంఠం సహజంగా సంగీతా విష్కరణానికి అనుకూలమైనది. కాబట్టి వారు సంగీత సాహిత్యాల సేవకు పూనుకుంటే, ఎంతైనా సాధించ గలరు.


సంగీతమును సాధించి ఆర్జించుటకు ఎన్నెన్నియో ఉపాయములు కలవు. కాని మనము వాటిని అంతగా ఉపయోగించుట లేదనియే నా అభిప్రాయము. ఏవో నాకు తోచినన్ని సాధనోపాయములు కొద్దిగా నిందు తెలిపెదను.

ప్రతి, పట్టణము, పల్లెటూరు, పెద్ద పట్టణములలోను, సంఘములు కాని, సంగీత కళా శాలలు గాని విరివిగా, పురుషులు గాని ప్రత్యేక స్త్రీలు గాని, వారు వీరు కలసికొని ఇన్ని అన్ని అనిలెక్క చేయుటకు వీలు లేనన్ని ఆంధ్రఅంతటను నెలకొల్పి సంగీత ప్రచారము చేయవలసి యున్నది. ప్రతి ఇంటను తల్లులు తమ పిల్లలకు తగినంత సంగీత సాహిత్యములలో శ్రద్ధ వహించి నేర్పించ వలసిన విధికి బాధ్యురాలుగా నుండ వలెను. అట్లు అందరు, విద్యాభి మానులై ధనము వెచ్చించుటకు వెనుతీయని వారై నిందాపనిందలు ఎన్ని కలిగినను ఇది మంచిపని గనుక వెనుదీయక సాహసముతో, ఈ కళను వృద్ధి చేయుటకు పూనుకొనినచో సంగీతము వృద్ధికి రాక మానదు. తప్పక వృద్ధి యగునని నాకు దృఢ నమ్మకము కలదు.

ఆనాడుగోపికలుకూడ ఏదిక్కుననో వినవచ్చుచున్న గోపాలుని మురళీ నాదము విని ఇంట చేయుచున్న పని పాటలను, బిడ్డలను, భర్తలనుకూడ వదిలి ఆ నాదములో నిమగ్నులై, ఉన్మత్తులై తమశరీరములను తాము తెలియ నంత, స్థితిలో ఒక్కయేపున శ్రీ కృష్ణుడున్న చోటుకు చేరి ఆ సంగీత రసములో తాండవ మాడుచుండెడివారని మనము భాగవతములో చూచుచునే యున్నాము. త్యాగయ్య కీర్తనలు వింటూ పగలు రాత్రియు తెలియక ఆనందవారధిలో మునిగి తమజీవితములను సార్థకము చేసికొనిన ధన్యాత్ము లెందరో మొన్న మొన్నను అనగా సుమారు ఏడు ఎనిమిది వత్సరముల క్రింద, రాజమహేంద్ర వరమునకు దగ్గరగా నున్న ద్రాక్షారామమను చిన్ని గ్రామములో ఒక బిడ్డడు 15,16 వత్సరముల వయస్సుకలవాడు తనతోడి బాలురతో త్యాగయ్య సినిమాకు వెళ్ళి అచటవిన్న కీర్తనల మాధుర్యమును, సంగీతానందమును, త్యాగయ్య కుకగిలిన భగవద్భక్తియును చూచి తనమనస్సు ఛర్రున ఆ ఆనందములో ముంచి ఇంకను విడువక దారిలోనే ఉండి తిరిగి ఇంటికిరాక ఒక తపస్వియై ఇప్పటి వరకు భగవద్భక్తుడై ప్రజల వలన పూజింప బడుచు, పొలముల లోనే వసించుచున్నాడు. సంగీతము మానవులను, అంత ఉచ్ఛదశకు తెచ్చును. ఇప్పుడు ఆయన మనస్సు సంసార బాధల నొందక భగవద్భక్తి లోబడి ఎంత హాయిగా నున్నదో చూడండి. ఇకమీదనైన ప్రతివారు కష్టపడి ఈ కళను తప్పకపోషించినచో బాగాఉన్నతదశకు రాగలదు.

శ్రీలు పొంగిన జీవగడ్డయి
పాలుపారిన భాగ్యసీమయి
వ్రాలినది ఈ భరతఖండము
భక్తిపాడర! తమ్ముడా!


ఆంధ్రమహిళా సభలో స్వాతంత్ర్య దినోత్సవమునాడు ఏటేట జాతీయ గీతముల పోటీ జరుగును. ఈ యేడు ఈ ముగ్గురు బహుమతులు పొందినారు.



కె. సంధ్యారాణి - ప్రత్యేక బహుమానం



పి. ప్రేమ - మొదటి బహుమానం



బి. ఎస్. రేవతి - రెండవ బహుమానం

కృతజ్ఞత

శ్రీమతి. లింగము అన్నపూర్ణమ్మగారు– శ్రీ లింగము వీరభద్రయ్య చౌదరిగారి భార్య– రూ 100/– విరాళమిచ్చి ఆంధ్రమహిళా సభ శాశ్వత సభ్యురాలయినందుకు వారికి మా కృతజ్ఞత.

—కార్యదర్శినులు.

దక్షిణ రైల్వే

దక్షిణ భారతానికి విచ్చేసి దర్శించండి:

బాదామీ :	ఆరవ శతాబ్దంనాటి గుహానిర్మిత దేవాలయాలకూ, జైన శిథిలాలకు ప్రసిద్ధిచెందినది.
బిజాపూర్ :	గోల్‌గుంబాజ్ గోపురము, సంగీత మండపము ప్రపంచంలో ద్వితీయ స్థానము నలంకరించినది.
చిదంబరం :	ఇచ్చటి నృత్యకళాదేవుడు, నటరాజస్వామి పవిత్ర దేవాలయము దర్శనీయము.
కుట్రాలమ్ :	జలపాతానికి ప్రసిద్ధికెక్కినది. అందు స్నానం చేసినవారికి ఆరోగ్యము కలుగునని పేరుకెక్కినది. గొప్ప ఆరోగ్య స్థానము.
హంపీ (విజయనగర్) :	విజయనగర హిందూ సామ్రాజ్య పురాతన రాజధానీ నగరముయొక్క అద్భుత శిథిలాలు మరపురానివి.
కొడైకెనాల్ :	మధుర సమీపంలోని కొండలమీది అందాల వేసవి విడిది.
మధుర :	పురాతన పాండ్యరాజుల రాజధాని. మీనాక్షీదేవి ఆలయానికి ప్రసిద్ధి.
మైసూర్ :	జ్యోతిర్మయ నగరం. దీపాలదీవి. మనోహరమైన బృందావన్ గార్డెన్సు ఇక్కడికి పది మైళ్ళు.
ఉదకమండలం :	హిందూ దేశంలోని పర్వతనగరాల్లో శ్రేష్ఠమైనది.
రామేశ్వరం :	తీర్థయాత్రలకూ, పవిత్ర స్నానాలకూ, రామలింగేశ్వరుని దర్శనానికీ ప్రసిద్ధి.
తిరుపతి (బాలాజీ) :	కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరుని దివ్యనిలయం. ఇచ్చట ప్రతిదినమూ ఉత్సవ దినమే.
తిరుచునాపల్లి :	సమీపమునగల శ్రీరంగ దేవాలయాలూ, శృంగార మంటపాలూ, తిరువనైకావల్ లోని సుందర దేవాలయగోపురాలూ, దర్శనీయములు.
తిరువనంతపురం : (త్రివేండ్రం)	కళా ప్రదర్శనశాలకూ, వస్తు ప్రదర్శనశాలకూ, జంతు ప్రదర్శనశాలకూ ప్రఖ్యాతి వహించినది.

చీఫ్ కమ్మర్షియల్ సూపరెంటెండెంటు.

కూచిపూడి సంగీతము-నాట్యము

శ్రీ షసుమర్తి శ్రీవేణుగోపాల కృష్ణశర్మ

"కళ" యనగా నొకక్రియ. ఒక పని యందుగాని, విద్య యందుగాని, అందచందముల నేర్పును చూపించుట. ఇట్టివి చతుష్షష్ఠి (అరువదినాలుగు) యనివ్యవహరింతురు. అనుభవజ్ఞులు వీటిని ద్వివిధములుగ పేర్కొనుచు, నందు కొన్నింటిని మాత్రమే లలిత కళలని వ్యవహరింప సాగిరి. అవి 1 సంగీతము, 2 నాట్యము, 3 కవిత్వము, 4 చిత్ర లేఖనము, 5, శిల్పము అనునవి. నేటి ప్రపంచమున సంగీత, నాట్య, కవిత్వ చిత్రలేఖనాదులు, యితోధిక ప్రచార మందున్న వనుటలో సందేహమిసుంతయుఁ లేదు.

సృష్టియందు మానవుడు తన జీవితము నానందముగా గడుప వలయును. కష్టమన్నది లేకుండ మానవజీవితము అసంభవము. గృహస్థులు ఆశ్రమ ధర్మములలో చిక్కుపడి అందుగల కష్టసుఖముల ననుభవించుచుందురు. అట్టి వారి మనములకు కొంత కాలమైనను ఆనందమొన గూర్చునవియే కళలు. అందు సంగీత మత్యంతప్రధానమై యున్నది. సంగీత మనునది వీనులకు వినిపించునదైనను, కనులకు చిత్రరూపమున, ఆపరంధాముని మహిమల కనుపరుపజేయుచు, పండిత పామరులచే సులభముగ గ్రహింపఁబడి ఆనందము నొనగూర్చును.

సంగీత విద్య యిహపరముల రెంటికిని తరణోపాయ మని విజ్ఞులెల్లరుఁ గొనియాడి యున్నారు. సంగీత మనగా ప్రణవనాదమైన ఓంకారము నుండి సప్తస్వర రూపమున జనించినది. ఇట్టి మహత్తరమైన గాన శాస్త్రమునకు ప్రవక్తలు, బ్రహ్మ, శివుడు, నందికేశ్వరుడు భరతముని, దుర్గ, నారదుడు, కోహళుడు, రావణుడు, వాయువు, రంభమొదలగు వారును, మరియు, కశ్యపుడు, భరద్వాజుడు, గౌతముడు, వశిష్ఠుడు, శౌనకుడు, మొదలగు ముప్పది యార్వురు ఋషులు గలరని తెలియుచున్నది.

పురాణ పురుషుల మహామునుల, సార్వభౌములచే ప్రశస్తిగా[illegible]యిట్టి సంగీత శాస్త్రము సృష్ట్యాది నుండి



కూచిపూడి నాటకములలోని పాత్రల దుస్తులు - అలంకారములు

పురాణ యుగమునకును, అటనుండి చరిత్ర యుగమునకును, బహుళ ప్రచారము నందుండె ననుటకిం దుదాహరణముల కొన్నిఁటిని పేర్కొందము. మొదటి చన్ద్రిగుప్తుని కుమారుడగు సముద్రగుప్తుడు, సంగీతమన్న మిక్కిలి ప్రీతిగలవాడై, తన నాణెములపై తాను వీణవాయించుచున్నటుల ముద్రింపించు కొనెను. అగ్బర్ ఆస్థానమునందు తాన్‌సేన్ యను పండితుడును, ఆంధ్ర భోజుడగు శ్రీకృష్ణదేవరాయల యాస్థానమున, భండారు లక్ష్మీనారాయణ పండితుడును, మైసూరు మహారాజుల యాస్థానమున, సంగీత, నాట్య విశారదులగు హరి రామయ్యగారు (కూచిపూడి)ను, నిట్లిం కెందరో మహారాజుల కాలమున వారి వారి యాస్థాన విద్వాంసులుగను, సచివోత్తములుగనుఁ గూడ నుండిరనుటకు ప్రబల నిదర్శనములు గలవు. కూచిపూడి వా రాలపించు యపూర్వ రాగములగు, ఆహిరి, పున్నాగవరాళి, నాదనామక్రియ, దేశాక్షి, జంఝూటి, నవరోజు, దేవగాంధారి, భూపాళాదిరాగము లిప్పటికిని విని యానందిచవలయునే గాని వ్రాయుట దరముగాదు.



కూచిపూడి నాటకములలోని పాత్రల . అలంకారములు

కాన మహారాజుల కాలములం దీ కళలను విరివిగ ప్రోత్సహించిన కారణముననే, నేటి మన సాంఘిక యుగమున మన భారతీయ సంగీత మంతరింప నున్నదని తలంచుట కవకాశము లేకుండుటకై, కళాభిమానులు, కళా పోషకులు. కళాప్రచారకు లెల్లరు దీని నుద్ధరింప కంకణములఁదాల్చి పని చేయవలసిన సమయ మాసన్నమైయున్నది. మరియు నిట్టి సంగీతశాస్త్రమును లక్ష్య, లక్షణయుతముగ బహుళ ప్రచారమునకుదెచ్చుటకై కళాశాలల స్థాపించుటెంతయు నా వశ్యకమై యున్నదని మహా మహులైన పెద్దలెల్లరుఁగురుతింతురుగాత !

నాట్యాభి నయములఁగూర్చి తెలిసి కొందము, ఇది ఆరు విధముల జెప్ప బడుచున్నది. అవి 1 తాండవము, 2 నటనము, 3 లాస్యము, 4 నృత్తము, 5 నృత్యము, 6 నర్తనము లనునవి. ఇవి ఈశ్వరప్రేరితములు. నృత్తము నందు తాండవము, నృత్యము నందు లాస్యము, తాళము నర్తనమునను శోభిల్లుచున్నవి. నటనము భావ ప్రకాశకమైయున్నది.

ఇంకను, గీత, తాళ, సమన్వితముగ నాట్యము జేయుచు, నా విభావాను భావాది సంచారీ భావముల ముఖరూపమున దెలియ జేయుచు. నా గీతార్థముల నంసయుత, సంయుతాది హస్తములచే ప్రదర్శనముజేసి చూపింప సర్వజనాహ్లాదకారి యైయుండు నభినయ యుక్త నాట్యమును, ఉత్తమ, మధ్య మాధమములని త్రివిధముల విభాగింప నగును, అందుత్తమము, భరతుని నాట్యశాస్త్రము ననుసరించి పాత్రబాడుచు, నా గీతోక్త విభావానుభావసాత్విక సంచారీ భావాదుల నూర్ధ్వకాయ (నడుమునకు పైభాగము)చలనాదులచే, ప్రపంచానుభవమున యథార్థ ప్రకటన ముజేయుచు, నా గీతార్థముల నసంయుత, సంయుతాది హస్త పాటవముచే నభిన యించుచు సభ్యులనువ్విళ్ళూరింప జేయుచుండునది. అనగా కంఠము ద్వారా పాటను బాడుచు, నా పాట యొక్క అర్థము, వ్యక్తపరచుటకు హస్తములచేత ముద్రల ప్రదర్శించుచు భ్రూ, నేత్రాదులచే భావప్రకటన జేయుచు, పాదములచే తాళలయాది వివిధగతుల నాచరింప వలెను. మరియు నెచ్చట హస్తము జూప బడుచున్నదో. దృష్టి నచ్చట నుంచవలెను. ఎచ్చట దృష్టి ఉంచ బడెనో యచ్చటనే మనసునే జాగ్రతతో నిలుప వలెను. ఎచ్చట మనసు నిలువరింప జేయ బడుచున్నదో, నచ్చటనే హావ, భావ, హేలా పద్ధతుల ననుసరించి వ్యక్త పరుప

వలెను. ఎచ్చట నిట్టిసమ్మిశ్రిత భావము వ్యక్తీకరింపజేయ బడుచున్నదో అచ్చటనే రసోత్పత్తినొంది సభ్యులను హర్ష సారగమునం దోలలాడ జేయుచున్నది!

ఇట్టి త్రార్యత్రికమగు నుత్తమ నాట్యశాస్త్రము ననుస రించుచున్న మహనీయులే నేటి మన కూచిపూడి భాగ వతులు. (భగవత్ కథలను ప్రదర్శించు వారు గాన భాగ వతులు) ఇటి సర్వోత్కృష్టమైన నాట్యమును గురు తించుట, నేటి ప్రపంచమున కెంతయు సముచితము. ఇది కేవలము పామరరంజకముగాక, నాట్యంగ చలనాదులచే పరమేశ్వరుని లీలా వినోదముల, నాట్యా రసములతోడ నూహించి తెలసికొనుట వలన, బ్రహ్మజ్ఞాన ముం బొంద నర్హమై యున్నది.


క్షేత్రజ్ఞులు దైవోపాసకులు ధర్మపురి వారు, తదితర జావళుల రచయితలు కూడ జ్ఞాన నిష్ఠా గరిష్ఠులు. దైవమును, శృంగార రసాధిష్టాన దేవతయు, లోకజన కుడును నగు శ్రీ కృష్ణపరమాత్మ నాయా దృశ్యములలో నున్నటుల భావించి, సృజించి, రచించి, అనుభవించి, తరించి యుండిరేగాని వేరుగాదు పరమాత్ముని లీలా వినోదములే శృంగారములు. వేదాంతములు. నిగూఢ ములు. ఇటి అత్యుత్తమ భావముల గ్రహించుటకు, సభ్యులు వేదాంతముతో గూడిన విమర్శనాభావ మల వరచు కొనిననేగాని ఆనందించి తరించుటకు వలను పడదు.

గోపికా వస్త్రాపహరణ సందర్భమున, పర మాత్ముడా గోపికలను, "జలమునుండి బహిర్గతలైననే గాని వస్త్రముల నివ్వ"నని నిర్బంధించెను. ఇందలి భావము గోపికా మానసములగల అహంకార, మమతా, స్వాభిమానము ఈ పంచభూతాత్మకమైన శరీరమునకేగాని, జీవాత్మకు లేవనియు, అట్లయిననే గాని వారలంతర్గత జీవుల, తనలో నైక్యమొనర్చు కొనుటకును, వారలకు మోక్ష మొసంగుటకు జేసిన లీలా వినోదమేగాని, జల బహిర్గతలగు నా గోపికల యవయవముల జూచుటకు గాదు. ఇట్టి ఉత్కృష్టమగు రచనలు నాట్య ప్రదర్శనమున కెక్కువ యుపయోగ కరములని గ్రహించియే, యుత్తమ నాట్య శాస్త్రజ్ఞులైన కూచిపూడి వారు నాటకిని సజీవమైన కళారాధనను జేయుచుండు టెంతయు ముదావహము, అందులకు వారు మిక్కిలి వంద నీయులు.

కాన, నిట్టి భాషాభేదముల గమనింపక, భావముల గ్రహించి, ధర్మార్థకామమోక్ష ఫలప్రదమును, "భరత" నాట్య శాస్త్రప్రవక్తలగు, శివుడు, పార్వతి, బ్రహ్మ, విష్ణువు, నందికేశ్వరుడు, దత్తిలుడు, కోహళుడు, యాజ్ఞ్య వల్క్యుడు, నారదుడు, ఆంజనేయుడు, వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు, బృహస్పతి అర్జునుడు, రావణుడు, ఉషాకన్యక, మొదలగు వారియాశయముల ఫలవంత మొనర్చుటకును మన కెల్ల విధములచేత నీ నాట్య శాస్త్రము పరిగ్రహణీయాభ్యసనీయములు కావలయును.

సంగీత నృత్య కళలకు కాణాచి యయిన కూచిపూడి ఇట్టి లలితకళా శాలాస్థాపనకు ఉచితమైనదని వేరుగ జెప్పనక్కర లేదు. ★

బ్లాకులు ఇచ్చిన ఆలిండియా రేడియో 'వాణి' వారికి మా కృతజ్ఞత.





చి॥ బేబి శశికళ

నటరాజు అంశకుతోడు గంధర్వాంశను కూడ జన్మహక్కుగా సంపాదించుకుంది శశికళ. ఈ పాప తొలి అడుగే నృత్యపు ముద్రగా, తొలిపలుకే సప్తస్వరాలు మేళవించిన మధురగీతంగా అమరింది. నృత్యగానాలను లేతవయసులోనే అనుభవించి మైమరచిపోయేది. ఎన్నో బహుమానాలను పొందింది. చిరంజీవులలో నటించింది బాలనాయికగా. ప్రస్తుతం 'భాగ్యరేఖ', 'అక్క-చెల్లెళ్లు', 'దాంపత్యం', 'కన్నకడుపు', 'దొంగలదొర' అనే చిత్రాలలో నటిస్తూంది.

ఆరేళ్ళ పసివయసులోనే నృత్య, గాన, నటన కళాప్రాభవములలో ఆరితేరి కళారసికుల మెప్పుపొందిన చిరంజీవి శశికళ డాక్టర్ కె. వి. స్వామిగారి పుత్రిక. ఈ శశికళాపాప, 'కళాదేవి'గా ఆ దేవి దయవలన ఆయురారోగ్యైశ్వర్యములతో కలకాలం వర్ధిల్లాలని ఆంధ్ర మహిళ ఆశీర్వదిస్తోంది.

కృష్ణ పాత్రధారిణి ప్రమీలా రాణి శ్రీ గోగినేని వెంకటేశ్వరరావు దంపతుల ద్వితీయ పుత్రిక. రాధ పాత్ర వారి మరదలు వాణి అభిన యిస్తోంది, ఈపాపలు కాన్వెంటులో చదువూ, మూడేళ్లుగా వెంపటి చిన సత్యంగారివద్ద నాట్యం, ఇటీవలే పి. కోటీశ్వరరావుగారివద్ద సంగీతం ఒకేసారి శిక్షణ పొందుతున్నారన్న విషయం ప్రశంశనీయం. వీరినే గోగినేని సిస్టర్స్ అంటారు. అలాఅంటేనే మీకు బాగా తెలుస్తుందేమో? ఈ చిన్నారి చిట్టి పాపలకు "ఆంధ్రమహిళ" ఆశీర్వచనము లందిస్తూంది.



గోగినేని సిస్టర్సు



రత్నపాప

ఈ పాప పేరుకు తగ్గట్టు రత్నంలాంటి పాప. మరి లలితకళా సాగరం అనదగిన వంశంలో రత్నం జన్మించటం సహజమే! ఈపాప తల్లిగారు, పినతల్లిగారు, శ్రీమతులు అనసూయ సీతగార్లు గాన కళా ప్రావీణ్యులు. పినతల్లిగారు సంగీతంలో మాస్టర్ డిగ్రీని పొందిన మేధావులు. తండ్రిగారు శ్రీ గిరి, ఫిలింనటులు. ఈ పాపకూడా ఈ చిన్న వయస్సులో ఎన్నో ఫిలిముల్లో నటించుటయేకాక భరతనాట్యంలో కూడా మంచి నైపుణ్యత సంపాదించింది. కాన్వెంటుస్కూలులో చదువుకుంటూ పదిసంవత్సరముల వయసులోనే vii స్టాండర్డులోనికి వచ్చినది.

ఈ తెలుగు పాప ఇంకా ఇంకా వృద్ధిలోకి వచ్చి చిరాయురారోగ్యాభి వృద్ధిగా వర్ధిల్లాలని "ఆంధ్రమహిళ" ఆశీర్వదిస్తోంది.



వసుంధర, గిరిజ

పైచిత్రంలో ముచ్చటగొలిపే చిరంజీవులు శ్రీ పురాణం ఆర్. కె. శాస్త్రి గారి కుమార్తెలు- వసుంధర, గిరిజ. అత్యంత లావణ్యాన్నొలకబోసే వీరిద్దరూ కూడ నాట్యంలో ఆరితేరిన వారనటానికి వారి వంపుల సొంపులే మనకు సాదృశ్యములు. వారు మద్రాసులో చాలా నాట్యప్రదర్శనము లిచ్చియున్నారు.


వసుంధర తమిళ నాటక నటిగా పేరు పొంది, ఇటీవలనే సినిమా నక్షత్రంగా కూడ ప్రకాశించ నారంభించింది. గిరిజ ఇంతకు పూర్వమే పెళ్ళిచేసిచూడు, ప్రియురాలు, బాలసన్యాసమ్మకథ చిత్రాల్లో నటించింది. వసుంధర ప్రీయూనివర్సిటీ కోర్సు చదువుతూంది. మెట్రిక్ వరకూ ఆంధ్ర మహిళా విద్యాలయపు విద్యార్థినియే. గిరిజ ప్రస్తుతము ఇచటనే జూనియర్ మెట్రిక్ చదువుతూంది. నృత్యం వీరి ఆరాధ్య కళ. వీరికి "ఆంధ్ర మహిళ" సంక్రాంతి ఆశీస్సులు ఇస్తోంది.

ఆశీస్సు


మహిళామణుల కెల్ల మానవత్వముగూర్చు
చిన్నగాథల మాకు చెప్పినావు
చైతన్యమునుబెంచు చక్కని పద్యముల్
ప్రేమ మీరగ నాల పించినావు
పూర్వ భారతస్త్రీల పుణ్యచరితలనెల్ల
జిలిబిలి పలుకుల చేర్చినావు
మానవసేవకు మగువలే సరియంచు
భావము మాలోన బరపినావు

వచ్చెనేటికి పదమూడు వత్సరములు
హాయి చక్కని పాటల నాలపించి
నీతిబోధక భావాల నేర్పవమ్మ !
అమల గుణబాల ! ఆశీస్సు లాంధ్ర మహిళ !

— కె. పార్వతీదేవి.







ఈ శీర్షిక క్రింద రాష్ట్ర పరపతిగల సేవాసంస్థలు కార్యక్రమ వివరములు ప్రకటించదలచి ఆరంభించాము. తరువాత మావద్ద అప్పుడప్పుడు ప్రకటనకై వచ్చిన వివరములన్నీ సేకరించి ఆయా సంస్థల కార్యక్రమములుకూడ క్లుప్తముగా పాఠకులకు సమర్పించదలచి ఈ శీర్షిక ప్రకటించాము. పొరపాటున ఏ సంస్థల వివరములైన మేము వెయ్యనియెడల ఆ వివరములు మా చెయ్యి జారియుండునని గ్రహించి మమ్ములను క్షమించవలయును. ఆంధ్ర ప్రదేశ్ లోనున్న స్త్రీల, శిశువుల సేవా సంస్థలన్నిటి కార్యక్రమములు మా పాఠక మహిళా లోకమున కెప్పుడో ఒకసారి సమర్పించవలయునని మాకు గాఢమైన అభిలాషయున్నది. మాతో సహకరించి అట్టి సంస్థలనువాటి కార్యక్రమ వివరములు, (ఛాయ చిత్రములతో సహా) మాకు వీలు వెంట ప్రతి మాసమో లేక ప్రత్యేక సంచికగానో ప్రకటించగలము. మా కట్టి సహకారము అనతికాలములోనే లభించగలదని ఆశించుచున్నాను.

—సంపాదకురాలు.

మన సంస్థలు - మా సంస్థలు

మన సంస్థలు-మా సంస్థలు

ఆంధ్రరాష్ట్ర సంఘసంక్షేమ సలహాసంస్థ

కేంద్ర సంఘ సంక్షేమ సంస్థ ఆంధ్ర ప్రభుత్వం సంయుక్తంగా ఆంధ్రదేశములో ఈ సంస్థను సంక్షేమ కార్యక్రమ విస్తరణకుగాను నిర్వహిస్తున్నది. 1954 జూలైలో శ్రీమతి ఎ. చన్నఘంటమ్మ కృష్ణారావు అధ్యక్షతక్రింద స్థాపింపబడిన ఈ సంస్థ స్వచ్ఛందసేవా కార్యక్రమాలను అత్యుత్తమంగా నిర్వహిస్తున్నది.



అధ్యక్షురాలు

స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు :

దేశంలో స్వచ్ఛందంగా సేవాకార్యక్రమములను నిర్వహిస్తున్న సంస్థలనేకము లున్నవి. ఎన్నో సంవత్సరముల నుంచి ఈ కార్యక్రమములను ఈ సంస్థలు నిర్వహిస్తున్నా ఆర్థిక అభావంవల్ల నూతన కార్యక్రమములను ప్రారంభించుటకాని, ఉన్న కార్యక్రమములను సమర్థతతో నిర్వహించటం కాని జరుగుటలేదు. ఇటువంటి సంస్థలకు తగు ఆర్థిక సహాయము, సలహాలనుయిచ్చి సక్రమమైన పంథాలలో నడిపించుటకు కేంద్రసంస్థ పూనుకొన్నది. ఈ కార్యక్రమం ప్రకారము ఆంధ్రదేశంలో 53-54 సంవత్సరములో 41 సంస్థలకు రు 1,69,000 విరాళమీయబడినది.

1954 వ సంవత్సరములో ఆంధ్రరాష్ట్రి సలహా సంస్థ ఏర్పాటయిన తరువాత 1954-55 సంవత్సరములో 30 సంస్థలకు రు 61, 500 విరాళ మీయబడినది. 55-56 సంవత్సరములో 101 సంస్థలకు రు. 3. 63, 941 లు విరాళముగాఇవ్వబడినది భవననిర్మాణమునకు, మోటారు వేన్‌లకును కూడ వలయు ధనమును కొన్ని సంస్థలకు విరాళముగా యిచ్చిరి. కేంద్ర సంస్థ సహాయము చేయు కార్య క్రమములలో బాలసంక్షేమం స్త్రీ సంక్షేమం ముఖ్య కార్యక్రమములు.

56-57 సంవత్సరమునుండి కేంద్ర సంస్థ పెద్ద పెద్ద సంస్థలకు ఐదు సంవత్సరముల గ్రాంటులను విరాళముగా ఇచ్చుటకు నిశ్చయించినది. 6 సంస్థలకు 1.63,500 లు 5 సంవత్సరముల గ్రాంటుగా యిచ్చిరి. 42 సంస్థలకు రు 77,450 లు ఒకసంవత్సరం విరాళముగా యివ్వబడినవి. ఈ ధనసహాయము వల్ల రాష్ట్రసంస్థ యిచ్చు సలహాల వలన యీ సంస్థల కార్యక్రమము లన్నియు సక్రమమైన పద్ధతులలో నడుస్తూ, తమ తమ స్వచ్ఛందసేవా కార్యక్రమములు ,, జయప్రదముగా నిర్వహించగలవని ఆశింపబడుచున్నది.

సంక్షేమ విస్తరణ ప్రణాళికలు :

ఆంధ్ర గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సౌకర్యములు చాల తక్కువ. ఉదాహరణకు ఈ సరియైన విద్యాసౌకర్య

ములు లేవు. ప్రసూతి సౌకర్యములులేవు. స్త్రీలకు తీరిక కాలములో విద్య అభ్యసించుటకు, కుట్టు అల్లిక మొదలైన చేతిపనులు నేర్చుకొను అవకాశములులేవు. పట్టణ ప్రాంతాలలో ఈసౌకర్యములు అంతంతమాత్రంగాఉన్నా. గ్రామములలో ఈ సౌకర్యము లసలు లేనే లేవు. అందు వలన కేంద్రసంస్థ గ్రామీణ ప్రాంతములకు సంక్షేమకార్య క్రమములను విస్తరించు ప్రణాళికలను నిర్వహించుటకు పూనుకొన్నది. దీనికొరకు ఖర్చులలో సగము కేంద్రసంస్థ భరించును. నాలుగవ వంతు రాష్ట్ర ప్రభుత్వము యివ్వ గలదు. మిగిలిన నాలుగవవంతు సంక్షేమకార్యక్రమములు నిర్వహింప బడుతున్న ప్రాంతపు ప్రజలు విరాళంగా యివ్వవలసి యుండును. ఈ కార్యక్రమ నిర్వహణంలో ముఖ్యముగా గుర్తుంచు కొనవలసిన విషయం ఈ కార్య క్రమ నిర్వాహకులు అందరు స్వచ్ఛంధసేవకులు, ముఖ్యంగా మహిళలు.

ప్రతీ ప్రణాళికా ఆధ్వర్యాన ఐదు కేంద్రాలుండును. ప్రతీ కేంద్రమునందును ఒక మంత్రసాని, ఒక గ్రామ సేవిక. ఒకచేతి పరిశ్రమలు నేర్పు శిక్షకురాలు ఉండ గలదు. పిల్లల ఆట సామానులు, ప్రాథమిక విద్యాబోధకు అవసరమైన పుస్తకములు మొదలగునవి ప్రతి కేంద్రము నందును ఉండగలవు. పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు పాలు సరఫరా, ప్రసూతి సౌకర్యములు అన్ని కేంద్రములలోని ముఖ్యాంశాలు. ఉదయం 6 గంటలనుండి సాయంత్రం 8 గంటలవరకు ప్రతీకేంద్రము నందును స్త్రీలకు, బాలురకు ప్రాథమిక విద్య, చిన్నచిన్న ఆటలు, పాటలు ప్రాపంచిక విషయములపై గోష్ఠి. కుట్లు, అల్లిక మొదలైన వివిధ కార్యక్రమములు సక్రమముగా జరగాలని ఈసంస్థ ముఖ్యోద్దేశం. గ్రామాలలో ఉబుసుపోకకు కేవలం సోమరిగా కాలము గడపకుండా సత్కాలక్షేపం ద్వారా విద్యాభ్యాసం ఆరోగ్యక్రమములు నేర్చుకొను అవకాశము లభించగలదు.

ఆంధ్ర దేశములో వివిధ జిల్లాలలో ఈ యోజన ఇటు వంటి ప్రణాళికలు ఇరవై ఒకటి 100 కేంద్రములలో నిర్వ హింప బడుతున్నవి.

ఈ కార్యక్రమములను ప్రణాళిక స్థాయిలో నిర్వహిం చుటకు ముఖ్యసేవికలు నియమించ బడిరి. జిల్లా కార్యా లయం గౌరవకమిటీ అధ్వర్యాన నిర్వహింపబడుచున్నది. 2 వ ప్రణాళిక సమాప్తమగు దినమునకు ప్రతిజిల్లాలోను 4 సంక్షేమ విస్తరణ ప్రణాళికలు న్విరహింప బడుతూ ఉండగలవు. ప్రతిజిల్లా కార్యక్రమ నిర్వహణకు ఒక్కొ క్క జీపుకూడ యివ్వబడినది.

ఆంధ్రలో ఈ కార్యక్రమమునకు ప్రజలనుండిఅత్యంత ఆదరణ లభించు చున్నది. ప్రభుత్వ ఉద్యోగులందరు ఇతోధికంగా ఈ కార్యక్రమములో తమతమ ప్రాంతము లలో తగు సహకారమును అందజేస్తున్నారు.

శిక్షణ కార్యక్రమములు :

ఈ కార్యక్రమ నిర్వహణకు వలయు కార్య కర్తల నిమిత్తమై సీతానగరములో గ్రామసేవికలు తర్ఫీదు చేయ బడుచున్నారు. ఈ సంవత్సరం 55 గ్రామసేవికలుగా అక్కడ తర్ఫీదు పొందుతున్నారు. మద్రాసు ఆంధ్రమహి ళాసభవారు 30 మంది మంత్రసానులకు శిక్షణ నిచ్చు చున్నారు. వీరందరు తమతమ శిక్షణ ముగిసిన పిదప ప్రణాళిక కేంద్రములలో విధులను నిర్వహింప గలరు. ఆంధ్రరాష్ట్ర సంస్థ వివిధ ప్రాంతములలో అనేకమైన యితర శిక్షణలను తమ సిబ్బందికి ఇప్పిస్తున్నారు.

పట్టణప్రాంత మధ్యతరగతి కుటుంబముల సంక్షేమం :

విజయవాడలో సహకార పద్ధతులలో అగ్గిపెట్టెల పరి శ్రమ ప్రారంభమైనది. శిక్షణ ప్రస్తుతము జరుగుచున్నది. త్వరలో పరిశ్రమ ఉచ్ఛస్థాయిని అందుకోగలదు.

ఆఫ్టర్ కేర్ కార్యక్రమములు :

దీర్ఘవ్యాధుల నుండి కోలుకొను వ్యక్తులు వ్యభిచార గృహములనుండి రక్షింపబడు స్త్రీలు మున్నగు వారిని సంస్కరించి వారికి తగు విద్యలు నేర్పి జీవితములో సరైన పంథాలో నడిపించు కార్యక్రమములను సంక్షేమ సంస్థ నిర్వహించుటకు నిశ్చయించు కొన్నది. ఆంధ్రదేశ ములో ఈ కార్యక్రమములను నిర్వహించుటకు ముఖ్య గృహములు 4 ఉండగలవు. ఈ ఆశ్రయంలో వీరినంద రిని చేర్చి వారివారి పరిస్థితులకు తగిన గృహములకు వారు పంపబడెదరు. ఈ కార్యక్రమముగూడ త్వరలోనే ప్రారంభము కాగలదు.

ఇన్ని నూతన కార్య క్రమములను ఈ నాడు మన ఆంధ్ర సంస్థ నిర్వహిస్తూ దేశములో సంక్షేమ కార్యక్రమ ముల వ్యాప్తికి సర్వదా కృషిచేయు చున్నది.

స్వచ్ఛంద సేవకుల, సేవికల ఆధ్వర్యాన, ప్రభుత్వం పూర్తి సహకార సాను భూతులతో, ప్రజల ఆదరణలో ఈ కార్య క్రమములు జయప్రదంగా సాగు చుండుట, ఆంధ్ర ప్రదేశములో వెల్లివిరియుచున్న నూతనవిజ్ఞానము, విద్యాసక్తి నిజముగా ఆంధ్రులమైన మనకందరికీ గర్వ కారణము.

★

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ

స్త్రీ జనాభ్యుదయ శాఖ

ఆనందంతో కలకలలాడుతున్న కుటుంబాలలో దేశ సౌభాగ్యం ప్రతిబింబిస్తూ ఉంటుంది. కుటుంబ సంక్షేమానికీ, తద్ద్వారా దేశసౌభాగ్యానికీ దోహదం చేసేవారు స్త్రీలే. గాంధీజీ ఈ విషయాన్ని ఏనాడో గుర్తించి, కూపస్థమండూకాలవలె ఉన్న మహిళలకు ప్రపంచదర్శనం చేయించి నిర్మాణ కార్యక్రమంలో వారికి సముచితమైన పాత్రను కల్పించారు. స్త్రీగా తనకున్న బాధ్యతకు తోడు ఈనాడు ప్రతీస్త్రీకీ సమాజంలో ఒక వ్యక్తిగా – ఒక పౌరురాలుగా – కూడా బాధ్యతలు హెచ్చాయి. గాంధీజీకి అత్యంత ప్రియమైన నిర్మాణ కార్యక్రమంలో ఒక అంశమైన మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టిన ప్రభుత్వం దేశంలోకెల్లా ఓం ప్రథమంగా సమష్టి మదరాసు ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రత్యేకంగా ఒక శాఖను స్థాపించిన గౌరవం ఆ ప్రభుత్వానికిదక్కింది. ఆంధ్రరాష్ట్ర విభజనానంతరం ఆ శాఖను ఆంధ్ర ప్రభుత్వం యథాక్రమంగా నిర్వహిస్తూవచ్చింది. ఆంధ్ర ప్రదేశావతరణానంతరం ఈ శాఖ కార్యకలాపాలను తెలంగాణా ప్రాంతానికి విస్తృతంచేసే కార్యక్రమం ఇంకా రూపొందించబడలేదు.

సంఘ సంక్షేమ కృషి ఈనాడు కేవలం మతధర్మ దృష్టితోకాక, సహేతుకమైన దృక్పథంతో, శాస్త్రీయమైన పద్ధతులతో నిర్వహింపబడవలసి ఉంది. కుటుంబ సంక్షేమం, సమాజసేవ అనే రెండు ముఖ్యాంశాలతోకూడిన కార్యక్రమాన్ని స్త్రీ జనాభ్యుదయ శాఖ ఆచరణలో పెట్టుతున్నది.

ఈ శాఖ ఉద్దేశాలూ, ఆశయాలు:

1. గ్రామసీమల్ని ముఖ్యంగా దృష్టిలో పెట్టుకుని, విద్యద్వారా, దుర్దశానివారణద్వారా, కుటుంబసంక్షేమాన్ని వృద్ధిచేయడం, జీవనప్రమాణాన్ని హెచ్చించడం.

2. సాంగత్యానికీ, అభిప్రాయ వినిమయానికీ, పౌర శిక్షణకూ సౌకర్యాలు కల్పించడంకోసం సామాజికసేవా కేంద్రాలను నడపడం.



కుమారి జమునాబాయి

డైరెక్టరు, స్త్రీ సంక్షేమ శాఖ.

3. వృత్తి ఉద్యోగాలను చూపడంద్వారా, పల్లెపట్టులలో చిన్న కుటీర పరిశ్రమలద్వారా, పట్టణప్రాంతాలలో ఉపయోగకరమయిన వృత్తులను నేర్పడంద్వారా, ఆర్థిక సహాయం చేయడం.

4. స్త్రీ – బేసిక్ తరగతులద్వారా బాలల సంరక్షణ.

ఈ ఆశయాలను పురస్కరించుకొని ఈ క్రింది పద్ధతులలో కార్యక్రమం నడపబడుతున్నది.

1. సంఘసేవలో ప్రత్యేక శిక్షణ పొందిన ఆర్గనైజర్లు ప్రతీకుటుంబాన్ని దర్శించి, కుటుంబ పరిస్థితులను పరిశీలిస్తారు. ఒక్కొక్క కుటుంబానికి సంబంధించిన విషయాలన్నీ అవగాహనచేసుకొని వారికి తగిన సలహాలు ఇస్తూఉంటారు.

2. ప్రవర్తన సమస్యలు, నిరుద్యోగం మొదలయిన ప్రత్యేక సమస్యలు గల కుటుంబాలను గురించి ప్రత్యేక కృషిచేసి సహాయం చేస్తారు.

3. బిడ్డల సంరక్షణకు ప్రాముఖ్యం ఇవ్వబడుతుంది. మూడేళ్ళలోపు పిల్లలను ఆర్గనైజరూ, మంత్రసానీ కుటుంబ సందర్శన సందర్భంలో జాగ్రత్తగాచూస్తూ ఉంటారు. 3–7 ఏళ్ళ పిల్లలకు ప్రత్యేకమయిన తరగతులు ఏర్పాటుచేసి వారికి చక్కని శిక్షణ యిచ్చి మంచి అలవాటులు నేర్పుతారు.

4. మధ్యాహ్నం తీరిక సమయాలలో సామాజిక సేవా కేంద్రాలు నడుపుతారు. పౌరచైతన్యం కలిగించడానికీ, సాంఘిక జీవనాన్ని అలవరచుకోడానికీ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. వివిధ వర్ణ వర్గాలకు చెందిన స్త్రీలు ఒక చోట సమావేశమై, తమ అనుభవాలను పరస్పరం తెలియజెప్పుకొని, సౌహార్దాన్ని పెంపొందించుకుంటారు. శిశు సంరక్షణ, గృహనిర్వహణ, తీరిక సమయాలలో చేయవలసిన పనులు మొదలయిన వానిని గురించి నేర్చుకుంటారు. ఉపజ్ఞ, ప్రజ్ఞ గలవానికి మంచి అవకాశాలు కల్పించి, ప్రోత్సహిస్తారు.

5. దుర్దశానివారణ కోసం, పునరావాసకల్పనకోసం, తూర్పు గోదావరి జిల్లాలోని సీతానగరంలో ఒక సేవా గృహం, నెలకొల్ప బడింది. తమ వశం తప్పిన పరిస్థితులలో చిక్కుకొని, జీవితంలో నిరాధారంగా బాధపడుతున్న స్త్రీలకు తక్షణ సహాయం లభింపకపోతే అట్టివారు పెడత్రోవలు పట్టవచ్చు. ఆత్మహత్య చేసుకోవచ్చు. అదనులో అట్టివారిని సేవాగృహంలో చేర్చడం వల్ల అట్టి దుర్ఘటనలు నివారింప బడతాయి.

ఈ సదనం కస్తూర్బా గాంధీ జాతీయ స్మారకనిధివారి యాజమాన్యాన్ని నడప బడుతున్నది. ఇందులో చేర్చుకో బడినవారు 3 సంవత్సరాల పాటు సామాన్య విద్యనూ, వృత్తి విద్యనూ, నేర్చుకొని జీవనభృతిని సంపాదించుకో గలుగుతారు. 3 సంవత్సరాల పాటు వీరి పోషణ నిమిత్తం ప్రభుత్వం మనిషి ఒక్కంటికి నెలకు 35 రూపాయిల వేతనం ఇస్తుంది.

ఈ శాఖ చేస్తున్న సేవలో ప్రసూతి సహాయం చెప్పకోదగింది. ఈ శాఖ తాలూకు బ్రాంచీలను తర్ఫీదు పొందిన మంత్రసానులు నియమింప బడ్డారు. మారుమూలల ఉన్న గ్రామాల వారికి ఈ మంత్రసానులు తప్ప వేరే ప్రసూతి సౌకర్యాలు లేవు.

నాగరక ప్రాంతాలకు దూరంగా, మన్యపు ప్రాంతాలలో నివసించే ఆదివాసి స్త్రీల కోసం ప్రత్యేకంగా బ్రాంచీలు నడప బడుతున్నాయి.

ఇదివరలో నేరస్థ జాతులుగా పరిగణింప బడిన ఏనాదులూ, సుగాలీలూ మొదలయిన తెగలవారి స్త్రీలకోసం కూడా ప్రత్యేక మయిన బ్రాంచీలు నిర్వహింప బడుతున్నాయి.

అన్ని బ్రాంచీలలోనూ హరిజన స్త్రీల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూప బడుతున్నది.

సాంఘిక సేవా కృషి కష్టయుత మయినది. నిర్దిష్ట ప్రయోజనాల్ని లక్ష్యించి క్రమపద్ధతులలో కార్యక్రమం సాగించాలి. ఈ క్షేత్రంగలో జరిగేకృషి ఆర్భాటంగా కన బడక పోవచ్చు. తక్షణ ఫలితాలు కూడా సాధించ బడక పోవచ్చు. పట్టుదలతో, జీవకారుణ్య దృష్టితో, శాస్త్రీయ పద్ధతులలో జరిగే సంఘ సేవాకృషి వల్ల తప్పక ఫలితం సిద్ధించ గలదు.

—★—

అఖిల భారత మహిళా సభ

ఆంధ్ర శాఖ

శ్రీమతి సరోజినీనాయుడు, శ్రీమతి విజయలక్ష్మీ పండిట్, శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ మొదలగు నారీమణులచే నిర్వహింప బడిన అఖిలభారత మహిళా సభకు ఇది రాష్ట్రశాఖ. ముప్పది ఏండ్లుగా ఈ శాఖ స్త్రీల హక్కులకై నిరంతరము పోరాడినది. విషయసమస్య ఉత్పత్తిల్లినప్పుడల్లా స్త్రీల వకాల్తా తీసికొని అతి ధైర్య సాహసాలతో ఇండ్లలో, సభావేదికలలో, అసెంబ్లీ, పార్ల మెంటులో ఆందోళనచేసి కొన్ని సాంఘిక చట్టములు రూపొందించుటకు కారణ భూతురాలైనది.



కుమారి సి. వి. లక్ష్మీరెడ్డి, కార్యదర్శిని.

ఆంధ్ర రాష్ట్రశాఖకు అధ్యక్షురాలు శ్రీమతి రామ సుబ్బమ్మగారు. ఉపాధ్యక్షురాలు, ద్రోణంరాజు లక్ష్మీ బాయమ్మగారు, కార్యదర్శిని కుమారి సి. వి. లక్ష్మీరెడ్డి. ఈ ఆంధ్ర రాష్ట్రశాఖకు ప్రతి జిల్లాలోను శాఖలు,



శ్రీమతి కడప రామసుబ్బమ్మ, అధ్యక్షురాలు.

అనుబంధ శాఖలు ఉన్నవి. అనంతపురము, విశాఖ పట్టణము జిల్లాలు మినహా, అన్ని జిల్లాలలోను ఆ యా శాఖలు చాల ఉత్సాహముతో స్త్రీలకు, బిడ్డలకు ఉప యుక్తమగు నిర్మాణ కార్యక్రమమునకు చేదోడుగా పెక్కు సంస్థలు నిర్వహించుచున్నవి. రాష్ట్రమంతటా, పల్లె పల్లె వాడవాడ నవచైతన్యము కలిగించుటకు ప్రప్రథమంగా కృషి చేసిన సంస్థ ఇదియేనని చెప్పవచ్చును. ధనలేమిచే మరింత కార్యము నిర్వహించుట గాని, ప్రచారముగాని లేకుండ యున్నది. దాని కార్యాలయము మద్రాసులో, 55 హారింగ్టన్ రోడ్డులో స్థాయీ సంఘ సభ్యురాలు శ్రీమతి లక్ష్మీరఘురామ్‌గారిచే నిర్వహింప బడుచున్నది. ఇండోరు మహాసభకు ఈ శాఖ నుండి ముగ్గురు ప్రతి నిధులు వెళ్ళగలరు. ★

శిశు సంక్షేమ శాఖ

దీని కార్యాలయము నెల్లూరులో కలదు. రెండేళ్లనాడే ఈ శాఖ ఏర్పాటు కాబడినది. జిల్లాలన్నిటిలోను ఇప్పు డిప్పుడే శాఖలు ఏర్పాటైనవి. శైశవావస్థలోనున్న ఈ శాఖ ఇంతవరకు పెద్దగా చెప్పుకో దగినంత పని ఏమి చేయలేదు. అఖిల భారత శిశు సంక్షేమమునకు శాఖ గనుకను, అంతర్జాతీయ శిశు సంక్షేమ శాఖకు అను బంధశాఖ గనుకను, భవిష్యత్తులో ఆంధ్రదేశములోని బిడ్డల సంక్షేమము కొరకై ఎక్కువ కృషిచేసే సేవా భాగ్యము కలిగే అవకాశమున్నది. దీనికి అధ్యక్షురాలు, శ్రీమతి లక్ష్మీరఘురామ్, ఉపాధ్యక్షురాలు, శ్రీమతి వి. లక్ష్మీపార్వతిగారు, కార్యదర్శులు — కుమారి సి. వి. లక్ష్మీరెడ్డి, శ్రీ పి. ఎస్. ఆర్. ఆంజనేయులు, శ్రీ న్యాయపతి రాఘవరావు.

ఆంధ్ర యువతీ మండలి

హైదరాబాదు



శ్రీమతి బూర్గుల అనంతలక్ష్మీదేవి, అధ్యక్షురాలు.

భారతదేశ మంతయు. బానిసత్వము ననుభవించు చున్న రోజులలో, ఈ ఆంధ్రయువతీ మండలి 1935 వ సం ॥ విజయదశమినాడు స్థాపించ బడినది. ఆంధ్ర వనితల జీవనములో ఆర్థిక సాంఘిక వైజ్ఞానికాభ్యుదయము కలుగ జేయవలయునని ఈ సంస్థ యొక్క ముఖ్యోద్దేశము. శ్రీమతి యల్లా ప్రగడ సీతాకుమారి, శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి గార్లు ఈ సంఘ స్థాపనకు బూనుకొనిన సోదరీ మణులు. శ్రీమతి బూరుగుల అనంత లక్ష్మీదేవి, శ్రీమతి రంగమ్మ, ఓబులరెడ్డి, శ్రీమతి టి. వరలక్ష్మమ్మగార్లు సంస్థాభివృద్ధికి తోడ్పడిరి.

ప్రారంభమున నొక చిన్న గది అద్దెకు తీసికొని, అందే సభలు, సమావేశములు జరుపుచుండెడి వారు. లలిత కళా ప్రదర్శనములు, శిశు ప్రదర్శనములు కూడ నప్పుడప్పుడందే జరుగు చుండెడివి. మండలి యొక్క ఆశయములను నెఱ వేర్చుటకు తగిన కార్యక్రమము, లందే జరుప బడుచుండెను. వయోజన విద్యాభి వృద్ధి కొరకు పాఠశాలలు, గ్రంథాలయము, నెలకొల్పబడినది.

సంస్థ పక్షమున శ్రీమతి టి. వరలక్ష్మమ్మగారి యాజమాన్యము క్రింద దాయీలకు శిక్షణ ఇవ్వబడెను. పోలీసు చర్యకు పూర్వమున నిజాము నిరంకుశ ప్రభుత్వపు రోజులలో, స్త్రీలకు కలిగిన యిక్కట్టులు కొన్ని యీ సంస్థ ద్వారా తీర్చబడినవి. హైదరాబాదు రాష్ట్ర ఆంధ్ర మహిళలలో చైతన్యము కలుగ జేసినది యీ ఆంధ్ర యువతీ మండలి యని చెప్పుట అతి శయోక్తి కాజాలదు.

రజాకార్ల రోజులలో మండలి సభ్యురాండ్రు చాలా మంది కొంది శీకులై యితర ప్రాంత ములకు బోయిరి. పోలీసు చర్య తరువాత ఈ సంస్థ పునః స్థాపనము చేయ బడినది. ప్రస్తుతము సభ్యురాండ్ర సంఖ్య 250 కి మించి యున్నది. సభ్యత్వపు చందా నాలుగు తరగతులుగా నేర్పఱచబడి యున్నది. అందు మొదటి తరగతి రెండు రూపాయిలు. రెండవ తరగతి ఒక రూపాయి, మూడవ తరగతి ఎనిమిది అణాలు. నాలుగవ తరగతి నాలుగణాలు, ఇట్లు ఏ మహిళయైనను దన ఆర్థికపరిస్థితికి దగిన యేదో ఒక తరగతి సభ్యురాలుగ జేరుటకు అవకాశముకలదు.

మండలికి స్వంత భవనము అవసర మని నిర్ణయింప బడినది. అప్పటి నుండి భవన నిర్మాణ ప్రయత్నములు గావింపబడెను. ప్రజా మంత్రులు నలుగురు ప్రభుత్వములో చేరిన వెంటనే మండలి సభ్యురాండ్రు భవనము కొఱకు భూమిని గోరుచు దరఖాస్తు పెట్టిరి. తత్ఫలితముగా ఎకరము ముప్పాతిక వైశాల్యముగల భూమి, మండలి కొసంగ బడినది. అప్పుడు విద్యా, భూమ్యాదాయ, శాఖల మంత్రిగానున్న శ్రీయుత డా ॥ బూరుగుల రామకృష్ణా రావుగారును, పి. డబ్ల్యు. డి. మంత్రిగా నున్న నవాబ్ జైన్, యార్ జంగ్ బహద్దరు గారును, అభిమాన పురస్సరముగ ఈ కార్య నిర్వహణమునకు ముఖ్య కారకులైరి. మండలి సభ్యురాండ్రు భవన నిర్మాణము కొఱకు ఒక లక్ష హాశీ రూపాయిలు విరాళములను ప్రోవుచేసి, వినియోగించిరి. 1954 వ సంవత్సరమున రాష్ట్ర ప్రముఖుల సహకారముతో భవన నిర్మాణము పూర్తి అయినది. మండలి కిట్టి స్థిరాస్తి నేర్పరచుటకు బాధ్యత వహించిన వారిలో ముఖ్యులు ఇప్పుడు మండలి ఉపాధ్యక్షురాలుగా

నున్న శ్రీమతి బూరుగుల అనంత లక్ష్మీదేవిగారును, శ్రీమతి ఎ. శ్యామలాదేవిగారును.

మండలిలో సమావేశములు ఉత్సవములు చేయబడుచున్నవి. కుట్టు చాపలల్లుట, తెలుగున మాంటెస్సోరీ విధానమున శిశు విహార శిక్షణము, సంగీతము, నృత్యము, హిందీ ప్రబోధము, మొదలగునవి నిర్మాణ కార్యక్రమాంశములుగా సాగింప బడుచున్నవి. మండలి యందు కొన్ని గ్రంథములు సమకూర్చ బడినవి. ప్రతి దినమునను సాయంకాలము 5 మొదలుకొని, యేడు గంటల వరకు సభ్యురాండ్రకు పఠనార్థమై గ్రంథములొసంగ బడుచున్నవి. ప్రస్తుత గౌరవ కార్యదర్శిని యగు శ్రీమతి ఏ. శ్యామలాదేవిగారును. సహాయ గౌవర కార్యదర్శిని యగు శ్రీమతి సత్తిరాజు రాజ్యలక్ష్మిగారును, ఈ కార్యక్రమము సక్రమముగా జరుగు నట్లు చూచుటకు బాధ్యత వహించి, కృషి చేయుచున్నారు.


రెండున్నర మొదలు కొని యాఱు సంవత్సరముల వఱకు ప్రాయము గల బిడ్డలకు, తెలుగులో, మాంటెస్సోరీ విదానమున శిశు విహార శిక్షణము జేయించుచు, శ్రీమతి భాగానగర లక్ష్మిగారు, ఆనరరీ డైరెక్ట్రిస్సుగా గృషిచేయుచు, అత్యంత ప్రజా గౌరవమునకు బాత్రులైరి.

కడచిన ఉగాది పండుగ నాటి నుండి మండలి పక్షమున "వనిత" అను నొకమాస పత్రిక వెలువడుచున్నది. వనితా మణులకు సారస్వత రంగమున సైతము ప్రవేశము కలుగ జేయుటయే, ఈ మాస పత్రిక యొక్క ముఖ్యోద్దేశము. ఇటీవల ఈ పత్రిక పరిమాణము సైతము పెద్దగఁ జేయబడినది. మండలి, కార్య నిర్వాహక సభ్యురాలగు శ్రీమతి అబ్బూరి ఛాయాదేవి ఈ పత్రికకు సంపాదకురాలుగానుండి, పత్రిక స్వరతో ముఖాభివృద్ధికి పాటుబడుచున్నారు.

ప్రతి మాసమునను బది యారవ తేదీన మండలి భవనమున, మాతృమండలి సమావేశము జరుపబడుచున్నది. తస్మూలమున దల్లులకు విజ్ఞాన వికాసము గలుగు నట్లు పండితుల వలన నుపన్యాసము లిప్పించఁబడుచున్నవి, తల్లులకు గలుగు సంశయములను, సమస్యలను నివారణము చేయు చర్చలు జరుప బడుచున్నవి.

హైదరాబాదు నగరములోని కబాడిగూడ యను ప్రదేశమున, మండలి పక్షమున నొక్క శిశు సంక్షేమ కేంద్రము నడుప బడుచున్నది. ప్రస్తుతము దానిలో ఇరువది మంది శిశువులు మాత్రము చేర్చు కొనబడి, జాగ్రత్తచేయ బడుచున్నారు. మండలి కార్య నిర్వాహక సభ్యురాలగు శ్రీమతి డాక్టరు శకుంతలా దేవి ఎం.బి.బి.ఎస్. గారు, శిశువుల యారోగ్యమును పరీక్షించుచుందురు.

మండలి కార్యక్రమముల నడుపుటకు, కేంద్ర సమాజ సంక్షేమ సంఘమునుండి రు 7,500 లు ఆర్థిక సహాయము లభించినది. సంస్థయు మఱి, యంత ధనమును బ్రోవు చేసి, మొత్తము రు 15,000 ల రూప్యములను కొన్ని కార్యక్రమములకై వినియోగపఱచినది. ఈ సంవత్సరము ఒక పంచవర్ష ప్రణాళికను సిద్ధముచేసి, సి. ఎస్. డబ్ల్యు



శ్రీమతి ఎ. శ్యామలా దేవి, గౌ॥ కార్యదర్శిని.

బి. వారి కంపుచు రు 50,000 ఏబదివేల రూపాయిల ద్రవ్య సహాయము నర్థింపగా; వారు రు 25,000 ల మొత్తము నొసంగ ననుమతించిరి.

హైదరాబాదు నగరము "ఆంధ్రప్రదేశ్" నకు ముఖ్య పట్టణ మగుటచే, ఇంక సభ్యురాండ్ర సంఖ్య పెరుగ గలదనియు, ఆంధ్ర యువతీ మండలికి, మహోజ్జ్వల మగు భవిష్యత్తు కలుగ గలదనియు, భావించుచున్నారము.

జిల్లాలలోని స్వచ్ఛంద సంస్థలు

"సత్కార్యసాధన అనే సాగర తరణమునకు సంస్థయే మంచి నావ" అని ఒక మహాకవి ప్రవచనం. అంటే ఒక మంచి పనిని సాధించటం సముద్రాన్ని దాటటంతో పోల్చి, 'సంస్థ'ను దాటే నావగా వర్ణించేరు-నిజమేనేమో ననిపిస్తుంది. ఇప్పుడు సంస్థను చూస్తుంటే....

అసలు ఏ పనీ కూడా ఇతరుల సహాయం అపేక్షించ కుండా జరగదు. వ్యక్తిగతంగా కాదు నేను చెప్పేది, పరోపకారంగా ఏదేనా సత్కార్యం, తల పెట్టితే అవరోధాలయ్యేవి ముఖ్యంగా, ధనాభావం, శక్తిలేమి...ఒక సద్వ్యక్తి మనసులో ప్రజా సంక్షేమం కొరకు ఏదేనా నల్గురికీ ఉపయోగ పడే కార్యం చేయాలంటే నల్గురి సహాయం అపేక్షించాలి....ఆ నల్గురి కలయికయే ఒక సంస్థ.

ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయులు ఎంతో సహాయాపేక్షకులుగా ఉన్నారు....వెనుక బడియున్న వారి సంక్షేమానికి ఎన్నో సంక్షేమ సంస్థల అవసరం ఎంతేనా ఉంది....ప్రభుత్వం కూడ ఈ విషయంలో ఎంతో గమనికతో, కేంద్రసాంఘిక సంక్షేమసంస్థ నేర్పరచి, ఆ సంస్థకు శాఖలుగా రాష్ట్రి సంక్షేమ సంస్థలు. జిల్లా సంక్షేమ సంస్థలు. ఉపశాఖలుగా గ్రామసేవా సంఘములు, స్థాపించే ఉంది. వీటిల్లో స్త్రీ సంక్షేమం, శిశు సంక్షేమం, ముఖ్యం—ఈ సంస్థలు మన దేశపు నలుమూలలా పల్లె పల్లెలా స్థాపించ బడ్డాయి.—అల్లాంటివి మన ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్నాయి. అవికాక ఇంకా ప్రతి ఊరికీ ఒక మహిళా సంఘం-ఒకటి ఉండనే ఉంటుంది.... ఈ సంఘం కూడా మహిళా సంక్షేమం, శిశు సంక్షేమం వంటివి చేస్తూనే ఉంటుంది....అందులో కొన్నింటిని పరిచయం చేస్తున్నాను.

భారత సేవాసమాజము - మహిళాశాఖ

గుంటూరు

గుంటూరు జిల్లా కన్వీనరు ఆధ్వర్యమున - శ్రీమతి ఆవుల జయప్రదాంబగారి నిర్వహణ క్రింద ఈ సంస్థ నడుప బడుతూవుంది. వికలాంగులైన బిడ్డల శరణాలయమును నడుపుచున్నారు. ఇందు కుంటి, గ్రుడ్డి అవిటి బాల బాలికలున్నారు. అన్న వస్త్రములు, విద్యా వృత్తి సౌకర్యములు జరుపుచున్నారు. ఈ బాల బాలికలలో బుర్రకథ దళము ఒకటి ఏర్పాటు చేసినారు. కుంటి, గ్రుడ్డి వారైనా చక్కగా బుర్రకథలు ఇప్పుడు చెప్ప కలుగు చున్నారు. స్త్రీలకు కుట్టు, టైపు వయోజన విద్యాశాఖ మొదలగునవి నిర్వహింప బడుచున్నవి.

భారత సేవాసమాజము - మహిళాశాఖ

సంగంజాగర్లమూడి

అధ్యక్షురాలు శ్రీమతి జంపాల పద్మావతీదేవిగారు, కార్యదర్శిని దేవభక్తుని వెంకట నరసమ్మగారు,

ఈ శాఖ యీ చిన్న గ్రామములో స్త్రీలకు, బాలికలకు కుట్టు, హిందీ, నవ్వారు నేయుట నేర్పుచున్నారు. ప్రథమములో కుంటి గ్రుడ్డివాళ్లకు అన్నదానముతో ఆరంభించి, ఇప్పుడు ఈ శాఖను విజయవంతముగా వికలాంగులైన బిడ్డలకు ఒక శరణాలయమును నిర్వహించుచున్నది. ఈ బిడ్డల రక్షణ విద్యా సౌకర్యములు, అన్నవస్త్రముల సౌకర్యములు ఈ సంస్థే కలిగిస్తున్నది.

మహిళా సేవా మండలి

బందరు

అధ్యక్షురాలు, శ్రీమతి రాజ్యలక్ష్మమ్మగారు కార్యదర్శిని, శ్రీమతి దుల్ల వెంకట రమణమ్మగారు.

పెక్కు సంవత్సరముల నుండి నిర్వహింప బడుచున్న ఈ మహిళా సేవామండలిలో చరఖాతో నూలు వడకుట ఒక ముఖ్యమైన కార్యకలాపము. మొన్న చరఖా జయంతి సందర్భములో సభ్యురాండ్రు దీక్షగ వడికి తీసిన 200 చిలపల నూలు మహాత్మునికి కానుకగా సమర్పించిరి.



ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవ సందర్భములో బందరు మహిళాసేవా మండలి స్వచ్ఛంద సేవికలు రాజేశ్వరీ బాల విహారులో పతాక వందనము చేసిరి. పతాకమును శ్రీమతి నూకల సత్యసనాతనమ్మగారు ఎగురవేసిరి.

హితకారిణీ సమాజము

రాజమండ్రి

1907 లో కీ॥ శే॥ శ్రీ కందుకూరి వీరేశలింగము గారిచేత స్థాపింప బడినది. అధ్యక్షులు నాళము కృష్ణారావు గారు, కార్యదర్శి శ్రీ ఎ. వెంకట్రావుగారు.

ఈ సంస్థ ఒక వితంతు శరణాలయము నిర్వహించు చున్నది. ఆ వితంతువులకు విద్యా సౌకర్యములు కూడ ఏర్పాటు చేయ బడియున్నవి. ప్రార్థన సమాజము, ప్రదర్శనాలయము, హైస్కూలు నిర్వహింప బడుటే గాక అచ్చటి స్త్రీలకు నవ్వారు నేయుట, కుట్టు, లేసు అల్లుట మొదలగు పనులు నేర్పుదురు-ప్రస్తుతము అక్కడ సుమారు అరువది విద్యార్థినులు మాత్రమే యున్నారు.

మహిళా సమాజము

సంగంజాగర్లమూడి

వి॥ లం॥ అధ్యక్షురాలు—శ్రీమతి పరుచూరి జానకమ్మగారు కార్యదర్శిని శ్రీమతి కొత్త రంగమాంబగారు.

ఈ సమాజము 1954 జూన్ 23 తేదీన శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్‌గారి ప్రోత్సాహముతో రిజిష్టరు కాబడి అఖిలభారత మహిళాసభకు అనుబంధ శాఖగా ఏర్పడినది ఈ సంస్థలో 160 మంది సాధారణ సభ్యులు, 11 మంది కార్యవర్గ సభ్యులు ఉన్నారు. ఈ సంస్థ పురాణపఠనము, శిశుకేంద్రము, కుట్టుమిషను, నవ్వారునేత, వడుకునూలు, హిందీ తరగతులను నిర్వహించు చున్నది.

(1) పురాణ పఠనము :


ఈ శాఖలో ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలనుండి 5 గంటలవరకు 20 మంది స్త్రీలు జ్ఞానార్జన నిమిత్తము సమాజ ఆవరణలో చేరుదురు. సమాజ అధ్యక్షురాలు శ్రీమతి పరుచూరి జానకమ్మగారు ఒక గంట పురాణ గ్రంథముల చదివి అర్థతాత్పర్యములు చెప్పెదరు. సమాజ సభ్యురాలు శ్రీమతి కాకాని రంగమ్మగారు సమాజమునకు వచ్చే వివిధ పత్రికలను చదివి వినిపించెదరు. సమాజ

షునకు 8 దిన. వార. పక్ష. మాసపత్రికలు వచ్చుచున్నవి ఈ శాఖ సంవత్సరములో వచ్చు జాతీయపౌరాణిక ఉత్సవములు జరుపుచుండును. ఈ కార్య క్రమము వలన గ్రామీణస్త్రీలు వివిధ విషయములు తెలుసు కొనుటకవకాశము కలుగుచున్నది.

(2) శిశు కేంద్రము :

ఇందులో 10 మంది అనాథులైన సవర్ణ హరిజన బాలికలకు ఉచితముగా అన్న. వస్త్ర. వైద్య. విద్యాదానము జరుగుచున్నది. వీరి సంరక్షణకు ఒకవంటమనిషిని నియమించటమైనది. ఇందు 3 గ్గురకు హిందీ. 7 రికి ప్రైమరీ విద్య 10 మందికి నవ్వారు నేత నేర్పబడుచున్నది. ఈ బాలికలను స్వయం పోషకత్వము కలిగింపు వృత్తి విద్యలలో తయారుచేయవలెనని సమాజఆశయము. ఈశాఖను కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి కోనేరు అన్నపూర్ణమ్మగారు నిర్వహిస్తున్నారు.

పరిశ్రమల శాఖలో కుట్టుమిషను పదిమంది బాలికలకును, నవ్వారు నేయుట సమాజ శిశుకేంద్ర బాలికలకు నేర్పుటయును, ఆరు రాట్నములమీద నూలువడకుట దిన కార్య క్రమములు. హిందీపాఠములు 24 గురు బాలికలు ప్రాథమికనుండి విశారద వరకు నేర్చుకొను చున్నారు. ఇంతవరకు ఈ పాఠశాలనుండి 54 గురు హిందీ పరీక్షలకు వెళ్ళారు. 35 మంది ఉత్తీర్ణులైనారు. కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి యన్నంశెట్టి సామ్రాజ్యమ్మగారి అజమాయిషీ క్రింది ఈ శాఖవున్నది.




సంగంజాగర్లమూడి మహిళా సమాజము ఇందు కార్యవర్గ సభ్యులు, అనాథ బాలికలు, శిశుశరణాలయ సంరక్షకురాలు కుట్టు టీచరు కలరు.

—★—

శ్రీ సాధువమ్మ సేవాసదనము

సత్తెనపల్లి

సుమారు పన్నెండు సంవత్సరాలనాడు స్థాపితము. ఈ సంస్థ సత్తెనపల్లిలో బాలికలకు ప్రత్యేకముగా నొక ఉన్నత పాఠశాలగా స్థాపించినారు. ఇప్పుడు నూటపది మంది బాలికలు దానిలో జదువుకొనుచున్నారు. బీదబాలికలకొరకు ఒక వసతి గృహముకూడ ఏర్పాటు చేసినారు. ఇందు హరిజన, క్రైస్తవ, వెనుక బడిన జాతుల బాలికలు అగ్రవర్ణములబాలికలు కూడకలరు. అస్పృశ్యతా నివారణకు ఇది ప్రథమ సోపానము. ఇచ్చటి విద్యార్థినులేగాక యితర గృహిణులుకూడ తీరిక వేళలలో నుపయోగించుకొనుటకై ఒక గ్రంథాలయము (కస్తూరిబాయి గ్రంథాలయమను పేరుతో) వున్నది. మరియు దుర్గాకళా నిలయమను ఒక శాలలో, నూలువడకుట, నవారునేత, కుట్టు. చాపల్లుట. బొమ్మలుచేసి రంగులు వేయుట, సిమెంటుతో సానలు, కూజాలు మొదలగునవి చేయుట మున్నగు కుటీర పరిశ్రమలు నేర్పబడుచున్నవి. ఇందు బొమ్మల విభాగము ప్రత్యేక ఆకర్షణ కలది. ఇచ్చటి విద్యార్థినుల బృందమొకటి బుఱ్ఱకథలు, హరికథలు చెప్పుటకు తర్ఫీదైనది. ఈ రెండేళ్ళనుండి పాలసరఫరాకు ఒక కేంద్రముకూడఏర్పాటైనది. ఈసంస్థ మేనేజరు వ్యవస్థాపకురాలు శ్రీమతి త్రిపురనేని సాధువమ్మగారు



దుగ్గిరాల మాతా శిశుసంరక్షణ కేంద్రం

మహిళా సమాజము

దుగ్గిరాల

అధ్యక్షురాలు— శ్రీమతి జంపాల రత్నమాణిక్యమ్మ గారు కార్యదర్శిని శ్రీమతి జంపాల ప్రభావతీదేవి గారు- శ్రీమతి లక్ష్మీరఘురామ్ గారిచే స్థాపితము వారి ప్రోత్సాహముతో అఖిలభారత మహిళాసభకు అనుబంధ శాఖగా ఏర్పాటైనది.

కార్య క్రమములు :

ఈ సమాజము ఆధ్వర్యమున అనుదినము రాటము వడకుట, పత్రికా పురాణ కాలక్షేపములును, శనివారము నాడు భజన ఇత్యాది ఆధ్యాత్మిక కార్య క్రమములు నిర్వహింపబడును.

పదివేల జనాభాగల గ్రామములో ప్రసూతికి ఏ విధమైన వైద్య అనుకూలములు లేకుండుటచే రెండేళ్ళకు పూర్వము ఒక ప్రసూతిచికిత్సాలయము మహిళా సమాజము ఆధ్వర్యమున ఏర్పాటైనది. ఈ చికిత్సాలయములో ఒకనర్సు ఒక డాక్టరు ఎల్లప్పుడూ వుందురు. ఉదయము సాయంకాలము స్త్రీలకు బిడ్డలకు ఔట్ పేషెంటు డిపార్టుమెంటుయున్నది, గవర్నమెంటు వారు ఈప్రసూతి చికిత్సాలయమునకు అరఎకరము భూమి యిచ్చినారు. అందు శ్రీ కంభంపాటి నారాయణగారి భూరి విరాళముతో ఒక ప్రసూతి చికిత్సాలయము కట్టనున్నారు.

హరిజన బాలికల వసతిగృహము

తెనాలి

1935 స్థాపితము, శ్రీ గాంధి మహాత్మునిచే శంఖుస్థాపన చేయబడినది. ఇచ్చటఇప్పుడు 375 బాలికలున్నారు ఏడు శాఖలున్నవి. అందు ముఖ్యము ప్రాథమిక ట్రైనింగు పారిశ్రామిక శాఖలు, ఉచిత వైద్యశాఖ దీని మేనేజరు. వ్యవస్థాపకురాలు శ్రీమతి కొల్లా తాయారమ్మగారు

స్త్రీ హితైషిణీమండలి


బాపట్ల

సుమారు ఇరువదైదు సంవత్సరముల నాడు శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు బాపట్లలో ఈమండలిఏర్పాటు చేసి స్త్రీలలో సాహిత్య సంస్కారములకు పెక్కు కార్యక్రమములు ఏర్పాటు చేయుచున్నారు.


బాలసరస్వతీ స్త్రీ సమాజము

తణుకు

వ్యవస్థాపక అధ్యక్షురాలు-శ్రీమతి డి. సత్యవతమ్మ కార్యదర్శిని శ్రీమతి పి. బాలా త్రిపుర సుందరి, సాంఘికముగా రాజకీయముగా, సాంస్కృతికముగా స్త్రీలకు బిడ్డలకు విజ్ఞానావకాశములు కలిగించుట ప్రాథమిక విద్యా, హిందీ, సంగీత నృత్యములు, మిషను కుట్టు,



బాపట్ల స్త్రీ హితైషిణీ మండలివారు ప్రతీ ఉదయం బీద పిల్లలకు పాలు పోస్తున్నారు.



పశ్చిమ గోదావరి జిల్లా రాయలంలో
సమాజ కల్యాణ క్షేత్రంలోని బాల బాలికలు.

ఎంబ్రాయిడరీ, నేత, నూలు వడకుట, టైపు చేయుట నేర్ప బడుచున్నవి. టెలిగ్రాఫ్, టెలిఫోనులు స్త్రీలకు నేర్పుట ఒక ప్రత్యేకత. ఉచిత హోమోపతి వైద్యశాల నడుప బడుచున్నది, ఐదు వందల స్త్రీలు, బాలికలు ఈ సంస్థలో నున్నారు.

మహిళాసంఘము

శ్రీకాకుళము

అధ్యక్షురాలు : శ్రీమతి టి. సత్యనారాయణరావు.
ఉపాధ్యక్షురాలు : శ్రీమతి డి. సువర్ణాబాయి.
కార్యదర్శిని : శ్రీమతి గుడివాడ సూర్యకాంతమ్మ.

ఇచ్చట పాల పంపకము, మహిళా వికాసకార్యక్రమములు జరుగు చున్నవి.

కస్తూరిదేవి బాలికల విద్యాలయము

నెల్లూరు

వ్యవస్థాపకురాలు పొణకా కనకమ్మగారు, అనేక సంవత్సరముల నుండీ దేశసేవ భాషాసేవ ఈ విద్యాలయము ద్వారా, చేయు చున్నారు. ఈ విద్యాలయమునకు పారిశ్రామికశాఖ వసతి గృహము కలవు, శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు, పెక్కు సంవత్సరములు శ్రీమతి కనకమ్మగారికి కుడి భుజముగా యుండి ఈ విద్యాలయ నిర్వహణకు సహాయ పడిరి.

శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘము

రాజమండ్రి

ఈ సంఘము వివిధ శాఖలతో పెక్కు సాంఘిక సంక్షేమ కార్యక్రమములను 1940 నుండి నిర్వహించుచున్నది. ఇందు ముఖ్యముగా బీదలకు ఉచితముగా వైద్యాలయమును నిర్వహించుట. విడువబడిన శవములకు దహన సంస్కారములు ఏర్పాటు చేయుట-స్థాపకులు-శ్రీ స్వామి కారుణ్యానందగారు. అధ్యక్షులు : శ్రీ ఎ. బి. నాగేశ్వరరావు. కార్యదర్శులు : శ్రీ కారుమూరి సర్వేశలింగముగారు, శ్రీ కె. అప్పలస్వామిగారు.

ప్రేమసమాజము

విశాఖ పట్టణము

మొన్ననే 15 వ వార్షికోత్సవము జరుపుకొనినది. ఈ ప్రేమసమాజముచే నిర్వహింప బడుచున్న వివిధ శాఖలలో అనాథ శరణాలయము ముఖ్యము. మొన్ననే ఒక ఔషధాలయానికి ప్రారంభోత్సవము చేసుకున్నారు. వికలాంగులకు వసతి గృహము-వారికి విద్యా, ఆహార సౌకర్యముల ఏర్పాటు గలదు-ఒక గ్రంథాలయము నెల కొల్పి హరిజనవాడలోని వారికి విజ్ఞాన వినోదములు కల్పించుచున్నారు.

కోనసీమ మహిళాసంఘము

అమలాపురము

డాక్టరు గోటేటి సరస్వతిగారు నిర్వాహకులు. స్త్రీల బాలబాలికల విజ్ఞాన వినోదముల కార్యక్రమములు నిర్వహించు చున్నారు - వీరు సంఘమునకు స్వంత భవనమునకై, బాలకేంద్రమునకై కృషి చేయుచున్నారు.

శ్రీ అకెళ్ల సూర్యనారాయణ రాయ మహిళా భవనము

విశాఖ పట్నం

కార్యదర్శిని శ్రీమతి పా॥ వెంకట రమణమ్మగారు, ఈ మహిళా సమాజముచే గృహపరిశ్రమలు, చిత్ర లేఖనము, వివిధ రకముల కుట్టు పనులు, హిందీ, భాషా శిక్షణ నిర్వహింప బడుచున్నవి.

ఆంధ్ర మహిళా సభ

మహిళా విద్యాలయము

మల్లమదేవి హాస్టలు

రాజ్యలక్ష్మి పారిశ్రామిక విద్యాలయము

ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్

ఆంధ్ర మహిళా ప్రింటింగ్ ప్రెస్

ఆంధ్ర మహిళ మాస పత్రిక

నాగేశ్వర శిశువిహార్

నర్సింగ్ హోమ్

మహిళలను సుశిక్షితలైన దేశసేవికలుగా తయారుచేసి
సంఘ సౌభాగ్యమునకు తోడ్పడడమే మాలక్ష్యం.




రత్నాల కమలాబాయి



ఆకెళ్ళ పర్వతవర్ధనమ్మ



వెనిగళ్ల లక్ష్మీపార్వతి




గిడుగు లక్ష్మీకాంతమ్మ




కర్ణి కమలా కేశవరావు



కస్తూరి రంగనాయకమ్మ



పర్వతనేని సంపూర్ణమ్మ



కార్యదర్శినులు

బెన్నూరి తిమ్మాబాయి

కొత్త లక్ష్మీరఘురామ్

ఆంధ్ర మహిళా సభ

కార్యనిర్వాహక వర్గము

1956-'57

మా సంస్థ

లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే పేరుతో 1937 సంవత్సరంలో బాలికల క్లబ్బుగా జననమందిన మా సభ నేటికి ఆంధ్ర మహిళల ఏకైక విద్యా సంస్థగా రూపొం దింది. సభను స్థాపించిన దుర్గాబాయమ్మగారు, భూరివిరాళ ముల నిచ్చి సభా భవనమును నిర్మించిన దాతలు ట్రస్టీలుగా ఉన్నారు. ప్రత్యేక శాఖల కార్యభారం వహిస్తున్నవారు మా కార్యనిర్వాహక సభ్యురాండ్రు.

ఆంధ్రమహిళాసభను నిర్విఘ్నంగా నిర్వహించ కలిగా మంటే అది ఎందరి సహకారముతోనో చేయ కలుగు తున్నాము. ధన సహాయము వల్లగాక పెక్కుమంది మన స్ఫూర్తిగా సభకొరకై పనిచేయుట వల్లనే ఈసంస్థ విజయ వంతంగా నిర్వహింప గలుగుచున్నాము. ఈ సంస్థకు పెక్కుమంది ఎంతో ఔదార్యంతో ధనసహాయము చేశారు. చేస్తున్నారు. ప్రతిపనీ చేయుటకు "నిర్వాహ కులు" సహకరిస్తున్నారు. పదముగ్గురు పోషకులు, 450 మంది యావజ్జీవ సభ్యురాండ్రు, అశేష సామాన్య సభ్యు రాండ్రు విద్యార్థినులు, నిర్వాహకులు. ఆంధ్రమహిళ చందా దారులు, అడ్వర్టైజుచేసే వ్యాపారస్థులూ అందరూమాకు ధనమునిచ్చు 'దాతలు' నిర్వాహకులే. ఒక్కొక్కప్పుడు దాతలు సైతము "నిర్వాహకు"లుగా కూడ శ్రమించిన తరుణములున్నవి. కాని "నిర్వాహకులు" తమ శ్రమ వలన ఆంధ్రమహిళా సభకు పరోక్షముగా దాతలేకదా! కొందరికి సభతో పరిచయము రూ 100 కట్టి యావజ్జీవ సభ్యులగుటతో ఆరంభించి యుండవచ్చు. కాని వారి ధన సహాయము అంతటితోనే పూర్తిగాక, అనేక పర్యాయ ములు అనేక కార్యక్రములకు తృణమో పణమో ఇస్తూనే వస్తూవుండవచ్చు. అంతేగాక ఈ సభ తమ స్వంత సంస్థ గానే తలచుచూ దానికొరకై అనేక విధముల కష్టపడి సహాయము చేసినవారు కలరు.

అట్లే విద్యార్థినిగా సభలో ప్రవేశించి తదుపరి జనించిన మమకారముతో సభా నిర్వాహకులలో ముఖ్యులుగా తయారై ఎంతో కష్టపడి సభ బాగోగులను చూచుకొను చున్నవారును కలరు. ఇట్లే సభ్యురాలుగా, విద్యార్థినిగా, ఉదరపోషణకై, ఉద్యోగముకై వచ్చినవారిలోను, రక్షణకై సభకు చేరినవారిలోను దిట్టలైన నిర్వాహకులు తయారైనారు. ఆ తరువాత వారే దాతలైన వారూ వున్నారు. పనిచేయించుచున్నవారికి, పనిచేసేవారికి. దాత లకు, నిర్వాహకులకు, పోషకులకు, సాధారణ సభ్యులకు ఎట్టి భేదము లేకుండా అందరినీ సమభావముతో చూచు చుండుటవలన వారికి అట్టి సమభావముతో సోదరీభావము ఏర్పడి ఎట్టి పౌరుషము లేకుండ చిన్న పనులనుండి కష్ట మైన పెద్ద పెద్ద పనులవరకు విజయవంతంగా సాధించ కలుగుతున్నారు- కనుకనే మహిళాసభ శాఖోపశాఖలు- మహిళా విద్యాలయాన్నీ, వసతి గృహాన్నీ, పరిశ్రమ శాఖనీ, శిశు విహారాన్నీ, నర్సింగుహోమునీ, నర్సుల ట్రయినింగు సెంటరునూ నిర్వహింపగలుగుతూంది.

మా సభకు ఇంకా ఎన్నోవిధాల సహాయము లభించు చునేయున్నది. వివిధ మార్గముల, వివిధ కార్యక్రమ ములకుగాను ధనము సేకరింపబడుచున్నది. ఆయా సొమ్ములు సక్రమముగా జమ చేయించి, సక్రమముగా ఖర్చు చేయించి వాటికి సక్రమమైన పద్ధతిని లెఖ్ఖలు ఇటు సభ్యులకూ అటు ప్రభుత్వమునకూ చార్టర్డు అక్కవుం టెంట్సు అండు ఆడిటర్సు సర్టిఫికెట్‌తో చూపవలసిన బాధ్యత మాకు కలదు. ఈ విషయమున అవసరమైన సలహాలను ఇచ్చి, కొన్నేండ్లుగా జమా ఖర్చులు సరిచూచి ప్రతియేటా, మా శాఖలన్నింటినీ ఆడిటు చేస్తూవస్తూ, మా కెన్నో విధాల సహాయము చేస్తున్న బ్రహ్మయ్యా అండు కో వారికి మే మెల్లప్పుడు కృతజ్ఞులము. మా లెఖ్ఖలు ఏ ఫీజు తీసుకోకుండా ఉచితముగా ఆడిటు చేయుటయే గాక, ఇంకా ఎన్నోవిధాల వారు మాకు సాయపడు తున్నారు. వారి ఆఫీసులోని ఉద్యోగులు మా అడ్వర్టయిజు మెంట్లు సేకరించుటలో చేయుచున్న సహాయమును మే మెన్నడునూ మరవజాలము.

మా వసతి గృహములోని విద్యార్థినుల ఆరోగ్యములు కాపాడుతూ రాత్రి అనక, పగలనక పిలుపు వినగానే వచ్చి సలహా మాత్రమేకాక ఔషధములు కూడా ఇచ్చి సభ స్థాపించినప్పటినుండీ సభ పురోభివృద్ధికి పాటుపడుతున్న డాక్టరు అవధానిగారికి మా కృతజ్ఞత తెలుపుట మా కర్తవ్యము.

ఈ అన్యోన్యతతోనే, ఈ యేకైకలక్ష్యంతోనే ఆంధ్ర మహిళాసభ చిరకాలం వర్థిల్లాలని ఆశీర్వదించమని పెద్ద లను కోరుతున్నాము.

★

మా సభ చరిత్రలో సాధించిన కొన్ని విజయాలను, చిరస్మరణీయమైన శుభ ముహూర్తాలను
ఈ దిగువ నివేదిస్తున్నాము.

1945

సెప్టెంబరు 2 :
మల్లమదేవి మహిళా మందిరము హాస్టలుకు శంకుస్థాపన

1946

జనవరి 31 :
సభా భవనములకు శంకుస్థాపన

ఆగస్టు 17 :
గృహప్రవేశ మహోత్సవం

1950

జనవరి 7 :
నర్సింగ్ హోమ్‌కు శంకుస్థాపన

1951

మే 18 :
నర్సింగ్ హోమ్‌లో ప్రసూతి గృహమునకు (మెటెర్నిటీథియేటర్ శంకుస్థాపన)

1952

ఆగస్టు 17 :
నర్సింగ్ హోమ్ (గృహప్రవేశం) ప్రారంభోత్సవం

1953

సెప్టెంబర్ 23 :
ఇండస్ట్రియల్ ట్రైయినింగుసెంటరు భవనమునకు ప్రారంభోత్సము.

1954

జనవరి 24 :
నర్సింగ్ హోమ్ పిల్లల వార్డుకు శంకుస్థాపన

1955

జనవరి 22 :
నర్సింగ్ హోమ్ పిల్లలవార్డుకు ప్రారంభోత్సవం

డిసెంబరు 28 :
నాగేశ్వర శిశువిహార్‌కు శంకుస్థాపన

డిసెంబరు 28 :
ఆంధ్రమహిళాసభ సైన్సు హాలు గృహప్రవేశం

1956

జూలై 4 :
నర్సింగ్ హోమ్ ఔటుపేషెంటు వార్డుకు ప్రారంభోత్సవం


జూలై 6 :
నాగేశ్వరశిశువిహార్ గృహప్రవేశమహోత్సవం

ఆంధ్ర మహిళా సభ సర్వసభ్య సమావేశము జనవరి 24, 1957
తేదీని జరుగును. సభ్యురాండ్రందరు దయచేయ ప్రార్థన.

సంస్థ పురోభివృద్ధికి


సోదరుల తోడ్పాటు

ఆంధ్ర మహిళాసభ శాఖోపశాఖలతో విరాజిల్లుతూ ఆంధ్రుల నిష్కళంక సేవా దక్షతను చాటుతోందీ అంటే దీనికంతటికీ కారణం స్త్రీలే అన్న అహంభావం మాకు లేదు. మేము పురుషుల సహకారముతోనే ఇంత సాధించ కలిగాము. ఎందరి పురుషుల సలహాలనో స్వీకరించాము. అంతేకాకుండా అనుభవ శాలురగు పురుషులపై సభ నిర్వహణభారము మోపాము. మా ఉపాధ్యాయినులందరూ స్త్రీలే. నిర్వాహకులందరూ స్త్రీలే. కాని కొంత పని పురుషులే నిర్వహిస్తున్నారు. ముందు నిర్వహించాలి కూడాను. వారూ మావలెనే సంస్థ బాగోగులనే ఎల్లప్పుడూ కాంక్షించుచూ సభానిర్వహణకై వారి యావచ్ఛక్తి ధారపోయుచున్నారు. అట్టి వారిలో ముఖ్యులు శ్రీనివాసన్, నాయుడు, వెంకట్రావుగార్ల సేవను యీ సందర్భంలో పేర్కొని వారికి మా కృతజ్ఞతను వెల్లడించడం సమంజసం.



శ్రీ శ్రీనివాసన్

శ్రీనివాసన్‌గారు మూడేళ్ళ క్రిందట సభలో ప్రవేశించి ఆదివారాలు సైతము సెలవు ఎరుగక లెఖ్ఖల చిఠ్ఠాలవద్ద కూర్చుని ఎడతెగని లెఖ్ఖలు తయారు చేయుచుందురు. మా చేతికి వచ్చుచున్న ప్రతి దమ్మిడి సక్రమముగా ఖర్చు అగుచున్నదీ లేనిదీ ప్రజకూ ప్రభుత్వానికీ లెఖ్ఖల ద్వారా చూపవలయునుకదా. అదంతా ఆయన




శ్రీ జగన్నాథం నాయుడు

చూచుకుంటారు. కాని అంతటితోనే ఆయనకు సభలో పని పూర్తికాదు- వార్డనుకు రేషన్ల విషయము ఆయన సహాయము చేస్తారు- వసతి గృహములోనున్న పిల్లలకై వారివారి తలి దండ్రులు ఈయన చేతికి డబ్బు వప్పగించి వెళ్తారు. అంతేకాకుండా ఉత్సవము, పండుగ పబ్బములు వస్తే నిచ్చెన ఎక్కి తోరణాలు కడ్తారు. సభ పన్ను మినహాయింపుకై నడువవలసిస్తే కొన్నిమైళ్ళు నడిచి వెళ్ళి ఆ అధికారికి పరిస్థితులు ఎరుక పరుస్తారు.

ఈయన వంటి వారే 'తాతగారు' అనబడే శ్రీ జగన్నాధం నాయుడు గారు. రిటైరు అయిన అకౌంట్సు శాఖ ఉద్యోగి. తన వృద్ధాప్యములో ఈ సభా నిర్వహణలో మాకు చేదోడుగా వారున్నారు. ఈ సంస్థకు చేయుచున్న నిరంతర సేవ ద్వారా దేశానికి సేవ చేయుచున్నారు.

వీరిద్దరికి తోడుగా ఇటీవల దాదాపు రెండు సంవత్సరములయి మాకు సహాయముగా సభలో చేరినవారు




శ్రీ వేంకటరావు


కురుమెళ్ళ వెంకటరావుగారు- క్రొత్తగా చేరినప్పటికి పాతవారితో చేరి అనుదినము సంస్థ కార్యనిర్వహణము సాగిస్తున్నారు, పూర్వము అధ్యాపకుడిగా, రచయితగా వుండి దేశసంచారియై, మంచి అనుభవ శాలియైన ఈ వెంకటరావుగారి సహకారముతో, కృషితో ప్రెస్సుకు, ఆంధ్రమహిళ పత్రికకు మంచి భవిష్యత్తు ద్యోతక మగు చున్నది.

ఈ ముగ్గురకు తోడు నాల్గవ సోదరుడు శ్రీ రామలింగముగారు- ఆయన నర్సింగుహోమ్ మేనేజి మెంటు నిర్వహించటము ఈమధ్యనే కొన్ని మాసములకు పూర్వము ఆరంభించారు. ఈ నలుగురూ ఆంధ్రమహిళా సభకు నాల్గు స్తంభాలవలె వుండి మా సంస్థ పురోభివృద్ధికి సహాయ పడుచున్నారు.


—కె. లక్ష్మీరఘురామ్
బి. తిమ్మాబాయి
కార్యదర్శినులు.



ఆంధ్ర మహిళాసభ నాగేశ్వర శిశువిహార్



ఎస్. రాజ్యం - బెనారస్ మెట్రిక్



ఎన్. కమల - ఆంధ్రా మెట్రిక్




వై. సరోజారెడ్డి - పారిశ్రామిక శాఖ

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ బహుమానములు

ఆంధ్రమహిళా సభ వివిధ శాఖలలో ప్రతి సంవత్సరము జరుగు పరీక్షలలో ప్రథమ స్థానమునలంకరించినవారు శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ బహుమానములను గ్రహించెదరు. ఈ సంవత్సరము ఇందలి అయిదుగురు అట్టి బహుమానము స్వీకరించి గౌరవపాత్రులైరి.



ఎ. సుశీల - నర్సింగ్ హోమ్



నిత్యానందం - నాగేశ్వర శిశు విహార్

జనవరి 12 వ తేదీన విడుదల



డైరెక్షన్
కె.బి.నాగభూషణం

విశేషధనము వ్యయపరచి, అనేక ప్రయాసలకులోనై తయారుచేసిన మేటి చిత్రము.

మాటలు :	పాటలు :	స్టూడియో :
రావూరి.	దైతగోపాలం - రావూరి - బి. వి. యన్. ఆచార్య.	జెమిని.

చమ్రియా రిలీజు

రాజకీయాలు

శ్రీ జొన్నలగడ్డ వేంకటరాధాకృష్ణయ్య

బుద్ధజయంతి

బుద్ధ జయంతి పంచ వింశ శతవార్షికోత్సవం నవంబర్ 24 తేదీని న్యూఢిల్లిలో జరిగింది. ఈ ఉత్సవసందర్భంగా భారత ప్రధాని పండిట్ నెహ్రూ ప్రసంగిస్తూ ఈ నాడు ప్రపంచాకాశంలో క్రమ్ముకొనివున్న కాదుమబ్బులు ప్రపంచ పరిస్థితిని చాలామట్టుకు అదుపునుంచి తప్పించిన వని యివి చివరకు మానవజాతిని ఏదారిన పట్టించగలవో తెలియదని అన్నారు. కొన్నివేల సంవత్సరాల క్రితం బుద్ధభగవానుడు అనుగ్రహించిన సందేశాన్ని మానవ జాతి ఆకళింపు చేసుకొంటేనేగాని పరిస్థితి చక్కబడదని అయన హెచ్చరించారు కూడా.

ధర్మమార్గానుసరణమే గౌతమునికి స్మారక చిహ్నమని ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు, శాంతిస్థాపనకోసం, మానవసంక్షేమంకోసం ప్రజలు బుద్ధుని సందేశాలను అనుసరించాలని ప్రెసిడెంట్ ప్రసాద్ ఉద్బోధించారు. ఈ బుద్ధజయంతి సందర్భంగా టిబెట్ నుంచి బౌద్ధాచార్యులు దలైలామా, పంచన్ లామాలు, సిక్కిమ్‌మహారాజు, కాంబోడియా యువరాజు మున్నగువారు వచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌కు న్యూస్ ప్రింట్ ఫ్యాక్టరీ:

ఆంధ్రప్రదేశ్‌లోని షకర్‌నగర్‌లో (నిజామాబాద్‌జిల్లాలోని బోధన్) సాలుకు 30 వేలటన్నుల న్యూస్‌ప్రింట్‌ను ఉత్పత్తిచేసే ఫేక్టరీ ప్రభుత్వపరంగా నెలకొల్పబడగలదని భారీ పరిశ్రమల మంత్రి శ్రీ ఎం. ఎం. షా నవంబర్ 21 వ తేదీని న్యూఢిల్లిలో ప్రకటించారు.

తూత్తుకుడి ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం

నవంబరు 22 వ తేదీరాత్రి మద్రాసుకు 170 మైళ్ళ దూరంలోని అరియలూరు కల్లగుం స్టేషనులమధ్య తూత్తుకుడి ఎక్స్‌ప్రెస్ రైలు మరుదయార్ నదిమీద వంతెన కూలి పోవడం ఫలితంగా 147 మందికి పైగా మరణించారు, అనేకమంది గాయపడ్డారు.

మహబూబ్ నగర్ జనగాం, రైలు ప్రమాదాలకు పిమ్మట జరిగిన మరొక ఘోరప్రమాదమిది.

ఈ ప్రమాదం వెంబడినే కేంద్ర ప్రభుత్వ రైల్వే మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి తన పదవికి నవంబర్ 26 న రాజీనామా యివ్వడం, ఆ రాజీనామాను ఆమోదించ వలసినదిగా ఇండియా ప్రెసిడెంట్‌కు సిఫారసు చెయ్యడానికి ప్రధాని పండిట్ నెహ్రూ నిర్ణయించుకోవడం జరిగాయి. రహదారులశాఖమంత్రి శ్రీ జగజీవనరామ్‌కు రైల్వేశాఖ అప్పగించ బడింది.

చైనా ప్రధానిరాక.

చైనీస్ రిపబ్లిక్ ప్రధాని చౌ ఎన్‌లై. నవంబర్ 28 న విమానంలో ఢిల్లికి వచ్చారు. విమానాశ్రయం వద్ద ఘనమైన స్వాగత మీయబడింది. శ్రీ చౌఎన్ లై బొంబాయి మద్రాసు మున్నగు నగరాలను ప్రాజెక్టు ప్రాంతాలను, కూడా తన భారతదేశ పర్యటన సందర్భంగా సందర్శించారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రథమ దశగా ఎనిమిదేళ్ళలో 88.18 కోట్ల రూపాయల ఖర్చుతో జరిపించబడగల కార్యక్రమాన్ని నాగార్జునసాగర్ కొత్తకంట్రోల్ బోర్డు హైదరాబాద్‌లో నవంబర్ 26 వ తేదీని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారి ఆధ్వర్యాన సమావేశమై నిర్ణయించింది.

ఆంధ్ర ప్రదేశ్‌కు క్రొత్త స్పీకర్

ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లి స్పీకర్ పదవికి డిసెంబర్ నాలుగవ తేదిని జరిగిన ఎన్నికలో శ్రీ అయ్యదేవర కాళేశ్వర రావుగారు. స్పీకర్‌గా ఎన్నికైనారు.

ఆంధ్రప్రదేశ్‌కు లెజిస్లేటివ్ కౌన్సిల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి లెజిస్లేటివ్ కౌన్సిల్ ఏర్పాటు చెయ్యాలని ఇండియా పార్లమెంటుకు సిఫారసు చేస్తూ ప్రతిపాదించబడిన అధికార తీర్మానాని ఆంధ్ర అసెంబ్లి

డిసెంబర్ అయిదవ తేదీని అత్యధికమైన మెజారిటీతో ఆమోదించింది.

పాకిస్థాన్ దుష్ప్రచారం

ఇండియాలో తమపై ముట్టడి జరపగలదనే భయం కలుగుతున్నదంటూ పాకిస్థాను యిటీవల ప్రారంభించిన కొత్త దుష్ప్రచారం రానున్న కొత్త చిక్కులకు నాందిగా కనిపిస్తున్నదని ఇండియాపై పాకిస్థాను దురాక్రమణకు తలపడితే తప్ప దానితో యుద్ధానికి దిగబోమని ప్రధాని నెహ్రూ డిసెంబర్ 4వ తేదీన రాజ్యసభలో ప్రకటించారు

అంబేడ్కర్ మృతి

ఇండియా మాజీ న్యాయశాఖ మంత్రి షెడ్యూల్డు తరగతుల నాయకుడు, నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ డిసెంబర్ 6 తేది ఉదయం న్యూఢిల్లీలో మరణించారు. భారత ప్రధాని యితర నాయకులుకూడా ఆయన మృతికి లోక్‌సభలో రాజ్యసభలోనూ కూడాసంతాపం వెలిబుచ్చారు.

కొత్త ఎన్నికల తేదీలు

వచ్చే జనరల్ ఎన్నికలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 12 ల మధ్య జరగగలవని, ఎన్నికల ఫలితాలు మార్చి 31 తేదీనాటికి గెజెట్‌లో ప్రకటించ బడగలవని ఎన్నికల కమీషనర్ శ్రీ సుకుమారసేన్ అధికార పూర్వకంగా ప్రకటించారు.

కాశ్మీర్‌కు అంతర్జాతీయ సైన్యం

కాశ్మీర్ వివాద పరిష్కారానికి పాకిస్థాన్ విదేశాంగ మంత్రిమాలిక్ ఫిరోజ్‌ఖాన్‌నూను డిసెంబర్ 6 తేదీని ఒక ప్రకటనచేస్తూ కాశ్మీర్‌లోని ఇండియా పాకిస్థానుల సైన్యం స్థానే మిత్రరాజ్యసమి ఈజిప్టుకు పంపినట్టి సైన్యాన్నే పంపాలనీ ఆలా పంపితే పాకిస్థాన్ అక్కడి సైన్యాన్ని అంచెల వారిగా ఉపసంహరించుకో గలదని ప్రకటించారు.

సోషలిస్టు సమాజ స్థాపనావశ్యకత

భారత ప్రధాని నెహ్రూ డిసెంబర్ 10 వ తేదీనిప్లానింగ్ కమిషను నియమించిన శాస్త్రజ్ఞుల సలహా సంఘం తొలి సమావేశంలో ప్రసంగిస్తూ ఇండియా పరిస్థితులకు అనువైనది సోషలిస్టు సమాజమేననీ పంచవర్ష ప్రణాళికల లక్ష్యసాధనకు ప్రజాస్వామ్య దృక్పథం అవసరమని ఉద్ఘాటించారు.

న్యాయశాస్త్ర క్రోడీకరణ

హిందువుల దత్తత, మనోవర్తి బిల్లుకు డిసెంబర్ 14 వ తేదిని లోక్‌సభ ఆమోదించడంతో హిందూ ధర్మ [illegible]

మగపిల్లలతో పాటు ఆడపిల్లలను కూడా దత్తత చేసుకొనడానికి అనుమతించే ఈ బిల్లుకు రాజ్యసభ యింతకు ముందే ఆమోదించింది.

అమెరికాకు పండిట్ నెహ్రూ

ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్ ఆహ్వానంపై డిసెంబర్ 14 న బయలుదేరి, లండన్ మీదగా వాషింగ్‌టన్‌కు వెళ్లిన భారత ప్రధాని పండిట్ నెహ్రూ 16 వ తేదికి అమెరికా చేరుకున్నారు.

లండన్‌లో కొన్ని గంటల సేపు ఆగిన పండిట్ నెహ్రూ ఆ రోజునే జమైకానుంచి తిరిగి వచ్చిన బ్రిటిష్ ప్రధాని సర్ ఆంథోని ఈడెన్‌తో 45 నిమిషాల సేపు, బ్రిటిష్ పేమాస్టర్‌జనరల్ సర్ వాల్టర్ మాంక్టన్‌తో 30 నిమిషాలు సంభాషించారు.

వాషింగ్‌టన్‌లో ప్రధాని నెహ్రూకు బ్రహ్మాండమైన స్వాగతంయివ్వ బడింది. ఆయనతో కూడా శ్రీమతి ఇందిరాగాంధి వున్నది. పండిట్ నెహ్రూకు విమానాశ్రయంలో అమెరికా వైస్-ప్రెసిడెంట్ నిక్సన్ ఆయన సతీమణి స్వాగత మిచ్చారు. 19 ఫిరంగులు పేల్చబడ్డాయి.

వైట్‌హౌస్ వద్ద ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్ దంపతులు స్వాగతమిచ్చారు. ఆరాత్రి బ్లెయిర్ హౌస్‌లో బసచేసిన ప్రధాని నెహ్రూతో ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్ ఆంతరంగిక సంభాషణల నిమిత్తం గెట్టిస్ బర్గ్‌లోని తన గృహానికి తీసుకువెళ్లారు. ఇక్కడ సంక్షోభిత ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధానసమస్యలపైవీరు చర్చలుజరిపారు

విదేశవార్తలు

అమెరికా ఒత్తిడి, మిత్రరాజ్య సమితి జనరల్ అసెంబ్లి తీర్మానాలు, ప్రతికూల ప్రపంచప్రజాభిప్రాయాల ఫలితంగా ఈజిప్టునుంచి బ్రిటిష్, ఫ్రెంచి సేనలు ఉపసంహరించుకున్నారు.

ఈజిప్టియన్ రేవు పట్టణం పోర్టుసయ్యద్‌ను మిత్రరాజ్య సమితి ఏర్పాటు చేసిన అంతర్జాతీయ పోలీసు దళం ఆక్రమించుకొంది.

ఇశ్రాయెల్ బలాలు తొలగడంతో సినాయ్‌ని యూగోస్లావ్ దళాలు ఆక్రమించుకుంటున్నాయి.

మిత్రరాజ్య సమితిలో జపాన్ సభ్యత్వాన్ని జనరల్ అసెంబ్లికి సిఫారసు చేయడానికి భద్రతా సంఘం ఆమోదించింది.

సూయజ్ వివాదం

(బ్రిటన్, ఫ్రాన్సు, ఇజ్రాయల్‌లు ఈజిప్టు విధ్వంసనకు పన్నిన కుట్రవైఫల్య గాథ)

సూయజ్ కాల్వపై యాజమాన్యం ఎవరిది? ఈజిప్ట్‌దా? దానిని స్వేచ్ఛగా తమ వాణిజ్యానికై ఉపయోగించు కొం టున్న రాజ్యాలదా?

ఈజిప్టులో యుద్ధానికిదారితీసిన కారణాలు, పరిస్థితులు చాలా వున్నాయి. ఈజిప్టు, సవుదిఅరేబియా, సిరియా, లెబనాన్, ఎమెన్, జోర్డాన్, లిబియా, ఇరాక్‌లు అరబ్ రాజ్యాలు. వీటికి పొరుగునవున్న యూదురాజ్యం ఇజ్రాయల్‌కు సరిపడదు. ఇజ్రాయల్‌కు, ఈ రాజ్యాలకు మధ్య పాలస్తీనాలో గొప్పయుద్ధం జరిగింది. మిత్రరాజ్య సమితి జోక్యంపెట్టుకుని ఆపుచేసింది. అయినప్పటికీ సరిహద్దుల వద్ద ఇజ్రాయల్ సైన్యాలకు అరబ్ సైన్యాలకు మధ్య సంఘర్షణలు రేగుతూనే వున్నాయి. అరబ్ రాజ్యాలూ, ఇజ్రాయలూ, ఆయుధాలను, సైన్యాలనూ పెంపొందించు కొంటూనే వున్నాయి.

ఈజిప్టులో 80 ఏళ్ళుగా తిష్టవేసుకొని వున్న బ్రిటిష్ సైన్యాలు సూయజ్ కాల్వప్రాంతంనుంచి వైదొలగాలని ఈజిప్టు పట్టుపట్టింది. దానిమీద బ్రిటిష్‌వారికి, ఈజిప్టు యనులకు మధ్య సంఘర్షణలు రేగినవి. చివరకు ఈజిప్టుతో సమాధానికి వచ్చి బ్రిటన్ తనసేనలను ఉపసంహరించుకొంది. ఆ తర్వాత ఈజిప్టు బ్రిటన్‌ను ఆయుధాలను అమ్మమని అడిగింది. దానికి బ్రిటన్ సరియైన జవాబివ్వక పోవడంతో ఈజిప్టు చెకోస్లావియానుంచి ఆయుధాలు కొంది. అవి రష్యన్ ఆయుధాలే.

ఈ ఆయుధాల క్రయంపేరుననో, మరే సాకుననో రష్యా మధ్యప్రాచ్యంలో అడుగుపెట్టి అరబ్ రాజ్యాలలో పలుకుబడి సంపాదించుకొనడం బ్రిటన్‌కు యిష్టంలేదు,

ఈజిప్టు నైల్‌నదిపై అశ్వాణవద్ద అనకట్టనిర్మాణానికి ద్రవ్యసహాయం (ఋణం) చెయ్యమని బ్రిటన్, అమెరికాలను కోరింది. రష్యావేస్తున్న ఎత్తులపట్ల అనుమానం కలిగిన అమెరికా సహాయానికి అంగీకరించలేదు. బ్రిటన్ కూడా అమెరికాతోపాటు సహాయం తిరస్కరించింది. దీనిమీద ఈజిప్టు ప్రెసిడెంట్ కర్నల్‌నాజర్ 1956 జూలై 26 న సూయజ్‌కాల్వ తమదే అని దాని నిర్వహణకు ఏర్పడ్డ కంపెనీని జాతీయం చేసుకొన్నాడు. కాల్వలు రాకపోకలు జరిపే నౌకలు ఈజిప్టుకు సుంకం చెల్లించాలని 1888 లో జరిగిన అంతర్జాతీయ ఒడంబడికపరంగాఅన్ని దేశాల నౌకల స్వేచ్ఛప్రయాణాలకు ఎట్టి విఘాతాలు కలిగించ బడవని హామీయిచ్చాడు.


దీనితోనే చిచ్చు రగిలింది, సూయజ్ కాల్వలో ఓడల నడిపే బ్రిటీష్, ఫ్రెంచినావికులను బ్రిటన్, ఫ్రాన్సులు ముందు పనినుంచి మాన్పించివేశాయి. ఈజిప్టు జంకలేదు తన నావికులతోనే 105 మైళ్ళ కాల్వలో రాకపోకలు జరిపించింది ఇంక ఎలాగైనా ఈజిప్టును బలప్రయోగంచేసి. కాల్వను స్వాధీనం చేసుకోవాలని బ్రిటన్ ఫ్రాన్సులు గూడిపుఠాణి చేశాయి. ఇజ్రాయల్‌ను ఈజిప్టుపై దాడికి ప్రోద్బలంచేశాయి,

ఇజ్రాయలీసేనలు అక్టోబర్ 29న సినై ఎడారిపై దండయాత్ర జరిపాయి. ఇజ్రాయల్ ఈజిప్ట్ సైన్యాలను వేరు చెయ్యాలంటూ బ్రిటన్, ఫ్రాన్సులు ఈజిప్ట్‌కు 12 గంటల గడువుతో ఒక అల్టిమేటమ్ పంపాయి. దాన్ని ఈజిప్ట్ నిరాకరించడంతో అక్టోబర్ 31 న బ్రిటీష్, ఫ్రెంచి విమానాలు కెయిరోపై బాంబులు వేశాయి. ఈజిప్షియన్ విమానాశ్రయాలపై అగ్నివర్షం కురిపించాయి,

పోర్ట్ సయ్యద్‌లో తమసేనలను దింపాయి. అకస్మాత్తుగా జరిగిన ఈ ముట్టడి అటు ఇజ్రాయల్‌తో యుద్ధం వీటిమధ్య చిక్కుపడ్డ ఈజిప్టు ముందు తమ విమాన బలాన్ని అరబ్ రాజ్యాలకు పంపివేసింది. అతిభీషణంగా బ్రిటీష్, ఫ్రెంచి సేనలను ప్రతిఘటించింది.

ఈజిప్టులో యుద్ధంమానక పోతే తాను సాయుధ జోక్యంపెట్టుకొంటానని రష్యా బ్రిటన్, ఫ్రాన్సులను బెదరించింది. ఇది ప్రపంచయుద్ధం కాబోతున్నదని భయపడి అమెరికా బ్రిటన్‌ను గట్టిగా ఒత్తిడి పెట్టింది మిత్రరాజ్య సమితి బ్రిటన్, ఫ్రాన్సుల చర్యను నిరసించింది. తాను ప్రత్యేకంగా అంతర్జాతీయపోలీస్ దళాన్ని ఏర్పాటుచేసి ఈజిప్టుకు పంపింది.

పోర్టుసయ్యద్‌నుంచి బ్రిటీష్ ఫ్రెంచి సైన్యాలు ఇష్టం లేకున్నా మిత్రరాజ్యసమితి అమెరికాల ఒత్తిడి భరించలేక ఉపసంహరించుకొంటున్నాయి. సూయజ్ కాల్వలో ముంచివేయబడిన నౌకలమూలంగానే నౌకలరాకపోకలపై ఏర్పడ్డ అవరోధాలు తొలగించ బడుతున్నాయి. ఈజిప్టు నష్టపడ్డా దాని స్వాతంత్ర్యం చెక్కు చెదరలేదు. బ్రిటన్, ఫ్రాన్సుల ప్రతిష్ట భంగపడడమేగాక పరాజయం పరాభవం,కూడా మిగిలాయి. ప్రపంచంలోని అన్నిరాజ్యాల, ప్రజల నిరసనకూ గురి అయినాయి.


జమ్ము
శ్రీనగర్
కాశ్మీర్
హిమాచల ప్రదేశ్
పంజాబ్
రాజస్తాన్
జయపూర్
ఉత్తర ప్రదేశ్
లక్నో
నేపాల్
భూటాన్
అస్సాం
షిల్లాంగ్
పాట్నా
బీహారు
భోపాల్
మధ్య ప్రదేశ్
తూ. పాకిస్తాన్
త్రిపుర
కటకం
ఒరిస్సా
బొంబాయి
మద్రాసు
లంక

1956 సంవత్సరంలో భారత దేశం సాధించిన మహత్తర కార్యక్రమంలో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ముఖ్యాంశం. మన రాష్ట్రాల వైశాల్యం, జనాభా మొదలగు వివరాలు ఈ క్రింద పొందుపరచబడ్డాయి.

నెం.	ప్రదేశము	వైశాల్యము చ. మైళ్ళు	జనాభా లక్షలలో	రాజధాని.	గవర్నరు	ముఖ్యమంత్రి
1.	ఆంధ్రప్రదేశ్	110,250	322	హైదరాబాదు	సి. ఎమ్. త్రివేది	ఎన్. సంజీవరెడ్డి
2.	అస్సాం	84,924	90	షిల్లాంగ్	ఎస్. ఫాజల్ ఆలీ	బిష్ణురాం మెహిదీ
3.	బీహార్	67,830	389	పాట్నా	ఆర్. ఆర్. దివాకర్	ఎస్. కె. సిన్హా
4.	బొంబాయి	188,240	478	బొంబాయి	శ్రీప్రకాశ్	వై. బి. చావన్
5.	కేరళ	14,980	136	త్రివేండ్రమ్	బి. రామకృష్ణారావు	
6.	మధ్యప్రదేశ్	171,200	261	భోపాల్	పట్టాభి సీతారామయ్య	రవిశంకర్ శుక్ల
7.	మద్రాస్	50,170	300	మద్రాస్	ఎస్. కె. జాన్	కామరాజనాడార్
8.	మైసూర్	72,730	190	బెంగుళూర్	మైసూర్ మహారాజా	ఎస్. నిజలింగప్ప
9.	ఒరిస్సా	60,140	146	భువనేశ్వర్	భీమ్‌సేన్ సచార్	హెచ్. కె. మెహతాబ్
10.	పంజాబ్	46,616	160	చండీగర్	సి. పి. ఎన్. సిన్హా	పి. ఎస్. కైరోన్
11.	రాజస్థాన్	132,300	160	జైపూర్	గుర్‌ముఖ్ నిహాల్‌సింగ్	ఎమ్. ఎల్. సుఖాడియ
12.	ఉత్తర్ ప్రదేశ్	113,410	632	లక్నో	కె. ఎమ్. మున్షీ	ఎమ్. సంపూర్ణానంద్
13.	పశ్చిమ బెంగాల్	33,279	262	కలకత్తా	పద్మజా నాయుడు	బి. సి. రాయ్
14.	జమ్ము, కాశ్మీర్	92,780	44	శ్రీనగర్	కరన్‌సింగ్	బక్షీగులామ్ మహ్మదు

కేంద్ర పరిపాలిత ప్రాంతాలు

ప్రదేశము	వైశాల్యము చ. మైళ్ళు	జనాభా లక్షలలో	రాజధాని
1. ఢిల్లీ	578	174	ఢిల్లీ
2. హిమాచలప్రదేశ్	10,451	98	సిమ్లా
3. మణిపూర్	8,658	58	
4. త్రిపుర	4,032	64	అగర్తల
5. లక్షదీవులు, అమిన్‌దీవి	1,900	0.2	
6. అండమాన్ నికోబర్	3,215	0.3	బ్లెయిర్ రేవు

హంగరీలో కల్లోలం

(స్వాతంత్ర్యం కోరిన ప్రజలకు రష్యన్ టాంకుల జవాబు)

1956 నవంబర్ నెలలో జరిగిన రెండు అంతర్జాతీయ సంఘటనలను ప్రపంచ చరిత్రలో రక్తంతోనే లిఖించ వచ్చు. వీటిలో ఒకటి హంగరీ.

రష్యా తన ఉపగ్రహరాజ్యాలుగా చేసుకొన్న తూర్పు యూరపియనురాజ్యాలలో హంగరీ ఒకటి. హంగరియను ప్రజలు స్వాతంత్ర్య ప్రియులు. రష్యాతో వీరు తమ స్వాతంత్ర్యానికి క్రిందటి నెలలో జరిగిన పోరాటమే తొలి పోరాటంకాదు. 1848 లో హంగరియను ప్రజలు జార్ చక్రవర్తుల సేనలతోనే తొలి స్వాతంత్ర్య సమరం జరిపారు.

డాన్యూబ్ నదికి యిరువైపులా రెండుపట్టణాలున్నాయి నదికి దక్షిణ తీరంలో పురాతన పట్టణం బుడా. ఎడమ గట్టున వెలసిన అధునాతన పట్టణం పెస్ట్ల కలయికే బుడాపెస్ట్ నగరంగా 1873 నుంచీ వ్యవహరించబడుతూ వుంది. బుడాపెస్ట్ హంగరీ రాజధాని.

13 శతాబ్దంలో, రోమల కాలంనాడూ లోయర్ ఏనూ నియాకు బుడా రాజధానిగా వుండేది. బుడాపెస్ట్ అతిపురాతన నగరమేగాక అతి సుందరమైన నగరంకూడా. బుడాలో ప్రాచీన కట్టడాలు, స్తూపాలు వుంటే పెస్ట్లో పార్లమెంటు భవనం వుంది, ఈ పార్లమెంటు భవనమే యిటీవల స్వాతంత్ర్య పోరాటానికి ప్రథమరంగస్థల మయింది.

వ్యవసాయ ప్రధానమైన దేశమైనప్పటికీ రష్యాలో శిక్షణ పొంది. దేశ పరిపాలనాధికారాన్ని చేబట్టిన కమ్యూనిస్టు నాయకులు దేశంలోపరిశ్రమలను పెంపొందించారు హంగరీలో వెండి బంగారు గనులు, బొగ్గు గనులు వున్నాయి.

హంగరీలోని కోటిమంది ప్రజలు తమ దేశంలోని సహజసంపదలను పెంపొందించుకొని ఎంతో సుఖంగా కాలంగడప గలిగివుండేవారు.కాని గత ద్వితీయ ప్రపంచ సంగ్రామ కాలంనుంచీ హంగరీ యితర తూర్పు యూరపియను దేశాలవలెనే సోవియట్ కమ్యూనిస్టు నాయకుల ప్రాబల్యానికి లోబడిపోయింది.

ఆ ప్రాబల్యం ఫలితంగా హంగరీయను ప్రజలకుతిండి స్వాతంత్ర్యమూ కూడా కరువైనాయి. ముఖ్యంగా తమ స్వాతంత్ర్యం తిరిగి సంపాదించుకోవాలని రష్యనులు తమపై విధించిన దాస్యపాశం నుంచి విడివడాలని సంకల్పించు కొన్నారు,

గత అక్టోబర్ నుంచీ రష్యా పట్ల ప్రజకుగల వ్యతిరేకభావం పదేళ్ళుగా కుతకుత ఉడికి ప్రేలిపోయిన అగ్నిపర్వతంలోని లావావలె దేశ విస్తృతంగా వ్యాపించింది. రష్యనులు నాలుగేళ్ళుగా జైలులోనిర్బంధించి యిటీవలనే విడుదల చేసిన ఇమ్రీనాగిని హంగరియన్ వర్కర్స్ (కమ్యూనిస్టు) పార్టీనాయకునిగా ఎన్నుకొంది. ఇమ్రీనాగి ప్రధానమంత్రి కావడంతో రష్యా, పోలెండ్లో వలెనే హంగరిలో కూడా తమ ప్రాబల్యం తగ్గిపోతున్నదని భయపడింది,

1956 నవంబర్ నాలుగవ తేదీని హంగరీ అంతటా రేగిన సోవియట్ వ్యతిరేక ప్రదర్శనలను అణచి వేయడానికి రష్యను టాంకులు పంపబడినవి. ఈ టాంకులు, హంగరియను పోలీసు, సైనికదళాలు ప్రజలపై మారణాస్త్రాలను నిర్దాక్షిణ్యంగా ప్రయోగించినవి. వేలాదిగా ప్రజలు మరణించారు. దేశ విస్తృతంగా చెలరేగి నవిప్లవాన్ని రష్యనులు అణచివేయడానికి తమ సైనిక దళాలను గొనివచ్చారు. ప్రధాని నాగిని అరెస్టు చేశారు. తమకు అనుకూలుడైన జానూస్ కాదర్ ప్రధానిగా కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

ఈ రక్తపాతాన్ని కల్లోలాన్ని నిలిపివేయవలసిందని మిత్రరాజ్య సమితి కోరింది. తన పరిశీలకులను, తమ కార్యదర్శిని అక్కడకు పంపుతానంది. హంగరీనుంచి తమ సేనలను ఉపసంహరించుకొని శాంతిస్థాపనకు తోడ్పడమని కోరింది. తమకు కావలసిన ప్రభుత్వాన్ని ఎన్నుకొనే అవకాశాన్ని ప్రజలకు యిమ్మని సూచించింది.

రష్యా ఈ విజ్ఞాపనలను పెడచెవిని పెట్టింది. రష్యా నిలబెట్టిన కాదర్ కూడా ఈ సూచనలను త్రోసిపుచ్చాడు. 25, 000 మంది హంగరియనులు ఈ పోరులో మరణించారు,

హంగరియన్ ప్రజల స్వాతంత్ర్య పిపాస మాత్రం ఇంకా తీరలేదు. ఇప్పటికి హంగరీలో కొన్నిచోట్ల పోరు కొనసాగుతూనేవుంది.

అగ్రరాజ్యాల అధికార ప్రాబల్య కాంక్షకో బలియై నలిగి, నాశనమైపోయికూడా తమ స్వాతంత్ర్యంకోసం రక్తదానం చేస్తున్న హంగరియను ప్రజలు నిజమైన స్వాతంత్ర్య వీరులుకదా!

★

భారత స్త్రీలు

స్వాతంత్ర్యోద్యమంలో వారి ప్రముఖ పాత్ర

శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ

ధర్మక్షేత్రమూ పుణ్యక్షేత్రమూ అయిన భారతభూమి ప్రపంచములో మకుటాయమానంగా ప్రకాశిస్తున్నది. మహత్తర పరిణామాన్ని ఒక దశపూర్వం ప్రపంచము ఊహించలేదు. తొమ్మిది సంవత్సరాల క్రితం అనగా 1947 ఆగస్టు 15. విశ్వచరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని సృష్టించిన శుభదివసము. ఆనాటి తొలిప్రభాతంలో ఈ దివ్యభూమి ఒక్కమారు కోటిసూర్యులకాంతితో తేజరిల్లింది. ముప్పదిమూడుకోట్ల భారతీయుల హృదయాల్లో స్వాతంత్ర్య భానుడు ఒక్కసారిగా ప్రకాశించాడు. త్రింశత్కోటీ కంఠాల కలకల విజయనినాదాలు ద్వాత్రింశత్కోటి కరపద్మాల మంగళ పుష్పాంజలులు, ద్వాత్రింశత్కోటి నయన జ్యోతుల ఆనందనీరాజనాలు పవిత్ర భారత జనని అందుకొన్నది. పులకిత హృదయంతో తనకూర్మి సంతానాన్ని యావద్భారత భావిని నిండు వాత్సల్యంతో ఆశీర్వదించింది. అది భారత స్వాతంత్ర్య సిద్ధి, స్వరాజ్య సంసిద్ధి. ఆ ప్రభాత కాంతుల్లో స్వాతంత్ర్య పరిమళాలు వీస్తూ, కనువిందులుచేస్తూ. భారత జాతీయ పతాకలు. త్రివర్ణరోచిస్సులతో, రెపరెపలాడుతూ ప్రభుత్వభవనాల పై సమస్తభారతావనిలో ఒక్కమారుసాక్షాత్కరించాయి. భారతవాణి ముక్తకంఠంతో జయగీతం పాడింది. అది మహంతమైన పర్వదినము. విశ్వమానవజాతి ప్రేమాభి వందనాలు అందుకొన్న శుభోదయమూ సర్వోదయమూ అది. అశేషభారత ప్రజాకోటికి ప్రాతినిధ్యం వహించి త్యాగక్షేత్రంలో స్వాతంత్ర్య దుందుభులు మ్రోయించిన కాంగ్రెసుయోధుల విజయచిహ్నం అది. లక్షలకొలది సత్యాగ్రహవీరులు ప్రచండశాంతి సమరం జరిపారు. ప్రాణాలు ధారపోశారు. మహామహులెందరో అష్టకష్టాలు పడ్డారు. స్త్రీలు, పురుషులు పిన్నలు, పెద్దలు లోకోత్తర పురుషుడైన అవతారమూర్తి పూజ్యబాపూజీ నాయకత్వం క్రింద బ్రహ్మాండమైన స్వాతంత్ర్య మహోద్యమం నడిపి విజయం పొందారు, ఆగస్టు 15 1947 సం. లో మనకు స్వరాజ్యం వచ్చింది. సర్వ ప్రపంచమూ సగౌరవంగా. పుష్పాంజలులిచ్చింది. అది పూజ్యబాపూ మహోద్యమం యొక్క తపశ్శక్తి, ఆగస్టు 15 భారత స్వాతంత్రమహోద్యమం పిమ్మట రెండున్నర సంవత్సరాలకు ప్రపంచ మన్ననలు చూరగొన్న భారత రిపబ్లికువ్యవస్థాపన విజయోత్సవం (జనవరి 26, 1950) ఈరెండూ మనకు జాతీయ పర్వదినాలు.

అయితే స్వరాజ్యం వచ్చిన అనతికాలంలోనే అమర బాపూ బలిదానము. యుగపురుషుని హత్యాకాండ అనూహ్యమైన ప్రళయం జరిగించి. 1948 జనవరి 26 సర్వత్రా అంధతమస్సు క్రమ్మింది. ప్రపంచమే దుఃఖసముద్రంలో మునిగిపోయింది. ఆతర్వాత స్వరాజ్యపరిపాలన స్వాతంత్ర్యరక్షణ మన భుజస్కంధాలమీద పడినవి. సర్వశక్తులా కృషిచేస్తూ కర్తవ్యపరాయణులం కావలసి వచ్చింది. ప్రతినిత్యమూ సంధ్యాజ్యోతిలో జాతిపితను స్వాతంత్ర్య విధాతను పూజ్యబాపూజీని సందర్శిస్తూ స్వరాజ్యం అనుభవిస్తున్నాము. ఎనభైయేండ్ల కాంగ్రెసు పోరాటఫలితం ఈ స్వాతంత్ర్యము.

భారత జాతీయస్వాతంత్ర్య విజయము అపూర్వమూ అసాధారణమూ అయినది. సృష్టిపుట్టిన తర్వాత కనివిని యెరుగని ఊహాతీతమైన ఇట్టి శాంతిపోరాటం ప్రపంచ చరిత్రలోనే ఒక సువర్ణఘట్టాన్ని ప్రతిష్ఠించింది. ప్రేమ త్యాగము ధర్మసూత్రాలుగా సత్యాగ్రహాయుధంతో అహింసాసమరం జరిపి పూజ్యబాపూజీ యావద్విశ్వాన్ని విలుచుకున్నాడు. ఈ మహత్తరమైన ఆత్మశక్తికి జోహారులు పెట్టి ఆంగ్లసర్కారు ఓడయెక్కింది. మూడు మూరల

ఇంగ్లీషు దేశము గుప్పెడు మనుషులతో త్రింశత్కోటి దేవతా ప్రతీకమైన భారతవర్షాన్ని ఆక్రమించి పాలించుట ఎంతచిత్రమో రవి అస్తమించని ఆంగ్ల సామ్రాజ్యాన్ని ఒక ఉప్పుకల్లుతో, ఒకదారం ముక్కతో, ఒక కొల్లాయి తాత జయించి స్వాధీనం చేసుకొనుటకూడ అంతకంటె విచిత్రాతి విచిత్రమైనది. ఈ ధర్మాస్త్రాలలో అభిమంత్రితమైన మహాశక్తి విశ్వరూపం ధరిస్తుందని ఎందరెరుగుదురు? మహాత్మాజీ పెంపుడు బిడ్డయై స్వరాజ్య వారసుడై, త్యాగస్వరూపుడైన భారతరత్న పండిత నెహ్రూ భారత జాతి ప్రతిబింబమై శాంతిముద్ర చేధరించి విశ్వవిఖ్యాతితో భారతరిపబ్లిక్ పరిపాలిస్తున్నాడు ఇది మనమహాభాగ్యం. చిరసుకృత పూజాఫలము.

భారత స్వాతంత్ర్య మహోద్యమంలో భారత స్త్రీలు అత్యంత ప్రముఖ పాత్రను వహించి అమోఘంగా కృషి చేశారు. దేశం పిలుపు దేవుని పిలుపుగా అందుకున్నారు. మానవసేవ మాధవసేవగా భావించారు. పూజ్య బాపూజీ ఆదేశం శిరసావహించి స్వీకరించారు. స్వాతంత్ర్య శంఖం పూరించి సింహధ్వానం చేశారు. భర్తలను బిడ్డలను కుటుంబాలను వదలి జైళ్లకు పోయినారు. లాఠీ దెబ్బలకు గురియైనారు. తుపాకి గుండ్లకు ఎరయైనారు. ఆస్తి పాస్తులు కోల్పోయినారు. ఒకటేమిటి? సర్వస్వము సమర్పించి ప్రాణాలకు తెగించి పోరాడినారు. అది సామాన్యమైన ఉద్యమమా, భారతక్షేత్రాలను కూకటి కుదుళ్లతో కదిల్చిన మహావిప్లవం. గర్భిణి స్త్రీలు, పసి కందుల తల్లులు పాల బుగ్గల పడుచులు, నడుము వంగిన వృద్ధులు జైళ్లకు పోతుంటే బ్రిటిషు ప్రభుత్వం దద్దరిల్లింది. లక్షలాది పురుషులు ఉద్యమంలో ఉరికిన దానికంటె వేలకొలది స్త్రీలు పాల్గొన్నందు వల్ల శతాధిక ప్రయోజనమే కల్గింది. పుణ్యజనని కస్తూర్బా జండాపట్టి ముందు నిలిస్తే భారత స్త్రీ లోకమంతా వెనుక నిలిచింది. ఒక స్త్రీ జైలుకు వచ్చిందంటే ఒక కుసురు ఒక కుటుంబము అంతా స్వాతంత్ర్య సమరాగ్నిలో దుమికినట్లేకదా? 'యశోవా, మృత్యుర్వా' అని పోరాడిన రోజులవి. ఎంత మహాపుణ్యం చేసుకుంటేనో ఈ శ్రీకృష్ణజన్మ స్థానం ప్రాప్తించినదని ఉప్పొంగిన కాలం ఆనందాతి శయంతో పులకాంకితమయే దివ్యస్మృతి అది. ఈ యజ్ఞవహ్నిలో ఒక సమిధ వ్రేలిస్తే, ఈ మాతృపూజలో ఒక పువ్వు పూజిస్తే 'ధన్యోస్మి' అనుకున్న రోజులవి. ఇంత మహా జాతీయ విప్లవానికి మూల మంత్రాలు, ధర్మము, ప్రేమ, సత్యము శాంతము, త్యాగము, అహింస, ఇవి. ఈ మంత్రోచ్చరణ మాతృమూర్తులైన స్త్రీలను శక్తి స్వరూపులుగా ప్రత్యక్షం చేసింది. అంతర్గతమైన ఆత్మనిష్ఠనుధర్మ ప్రతిష్ఠను ఉద్బుద్ధం చేసింది. 'స్వరాజ్యము జన్మహక్కు' అని చాటుతూ వీరతిలకముదిద్దిన తల్లులు విజయధ్వజము పతిష్ఠించారు. భారత భూమిలో స్త్రీల స్థానము అతి లోకమైనది. అందులో జాతీయ మహోద్యమంలో వారి ప్రముఖ పాత్రఇంకను మహోన్నతమై తేజోశిఖరాల పైనిల్చి అమృతయశస్సులు ప్రకాశించినది. భారత జాతిని మహామహితశక్తి సంపన్నముగా తీర్చిదిద్దుటకు జాతీయ విద్యాశిబిరాలు స్థాపించిన వారిలో సైతంస్త్రీలు ముందంజ వేశారు భారత స్త్రీలు ఎన్నడూ మత కర్తవ్య నిష్ఠను ఏమరలేదంటే అతి శయోక్తి కాదు.

స్వరాజ్య సాధనలోనే కాదు. స్వరాజ్య పరిపాలనలో సైతం స్త్రీలు తమ శక్తి సామర్థ్యాలను అప్రతిమానంగా ప్రదర్శిస్తున్నారు. పార్లమెంటు మొదలు పంచాయితీ వరకు, బహు బహుప్రశస్తంగా నిర్వర్తిస్తున్నారు, రాయబారులుగా, హైకమీషనర్లుగా, గవర్నర్లుగా, మంత్రులుగా పార్లమెంటు సభ్యులుగా ప్లానింగు మెంబర్లుగా కేంద్ర సంస్థల అధ్యక్షులుగా ప్రజా సంస్థల నిర్వాహకులుగా ఉన్న తోద్యోగినులుగా చిన్న ఉద్యోగినులుగా పైనుండి క్రింద వరకు అన్నిటిలో స్త్రీలు అసమానప్రఖ్యాతి గడిస్తున్నారు. అత్యంత గౌరవప్రదమైన ప్రపంచ సమితి అధ్యక్షపదవి కూడా వారి కరగతమైనది. భారత స్త్రీల ఈ ఔన్నత్యము ప్రపంచ మహిళాభ్యుదయానికే గర్వరేఖ, యుగ యుగాలుగా భారత స్త్రీ జాతి ఆదర్శము విశ్వకల్యాణాన్ని సాధించుటలో మకుటాయ మానంగా తేజరిల్లింది. నవ భారత నిర్మాణంలో స్త్రీలు తమ ప్రతిభాశక్తులను సార్థక పరచి భావి భారత మహోదయంలో సమ భాగినులుగా చరితార్థలు కాగలరు. నవభారతం స్వయం సమృద్ధమై సర్వతోముఖాభ్యుదయంతో జగజ్జ్యోతిగా వర్ధిల్లాలి. ★

మా సానుభూతి

ది 26-11-56 ఉదయము 5-30 గం॥లకు శ్రీ రాధాకృష్ణన్ సతి శ్రీమతి శివకామమ్మగారు పరమపదించారు. వీరు మన సభ యావజ్జీవ సభ్యురాలు. ఈ హఠాత్తు సంఘటన వారి ఆత్మీయులకు నమ్మలేని ఒక దుస్సంఘటన. వారి భర్తకు, బిడ్డలకు మా మనఃపూర్వకమైన సానుభూతి. శ్రీమతి శివకామమ్మగారి ఆత్మకు శాంతి చేకూరుగాక.

—సం.

కచ్చేరీచావడి :

ధూమేశ్వరీ స్తవం

శ్రీ మధురాంతకం రాజారాం

గ్రాస మ్మింతయు లేక స్రుక్కినను, ఈ
    కాయమ్ము రోగాలతో
గాసిం బొందిననైన, కష్టములునన్
    గారించినన్ గాని నీ
ధ్యాసన్ మానగలేనుదేవి! పరి
    పూర్ణానంద సంధాయినీ!
నాసాగ్రమ్మున నాట్యమాడులలనా
    నారాణి! ధూమేశ్వరీ!

ఎనుబోతుల్ బలియిచ్చి మ్రొక్కినను, ఆ
    ఈశాని గంగమ్మ మా
వినతుల్ వీనులజేరనీయక సదా
    వేధించు, కానీకె నీ
వనయమ్మున్ కరుణింపుచుండెదవహో,
    ఆహో, కృపాంభోనిధీ!
నను నీ దాసుని ప్రేమజూడగదవే
    నారాణి! ధూమేశ్వరీ!

బీడీవిగా నెన్ని పెదవులపైననో
    నటియించు నీ నాట్యపటిమ జూచి
సిగరెట్టుపై ఎన్నో సింగారములగుల్కు
    నీ హావభావాల నీటుజూచి

పొగచుట్టవగుచు యుప్పొంగి క్షణమ్ములో
    మబ్బులుగట్టు నీ మహిమజూచి
వేయేల నీ దివ్యవిశ్వరూపమ్మది
    క్రమ్మిన ఈ ప్రపంచమ్ము జూచి

నిరతమానందమొసగెడి నీదుమేఘ
మాలికలపైన మేటిసామ్రాట్టు వోలె
కొలువు దీరిచి నేనేలుకొందు గదవె!
మహితసౌందర్య స్వప్న సామ్రాజ్యములను!

కాంగిరేసటంచు, కమ్యూనిస్టు లటంచు
వారటంచు మరియు వీరటంచు
భేదబుద్ధిలేని ప్రేమరాశివి నీవు
సాధ్వి! నీదికాదె సర్వసమత!

పంతము బట్టినట్టి చలి
    బాధకు నిద్దురరానివేళ, హే
మంత నిశీథమందు నొక
    మంచి 'సిగారు'ను గాల్చుచుండి, నీ
వెంతదయాబ్ధివంచు నుతి
    యింపదలంచితి నొక్కనాడు, నీ
మంతినీ! నేటికిట్లు యొక
    మాదిరిగా నిను సంస్తుతించితిన్.

ప్రజాస్వామిక భారతము

మహిళల బాధ్యత

పండిత శ్రీ జంపాల వేంకట నృసింహముగారు

భారత ప్రజలు కొన్నివందల యేండ్లు పరదేశీయుల పాలనమున కధీనులై యుండుటచేఁ దమసహజౌదార్య గాంభీర్య, సహన సౌందర్యాది గుణములకు దూరులై పరానుకరణ ఫలితముగా పలుతెరఁగుల పతనమగుట సంభవించినది.

కేవల స్వార్థపరత్వము, అసహనము, పరాపకారము మోసము, కర్తవ్య నిర్వహణమున కాపట్యము, అత్యల్పాక్రమలాభార్థనిరంతరదురంత దుష్కార్య కరణము మొదలగు ఘోరచర్యామహాభూతములు ప్రస్తుతమున భారతావనిని దాండవించుచున్నవి.

పరాధీనత తొలఁగినది. ప్రజాపరిపాలన విధానము నడచుచున్నది. కాని ప్రజాహృదయములందుఁ బాదుకొని యున్న పారతంత్ర్యకాలాభ్యసిత సంకుచితత్వములు మాత్రము వెనుకంజ వేయకున్నవి.

పైగా జనసామాన్యమున స్వపరిపాలన మన్న నిరంకుశమగు క్రమాక్రమ విభేదములేని యిచ్ఛానుసార ప్రవర్తన విధాన మను వికటభావము ప్రబలుచున్నది.

సమానత్వమన నితరులఁదిరస్కరించుట, అలక్ష్యము చేయుట, అవమానించుట యను దుర్లక్షణముగాఁ బరిణమించుచున్నది,

ఇందులకు ప్రజల కుపయోగపడు దారులు, డొంకలు మొదలగు వానినాక్రమించుట, యిచ్చవచ్చినచోట నెల్ల గొలుసులాగి రైళ్లనాపుట, మొదలగు నిర్భయ, నిరంకుశ, నిరాఘాట చేష్టితములే తార్కాణములు.

ఇంతకుముందు మతమూలముననేర్పడిన సాంఘిక నిమ్నోన్నతముల కాలవాలముగ నెలకొనియున్న కుల తత్త్వ దురభిమానములు సర్వవిధముల సంఘ విద్రోహకరములుగాను, జాత్యభివృద్ధి నిరోధకములుగాను, తాండవించుచున్నవి. నాయకాగ్రణుల ప్రబోధము లడవిఁ గాచిన వెన్నెల లగుచున్నవి.

ఈ సాంఘిక విభేదము లంత మొందించు పని స్త్రీల సంపూర్ణ సహకారము లేకున్నచో నొక్కింతయు నెక్కరాదు.

నేఁడు పురుషులలో చిత్తవైశాల్యము, సంఘీభావము సహనము మున్నగు నుత్తమ లక్షణములు వెదుక వలసినవైనవి.

సాంఘిక విషయములందు, ఆరోగ్య రక్షణ విధులందు, మితవ్యయమునందు భావిపౌరుల తీర్చిదిద్దుట కొఱకు స్త్రీలు ముఖ్యముగా శ్రద్ధవహించి శ్రమచేయరేని మన భారత జాత్యభ్యుదయము కుంటువడఁగలదు; పెంపొందఁజాలదు.

దేహ, గేహ, వస్త్ర, నివేశనపరిసర ప్రదేశాది పరిశుద్ధ విషయమున నారీలోకము మనసుపట్టి పనిచేసినచో ననతికాలముననే మన పల్లెలు, పట్టణములు, జలాశయ తీరములు, ప్రజల నిత్యోపయోగకర బహిరంగ ప్రదేశములు పరిశుద్ధములై ఆరోగ్యరక్షణ కేంద్రములు కాగలవు.

పరిశుభ్రతకు నాగరికతకు సంస్కృతికి పుట్టుకచేతనే పట్టుఁగొమ్మల మను సంఘములవారే పరులకు బాధయని పరికింపక, యధర్మమని యనుమానింపక తమ యిండ్ల ప్రాంతములును, సర్వజనోపయోగ కరములగు వీధులును, రచ్చపట్టులును, జలాశయములు సత్రములు మున్నగువాని పరిసరములును పిల్లల మలవిసర్జనములు, ముఱికి పదార్థములు పడవేయుట మొదలగువానిచే మలిన భూయిష్ఠములు గావించి తమకు అసంఖ్యాక జనులకు రోగకారకములు గావించుచున్నారు.

"యద్యదా చరితిశ్రేష్ఠఃతత్తదేవే తరోజనః" అను వాక్యానుసారము వారిని జూచి యిప్పుడి తరులు గూడ పెక్కురు, బహిరంగముగ, నిరాఘాటముగ నిట్టిచర్య లకుఁ గడంగినారు.

ఎవరేని యిది యన్యాయ్యమను వారున్నను వారి మాటలు చెవిఁబెట్టకపోగా పైకి దాడిసాగు స్థితి యేర్పడు చున్నది.

ఇట్టి ఆరోగ్య భంగకరములు, సహింపరాని రోత గలిగించునవియు, అనాగరకములు నగు చర్యల నరికట్టుట స్త్రీలకు సుసాధ్యములు, స్త్రీలబోధలు తోడివారికి హిత కరములగును, వారివర్తనములు మార్గదర్శకము లగును, బాల బాలికలకు వారి తెరువులు రాచబాటలగును.

స్త్రీలు పురుషులు కేవల రాజకీయములలో మునిగితేలిన మాత్రమున జాతికి దేశమునకు మేలు చేకూరఁజాలదు.

పురుషులు సాంఘికార్థిక రంగములందుఁబాటుపడుట యెట్లావశ్యకమో స్త్రీలుకూడ నా యా యభివృద్ధికరప్రణాళికలందుఁ గృషిచేయుటయు ముఖ్యావశ్యకము, కాని మహిళాజనులయత్నము పురుషుల యత్నమున కంటె శీఘ్రకాలమున పెక్కురెట్లు సత్ఫలదాయక మగును.

సకల సృష్టినిర్వహణమున కా జగన్మాత పరాశక్తి యెట్లాధారమో యట్లేశక్తి స్వరూపిణులగు నీ రమణీలలామలును నైహిక వ్యవహారములను సక్రమ మార్గమున చక్కదిద్దుటకు ముఖ్యాధారలనుట యందొకించుకయు సంశయమునకుఁ దావులేదు.

"భారత మహిళలు వంటచేసి పెట్టుటయే కర్తవ్యముగా నెంచక బయటికి వచ్చి ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగములలో పురుషులతోపాటు కృషిచేయుఁడు" అని భారతదేశ నాయకాగ్రణులు ప్రబోధించు చున్నారు.

దీనిభావము సమస్త స్త్రీలు గృహస్థ విధులమానుఁడని కాదు. వంట వారిఁబెట్టుకొను శక్తి గలిగి యిలు తీర్పు జరుపువా రాపని మానవచ్చును, సామాన్య కుటుంబినులు కుటుంబ పోషణబాధ్యతలు విడచినచో గృహస్థ జీవితపు నడక యెట్లుసాగును?

కాబట్టి తమ గృహనిర్వాహక కార్యములే జాతీయాభివృద్ధికనువగు పద్ధతులలో నడుప వలయుననియు, అశ్రద్ధ, సోమరితనములేక తమ వ్యవధికాలమును గూడ జాతి యొక్క క్షేమాభివృద్ధుల కనువగురీతి కార్యాచరణమున నుపయోగింప వలయుననియు నాయకుల ప్రబోధ లక్ష్యమని గుర్తింప వలయును.

పురుషులలో సోమరులు, దుర్వ్యసనపరులు తమ యిల్లాండ్ర నీచకామసాధనములుగా నుపయోగించు కొనుచు కుటుంబ పోషణమున బొత్తిగా జోక్యములేక ఆలుబిడ్డలఁ గూడుగుడ్డలకుఁ గూడ నలమటింపఁజేయు పరమక్రూరశిలా హృదయులు కొందఱుండ వచ్చును. స్త్రీలలోను ధర్మవిరుద్ధవర్తనలై భర్తలను కుటుంబము లోని వారలను నవస్థల పాల్సేయు నీచురాండ్రును గొందఱుండ వచ్చును.

అట్టినీచులను (వారు స్త్రీలు కానిండు పురుషులు కానిండు) కుటుంబమునకు, జాతికి, దేశమునకు ద్రోహులని, పాతకులని యెంచక తప్పదు.

ఆ నిర్భాగ్య వర్తనులను క్రమమార్గమునకు మరలించుటకు స్త్రీ పురుషులు సమానబాధ్యులు. అయినను బంధుప్రీతి, జాత్యభిమానము మున్నగు మొహమోటాలు లేక వ్యవహరింతురేని దుర్వర్తనలం తరింపఁ జేయుటకు స్త్రీలు పురుషుల కంటె సమర్థలనుట పొగడికకాదు.

తమనివేశనములు, వస్త్రములు, దేహములు బిడ్డలు మురికిపాలు గాకుండఁ జూచుటయే గాక తోడిజనుల యొక్క తెలివిలేమిచేఁగాని, సోమరితనమునగాని, పరార్థభావశూన్యతనుగాని చేయు ననారోగ్యకర కార్యముల నంతరింపఁ జేయుటకుఁ దమ ప్రవర్తన ముదాహరణముగాఁజూపుటతో పాటు మృదురూపమున ప్రబోధమునకుఁగడంగిరేని వనితామతల్లులు జాతిని దేశమును రోగ సాగరమునుండి తీరముఁ జేర్పఁజాలుదురు.

గ్రామోద్ధరణమునుగూర్చి యెందఱు నాయకశిఖామణులెంత గంభీరముగ, సోదాహరణముగ, నుపమానోపమేయ పూర్వకముగ నుపన్యాసపరంపరల విసరి వెదచల్లినను గ్రామసీమల మహిళాలలామలు కార్యరూపమున సహకరింపఁబూన కున్న యేండ్లు పూండ్లు గడచినను గ్రామములు చక్కఁబడఁజాలవు.

సతీమ తల్లులు సహృదయలై ఐకమత్యము, సహనము, కరుణ, మితవ్యయము మున్నగు నుత్తమ విషయములను లక్ష్యముగాఁ జేసికొని తామును తోడివారును వాని ననుసరించి వర్తించుచు ప్రబోధములతో నిత్యజీవిత విధానము జోడించుట ప్రధానకర్తవ్యముగా గుర్తింప వలసియున్నది.

వీధులందు, ప్రజాసముదాయమునకు, నిత్యోపయోగకరములగు బహిరంగస్థలములందు చెఱువులు, బావులు,

కాలువలు మున్నగు వానితీరములందు మలాదులవిడచుట పిల్లలచే మలవిసర్జన చేయించుట, మురికి పదార్థముల వేయుట మొదలగు అనారోగ్యకరాభ్యాసముల మాన్పుటకై మాతృస్వరూపలగు నవలారత్నము లత్యంతము కృషిచేయ వలసియున్నది.

ఈ విషయమున మానినీమణులు సహకరించి కృషి చేయరేని మన గ్రామసీమల యనారోగ్యస్థితిని దొలఁగింప నెంతకాల మన్యవిధముల యత్నములు జరిగినను ఫలింపఁజాలవు.

మాతృదేవతలారా, మీ బిడ్డలు సర్వవిధముల వర్ధిల్లుటకును, మీజాతి వికాసవంతమగుటకును మీవలె పాటుపడుసాహసము పురుషుల కుండదు. "స్త్రీణామ్ ...... సాహసం షడ్గుణంచైవ" అన్నారు పెద్దలు. మగవాంద్రలోని చెడుగులఁ గడిగివేయు సామర్థ్యము సైతము మీకే పూర్ణముగా గలదు. మిమ్మాదర్శముగా గొనియైనను పెడత్రోవలఁబోవు మగమొద్దులు వివేకులై సన్మార్గవర్తులై మేలొందగలరు.

సాంఘిక రంగములందు మీరు నడుము గట్టుచో భేదవాదులు, సోమరిసాములు, దురహంకారులు, వ్యర్థజీవులు భారతభూమిని గలలోనైన గానరాకుందురని నమ్ముడు.

భారతప్రజలలో మీకృషి ఫలితముగా ఆడంబర రాహిత్యము. ఉపకారబుద్ధి, సాహసగుణము పెంపొంది యీర్ష్యాసూయలు, గర్వము, నీచస్వార్థము మున్నగు భావదాస్యగుణము లంతరింతపఁగలవు, జాతి సర్వతోముఖాభివృద్ధి నందును, దేశము కళ్యాణపరంపరా సహితయై ప్రపంచమున కాదర్శభూతయై తేజో విరాజమాన కానోపును "సర్వేజనాస్సుఖినో భవంతు" ★

జ్ఞానోదయం

శ్రీమతి జి. సుందరీ శంకరం



రచయిత్రి

ఇదివరకెప్పుడు గడపదాటి యెరుగను. నాలుగు గోడలమధ్య పుట్టాను. ఆ నాలుగు గోడలమధ్యను పెరిగాను. మా యింటనున్న నాలుగు గదులు, మా పెరడు, మా ఆయన, పిల్లలు, వచ్చే పోయే బంధువులు తప్ప ఇతర లోకం నాకేమీ తెలియదు. ఇదీ నాలోకం - ఈలోకంలోనే అనుసృతంగా వస్తున్న సంస్కారంమాత్రం నావంటబట్టింది. ఒక అర్ధరాత్రివేళ నాకెందుకో తెలియని ఆవేదనకలిగింది. ఈ యిల్లూ వాకిలీ, పిల్లల్నీ జల్లల్నీ చూస్తే రోతపుట్టింది. నాకేకాదు యెవరికైనా రోత పుడుతుంది. మా యింట్లో తండ్రి దొకదారి, పిల్లల దొకదారి - క్రమశిక్షణలేదు. సక్రమపద్ధతులు అలవరచుకోలేరు. ఎవరిమతం వారిది - ఎవరిపద్ధతి వారిది - మా పెద్దవాడు అతివాది - చిన్నవాడు మితవాది. ఒకరిమాట ఒకరికి నచ్చదు. మా పెద్దమ్మాయి వ్యామోహానికి అంతూ పంతూ లేదు. అసలు దేవుడేలేడంటుంది. నావన్నీ మూఢ నమ్మకాలు. ఆమెవన్నీ ఉన్నతాదర్శాలు. పెద్ద చదువులు నేర్వని నాబోటి పూర్వాచార పరాయణురాలికున్నంత జ్ఞానమైనా దానికిలేదు - ఇటువంటి సమాజంలో యెవరికైనా విసుగుపుడుతుంది. అది స్వీయప్రయత్నమనండి - భగవత్ప్రేరణ అనుకోండి - అర్ధరాత్రివేళ ఇల్లు వదలి ఇవతల పడాలని అనిపించింది -

మా పల్లెకు ఒక్కటే వీథి వర్షానికి వెలిచికాబోలు వీథిలో యెవరూలేరు. అందరు అంతఃపురాల్లోనూ, కొందరు అరుగులమీదను గుబ్బు పెట్టి నిద్రపోతున్నారు. చలిదేవతకు వెఱచి ముడిచిపెట్టుకుని నిద్రిస్తున్నారు. ఆకాశం మేఘావృతమైవుంది. ఉఱుములు మెరుములు. నిర్జనప్రదేశాన్ని, నిశ్శబ్దముగానున్న ఆనిశీథాన్ని, ఒంటరితనంలో చూడటం నాకు ఇదే మొదటిసారి. కొంచెం భయంగానేవుంది. మళ్ళీ యింట్లోకిపోయి పడుకుందామా అని అనుకుంటూనే ముందునకు సాగిపోయాను. పదినిముషాలలో మా చెరువుగట్టు మీదికి చేరుకున్నాను. నాకు తెలీకుండానే నా కాళ్ళు కాలవగట్టును అనుసరించాయి. మా కాలవగట్టు పాములకు ప్రసిద్ధి. ఏక్షణంలో యే ప్రమాదానికి గురియౌతానో యని సందేహిస్తూనే ఆరు ఫర్లాంగుల కాలవగట్టుదాటి అవతలనున్న రోడ్డుచేరుకున్నాను. ఎటువేపు వెళ్ళాలో తెలియదు. ఎక్కడికి వెళ్ళాలో కూడా నేను అనుకోలేదు. తూర్పువేపుకి తిరిగి నడిచాను. అలా యెంతదూరం నడిచాను. నాకు తెలియదు. కాళ్ళు గుదులు పట్టినాయి - ఒళ్ళు సడలిపోయినట్లనిపించింది. అంతట చలిగాలివేస్తున్నా నాకు చలి అనిపించలేదు ఇంత అనాలోచితముగాను, ఇంత అయోమయంగాను ఇల్లువదలి బయలుదేరడం, ఇంతదూరం నడచిరావడం నాకూ ఆశ్చర్యంగానేవుంది! నాకు గమ్యస్థానంలేదు. అది చేరుకోవాలనే ఆశలేదు-అప్పుడు మీరెవరైనా నన్ను చూచివుంటే బహుశః నాకుపిచ్చియెత్తివుండాలని అనుకొనివుందురు. ఆ చిటపట చినుకుల్లో, ఆ నిశా సమయంలో కాళ్ళు తడబడుతూ మనస్సు కలవరపడుతూ ఆరాత్రంతా నడిచాను. బళ్ళున తెల్లవారింది. మాపల్లెకు పదిమైళ్ళదూరంలోవున్న పట్టణంవచ్చానని తెలుసుకున్నాను.


మా పల్లెవాసుల జీవితానికి ఈ పట్టణవాసులజీవితానికీ చాలా తేడావుంది - కనుక చీకటిలోనే లేచి కాలకృత్యాలు తీర్చుకొని కళ్ళలోపడ్డ పసరంలా ఊపిరిసలపకుండా పనిచేసుకుపోవటంతోనే తెల్లారిపోతుంది - మాకు భళ్ళున తెల్లవారినా నాగరికతకు పేరుపడసిన ఈనగరవాసులుఅంతఃపురాల్లో ఇంకాఆదమరచి నిద్రపోతున్నారు గదా! రెక్కాడితేనేగాని డొక్కాడని అభాగ్యజీవులు మాత్రం లేచి దినకృత్యాలకు ఉపక్రమిస్తున్నారు. నవనాగరికులు లేవగానే నోటికి అందిచ్చే కాఫీకి కాబోలు పాలబిందెలు మోసుకుపోతున్నారు. పశువులను యింటిముందరే కట్టి కొందరు పాలు పితుకుతున్నారు. ఆ గృహయజమానుగాలు లేవకపోయినా - [illegible]

కల్లాపు జల్లి ముగ్గు పెడుతోంది-ఒక అభాగ్యపు జీవి- ఎంత తారతమ్యం- ఎంత వ్యత్యాసం- ఒకరు సుఖానికే పుట్టినట్లు, కొందరు కష్టానికే జన్మించినట్లు కనబడుతోంది. ఈ లోకంలో పట్టుపరుపులమీద కాశ్మీరశాలువ కాలికి తన్ని పెట్టి, ముఖంమీదకు ముసుగులాగి, వెచ్చగా నిదురిస్తున్న ఇల్లాలిని చూచి సంతోషించనా- ఎముకలు కొరికే చలిలో వెట్టిచాకిరీ చేస్తున్న అభాగినిని చూసి ఏడవనా? ఎవరి అదృష్టం వారిది. నా హృదయ వేదనతో గాని, నాతో గాని నిమిత్తం లేనట్లు యెవరి పనులు వారు చేసుకు పోతున్నారు. ఆ మందిరం ముందు గేటు- ఆ గేటు పైన అర్ధవర్తులాకారంలో అమర్చబడిన ఆ తెల్లని బల్లపై నల్లని అక్షరాలు చదివాను. అది "మహిళా సభ" అప్పుడే సూర్యోదయం అవుతోంది కాబోలు తూర్పున ఆకాశమంతా పచ్చని రంగుతో ప్రకాశించబోతోంది- రంగు రంగుల చీరలు కట్టి రకరకాల ముస్తాబులతో రమణీమణులు ఒక్కొక్కరుగా వచ్చి ఆ మందిరంలో ప్రవేశిస్తున్నారు. ఆ సుందరమైన మందిరానికి ఆ రమణీమణుల రాక- అత్యంతశోభను చేకూరుస్తోంది. ఆ మందిరమధ్యంలో లగ సుదీర్ఘమై సువిశాలమైన హాలులో సుందరీమణులందరూ తూర్పు దెసనుగల వేదికకు అభిముఖులై కూర్చున్నారు. గవాక్షములనుండి రవి ప్రభువు ఈ రమణీమణుల చెక్కిళ్ళను ముద్దు పెట్టుకుంటున్నాడు. నవలావణ్య కుసుమ కోమలుల ముఖములు రవంత కందినట్లునది. గాజుల గలగలలతో- అత్తరువుల ఘుమఘుమలతో- తుమ్మెదల రంగును ధిక్కరించు నల్లని కేశపాశములతో- సీతాకోక చిలుకలవలె ఆ సభ నలంకరించిన వనితల అందచందములు వర్ణించుటకు ఆదిశేషునకైనా అలవికాదనుట అతిశయోక్తి కాదు. అంత నొక్క సుమంగళి ఒక దివ్య సుందరవిగ్రహము, నా యెట్టయెదుట కారునుండి దిగి, ప్రత్యక్షమైంది. నన్ను ఆమె చూచింది. ఏమమ్మా ఎవరు మీరని ప్రశ్నించింది. నా జవాబునకు ఎదురు చూడనే లేదు. అక్కడగల ఒక వనితతో నన్నుకూడ లోనికి తీసుకొని రమ్మని చెప్పి తాను మందిరమువైపు నడువసాగింది. నేనును ఆమెను అనుసరించి మందిరము ప్రవేశించాను. ఈమెరాకకై ఎదురు చూచుచున్న రమణీమణులందరు ఈమె రాగానే ఒక్కసారి లేచి నిలబడిరి. ఆమె వేదికవద్ద నిలబడింది. నేనును ఈ సుందరీమణుల వెనుకకు పోయి నిలచితిని. ఇరువురు వనితలు వేదికవద్దకు వెళ్ళి ప్రార్థనాగీతము లాలపించారు. అందరూ ఉచ్చైస్స్వరమున పాడినారు. తరువాత [illegible] నిశ్శబ్దం. ఆ ప్రశాంతవాతారణము చీల్చుకొని ఒక సుమధుర కంఠ స్వరము నా వీనులకు విందుచేసింది. ఆమె ఎంతసేపు ఉపన్యసించిందో నాకు తెలియదు. తన్మయతలో విన్నాను. విన్నవాటిలో కొన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాను.

సోదరీ మణులారా! నేను చెప్పబోవు విషయము అత్యంత ప్రధానమైనది.

"మీరందరు శిక్షితులైన తరువాత పల్లెలకుపోయి అక్కడనే స్థిరనివాసము లేర్పరచుకొని తోడి నారీరత్నములను సంస్కరింపవలసియున్నది. సాంఘికముగాను, రాజకీయముగాను, ఆర్థికముగాను సంస్కరణము జరుగవలసియున్నది. సంఘములోని దురాచారములను రూపుమాపి- ఆర్థిక సౌష్టవముచేకూర్చి, రాజకీయములలో నవచైతన్యమును కలిగింపవలసి యున్నది. సంఘసేవ, దేశసేవ. మానవ సేవ, మాధవసేవ చేసి ధన్యులు కావలెను, మీలో క్రమశిక్షణ కట్టుబాట్లు వుండినగాని ఇది సాధ్యపడదు. మీరు క్రమ శిక్షణ అలవరచుకొనుడు. కట్టుబాట్లుగల జీవిత విధానమననుసరించుడు. అప్పుడు మీ జీవితము ధన్యత గాంచును. మీరు తరించి ఇతరులను తరింపచేయుదురు."

ఈ మాటలతో జ్ఞానోదయమైనది. అక్కడ ఒక్క నిముసముకూడ నిలబడలేదు. ఎవ్వరినీ పలుకరించలేదు- చల్లచల్లగా జారి ఇవతలపడినాను. పది గంటలగుసరికి పదిలముగా మా పల్లె చేరినాను. ఇంట్లో అంతా దిగాలు పడి కూర్చున్నారు. అంతా ఒక్కసారి నన్ను కౌగలించుకొని గొల్లుమన్నారు. అందర్నీ అన్నివిధాలా సముదాయించాను. ఇకనుంచి నే చెప్పినట్లు వింటే ఎక్కడికీ పోకుండా వుంటానన్నాను. అది మొదలు మా యింట్లో "ఆనందము" స్థిరనివాసం ఏర్పాటుచేసుకుంది.



ఆకర్షణీయంగా ఉండాలంటే

శ్రీమతి సువేణీ కాశ్యప్

సౌందర్య పోషణకి తోడ్పడే వాటిలో బ్రష్ ఒకటి. బ్రష్ నుపయోగించటము వలన చాలా ప్రయోజన ముంది. ఒక విధమైనతెలియని సౌకుమార్యాన్ని, సౌందర్యాన్ని ఈ బ్రష్ కలుగచేస్తుంది.

ముందుగా హెయిర్ బ్రష్‌ను చూదాము. హెయిర్ బ్రష్ నుపయోగించుట వలన జుట్టు ఊడుట తగ్గుటయే కాక పట్టుకుచ్చు లాగా ఉంటుంది. ముఖ్యముగా తలంటి పోసుకొన్నప్పుడు చిక్కు దువ్వెనతో చిక్కుతీసే దానికంటే, బ్రష్‌తో తీస్తే మంచిది. దువ్వెనతో తీస్తే తల నొప్పిపెట్టుటయే కాక, బోలెడంత జుట్టూడిపోతుంది. తల తడిలేకుండా శుభ్రముగా తుడుచుకొని పాయలు పాయలుగా తీసి బ్రష్‌తో చిక్కుతీసు కుంటే జుట్టు ఊడక పోవుటయేకాకుండా వెంట్రుకకీ, వెంట్రుకకీ విడివడి, వున్న జుట్టును మరింతగా కనబడేటట్లు చేస్తుంది. అలా రోజూ బ్రష్ఉపయోగిస్తే జుట్టు పట్టుకుచ్చులాగ వుంటుంది



రచయిత్రి :

ఇక పోతే స్నానము చేసేటప్పుడు కూడా బ్రష్ నుపయోగించటము చాలా మంచిది. బాత్ బ్రష్ కానీ, స్పాంజి కానీ ఉపయోగించుట వలన చేతితో పోని మలినము పోయి హాయిగా ఉంటుంది. బ్రష్ కనుక యుపయోగిస్తే, సోపునురుగు వొంటికి బాగా పట్టించి తర్వాత బ్రష్‌కు కొద్దిగా సోపురాసి రుద్దుకోవాలి, స్పాంజి అయినా కూడా అంతే. వొంటికి బాగాసోపురాసి, తర్వాత స్పాంజికి కూడా బాగాసోపుపట్టించి రుద్దుకోవాలి, రబ్బరుస్పాంజి కనుక అయినట్లయితే సోపుమరింతఎక్కువగా పట్టించాలి, లేకపోతే శరీరమంతా రబ్బరువాసన కొట్టుతుంది. ఇలా కనుక స్నానము చేస్తే ఎంతో హాయిగా ఆరోగ్యముగా ఉంటుంది.

సామాన్యముగా రోగా లన్నీ పాదములమీద చూపే అశ్రద్ధవలననే వస్తాయి. ఎక్కడికైనా వెళ్ళి రాగానే చెంబుడు నీళ్ళు కాళ్ళమీద గుమ్మరించుకోవటము మనకలవాటు నిజానికి మన పూర్వులెంత ఆలోచించి ఆ ఆచారాన్ని అమలులో పెట్టారో ! కానీ అంత మాత్రము చాలదు. పాదాలు తడిసేట్లు గోరువెచ్చని నీళ్ళుపోసి, సోపు నురుగును పట్టించి, మంచి బ్రష్‌తో రుద్దాలి, దాని వలన పాదము లందంగా కనిపించటమే కాకుండా, వొంటికి,

ఇంటికి కూడా ఆరోగ్యము చేకూరుస్తుంది.

అలాగ చెక్కిళ్ళు కూడా, గులాబిరంగు చెక్కిళ్ళు ముఖాకర్షణకి ముఖ్యమైనవి. అలా చేసుకోవటానికి ఈ బ్రష్ చాలా వుపయోగిస్తుంది. వేడినీళ్ళు, చన్నీళ్ళు వేరు గ్లాసులలో నుంచుకొని, సోపునురుగుతో నిండియున్న టూత్‌బ్రష్ తీసికొని, ఆబ్రష్‌ను ముందు వేడినీళ్ళలో ముంచి, చెక్కిళ్ళమీద చిన్నచిన్న సున్నాలుగా రుద్దాలి. అలా 5 ని. చేసినతర్వాత చన్నీళ్ళలో బ్రష్‌సుముంచుతూ మొదటిసారిలాగా మరో 5 ని. రుద్దాలి, తర్వాత శుభ్రముగా ముఖము రుద్దుకుంటే ముఖము రోజారంగులా అందముగావుంటుంది. ఇలావారానికి ఒకసారిచేస్తేచాలు.

ఇకపోతే పౌడరుబ్రష్ నుపయోగాన్ని చూదాము. తడిలేని ముఖముమీద పౌడరుబాగా జల్లుకోవాలి. అప్పుడు కాస్త ఎక్కువగానే జల్లుకోవటము సుంచిది. తర్వాత బ్రష్‌ను తీసికొని నెమ్మదినెమ్మదిగా ఆ పౌడరును సరిగా సర్దుకోవాలి, అలా బ్రష్‌ను టచ్ చేసినప్పుడు మామూలుగా చేతితో పౌడరు వేసినప్పుడు కంటె మృదువుగా కనిపిస్తుంది.

గులాబీరంగు బుగ్గలమీద నల్లటి కండ్లు ఆకర్షనీయముగా వుంటాయి. అందులో కంటికి అందాన్నిచ్చేవి రెప్ప వెంట్రుకలు. ఈ రెప్పవెంట్రుకలు నల్లగా, పొడుగుగా వంపుతిరిగి వుంటే చాలా అందముగా వుంటుంది కన్ను. ప్రతిరోజు రాత్రిపూట ఆముదముతో వాటిని బ్రష్ చేసి పడుకోవటం వలన అవి పెరగటమే కాకుండా వంపుతిరిగి నిగనిగలాడుతూ మెరుస్తూవుంటాయి. ఎక్కడికైనా వెళ్ళేటప్పుడు "మాస్కారా"ను ఉపయోగిస్తే అందముగా కనిపిస్తుంది.

చక్కని చిరునవ్వును చిగిరింపచేసేది తెల్లని పండ్లవరుస. ఎంత అందమున్నా, ఆకర్షణీయమైన చిరునవ్వులేకపోయిన తర్వాత ఆ అందము బొమ్మ అందమే అవుతుంది. ఎఱ్ఱటి పెదిమల సందులోనుంచి కనబడే తెల్లని పళ్ళ వరుస ప్రపంచాన్నంతా పులకింప జేయునదిగావుంటుంది. అందుకనే పండ్లను ప్రొద్దుట, సాయంకాలము రెండు పూటలా మంచిబ్రష్‌తో శ్రేష్ఠమైన పేస్టునుతీసికొని రుద్దుకోవాలి. ఈ బ్రష్‌లు నిలువుగా రుద్దేందుకొకటి, అడ్డముగారుద్దేందుకొకటి ఉంటే మంచిది. ఇవి రెండు నెలలకన్నా ఎక్కువగా ఉపయోగించటము మంచిదికాదు.

ఈవిధముగా కనుక శ్రద్ధతో బ్రష్‌నుఉపయోగిస్తే ఆకర్షణీయమైన అందము పొందవచ్చు.

★



ప్రపంచ పరిశ్రమలలో సినిమాపరిశ్రమ చాలా ముఖ్యమైనదిగా తయారైనది. దానిలో భారత దేశ చిత్రనిర్మాణము మంచి స్థానమును సంపాదించినది. మన దేశములో తెలుగు సినిమా పరిశ్రమకు అత్యుత్తమ స్థానమున్నది. మహోజ్వలమైన భవిష్యత్తుఉన్నది. అనతికాలములోనే తెలుగు సినిమాకు ప్రపంచ సినిమా పరిశ్రమలో ప్రముఖపాత్ర వహించగల అవకాశమున్నది. అత్యుత్తమ నటనా కౌశలము ప్రదర్శించగల నటీనటులు ఉన్నారు. అత్యుత్తమమైనవీ ఆదర్శవంతమైనవీ చక్కని చిత్రాలు తయారు చేయగల మేధావంతులూ డైరక్టర్లున్నారు. పరిశ్రమకు కావలసిన ప్రత్యేక శిక్షణపడసిన వివిధ కళాకారులూ ఉన్నారు. కావలసినది ఇంకనూ కొంత శ్రద్ధ, తీవ్రమైన కృషి మాత్రమే.

మన తెలుగు సినిమాలలో బాగా పరిచయముగల వారి విమర్శ పాటకులకు అందిస్తున్నాము.

—సంపాదకురాలు.



'ఇలవేలుపు' చిత్రంలో రేలంగి, కృష్ణకుమారి.

తెలుగు చిత్రాల విశిష్టత

శ్రీ యస్.టి. సుదర్శనాచార్య

"ఆఁ—తెలుగు చిత్రాలు చూసేదేమిటి?" ఈ తృణీకార భావం చాలామంది విద్యార్థుల్లోనూ, విద్యాధికుల్లోనూ కూడా కనుపిస్తుంది. తెలుగు చిత్రం చూడటం చిన్నతనంగానూ గౌరవభంగంగానూ అనుకునేవారు కూడా లేకపోలేదు. వీరి దృష్టిలో ఆదర్శచిత్రాలేవో అర్థంకాదు" "చిత్రాల్లో వినోదంతో పాటు. విజ్ఞానంకూడా వుండాలయ్యా" అంటారు అంతాను. అంతే యీ రెండూ తెలుగు చిత్రాల్లో లోపించడంవల్లనే పైన చెప్పినపెద్దలు తెలుగు చిత్రాలంటే చీదరించు కోవడం జరుగుతోంది. లేకపోతే వీరు చూసే హాలివుడ్ చిత్రాల్లోనూ, హిందీ చిత్రాల్లోనూ మాత్రమే వినోదం, విజ్ఞానం వీరికి లభిస్తున్నాయనా? చిత్రాల్లోని మంచి చెడ్డలను గ్రహించడం అట్టే తేలికైన పనిగాదు. ఏదో ఒక్క విషయం బాగుందకపోతే ఆ చిత్రమంతా చెత్తగా జమకడతారు చాలామంది. అలాగే చిత్రంలో యే పాటలో బాగున్నాయంటే అది ఉత్తమోత్తమ చిత్రం అని గొంతెత్తి చాటుతారు. ఇలా ఏదో ఒక విషయాన్ని ఆధారంగా తీసుకొని చిత్రాలలో మన యిష్టంవచ్చినట్లు యేరి పారెయ్యడానికివీల్లేదు. నిర్మాతలు. ఇంత సులువుగా మనం బాగుం దనీ, బాగా లేదనీ చెప్పేస్తాం.

చిత్రానికి అనేక అంగాలున్నాయి. కథ, స్క్రీన్ప్లే, సంభాషణలు, పాటలు, సంగీతం, శబ్దం, ఛాయ, కళ, నృత్యం, కూర్పు, నటీనటులనటన, దర్శకత్వం, వీటిల్లో యే ఒక్క విషయంపట్ల అశ్రద్ధ చూపినా చిత్రంలో ఆ లోపం కొట్టవచ్చినట్లు కనిపిస్తూనే వుంటుంది.

ఇన్ని విషయాలనూ విమర్శనాదృష్టితో ప్రేక్షకుడు చూడగలడా? చూస్తున్నాడా?— చాలామంది అంత ఓపిక పట్టి చిత్రం చూడరు. మనుషులలో వేరువేరు అభిరుచులుంటాయి. వారివారి కిష్టమైన విషయాలు తెరమీద ప్రత్యక్షమైతే వారి దృష్టిలో అది మంచి చిత్రంగానే పరిగణింప బడుతుంది.

ఇంతకూ సామాన్య ప్రేక్షకులను సైతం సంతృప్తిపరచే చిత్రం మంచి దనే అంటున్నారు కొంతమంది. ఇది అలా వుండగా చిత్రం శతదినోత్సవం చేసుకుందంటే అది అత్యుత్తమ చిత్రమని కొందరి భావం. నూరురోజులు

జనం పోషిస్తున్నారనే అనుకోవలసి వస్తోంది. పాటక జనానికి కావలసిన వినోదం వుండే చిత్రం సులువుగా వందరోజులు సాగిపోతుంది. అయితే దానిని ఉత్తమ చిత్రమని అంతా అంగీకరిస్తారా? డబ్బు గడించి పెట్టిన చిత్రమల్లా ఉత్తమ చిత్రంకాక పోవచ్చును. ఉత్తమ చిత్ర మైనంత మాత్రంచేత డబ్బు గడించక పోవచ్చు. మన దేశంలో అత్యుత్తమ చిత్రాల కెప్పుడూ డబ్బురాదన్న విషయం అందరికీ తెలిసిందే. అంటే ఉత్తమ చిత్రాలను ప్రోత్సహించే అంతస్థుకు మన ప్రేక్షకులింకా రాలేదన్న విషయం స్పష్టపడుతోంది.

ఇంతకూ చెప్పవచ్చే దేమిటంటే మన తెలుగుచిత్రాల్లో కూడా ఉత్తమ చిత్రాలున్నాయనీ కొంచెం ఓపికపట్టి చూస్తే మన చిత్రాలలోని ఆదర్శాలు, నీతులు, విజ్ఞానం, వినోదం మనకు లభిస్తాయనీ నా ఉద్దేశం.

ఈ సంవత్సరం విడుదలైన తెలుగు చిత్రాల్లో చక్కని చిత్రాలెన్నో వున్నాయి. "తెనాలి రామకృష్ణ" చిత్రంలో రాయలనాటి వైభవం, సంస్కృతి, కళలు యెంతో చక్కగా చిత్రింప బడ్డాయి. "నాగులచవితి" "నాగపంచమి," "కనకతార," "హరిశ్చంద్ర," "ఉమా సుందరి," "శ్రీ గౌరీమహాత్మ్యం," "బాలసన్యాసమ్మ కథ" చిత్రాలు ముఖ్యంగా స్త్రీలను బాగా ఆకర్షించేవి. స్త్రీలకు కావలసిన ఆదర్శాలు, నీతులు, నియమాలు, యీ చిత్రాల్లో చక్కగా వివరింప బడ్డాయి.


"ఏదినిజం?", "ఇలవేలుపు," "ముద్దుబిడ్డ," చిత్రాలలో చక్కని కథావిధానం కనుపిస్తుంది. సాంఘిక సమస్యలెన్నో యీ చిత్రాల్లో పరిష్కరింప బడ్డాయి. నేటి సాంఘిక జీవితంలోని వివిధ విషయాలు కన్నులకు కట్టినట్లు చిత్రింపబడ్డా యీ చిత్రాల్లో.

దాదాపు 30 చిత్రాలు యీ సంవత్సరం ప్రదర్శింపబడ్డాయి. వాటిలో 10 చిత్రాలు యితర భాషలనుండి డబ్ చేసినవి కొన్ని, వ్యాఖ్యలతో విడుదల చేసినవి కొన్నీను, డైరెక్టుగా తెలుగులో 20 చిత్రాలవరకూ నిర్మించారు. వీటిలో 10 చిత్రాలవరకూ ఆర్థిక విజయాన్ని సాధించాయి. మిగిలిన చిత్రాలు ఒక మాదిరిగా సాగిపోయాయి. నాలుగు చిత్రాలు శతదినోత్సవాలు చేసుకున్నాయి.

"హరిశ్చంద్ర" చిత్రం శతదినోత్సవం చేసికోవడం కొందరికి ఆశ్చర్యంగానే వుంటుంది. పాతపౌరాణిక కథకింత గిరాకీ వుందా యీ రోజుల్లో అనుకుంటారు. కానీ ఆంధ్రుల హృదయాలు అతి మెత్తనివి. "హరిశ్చంద్ర" చిత్రం చూస్తూ ప్రేక్షకులు ముఖ్యంగా స్త్రీలు కళ్లు వాచేటట్లు యేడుస్తారు. అంటే సత్యమూర్తియైన హరిశ్చంద్రుడు పడే కష్టాలను వీరు తమవిగా భావించుకొని ఆక్షణంలో విలపిస్తున్నారన్న మాట. స్త్రీలే కాదు పురుషులలో చాలా మంది కూడా అటువంటి ఘట్టాల్లో కంట నీరుపెట్టక మానరు. హృదయాలను కదిలించి, కరగించే చిత్రాలెప్పుడూ ఉత్తమమైనవే అని చెప్పక తప్పదు. హింస, అన్యాయం, కష్టం, మొదలైన వాటిని మనం భరించలేము. అందుచేతనే ఆయా రసాలు వెండి తెరపై చిత్రం పడినప్పుడు మనం కూడా ఆయా రసాను భూతులు పొందుతాము. అప్పుడే మనకు సంపూర్ణమైన సంతృప్తి, ఆనందం కలుగుతుంది.

అందుచేత మన తెలుగు చిత్రాల్లో ఉన్న మంచిని తీసుకొని సంతృప్తి పడి ఆనందిస్తే అదే చాలు. మన చిత్రాలలో కంటె హాలీవుడ్, చిత్రాల్లో గాని మరే యితర చిత్రాల్లో గానీ మనకు కావలసిన విజ్ఞానం వినోదం ఉంటాయను కోవడం దూరపు కొండలు నునుపను కోవడం వంటిదే అవుతుంది.

★



ముద్దుబిడ్డ చిత్రంలో తోడికోడళ్ళుగా జమున, లక్ష్మీరాజ్యం.


త్వరలో వస్తోంది
అశోకా పిక్చర్స్‌వారి
భూలోక
రంభ
(తెలుగు)
జెమినీగణేశన్. అంజలీదేవి.
రాజసులోచన. రేలంగి. బలం
R. నాగేశ్వరావు. జోగారావు.
M. కృష్ణమూర్తి. స్టంట్ బలరామ్.
E.V. సరోజ. M. సరోజ. సీత.....
మొదలగువారు
డైరక్షన్:- S. బాలచందర్
సంభాషణలు
సముద్రాల రామానుజం
పాటలు:
C.N. పాండురంగం
కెమేరా:
J.G. విజయం
స్టూడియో:
రేవతీ &
ఫిలింసెంటర్
BHARAT STUDIO

సంస్కృతుల సమన్వయము

—భావిస్వరూపము

డాక్టరు శ్రీమతి వి. యశోదాదేవి ఎమ్. ఎ., ఎమ్. లిట్., డి. లిట్.,

వివిధ సంస్కృతుల సమన్వయము జేసి యేక సంస్కృతిని నిర్మింపవలెను, సంస్కృతుల క్రమ పరిణతి, భావిస్వరూపము మనోగోచరములు. స్వతంత్ర దేశముల సంస్కృతులందు దేశీయత, జాతీయత ప్రజ్వలమైయుండును ; పరాధీన దేశముల పట్ల నివి నిద్రాణములు, ప్రతి సంస్కృతియు కాలగతి ననుసరించి గమ్యస్థానముజేరుటకై మారుచుండును,

ప్రస్తుత కాలము సంస్కృతిచరిత్రలో ముఖ్యమైనది. యుగసంధి యనవచ్చును. అన్ని దేశములును తమ సంస్కృతులను పరస్పరము సమన్వయించి యంతర్జాతీయతకు దోహద మిచ్చుచున్నవి. అంతర్జాతీయ యేక సంస్కృతి స్వరూపము విజయాహ్లాద కరము ; ధర్మోద్దీపితము ; కళోద్ధారకము ; సమతాభావ సంజనితము. ప్రాక్పశ్చిమ సంస్కృతుల కలయికను సూచించు కాలమాసన్నమైనది. "తూర్పు తూర్పే, పడమర పడమరే, రెండు నెన్నటికి కలియ" వన్నరోజులు గతించినవి. పాశ్చాత్యసభ్యతకు వరవడిపెట్టినది ప్రాచ్యనాగరికత యని సర్మించు సమయము వచ్చినది. దిగ్భ్రమ నొందించు కాలగతి వలన అన్ని దేశములును కొన్ని యవసరములకై యెండొంటిపై యాధారపడక తప్పదు. మానవుని విజ్ఞాన సంపద యద్వితీయమై ప్రపంచమును రేడియో, వైర్‌లెస్, విమానముల ద్వారా బంధించినది. వినాశ శక్తులును యధికమైనవి.

మతము మానవుని మనోవికాసమునకు అవలంబనము. శ్రీ కృష్ణభగవానుడు భగవద్గీతలో వచించినట్లు, ధర్మరక్షణకై ప్రపంచంలో ననేక మత ప్రవక్తలు ఉద్భవించిరి ; తమ మతముల బోధించి, ధర్మము స్థాపించి ప్రజల తరింపజేసి, శాశ్వతకీర్తి బొందిరి, మన దేశమున మహావీరుడు, బుద్ధుడు, చైనాలో లోత్సే కన్‌ఫ్యూసియస్ సమకాలికులు. యేసుక్రీస్తు, మహమ్మదు, జొరాష్టర్ తర్వాత వారు. తమ ప్రచారము రాజ రక్షణవల్ల వృద్ధిచెందింది అశోకుని కాలములో బౌద్ధము ప్రపంచమంతట వ్యాప్తి జెందెను. హింసాతత్వము ప్రపంచమును మట్టుపెట్టచున్న కాలంలో శాంతమూర్తి మహాత్మాగాంధీ యవతరించి సత్యము, ధర్మము, అహింస, మనోవాక్కాయ కర్మల యాచరించి స్వరాజ్యము దెచ్చెను ; మతవైషమ్యములకు ఆహుతి య్యెను, మతమువైరుధ్యమున కాస్కారము కాకుండ, సోదర, సామరస్య, సహన, సమతా భావముల పెంపొందించు నట్లు జేయవలెను, మతము పేరున జరుగు దురంతములంత మొందవలెను, ప్రతి మానవుడు తన సత్ప్రవర్తన వల్ల తన మతమును సార్థక మొనర్చిన మత సంస్కృతి పరిపక్వమైనట్లే.



రచయిత్రి

సంస్కృతుల సమన్వయము - భావిస్వరూపము

కళలు మానవుని భావ పరంపరకు రూపకల్పన జేయును, పాశ్చాత్యశిల్పమున బాహ్యజగత్తు ముఖ్యము ; ప్రాచ్యశిల్పమున భావము ప్రధానము. ఆధునిక భారతీయ శిల్పము ప్రాశ్చాత్యశిల్ప సమ్మిశితమే ; మన వాస్తుకళయు ప్రాక్ప్రతీచీ శిల్పసమన్వితమై యున్నది. ఇది. సహనమును దెల్పును. సింహళము, బర్మా. చైనా, జపానీయ శిల్పము బౌద్ధమయ్యు, స్వదేశీ ఛాయలగల్గి యున్నది. విగ్రహనిర్మాణ కళలో మన దేశములో పాశ్చాత్య పద్ధతు లనుకరింప బడుచున్నవి. చిత్ర కళయందును ప్రాక్ప్రతీచీ సమన్వయము గోచరించుచున్నది. నాట్యము, సంగీతముల కలయిక నుండి నూతన సంస్కృతి యేర్పడ వచ్చును. రేడియో సినీమా పరిశ్రమ యీ కళల వృద్ధి జేయుచున్నవి. ఉదయశంకరుని "కల్పన" చిత్రము భారతీయ జీవితమునకు, కళా సంస్కృతుల ప్రతిబింబము, శివతాండవము నుండి నేటి వరకు నాట్యపరిణతిని యీ చిత్రము చిత్రించినది. మరియు రైతులు నాగలి దున్నుచు పదముల పాడినట్లే, ట్రాక్టరును నృత్యోత్సవాలతో ఆహ్వానింతురు. కళాభి వృద్ధికై చిత్రశాలలు, సంగీత, నాట్యశిక్షణ, ప్రదర్శన శాలలు దేశమంతట యేర్పడవలసి యున్నది.

విశ్వసాహిత్యములో భావమునకు యెక్కువ ప్రాముఖ్యము గల్గినది. సులభ గద్యపద్యములలో సంఘ జీవనమందలి దైనందిన కృత్యములను, ప్రకృతిని వర్ణించుట పరిపాటి. ఇదే ప్రజాసాహిత్యము, ఇది పురాతన కాలమున లేదనుటకంటె కాలవాహినిలో లీనమైన దనుట సమంజసము. సారస్వతములో మహత్తర రచనలుగా నిల్చినవి - వేదపురాణములు, కాళిదాసు, షేక్స్పియరు రచనలు, కన్ఫ్యూసియస్ ప్రవచనములు. మధ్యయుగమునాటి ప్రజాసాహిత్యము, ఆంగ్లేయుల బేలడ్సు, చైనీయుల డ్రమ్స్టోరీ, ఆంధ్రుల బుఱ్ఱకథలు, చాటువులలో సజీవమైయున్నవి. ప్రస్తుతము ప్రజాసాహిత్యము చాల వృద్ధి చెందుచున్నది. శతక వాఙ్మయముతో ప్రారంభమై వేమన రచనలు వీరేశలింగముగారి కృతులతో పరిణతి గాంచినది యాంధ్ర సాహిత్య సంస్కృతి. గురజాడకవి "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" మొదలగు రచనలు జాతీయ ప్రబోధం సల్పినవి. దుగ్గిరాల వారిది ప్రజాసాహిత్యమే. కాని ఆధునిక సాహిత్య మోహములో శాస్త్రీయ సాహిత్యము వెనుక పడరాదు.

ప్రస్తుతము దేశములో విద్యావిధాన మెట్లుండ వలెనను ఒక పెద్దసమస్య. పరాధీనత వల్ల మందగించిన భారతీయ [illegible] చున్నది. ఇంగ్లాండు ఆమెరికా రష్యాలలో వలెనే, మన దేశంలో వయోజన విద్య వ్యాపింప జేయవలెను, ప్రతి వ్యక్తి వార్తాపత్రికలు, రేడియోల ద్వారా సంగతులు గ్రహించ గల్గిన, విద్యా సంస్కృతి పరిణతి నందినట్లే. నిరక్షరాస్యత నిర్మూలింప బడవలెను, యూరపులో సాధారణంగా మూడు భాషలు వచ్చియుండును-మాతృభాష, లాటిను, విజ్ఞానార్జనకై ఫ్రెంచి, జర్మను, యింగ్లీషులలో నేదేనియొక భాష. అదే విధముగా భారతీయులకు మాతృభాష హిందీ లేక సంస్కృతము. విదేశీయ విజ్ఞానమునకై ఇంగ్లీషు అవసరము.


మానవ సంఘ సంస్కృతి భావిస్వరూప మెట్లుండుననున దొక సమస్య, కల్పన చిత్రములో వాస్తవిక జీవితమునకు మానవుని ఊహా జగత్తుకు గలవ్యత్యాసము, పతనావస్థయం దున్నపాలకులు మరో జగత్తు నిర్మించుటకు త్వరపడుచున్న ప్రజాశక్తులు జూప బడినవి, చరిత్ర సచేతనమగుట మానవ సంస్కృతిని వివిధ ప్రాంతీయముగ విభజింపరాదు. ప్రపంచములో సాంఘికముగ జరిగిన మార్పుల సమన్వయము వలన శాంతి యాధారముగ నూతన సంస్కృతి వికసించ వలెను ; అది అత్యుత్తమమై యుండ వలెను. ★

పొడుపు కతలు

బాల బాలికల మనస్తత్త్వమునకుం దగినవి ఆట పాటలు. అందువలననే పాపము! మన పాపలు గద్యపద్యములను సైతము పాటలుగా పాటించి నీటుగా దీటుగా పాడుట పరిపాటి అయినది. అట్టి తరి తాళపు గొళ్ళెములం గూడ తగిల్చి మేళవించుట కనుకూలించునవి ఆటవెలఁదులు మాత్రమే

ఆట వెలఁదుల తేట మాటలతో పొడుపు కతలను గూడ పొందుపరచినచో, చిట్టి పాపలు చెంగలింతురు. నేఁటి కిట్టివి ఎనుబదింటిని వెలువరించిన ఆంధ్రమహిళను అభినుతింతును.

—రచయిత.



శ్రీ చదలవాడ కోటినరసింహము

ఆది మతము మానవాభ్యుదయమ్మది
దాని వక్త యెవఁడొ తలఁపనగునె?
అన్య మతములందు నది ద్వేషమందదు
దీనిభావమేమి? తిరుమలేశ!

భార్యకన్న యతఁడు ప్రాయమందునఁ జిన్న
మూర్తిపూజ కతఁడు మూతి విఱిచి
మతము నొకటి చాటి వెత మాన్పె నానాఁటి
దీనిభావమేమి? తిరుమలేశ!

పరిణయమ్ముగాని పడఁతి గర్భమ్మున
నవతరించెఁ; గర్ణుఁ డతఁడు గాఁడు
శాంతిదూత యతఁడు, సమరమ్మొనర్పడు
దీనిభావమేమి? తిరుమలేశ!

పుట్టి, ముక్తికాంతఁ బట్టి, గిట్టిన యట్టి
దినము లెన్న నొక్క తిథిగ నున్న
వాని నెల్ల దేశవాసులు నుతియింత్రు
దీనిభావమేమి? తిరుమలేశ!

పాదచారి యగుచుఁ బల్లెల బస్తీల
దాతలైన వారి దాపుఁ జేరి
ధరణి దానమడుగుఁ దనకుఁ గా కొరులకు
దీనిభావమేమి? తిరుమలేశ!

గుఱ్ఱ మెక్కి స్వారి గూడఁ జేయంగలడు
ఈఁదఁగలఁడు, జనులనేలగలడు
పూరుషోత్తముండు, భూమీశ్వరుఁ డతండు
దీనిభావమేమి? తిరుమలేశ!

కాగిత మ్మొకింత కలవయ్యెనో యేమొ!
కాయమీఁద నతఁడు వ్రాయుచుండు
తాత చేఁత రోఁత, తగ దన నేనెంత!
దీనిభావమేమి? తిరుమలేశ!

తాత తండ్రియైన ధవున కర్ధాంగిగాఁ
దల్లి తల్లి యైన తరుణి దొరకె
వావి వరుస లుండు వైవాహికమె యిది?
దీనిభావమేమి? తిరుమలేశ!

జవాబులు:- 1. హిందూ మతము, 2. మహమ్మదు, 3. క్రీస్తు, 4. బుద్ధుడు, 5. ఆచార్య వినోబా, 6. నెహ్రూ, 7. బ్రహ్మ, (తలవ్రాఁత) 8. విష్ణువు-లక్ష్మి.



DELAYED PERIODS?
BANISH STRESS AND ANXIETY. WHEN NATURE FORGETS START USING THE FAMOUS
EACH PILL CONTAINS
Aloes 84 mg. Senna 30 mg. Asafoetida 30 mg Galbanum 30 mg Myrrh 30 mg Ferrisulphate 90 mg. Saffron 12 mg. Mace 24 mg. Amber 4 mg Quinine Sulphate 30 mg Papain 24 mg.
DEVI Pills
Devi Pills
DEVI Pills
1 "DEVI Pills" are specially suitable for DELAYED, SCANTY, PAINFUL and ARRESTED MENSES but are considered for such DISORDERS as AMENORRHEA, DYSMENORRHEA & LEUCORRHEA.
2 DEVI PILLS act quickly & efficiently under all circumstances and non injurious to health.
Dosage. 1-2 TABLETS TWISE A DAY
Packing. VIAL OF 14 AND 28 TABLETS.
(HALF COURSE & FULLCOURSE)
Price Rs 6/8/- and Rs. 11/- PLUS POSTAGE
SOLD EVERYWHERE
GRAMS "ORCAS" (ESTD 1946) PHONE 55357
MFRS SEENU & CO., 28, THANDAVARAYA GRAMANI ST., MADRAS - 21.
Branch - SINGAPORE-8, (CEYLON) agents - N C M STORES, 82, MAIN STREET, COLOMBO-11,
(ADVT PERMITTED UNDER G O MS NO 1121 HEALTH.)
Sarathy Bros.



బాలరాజ్యం

శ్రీ బి. వి. నరసింహారావు, బి.ఏ., బి.ఇడి.,

నిన్ననె కద వచ్చాడు
కన్నతల్లి కడుపు పండి!!

చిన్నబాబు,
కన్నబాబు,
ఎన్నొ వెలుగు
లున్న, బాబు,

పున్నమి, రే
వెన్నెలసరి,
కన్నుల, సిరు
లున్న, బాబు,

మొగ్గల, నును
సిగ్గుకు, లే
బుగ్గల, తా
వొగ్గు, బాబు!!

ఎల్లరికిని,
అల్లరి, లే
మల్లియ, లెద
జల్లు, బాబు!

చిలుకల, పలు
కుల, కిలకిల
చిలికి, అంద
ములుకు, బాబు!

బుడిబుడి, వడి
వడి, అడుగుల,
తడబడు, చిరు
నడల, బాబు!

నిన్ననె కద వచ్చాడు
కన్నతల్లి కడుపుపండి!!!

ఆశ్చర్యం!!! అప్పుడే ఒక బాలరాజ్యం స్థాపించుకున్నాడు, తనలాంటి వాళ్ళందరితో కలిసి. చీకూ చింతా లేకుండా చిదానందుల్లా కాలం బుచ్చుతున్నారు అక్కడి బాల లంతా.

ఇది చూచి పెదలు కొందరు “

రాజ్యమా! అర్థంలేని మాట” అంటూ తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ఎందుకంటే అన్నీ తెలిసిన, నాగరీకమెరిగిన మనం పిల్లలకు కావలసినవన్నీ సమకూర్చి పెడుతున్నాం మనకై ఏర్పరుచు కొన్న రాజ్యంలో మనతో పాటే

ప్రత్యేక రాజ్యంకావాలా?" అని వారి ప్రగాఢవిశ్వాసం కావచ్చు.

ఈ మాటల్లో కొంత నిజమూ ఉంది, కొంత అబద్ధమూవుంది. మన కుద్దేశింపబడిన, మనకు సరిపడినవాతావరణంలో పిల్లల్నీ మనతో పాటే ఉండమంటున్నాం. నిజమే కాని అది వాళ్ళకెంత ఇరుకుగా, ఇబ్బందిగా ఉంటుందో మనం గ్రహించడంలేదు. పైగా వాళ్ళకు కావలసిన వన్నీ ఉదారంగా సమకూర్చి పెడుతున్నామనిఅనుకుంటున్నాం. అది నిజంకాదు. పిల్లలకు ఏం కావాలి? ఎందుకు కావాలి? ఎప్పుడు ఏంకావాలి? వాళ్ళ సంపూర్ణ వికాసానికీ, సర్వతోముఖాభివృద్ధికీ ఎలాంటి కార్యక్రమాలు అమలు జరగాలి? ఇవి నిర్ణయించి విజ్ఞతతో ఆచరణ పరచడం అంత సులభసాధ్యమైన పనికాదు.

ప్రపంచంలో అనేక ప్రభుత్వాలు నేడు భావిపౌరులైన బాలల విషయాన తగిన శ్రద్ధ వహిస్తున్నాయి. మెచ్చుకో తగిన వృద్ధి సాధిస్తున్నాయి. భారత ప్రభుత్వం కూడ బాలల భావ్యున్నతికై తన కృషి ప్రారంభించింది.

పిల్లల్ని గురించి ఆలోచించడమంటేనే పిల్లల పవిత్ర మనస్కతను కొంత పంచుకోవడమన్నమాట. ఆరోగ్య భావాల్ని కొన్ని అలవర్చు కోవడ మన్నమాట. ఇంక పిల్లల పరిమళ పరిచయంలో కమ్మగా కాలం వెళ్ళబుచ్చ గలిగితే, బాలరాజ్యంలోనే బ్రతుకంతా వెళ్ళబుచ్చగలిగితే ఆ అద్భుతానుభూతిని యింకవర్ణించ గలమా!

బాలరాజ్యమంటే కాంతికీ శాంతికీ నిలయం. అందానికీ, ఆనందానికీ ఆలవాలం. సాధ్యా సాధ్యాలకు అభేదం!

చుక్కలన్నీ మాట్లాడును
సూర్యుడు చల్లగ నుండును
మక్కువ నాకస మందరి
నక్కన జేర్చునిక ముద్దిడు:

గాలి చెడదు ఆ తావున
పూలు వాడ వా తావున:

కలుషిత వాతావరణంలో కాలం గడిపే మనకు, కలహాలతోనే కాపురముండే మనకు ఆ పవిత్ర ప్రాంగణ ప్రవేశానికి, ఆ బాలరాజ్య సందర్శనానికి అవకాశార్హత చిక్కుతుందా? అయినా యథోచితంగా మనం ఆ బాల రాజ్యం గురించి బాధ్యతగా ఊహించుకుందాం. ఉత్తేజం

మనం సంతరించుకొన్న కృత్రిమాలన్నీ బాలల పరిచయావసరాన పటాపంచలై పోతాయి. మనకున్న సర్వ భేషజాలు, గర్వాలు దెబ్బతిని తీరతాయి.

నిజంగా బాలలంతా పరంపరగా

ఎందుకుందురు కొంద రెరుపుగ
కొందరేమో నలుపుగాను?
ఎందుచేతను వాడుచుందురు
అందరూ కుడిచేతి నెక్కువ?

చుక్కలెక్కడ దాగు పగలుల?
సూర్యుడెక్కడి కేగు రాత్రుల?
పూలకెందుకు రంగు లుండును?
గాలి ఎందుకు వీచు చుండును?

ఆక లందరికుండు నెందుకు,
అన్న మందరి కుండ దెందుకు?--

అని లక్షప్రశ్నలు, యక్షప్రశ్నలు మనమీద కురిపిస్తే మనం తబ్బిబ్బుగాక ఏమవుతాం? తలక్రిందులు గాక ఏం సమాధానం చెపుతాం?

ఒకసారి మా మల్లిబాబు అలాగే చేశాడు. గొడ్లు కాచే గోపాలాన్ని "ఈ బొమ్మలు చూడు" అనిపిలిచి తనకు వాళ్ళతాత కొనితెచ్చిన బొమ్మల పుస్తకం చూపిస్తూ "అదేమిటి? ఇదేమిటి? చెప్పుకో" అంటూ ప్రశ్న లడగడం ప్రారంభించాడు. అక్షరంముక్కరాని ఆ గోపాలానికి బొమ్మలేమి అర్థమవుతాయి? పాపం! వాడేమీ చెప్పలేకపోయాడు. మా మల్లిమాత్రం అక్షరాలుగుర్తుతెలియక పోయినా, బొమ్మల్ని చూచి గమ్మత్తుగా బోలెడంత చదువుతూ వుంటాడు. బొమ్మల్తో మాట్లాడుతూ మురిసి పోతూ వుంటాడు.

ఇంకోసారి బ్రహ్మయ్య ఆవుని పాలు పితుకుతుంటే దగ్గరకువెళ్ళి "ఆపొదుగులోకి పాలు ఎక్కడ నుంచి వస్తాయి?" అని చిక్కు ప్రశ్న వేశాడు. వాళ్ళమ్మ గారెలు వండుతూవుంటే మెల్లగావెళ్ళి మల్లి "అమ్మా! నూనెలో వేస్తే గారెలు ఎందుకు చుయ్ మంటాయి?" అని గట్టి ప్రశ్న వేశాడు. అలా బ్రహ్మయ్యను, వాళ్ళమ్మను తన ప్రశ్నలచేత తబ్బిబ్బుచేసి విజయగర్వం ప్రకటించుకున్నాడు మా బాబు.

అందరినీ ఓడించడం సర్దాకాదు మా మల్లికి. అన్ని సంగతులూ అడిగి తెలుసుకోవాలనుదే అతనికి సరా.

అందుకే అన్నీ పరీక్షగా చూస్తూవుంటాడు. చూస్తూన్నప్పుడు మనస్సుకి తట్టింది చప్పున ఎదటివాళ్ళని అడుగుతూవుంటాడు. దానికి సమాధానం చెప్పలేక గింజుకు చచ్చిపోతూ వుంటారు వాళ్ళు.

మా బాబుకి నచ్చినరీతిని సమాధానాలు, చమత్కారాలు, కథలు. గమ్మత్తులు చెప్పగలవాడు వాళ్ళతాత ఒక్కడే. "అమ్మకంటె కూడ బలే కథలు చెప్తాడు అమ్మనాన్న" అంటాడు బాబు. తీరిగ్గా, తీయ తీయగా అన్నీ చెప్తాడు వాళ్ళతాత.

"తాతం తైతే
తలకొక పాగా
కళ్ళకు జోడూ
కాళ్ళకు జోడు
చేత బెత్తమూ
గ్రామ పెత్తనము,
చింతచెట్టు తొర్రలోన
చిలక ఉన్నదీ
తాత బోడిబుర్రమీద
పిలక ఉన్నదీ,

అని నా పాటలు పాడి మా బాబు వాళ్ళ తాతయ్యను గౌరవసత్కారం చేస్తాడు. తనంతవాడౌతానంటే తాతయ్యకు యింకేం సంతోషమేకదా, కావాలనే నేను మా బాబుకి వాళ్ళతాత పేరే పెట్టాను. ఇది మా బాబు తల్లికి ఎంతో సంతోషకరమైన విషయం.

మా బాబికి వాళ్ళతాతకీ గొప్పనేస్తం ఆరువత్సరాల బాబికి అరవైవత్సరాల వాళ్ళతాతకు వయసులో భేదం సున్నా మాత్రం.

కాలంతీరిన తాతకు
కాలం తీరాన మనుమనితో ఒప్పిననేస్తం:

కథచెప్పవు తాతా, ఒక
కథచెప్పవు? కథ చెప్పవు?

ఏ కథ?
అది నీ యిష్టం.
ఎంతో చక్కని,
అదె అదె

బాలరాజ్య మొకటి-
ఉంది-
చాల పేరుమోసి
ఉంది-

ఘటికుడవే బాబు! నీవు
కథకు వంతగలుపుతావు?

అడురానులే కథకిక
ఆపకుండ చెప్పు తాత!

ఏడు సాగరాల నడుమ
ఎంతో గొప్ప దీవి ఉంది
దీవినిండ బాల జగతి
దివ్యముగా వెలసి ఉంది

తాత వర్ణించి చెపుతూవుంటే బాబు మంత్ర ముగ్ధుడై మౌనబద్ధుడై వింటున్నాడు.


రాజు అంటు అచటలేడు.
రా జెవడికి వాడె: చూడు
పనులన్నీ చక చక మని
పరుగులతో జరుగుచుండు:

పాడు కుంటు, ఆడుకుంటు
పరవశాన బాలలంత
తీరికెరగకుండ, దినము
తీరమంత తిరుగుచుంద్రు:

పిట్టనైన లోకువెంచి
కొట్టబోరు అటనెవ్వరు:
పువ్వునైన, నవ్వుతాల
పుణికబోరు, అటనెవ్వరు.

భయమ్ము, బెంగ, కలత, వెలితి
బాల లచట ఎరగ రెవరు
అందరికిని అన్ని ఉండు
అందరొకటిగానె ఉండు.

అలా బాలరాజ్యం వర్ణన, కథాసరిత్సాగరంలా కట్టల్లు



అల్లరి చెయ్యడం పిల్లలకు సహజమే. అబద్ధం ఆడడం మాత్రం సహజంకాదు. అబద్ధాలు వాళ్ళు పెద్దల్ని చూచి అనుకరిస్తారు.

కల్ల కపటమూ ఎరగరూ, సరి
మాయ మర్మమూ ఎరగరూ, మరి
అబద్ధమన్నది ఆడుటెరుగరూ
అల్లరి చేయుట పిల్లల నైజమె.
ఎల్లవేళలా ఆనందంతో
చిల్లో బొల్లో మంటు ఉందురూ.
కొట్టు కొన్ననూ, తిట్టుకొన్ననూ
అట్టెమరచిపోయీ, పిల్లలు
గట్టి చెలిమి నోయీ, కూర్చుక
పట్టలేని హాయీ, పొందుచు
పిట్టలట్లు విహరించు చుందురు.

అందుకే వాళ్ళని పెద్దలకంటే బుద్ధిమంతులని అనాలి.

పెద్దలబుద్ధీ తరుగు చుండునూ
పెరుగుచున్న కొలదీ :
పెద్దలలోనే వాదా లెన్నో
పెరుగుచున్నకొలదీ
పెద్దలలోనే భేదా లెన్నో.
పెరుగుచున్న కొలదీ.

బాలరాజ్యానికి ప్రవేశార్హత ఒక్కసారి లభించిందంటే రెక్కలు గట్టుకొని ఎగిరిపోవాలని ఉబలాట పడతాం. ఊహాజగత్తులో కవితా రూపాల క్షణక్షణం అవతారాలు ఎత్తగలుగుతాం. దివ్యసీమలన్నీ తిరిగి తిరిగి, భవ్యదృశ్యాలన్నీ చూచిచూచి ఎప్పుడో తిరిగివస్తాం. వస్తూ ఊరికే రాం. కొంతశాంతి, రుచి, వాసన కూడా తెచ్చుకుంటాం. మన నిస్సారమైన బ్రతుకులనిండా నింపుకొని సారవంతం చేసికుంటాం.

అందుకే మన నవభారత నిర్మాత అయిన పండిత జవహరునేత పలసినన్నిమార్లు బాలరాజ్య సందర్శనంచేసి, బలాన్నీ, ఉత్సాహాన్నీ కూర్చుకోవడం జరుగుతోంది. పిల్లలతో హాయిగా, తీయగా కాలక్షేపం చేసే సమయాన పండితునికి బాలలతో తనకుగల భాషాభేదం గాని, వయః ప్రభేదంగాని స్ఫురణకే రావు. అవరోధాలుకావు. నెహ్రూ తాత బాలల గురించి ఎన్నెన్నో రుచిరస్వప్నాలను కంటూ ఉంటాడు. అవన్నీ సఫలీకృతమైననాడు భావిజగతికి, బాలజగతికి కలిగే అభ్యున్నతులు అనేకం.

నాగేశ్వర శిశువిహార్

ఆంధ్ర మహిళా సభ

మధ్యతరగతి కుటుంబీకుల పిల్లలకు (మూడు మొదలు ఏడు సంవత్సరములలోపు వారికి) విద్యావినోద కేంద్రము

శ్రవ్యనాటిక :

మహాశ్వేత

శ్రీ పణతుల రామచంద్రయ్య

పాత్రలు :

మహాశ్వేత.	సమరసేనుడు.
శిఖివాహనుడు.	నందరాజు.
చాణక్యుడు.	మయూరుడు.
చంద్రగుప్తుడు.	మహాపద్మనంద చక్రవర్తి—తదితరులు.

మహాశ్వేత : (తలుపుకొడుతూ) తమ్ముడూ, శిఖివాహనా !

శిఖి : (అర్ధనిద్రలో) ఎవరూ?

మహా : నేనురా, మహాశ్వేతను.

శిఖి : నువ్వా అక్కా? - వస్తున్నా. (తలుపుతీసిన చప్పుడు) శివాలయం రానిచ్చిందా మహాశ్వేతా? .... రోజు రోజుకూ నిశాచారిణివై పోతున్నావు. అర్ధరాత్రయిందే, ఇంతవరకు ఏమిటీ శివపూజలు? .... ఎంతవరకు ఈ కఠోర దీక్ష?

మహా : తమ్ముడూ. ఎంతవరకా?.... లక్ష్యసిద్ధివరకే !

శిఖి : లక్ష్యసిద్ధి ! ఇదేనా లక్ష్యం? లక్ష్యసిద్ధికి దీక్షధరించక ముందు ఆ లక్ష్యం ఎంతవరకు విశిష్టమయిందో ఆలోచించావా అక్కా? అది జగత్కల్యాణానికి ఎంతవరకు మార్గమో గమనించావా?

మహా : (నవ్వు) నాయనా ! అది జగత్కల్యాణానికి మార్గం కాదంటావా? (ఆవేశంగా) రాక్షస సంహారం, జగత్కల్యాణం కోసంకాక మరెందు కంటావు? .... ప్రజల నెత్తురుతో తమ శరీరాలను పెంచుకుని, ఆ శరీర భారంతో భూదేవిని క్షోభపెట్టే రాక్షసులను హతం చేయబూనుకోవడం జగత్కల్యాణం కోసం కాక మరెందు కంటావు?

శిఖి : అక్కా ! ఏమిటీ ఆవేశం?.... చూడూ, ఇంతలోనే నీ కళ్లెలా జ్యోతులైనాయో !

మహా : జ్యోతులుకాదు - మంటలు. అవి పవిత్రమయిన త్రేతాగ్నులు కావు. కోటి జీవులను కడుపులో నింపుకున్న శ్మశానపు మంటలు. శిఖివాహనా ! ఈ మంటలను ఆర్పివెయ్యాలంటే నీళ్ళు పనికిరావు. శత్రువుల శరీరాల్లోని రక్తంకావాలి.

శిఖి : మంటలను రేపుకుని, వాటిని ఆర్పలేం. అలమటించడం కంటె, ఆ మంటలను రేగనివ్వని చల్లదనాన్ని హృదయంలో సృష్టించు కోవటం ఉత్తమంకాదా?

మహా ; తమ్ముడూ ! పొరబడుతున్నావు. వెయ్యిహోమంత ఋతువులైనా సరే. ఈ మంటలను రేగ కుండా చెయ్యలేవు. అభిమానాభావంతో; కౌటిల్యంతో చల్లబడిపోయిన శత్రువుల నెత్తురే ఆపని చెయ్యగలుగుతుంది.

శిఖి : అక్కా ! మగధరాజ్యంలో మరొక భారతయుద్ధం చెలరేగటమే నీ ఆశయమా?

మహా : భారతయుద్ధం కాదు; మరొక దక్షయజ్ఞం అవసరమైనా సరే—

శిఖి : నీ సంకల్పం సిద్ధిస్తుందనే అనుకుంటున్నావా?

మహా : తప్పక....శిఖీ. అమాయికుడివి. మానవశక్తిపై నీ కింకా పరిపూర్ణ విశ్వాసంలేదు. అసహాయురాలనైన నావల్ల ఏమవుతుందని అనుకుంటున్నావుకదూ? పగబట్టిన ఆడత్రాచు యోజనం దూరమైనా గడచికాటు వేస్తుందని నీకు తెలీదు. ఆ సత్యాన్ని నిరూపించడానికే నే నీ దీక్షను స్వీకరించాను, నిత్యహోమంతో శివోపాసన చేస్తున్నాను. ఈ లక్ష్యం తప్పక సఫలీకృత మవుతుంది ! తప్పదు !

శిఖి : ఎవరిమీద అక్కా నీపగ?

మహా : నందరాజు మీద. అధికారమదంతో అంధుడైన నందరాజు మీద. ఒకనాడు సర్వ సంపత్శోభాయమానమై వెలసిన మగధరాజ్యానికి నేడు నరకాసురుని

వలె దాపురించిన నందరాజుమీద...

శిఖి : నాకేమీ అర్థం కావటంలేదు. అంత పగ పూనడానికి కారణమేమిటి?

మహా : కారణం లేకపోలేదు శిఖీ! .... ఇంత వరకూ హిమాలయాల్లో తపోనిష్ఠలో గడపిన వాడివి కాబట్టి నీకేమీ తెలీదు.

శిఖి : ఏమిటది?

మహా : అదొక విషాదగాథ. మీబావ.... సమరసేనుడు నీకు సరిగా జ్ఞాపకం లేదనుకుంటాను.

శిఖి : జ్ఞాపకం లేకేం! (విషాదంగా) ... బావ! .... ఆ శాంత గంభీరమూర్తి !....

మహా : అవును తన జీవితమంతా రాజకుటుంబ క్షేమానికి ధారపోశాడు. మహాపద్మనంద చక్రవర్తి కాలంలో ఆయనకు కుడిభుజంగా మెలగి, సేనాధి పతియై....

★

(పెద్దగా గోల బయలుదేరి మెల్లగా తగ్గిపోతుంది)

వంది : స్వస్తిశ్రీ విజయాభ్యుదయ, మహాపద్మ నంద చక్రవర్తీ!

సభ్యులు : జయహో!

ప్రధాని : విజయోత్సవ సమాగతులయిన ప్రజలందరికీ సమ్రాట్టు తరపున సుస్వాగతం. శ్రీ శోభితమైన మగధభూమి పైకి సామ్రాజ్య కాంక్షతో దండెత్తిన యవనులను పరాక్రమించి తరిమివేసిన మన సైనికులను అభినందిస్తున్నాము. ఈ యుద్ధంలో పరాక్రమం ప్రదర్శించిన మన వీరులను, అర్హతలను బట్టి నేడు సన్మానించ దలచాము.

(హర్షధ్వానాలు)

చక్రవర్తి లేమిటో చెప్పబోతున్నారు

చక్రవర్తి : (గంభీరకంఠం)ఈ యుద్ధంలో అసమాన ప్రతిభ చూపిన ఒక వీరునికి ఘనసన్మానం చేయ సంకల్పించాము. ఆ సన్మానానికి అర్హుడైన వీరుణ్ణి ఎన్నుకొమ్మని సభ్యులను కోరుతున్నాము.

ఒకసైనికుడు : ప్రభూ! దళవాయి సమరసేనుడే ఈ సన్మానానికి తగినవాడు. ఉధృతంగా యవన సేనలు వచ్చి పడినప్పుడు, వానిమధ్య మన సేనాని చిక్కుపడినప్పుడు—అసమాన శౌర్యంతో ముందుకు దూకి వ్యూహభేదనం చేసి మనకు విజయం చేకూర్చిన సమరసేనునికే ఈ సన్మానం చెయ్యబడ వలెనని నా భావన.

చక్ర : సభ్యుల అభిప్రాయం?

సభలో ధ్వానాలు : "సమరసేనునికే సన్మానం" "అతడే తగినవాడు"

చక్ర : జయోస్తు సమరసేనా! ఆకసంలో మగధ పతాక రెపరెప లాడేవరకు, మగధ రాజ్యానికి నీ సేవ శ్రీరామరక్ష కావాలి. నేటినుండి నీవు దళవాయిగాకాదు సేనాధిపతిగా రాజసేవ చేయాలని మాకోరిక.

(హర్షధ్వానాలు)

సమరసేనుడు : మహాభారాన్ని సమ్రాట్టు నాపై మోపుతున్నారు. ప్రజలందరి సహకారంతో ఈ గురుతర బాధ్యతను నిర్వహిస్తాను.

,, నేపథ్యంలో

"రాజాధి రాజాయః ప్రసహ్య సాహినే
నమో వయంవైశ్రవణాయ కుర్మహే"

చక్ర : సమరసేన సైన్యాధిపతీ—

సభ్యులు : జయహో !

★

మహా : విన్నావా, శిఖీ ! ఆనాడు మీ బావకు జరిగిన మహాసన్మానాన్ని, నేను బ్రతికి వున్నంతవరకు మరచి పోలేను తమ్ముడూ; మరచిపోలేను.

శిఖి : అంతటివాడా బావ ? ... ఆ సన్మానోత్సవంలో దూరానవున్న తమ్ముడు మీమనస్సులో మెదలనేలేదా, అక్కా ?

మహా ; లేదు తండ్రీ. మరచి పోలేదు. కాని, సన్మానోత్సవం కోసం, మహత్తర తపోనిష్ఠలోవున్న నిన్ను కదిలించడానికి మన సొప్పలేదు,

శిఖి : తరువాత ఏం జరిగింది ?

మహా : ఆనాటినుంచి సేనాధిపతిగా మగధ సామ్రాజ్య లక్ష్మికి మంగళ హారతులు తీశాడు మీ బావ. మహా పద్మనందులు నాటిన మగధరాజ్య వృక్షానికి మీ బావ శౌర్యమే కంచె అయింది.... ఐతేయేం........

శిఖి : ఏమిటి? అక్కా ! నీ మాటల వెనుక నుంచి ఏదో బరువు భాష వినవస్తోంది. అమంగళం పలుకుతున్నావు. ఏమయింది. తరువాత?

మహా : ఏముంది? తరువాత నాలుగేళ్లకు మహా పద్మనందులు కాలం చేశారు.... అంతే! విశాల సామ్రాజ్యానికి దీపం పెట్టిన మగధ వీరుడు మీ బావ. తన రాజు మరణిస్తే ఒక భీరువులా ఏడ్చాడు, నాటి నుంచే మీ బావకు గడ్డు రోజులు దాపురించాయి.

శిఖి : ఏం ? ఆ తర్వాత గద్దె నెక్కిన నందరాజుతో బావకు విరోధం కలిగిందా ?

మహా : ఎందు కక్కలుగదు తమ్ముడూ ? రాజ్య వినాశకుడు రాజూ, రాజ్య రక్షకుడు సేనాధిపతీ. విరోధానికింకేంకావాలి ? తన దుష్కృత్యాలకు అడ్డు తగులుతున్నాడని-మీ బావను హత్య చెయ్యడానికి సంకల్పించాడు నందరాజు.

శిఖి : అతడి కేం అపకారం చేశాడని ?

మహా : పిచ్చివాడా ! మబ్బుల్ని చూసి నాట్యమాడే నెమిలి, బోయవాడి కేం అపకారం చేసింది ?

శిఖి : ఆఁ ! !

మహా : అల్లదే చూడు.

★

నందరాజు : ఛీ ! నా దారి కడ్డంగా వున్న యీ నాగదారి పొదను నిముషాలమీద నాశనం చెయ్యాలి. సమర సేనుణ్ణి తుదముట్టించిన వాణ్ణి బంగారుతో అభిషేకిస్తాను.

ఎవరక్కడ ?

మయూరుడు : జయం నందరాజుకు !

నంద : మయూరా ! నా కొక ఉపకారం చెయ్యాలి.

మయూ : ఆజ్ఞ.

నంద : ఆ ఆజ్ఞ కఠినమైతే ?

మయూ : అగ్గిలో దూకమన్నా సరే.

నంద : ఈ రాత్రికి రహస్యంగా ఒక చోట— నేను చూపించిన వ్యక్తిని హత్య చెయ్యాలి.

మయూ : అంత మాత్రానికేనా ?—

నంద : జాగ్రత్త. రహస్యాన్ని వేయికళ్ళతో కాపాడాలి.

మయూ ; ఒక్కమాట—ఎవరావ్యక్తి ప్రభూ?

నంద : సేనాధి పతి సమరసేనుడు,

మయూ : ఆఁ ! ! సేనాధి పతి సమరసేనుడు ! !

నంద : ఏం, భయపడుతున్నావా?

మయూ ; క్షమించండి .... మిమ్మల్ని చేతులారా యెత్తి ముద్దుపెట్టుకున్న సేనాధిపతి మీదికి నా కత్తి పరుగెత్తలేదు ప్రభూ !

నంద : మయూరా ! నిన్ను శాసిస్తున్నాం.

మయూ : సేవకుణ్ణి శాసించగలరు. కాని మయూరుణ్ణి శాశించలేరు .... ప్రజాభ్యుదయాన్ని రూపుమాపే ప్రయత్నానికి, ప్రజ లేనాటికీ సహాయం చెయ్యరు ప్రభూ !

నంద ; ప్రభువు ప్రజల తందనాలకు దరువువేసే బానిస కాదు.

మయూ : అయితే అట్టి ప్రభువుకు అధికారం అడవి మృగాలమీదే... ప్రభూ ! మీ ప్రయత్నం ధర్మమైనదేనా? ప్రజల కోరికతో నిర్ణయమైనదేనా? ఏ లక్ష్యం కోసం, ఏశాంతికోసం ఈ హత్య తలపెట్టారో సెలవివ్వండి.

నంద : మయూరా ! నువ్వు సేవకుడివి మాత్రమే. ఆ మీమాంస నీ కనవసరం—

మయూ : క్షమించండి. నేను సేవకుడిగా మాట్లాడటం లేదు. విశాల మగధ సామ్రాజ్యానికి శ్రేయస్సుకోరే పౌరుడిగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ హత్యా ప్రయత్నం విరమించుకోండి. మగధప్రజలు మిమ్మల్ని క్షమించరు. సమరసేనుడు ప్రజల అనురాగాన్ని

చూరగొన్న ప్రేమమూర్తి.

నంద : ఆ ధర్మభీతి నీ కక్కరలేదు. రాజ్యరక్షణకోసమే ఈ ప్రయత్నం——

మయూ : రాజ్యరక్షణ కోసం ! ఏది రాజ్యరక్షణకోసం ! సవతి తమ్ముణ్ణి- రాజ్యమీక అడవుల్లోకి తరుమడం రాజ్యరక్షణ కోసమేనా? సామ్రాజ్యాన్ని తనబుజాలపై మోస్తున్న సేనాధిపతిని హత్యచెయ్య బూనటం రాజ్య రక్షణకోసమేనా? ఈమాటలతో ఎవర్ని మభ్య పెట్ట గలరు ప్రభూ?

నంద : సేవకా ! ! !

మయూ : కాదు. మయూరా అని పిలవండి.

నంద : ఛీ ! స్వామిద్రోహీ ! ముందు నిన్నే తుదముట్టిస్తాను...ఎవరకడక్కడ?...

మయూరుణ్ణి ఉరితీయండి !

(విషాద సంగీతము)

★

శిఖి : అక్కా ! ఏమిటీ దారుణం? ఒక రాజ భక్తుణ్ణి హత్య చెయ్యడానికి చేతులాడనినేరానికి బహుమానం మ-ర-ణ-శి-క్ష- ! సందేహంలేదే ! మగధరాజ్య లక్ష్మికి నరకాసురుడు నందరాజు.

మహా : ఒక్క మయూరుడేకాదు, ఈ ప్రయత్నంలో రాజాజ్ఞను ధిక్కరించి నందుకు కొన్ని వందలమంది ఉరితీయ బడినారు.

శిఖి : కొన్ని వందల మంది ! ! పాపం. అభాగ్యులు, మృత్యువు నోట్లో నోరులేని యేడుపు లేడ్చారు కాబోలు ! - ఐతే నందరాజు ప్రయత్నం ఫలించిందా?

మహా : ఆ నందరాజుకు పదహారు మంది తమ్ములు.

శిఖి : అన్నగారి మాటకు తాళంవేసే వాళ్ళేనా?

మహా : అవును ....అన్నగారి మనస్సును నెత్తురుతో అభిషేకించడానికి పూనుకున్న వాళ్ళు. (వెక్కి వెక్కి ఏడుస్తూ) మానవుల నెత్తురుతో మహారాజుల మనస్తాపాలు చల్లారేటట్లయితే, ఇదిగోనానెత్తుర్ని సమర్పించి రాజు గుండెలమీద తర్పణ చేసుకో మనేదాన్ని —— తమ్ముడూ !.... ....

శిఖి : అక్కా ! ఏమిటిది? ఏమయింది తర్వాత?

మహా : తమ్ముల సాయంతో మీ బావను తుదముట్టించాడు రాజు.

శిఖి : ఆఁ——

నంద : సమరసేనా !

సమ : మహారాజా !

నంద : దండయాత్ర చేయబోతున్నామని యవనుల శ్రీముఖం. ఇప్పట్లో వారి నెదుర్కొనటం మాకు సముచితంగా కనిపించటం లేదు.

సమ : కర్తవ్యం?

నంద : కొంతరాజ్యం వారి కప్పగించి, దాసోహమని సంధి చేసుకుంటాను.

సమర : తర్వాత మనం సన్యాసులమై పోవచ్చు.

నంద : సేనాధిపతీ !

సమర : సమరసేనుడి చేతిలో ఖడ్గమున్నంత వరకూ పాటలీపుత్రంపై యవనుల పతాక ఎగరడానికి వీల్లేదు.

నంద : అదినీ అధికారానికి వ్యతిరేకం సుమా !

సమర : క్షమించండి. నన్ను కని పెంచిన రాజ్యంమీదికి పరసేనలు దండెత్తి వస్తుంటే, సేనాధిపతిగా నేను గాజులు తొడుక్కుని కూర్చోలేను ప్రభూ.

నంద : విలాసాల్లో మునిగి తేలుతున్న మాకు ఈ అనవసర కలహం ఇష్టంలేదు.

సమర : భయపడ నక్కరలేదు. కడపటి నెత్తురు చుక్క నేల చిందేవరకూ మగధవీరులు కత్తిదింప కూడదు. విజయమైనాసరే—వీరమరణమైనాసరే ! శక్తి లేకుంటే మీరు అంతఃపురంలోనే వుండండి. మగధభూమిపైకి ఏ మొనగాడు దండెత్తి వస్తాడో చూస్తాను.

నంద : సేనాధిపతీ ! !

సమర : మగధ శౌర్యజ్యోతి అడ్డులేనిది.

నంద : సేనాధిపతీ ! !

సమర : ఆరిపోనిది !

నంద : సేనాధిపతి మంత్రాంగం మా కనవసరం.

సమర : సరే కానివ్వండి మాగధుల యుద్ధం ముందుగా మీతోనే జరుగుతుంది—

నంద : ఎవరితో మాట్లాడు తున్నావో తెలుసా—

సమర : భయంలేదు ప్రభూ ! చన్నీళ్ళలో మునిగిన తర్వాత చలికి జంకను.

నంద : స్వామిద్రోహీ ! ఇంతవరకూ వస్తావనుకోలేదు. నీ ఆటంకం కూడా తొలగించు కుంటాను. (గంట కొట్టిన శబ్దం: వెంటనే పదీ పదహారు కంఠాలు బిల బిల మంటాయి)

సమర : హ హ్హ ! నందరాజా ! తమ్ముళ్ళ నందర్నీ నాకోసమే పిలిపించావా?

రెండు మూడు కంఠాలు : అవును ! మా కత్తులకు నీ నెత్తురు కావాలట అందుకని.

సమర : హుం. పదహారుమంది సోదరులుఒకటై, ఒక్క వీరుణ్ణి తుదముట్టించడం కాదు గొప్ప. (ఒర నుంచి కత్తి లాగినచప్పుడు) ఇదే. క్షత్రియత్వానికి కడసారి పరీక్ష. ధర్మ మంగీకరిస్తారా. నేనూ ఒక్కణ్ణే; మీరూ ఒక్కరొక్కరే నిలవండి ఎవరి కత్తులకు నెత్తురులు కావలసిందీ మీకే తెలు....... (కత్తి విసిరిన చప్పుడూ బాధగా) అ ...బ్బా....అ—బ్బా

★

మహా : విన్నావా. తమ్ముడూ ! ఇదీ జరిగింది. నిజంగా మీబావ చనిపోలేదు. చనిపోయింది నేను .... పత్నీ హృదయం ఎంతగా రగిలి మండకపోతే, నేనా నీచుడిపై ఇంతపగ బూనానో ఆలోచించావా?

శిఖి : అక్కా ! ఏమయినా, నందుడు మనకు రాజుకదా ?

మహా : రాజభక్తుల్ని కొర్చిచ్చులో తోసిన ఛండాలుడు రాజుతున్న కొరివౌతాడుకాని రాజుకాడు.... తమ్ముడూ నా ప్రతిజ్ఞ మరల్చడానికి సూర్యుడు రేపట్నుంచి పడమర ఉదయించ వలసిందే. నంద సోదరుల నెత్తుటి కాలువలో నేను జలకేళి చెయ్యాలి.

శిఖి : కాని, అధర్మాన్ని నిరాయుధంగా ఎదుర్కొన మని బుద్ధుని సందేశం.

మహా : నిజమేనాయనా ! కాని, మదపుటేనుగు ములుగర్రతో మాటవింటుందా?

(దబదబ అడుగుల చప్పుడు)

చాణక్యుడు : నిజం పలికావు తల్లీ! మదపుటేనుగు ములుగర్రతో మాటవినదు.

మహా : ఎవరు? చాణక్యులవారు....

చాణ : అవును నేనే తల్లీ ! విన్నాను నీ గాథఅంతా.

మహా : నందరాజు మిమ్మల్నికూడా అవమానించాడని విన్నాను—

చాణ : అవునుతల్లీ .... అహింసా ప్రబోధంతో నందుడు కళ్ళు తెరిచేందుకు కొన్ని యుగాలు దాటాలి. క్షాత్రధర్మానికీ, అహింసా సూత్రాలకూ ఉత్తర దక్షిణ ధృవాల కున్నంత దూరం.

మహా : ఈ యువకుడెవరు మహాత్మా !

చాణ : చంద్రగుప్తుడు తల్లీ ! అన్యాయంగా నంద

సోదరులచే తరిమివేయబడినయువరాజు, వారిపైకత్తి కట్టి మనతోసహకరించాడు. నందుని హతమార్చడమే కాదు మనధ్యేయం. చంద్రగుప్తునికి మగధ రాజ్య పట్టాభిషేకంచేసి, మగధరాజ్యాన్ని నందనవనంగా మార్చాలి.

(పెద్దగా)

యువరాజు చంద్రగుప్తునికీ—

మహా, శిఖి : జయహో !

చాణ : మహాశ్వేతా దేవికీ

శిఖి, చంద్ర : జయహో !

మహా : చాణక్యామాత్యులకూ

శిఖి, చంద్ర : జయహో !

చాణ : జయహో ! రండి ఇప్పుడే పయనమౌదాం. శిఖి వాహనా ! సెలవు. విజయలక్ష్మీ సమేతులమై తిరిగి కలుసు కుంటాం.

శిఖి : (శాంతగా) ప్రళయం తర్వాత కాని పునస్సృష్టి ప్రారంభం కాదేమో ! వెళ్ళిరండిమహాత్మా ! తమదే విజయం.

[సమాప్తం]

బీద పిల్లలకు పాల పంపకము

ఆంధ్ర మహిళా సభ ఆవరణలో ప్రతీరోజు ఉదయం 7 గంటలకు, పాలు, బట్టర్ ఆయిల్, కూర పొడి వగైరాలు ఈ క్రింది విధంగా పంచిపెట్ట బడ్డాయి.

సెప్టెంబరు నెలలో 1022 మంది.


అక్టోబరు నెలలో 1007 మంది.

నవంబరు నెలలో 1015 మంది.

డిసెంబరు నెలలో 485 మంది.



ఆంధ్ర మహిళా సభలో ఈ సంవత్సరం జరిగిన దసరా ఉత్సవాలలో విద్యార్థినుల విచిత్ర వేషధారణ.



ఆంధ్రవాణి

ఇది సచిత్ర మాసపత్రిక. విద్యావిషయికముగా ఎక్కువ భాగము కేటాయించబడినా చాలా వినోదము, విజ్ఞానము, కూర్చే రచనలున్నవి.

సంపాదకులు శ్రీ ఎన్. శ్రీకంఠం. సహాయసంపాదకులు శ్రీమతి ఐ. పార్వతీ నారాయణ మూర్తి. సంవత్సర చందా, 6 రూ. విడిప్రతి 0. 8. 0. ప్రాప్తిస్థానము: ఆంధ్ర భాషాప్రచారసమితి. కోయిలకుంట్ల. కర్నూలుజిల్లా.

ప్రజారాజ్యము

ఇందు ప్రజారాజ్యము. ఉపాధ్యాయుడు. అనే రెండు నాటికలు ఉన్నవి. రచయితలు జాస్తి వెంకటనరసయ్య ధూళి పాళ వెంకటసుబ్రహ్మణ్యంగార్లు. మొదటిదానిలో గొప్ప వారి రాతికట్టడాలకూ పేదవారి పూరిగుడిసెలకీ మధ్యను ఉండే ఘర్షణే కథకు ఇతివృత్తం. ధనికుల పాషాణసదృశ మనస్తత్వాన్నీ, బీదల కరుణారస పూరిత హృదయాలనూ రచయిత చక్కగా చిత్రించారు. మొత్తానికీ నాటకము రంగస్థల ప్రదర్శనానుగుణంగా అమరింది. నేటి కాలమాన పరిస్థితులకు ఒక నమూనా ఇది. ప్రతులకు వెంకట్రామా అండ్ కో. విజయవాడ 1. మూల్యం రూ. 1. 0. 0.

కాంగ్రెసు విజయము

పై రచయితలే దాదాపు ఒక రజతోత్సవము చేసుకొనే వయసుగల కాంగ్రెసు ఉద్యమాన్ని ఉన్నదున్నట్లు ఉత్తేజపూరితంగా పేర్కొన్నారు. ప్రతివారు చదువ తగిననాటకమిది. ప్రతులకు వెంకట్రామా అండ్ కో విజయవాడ. వెల రూ 1. 0. 0.

నవగీతాలు

రచయిత ఉభయభాషాప్రవీణ శ్రీ జాస్తి వెంకటనరసయ్య. ప్రాప్తిస్థానం: భారతీ సమితి. పామర్రు కృష్ణాజిల్లా, వెల రూ 0. 3. 0. ప్రతులకు: వెంకట్రామా అండ్ కో విజయవాడ. పద్యకావ్యము. ప్రస్తుత పరిస్థితులను చక్కగా పొందు పరచి, గ్రంథాలయం, సైనిక శిక్షణ, వయోజన విద్య లంచగొండితనం, అనే పద్యాలు రచించబడ్డాయి. మరపురాని ఉత్సవాలలో ఒకటైన స్వాతంత్ర్య దినోత్సవాన్నిగూర్చి, గాంధీనిర్యాణం, బోసువీరుడు మున్నగు యుగపురుషులనుగూర్చి చక్కనిపద్యరచన చేశారు రచయిత.

వాచవి

ఇది "రసన" ప్రచురణ. కథల సంపుటి వెల రు 1.0.0 వలయువారు రసన కార్యాలయం, లోడికాలనీ, న్యూఢిల్లీ-3

వాచవి అంటే రుచిచూడటం. అది ఈ పుస్తకమునకు ఎంతో ఒప్పిఉంది. ఇందు ఆంధ్రదేశపు అభినవ కథారచయితలందరూ తమ లేఖినీ రసాలను చిందించేరు. వారి కలాలు నవరుచు(రసా)లనూ ఊటలూర పఠితలకు 'వాచవి' చూపినవి. కథకులు శ్రీయుతులు కవికొండల, చలం, కలపటపు రామగోపాలరావు, విశ్వనాథ అచ్యుత దేవరాయలు. బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు, క్రొవ్విడి లక్ష్మన్న, వాడ్రేవు పతంజలి, రావూరి భరద్వాజ, గిడుతూరిసూర్యం పన్యాల రంగనాథరావ్, శ్రీమతి పి. భానుమతి గార్లు - వీరంతా వేరే విధమున పేరుపొంది, రచన కేవలం ఊసుపోక కలవరచుకొన్నవారే. పఠితలకు ఈ కథలసంపుటి ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుందనడంలో సందేహంలేదు. ప్రకృత ప్రఖ్యాత కథకుల కలాల కాపాటి శక్తి లేదా?—

—ఇంద్రాణి.

ఆంధ్ర హిందీ నిఘంటువు

రచయిత : కొమాండూరి శఠకోపం, ఎం.ఎ. బి. యల్. వకీలు. కాకినాడ (తూర్పుగోదావరి) వెల రు 4-0-0

యాపద్భారత దేశానికి హిందీరాజభాషగాను, వ్యావహారిక భాషగాను వుండవలెనని మనరాజ్యాంగమునన్నిర్ణయింపబడినది. ఆసేతు హిమాచల పర్యంతముగల భారతీయులందరు ఒకే భాషను వాడుకొనుట దేశైక్యతకు యెంతయు దోహద మివ్వగలదను నంశము నిర్వివాదము. ప్రకృతము ఆంగ్లభాషాస్థానమున హిందీ ఆక్రమించుకొనవలసియున్నది. ఇట్టితరుణమున హిందీభాషను నేర్చుకొనుటకు ఉపయోగపడు గ్రంథములు యెన్నియైనా అవసరమే. శ్రీ కొ. శఠకోపంగారిచే సమకూర్చబడిన ఆంధ్ర హిందీ నిఘంటువు మిక్కిలి యుపయోగపడు ననుటకు సందేహములేదు. ఈ కోశముయొక్క విశిష్టత ఆంధ్ర శబ్దములకు సరియైన హిందీ పదములను సూచించుటయే.

మిత్రద్వయం

(ఏకాంక నాటికలు) రచన : ప్రసాద్ : వెల రు 1.40

మిత్రద్వయం, నేటి విద్యార్థి, కుంభకోణం మొదలైన ఏకాంకికల సంపుటి. కాలక్షేపమునకై చదువు కొనుటకు బాగుగనే యున్నవి. రచనా విధానమెట్లున్నను కథావస్తువులు ఒక నీతిని చదువువారికి బోధించుచున్నవి.

ఆంధ్ర ప్రదేశలక్ష్మి

కోటసోదర కవులు. వెల రూపాయి. (పద్యకావ్యము)

విశాలాంధ్రావతరణమహోత్సవసందర్భమును పురస్కరించుకొని కవి చంద్రులయిన కోటసోదర కవులు ఆ యా యుగములలోని సుప్రసిద్ధ ఆంధ్రనాయకుల వైభవోన్నతులను చక్కని శైలిలో రసవంతముగ వర్ణించి యున్నారు. ప్రతి యాంధ్రుడు చదివి ఆనందించ వలసిన గ్రంథ రాజము.

"కచట తపలు"

రచయిత : ఇసుకపల్లి లక్ష్మీనృసింహశాస్త్రి

"రాగద్వేషాలు,సర్వాంతర్యామి, జీవితపుజమాఖర్చులు మొదలైన తమాషా శీర్షికలతో రచియింపబడిన "కచట తపలు" అను కథల సంపుటి చదనడానికి చాలా బాగుంది. కథావస్తువులు చిన్నవైనా పాత్రలుకొద్దివైనా కథాకల్పనలో, పాత్రపోషణలో ఈ గ్రంథకర్త చూపిన నైపుణ్యము మెచ్చతగినది. ఈకథకుడు సిద్ధహస్తుడనక తప్పదు. ప్రారంభించినది మొదలు పరిసమాప్తి చెందేవరకు మధ్యలో ఏ కథను విడువ బుద్ధిపుట్టదు. అట్టి యాకర్షణయే కథారచనకు కావలసిన ప్రత్యేక గుణము అది ఈ గ్రంథకర్త రచనలో కనబడుచున్నది.

బృందావని-రాధ

రచయిత : చెలికాని వెల 0. 8. 0. తూర్పుగోదావరి జిల్లా కడియం."

భాగవత కథను తెలిసి పలుకుట శూలికైన తమ్మి చూలికైన కష్టతరమని పోతన్నగారు చెప్పినట్లు భాగవత కథకు నాయకులైన రాధాకృష్ణుల ప్రేమ సంబంధమును తెలుసుకొనుట సామాన్యులకు సాధ్యముకాదు. అది భాగవతోత్తములకే తెలియదగిన విషయము. గీతగోవింద కర్తయగు జయదేవుడు. ఆధ్యాత్మికాను భూతికలవాడు కావడంచేత అలౌకికమైన రాధా కృష్ణుల శృంగార లీలలను వర్ణించి తరించినాడు. జయదేవుని గీతగోవిందమును చదివిన వారికి యిట్టి రచనలు, రుచించవు.

—జి. సుందరీశంకరం.

మాగంటివారి చరిత్ర

బాపినీడు విరచితము. ప్రచురణ జాతీయజ్ఞానమందిరము, 64 థోర్నుమెయిన్ రోడ్, మద్రాసు20. వెల ఒకరూపాయి.

మాగంటివారి వంశ చరిత్రయని తన వంశ చరిత్రను శ్రీ బాపినీడుగారు వ్రాసుకున్నారు. ఏదో తమగొప్పలు చెప్పుకొనుట కాకుండా మనజాతీయోద్యమములో మహోద్యమములో కానరాకుండ ఇతోధిక సేవచేసిన వంశము లెన్నిటివలెనో ఈ మాగంటివారి వంశము రాజకీయ, సాంఘిక దేశహితైక ఉద్యమములలో ముందంజవేసి ఎట్లు అపార సేవ చేశారో విశదముగా సులభశైలిలో వివరించారు. అంతేగాక ఆంధ్ర చరిత్ర పరిశోధకులకు ఇప్పటి కులగోత్రముల ఉత్పత్తి చరిత్రలో,మాగంటివారివంశపుస్థానము విశదపరుస్తుంది. తొలిపలుకు వ్రాసిన శ్రీ సోమశేఖర శర్మగారు వ్రాసినట్లు ఈ వంశ చరిత్ర ప్రాంతీయ చరిత్ర పరిజ్ఞానము

కలుగజేయుటయే గాక అప్పటి కాల పరిస్థితులను కూడా ప్రతిబింబిస్తూ వున్నది

—లక్ష్మీనారాయణమ్మ

సర్వగీతార్థసారము

శ్రీ శ్రీ శ్రీ మహామండలేశ్వర స్వామి శివానంద సరస్వతీ మహారాజుగారి ఆంగ్లరచనకు ఆధ్యాత్మరత్న శ్రీ నండూరి వెంకట సుబ్బారావుగారి అనువాదము.

ఉత్తరగీత, వేణుగీత, శ్రుతిగీత మొదలు రామగీత వరకు మొత్తం 17 గీతలలో మానవుని మనుగడలో అడుగడుగునా తటస్థించే సుఖదుఃఖమమతానుబంధాది ద్వంద్వాలకు నివారణోపాయాలు జ్ఞానాభిలాషులకు సులభగ్రాహ్యంగా అనువదింపబడినవి. బ్రహ్మవిద్యాసూత్రాలైననూ, అనేక అనివార్య సందర్భములలోకూడ వాడుక పదాలే ప్రయోగించబడి సర్వులకూ సుగ్రాహ్యంగావుంది. ప్రతివెల రు 2-0-0.

ప్రతులకు : శ్రీ నండూరి వెంకట సుబ్బారావు బి. ఏ. దక్షిణపు వీథి, ఏలూరు.

—ఎన్. సుహాసిని.

గులాబి ముళ్ళు

రచయిత : ఇచ్ఛాపురపు జగన్నాథరావు. ప్రచురణ: సాగర్ పబ్లికేషన్స్, 11 బ్రాడ్వే, మద్రాసు. సైజు : క్రౌన్ $\frac{1}{8}$ పేజీలు 134.

ఈ రచయితా, ఇందలి రచనా పాఠకులకు చిరపరిచితమైనవే. గులాబిముళ్ళు నవల ఇదివరలో సీరియల్‌గా ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రకటితమైనదే. స్వధర్మనిర్వహణకు సంఘం ఒత్తిడివల్ల కలిగే బాధలూ, వాస్తవమైన ప్రేమ ఏదో, మైత్రి జాలీవల్ల కలిగిన ప్రేమ ఏదో నిర్ధారణ చేసుకోడానికి పడ్డ ఆవేదనా ఈ సంఘర్షణలవల్ల కథానాయకునికి కలిగే పరిణామాలు చక్కగా వ్యక్తీకరించారు రచయిత. మధుర పరిమళములు వెదజల్లుతూ మృదులమూ, మంజులమూ, సుందరమూ, అయిన గులాబికి ముళ్ళు ఉన్నాయి. ప్రణయ జీవితం గులాబిలాంటిదని ఆయన తియ్యని తలపులవల్ల, మనోవేదనవల్ల నిరూపించబడ్డది.

త్రివర్ణ చిత్రముగల జాకెట్టుతో, ఆంధ్ర మహిళాప్రెస్ నందు సుందరము గా ముద్రింపబడినది. ★

—ఎన్. సుహాసిని.